వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

సంపుటి : 8 సంచిక : 6 హైదరాబాద్ 107 జూన్ 2010 పేజీలు : 60 రు. 10

★ ఫోకస్ : అరవై సంవత్సరాల రాజ్యాంగం

★ కుల గణనకు జాప్యం ఎందుకు?

★ జాతీయ ఆహార భద్రతా చట్టం

★ రాయ్‌గఢ్ సెజ్ వ్యతిరేక పోరాటం

★ కాలుష్యానికి బలికావాల్సిందేనా?

★ పోరాటాల స్ఫూర్తితో భవిష్యత్తు

★ చరిత్ర - సంవిధానం

ఆనంద్ ఏజెన్సీస్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా వీక్షణం లభ్యమయ్యే బుక్ స్టాల్స్

కాశిబుగ్గ	ప్రేమ్ కుమార్ న్యూస్ ఏజంట్
రాజాం	ముత్యాలరావు న్యూస్ ఏజంట్
ఇచ్ఛాపురం	నాగేశ్వరరావు న్యూస్ ఏజంట్
పాలకొండ	మురళిమోహన్ రావు న్యూస్ ఏజంట్
శ్రీకాకుళం	రమణచారి న్యూస్ ఏజంట్
శ్రీకాకుళం	ప్రకాశ్ బుక్‌స్టాల్
శ్రీకాకుళం	బసవ కోటేశ్వరరావు న్యూస్ ఏజంట్
పలాస	ఎం.ఎస్. సాహు, రైల్వే స్టేషన్
సోంపేట	జ్యోతి బుక్స్ అండ్ స్టేషనరీ
సాలూరు	ఉల్లి విజయభాస్కర్ న్యూస్ ఏజంట్
విజయనగరం	శ్రీనివాస్ న్యూస్ ఏజంట్
విజయనగరం	ఆర్.టి.సి. బుక్‌స్టాల్
పార్వతీపురం	రాజేష్ బుక్ స్టాల్, ఆర్.టి.సి. కాంప్లెక్స్
చీపురుపల్లి	సి.ఎచ్. శోభాకుమార్ ఆర్.టి.సి. కాంప్లెక్స్
బొబ్బిలి	గౌరీశంకర్, ఆర్.టి.సి. కాంప్లెక్స్
విశాఖపట్నం	కె. సత్యనారాయణ, ఆర్.టి.సి. కాంప్లెక్స్
విశాఖపట్నం	వి. భాస్కరరావు న్యూస్ ఏజంట్
విశాఖపట్నం	రమణ న్యూస్ ఏజంట్
విశాఖపట్నం	దామోదర్ గుప్తా, ఆర్.టి.సి. కాంప్లెక్స్
చోడవరం	వి. రామారావు ఆర్.టి.సి. కాంప్లెక్స్
యలమంచిలి	ఆర్.టి.సి. బుక్‌స్టాల్
నర్సీపట్నం	పి. సూర్యనారాయణ న్యూస్ ఏజంట్
అనకాపల్లి	వి.వి. అప్పారావు న్యూస్ ఏజంట్
అనకాపల్లి	నానాజి, ఆర్.టి.సి. కాంప్లెక్స్
రావులపాలెం	శ్రీనివాసరావు, ఆర్.టి.సి. కాంప్లెక్స్
తుని	సరస్వతి న్యూస్ ఏజంట్, రైల్వే స్టేషన్
రాజమండ్రి	వరలక్ష్మి న్యూస్ ఏజెన్సీ
ముమ్మిడివరం	ఎస్. వీరభద్రరావు న్యూస్ ఏజంట్
రామచంద్రాపురం	జి.ఇ. సత్యనారాయణ మూర్తి
అమలాపురం	డి.వి.ఎస్.ఎస్. కుమార్ న్యూస్ ఏజంట్
మండపేట	బి. శ్రీనివాస్ న్యూస్ ఏజంట్
యానాం	చిట్టిబాబు న్యూస్ ఏజంట్
కొయ్యలగూడెం	ఎం. సూర్యారావు న్యూస్ ఏజంట్
కాకినాడ	ఎం. నారాయణమూర్తి న్యూస్ ఏజంట్
రాజోలు	కె. లలిత (కె.పి. స్వామి) న్యూస్ ఏజంట్
జగ్గంపేట	జిలాని పాన్ షాప్
నర్సాపురం	బి.వి. రంగనాధరావు న్యూస్ ఏజంట్
తాడేపల్లిగూడెం	కె.వి. కృష్ణయ్య న్యూస్ ఏజంట్
జంగారెడ్డిగూడెం	వి.వి. చౌధరి న్యూస్ ఏజంట్
భీమవరం	ధనాలో భవానిశంకర్ న్యూస్ ఏజంట్
ఏలూరు	ప్రభు న్యూస్ ఏజెన్సీ
తణుకు	జె.ఆర్. భూషణం న్యూస్ ఏజంట్
చింతలపూడి	శ్రీధర్ న్యూస్ ఏజంట్
వినన్నపేట	ఎ. సర్వేశ్వరరావు న్యూస్ ఏజంట్
మచిలీపట్నం	ఎస్. రమేష్, ఆర్.టి.సి. కాంప్లెక్స్
మచిలీపట్నం	వాసుదేవరావు న్యూస్ ఏజంట్
కూచిపూడి	రాజ్యలక్ష్మి న్యూస్ ఏజెన్సీ
కంకిపాడు	సిఎచ్. రామకృష్ణ న్యూస్ ఏజంట్
మైలవరం	సిఎచ్. నాగేశ్వరరావు న్యూస్ ఏజంట్
అవనిగడ్డ	మాణిక్యాలరావు న్యూస్ ఏజంట్
కంచికచెర్ల	వి. గంగాధరరావు న్యూస్ ఏజంట్
విజయవాడ	బి.ఎస్.ఎస్.వి. ప్రసాద్ న్యూస్ ఏజంట్
చల్లపల్లి	ఆంజనేయులు న్యూస్ ఏజంట్
ఇబ్రహీంపట్నం	వి. రాంబాబు న్యూస్ ఏజంట్
విజయవాడ	రాఘవేంద్ర బుక్ స్టాల్, ఆర్.టి.సి. కాంప్లెక్స్
గుడివాడ	నీలకంఠ న్యూస్ ఏజెన్సీ
చిలకలూరిపేట	వెంకటేశ్వర్లు న్యూస్ ఏజంట్
పొన్నూరు	ఎన్. రామారావు న్యూస్ ఏజంట్
కారెంపూడి	పి. బాలయ్య న్యూస్ ఏజంట్
నరసరావుపేట	దిలీప్ న్యూస్ ఏజెన్సీ
గుంటూరు	ఎం.పి. రావు న్యూస్ ఏజంట్
మంగళగిరి	సిఎచ్. రామస్వామి న్యూస్ ఏజంట్
పిడుగురాళ్ళ	యాదగిరి న్యూస్ ఏజెన్సీ
వినుకొండ	ఆంజనేయులు న్యూస్ ఏజంట్
రేపల్లె	టి. రాజశంకర్ న్యూస్ ఏజంట్
తెనాలి	ఎస్. నాగేశ్వరరావు, ఆర్.టి.సి. కాంప్లెక్స్
రెంటచింతల	యేచూరి రాజేష్ న్యూస్ ఏజంట్
మాచెర్ల	మొహియుద్దీన్, ఆర్.టి.సి. కాంప్లెక్స్
సత్తెనపల్లి	టి. శ్రీనివాసరావు న్యూస్ ఏజంట్
చీరాల	డి. మురళీకృష్ణ న్యూస్ ఏజంట్
మార్కాపూర్	ఒ.ఎ. మలిక్ న్యూస్ ఏజంట్
పొదిలి	వెంకటేష్, ఆర్.టి.సి. కాంప్లెక్స్
దర్శి	పి.వి. కుమార్ న్యూస్ ఏజంట్
ఇంకొల్లు	కె. శంకరరావు న్యూస్ ఏజంట్
ఒంగోలు	పి.ఎస్.ఆర్. ఆంజనేయులు న్యూస్ ఏజంట్
పామూరు	డి. భాస్కరరావు న్యూస్ ఏజంట్
కొమరోలు	జల శ్రీనివాసరావు న్యూస్ ఏజంట్
కనిగిరి	తిరుమల బుక్‌సెంటర్
అద్దంకి	జి. శేషగిరి రావు న్యూస్ ఏజంట్
కావలి	వేణుగోపాల్ న్యూస్ ఏజంట్
నెల్లూరు	పి. వెంకటేశ్వరరావు న్యూస్ ఏజంట్
ఆత్మకూరు	జె.కె. బుక్ స్టాల్, ఆర్.టి.సి. కాంప్లెక్స్
నాయుడుపేట	సురేష్‌కుమార్, ఆర్.టి.సి. కాంప్లెక్స్
పుంగనూరు	అశోక్ బుక్‌స్టాల్
చిత్తూరు	రామమూర్తి న్యూస్ ఏజంట్
తిరుపతి	అమర్‌నాథ్ న్యూస్ ఏజంట్
మదనపల్లి	కాలేజ్ బుక్ స్టాల్
శ్రీకాళహస్తి	చంద్రశేఖర్ రాజు న్యూస్ ఏజంట్
పలమనేరు	ఆర్.ఆర్. బుక్ సెంటర్
కుప్పం	భువనేశ్వర్, ఆర్.టి.సి. కాంప్లెక్స్
యెమ్మిగనూరు	జి.ఎం. రాజశేఖర్, ఆర్.టి.సి. కాంప్లెక్స్
ఆళ్లగడ్డ	ఎం. సుబ్రహ్మణ్యం, ఆర్.టి.సి. కాంప్లెక్స్

...మిగతా మూడవ కవర్ పేజీలో చూడండి

107

వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

సమతా పబ్లికేషన్స్, సెంటర్ ఫర్ డాక్యుమెంటేషన్, రిసర్చ్ అండ్ కమ్యూనికేషన్ ప్రచురణ

జూన్ 2010
సంపుటి : 8
సంచిక : 6

గౌరవ సంపాదకులు :
వి. హనుమంతరావు

సంపాదకులు :
ఎన్. వేణుగోపాల్

సహాయ సంపాదకులు :
డి.వి.రామకృష్ణారావు

కరస్పాండెంట్ /
సర్క్యులేషన్ మేనేజర్ :
వై. రామచంద్రం
9949391028

కరస్పాండెంట్/సబ్ఎడిటర్ :
సి. రాజశేఖర్

ఆఫీస్ అసిస్టెంట్ :
ఎస్. వెంకటేష్

వీక్షణం చందా వివరాలు

సంవత్సర చందా	**రు.**	**120**
3 సంవత్సరాల చందా	**రు.**	**350**
5 సంవత్సరాల చందా	**రు.**	**550**
10 సంవత్సరాల చందా	**రు.**	**1000**

'వీక్షణం' పేరిట ఎం.ఓ.లు,
డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం
రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

మైత్రి రెసిడెన్సీ, 3-6-394,
స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029.
ఫాక్స్, ఫోన్ : 040-66843495
Email : veekshanam2003@gmail.com
www.veekshanam.wordpress.com

వీక్షణం అకౌంట్ నెంబర్ –
013911011002175
ఆంధ్రాబ్యాంక్, గగన్‌మహల్ బ్రాంచ్,
హైదరాబాద్

డిస్ట్రిబ్యూటర్స్
ఆనంద్ ఏజన్సీస్, హైదరాబాద్.
ఫోన్ : 98484 28516
92468 26191

ప్రింటర్స్
చరితా ఇంప్రెషన్స్,
ఆజామాబాద్, హైదరాబాద్
ఫోన్ : 040 - 27678411

సంపాదకీయం

రాష్ట్రాన్ని ముంచెత్తుతున్న యాత్రలు

రాష్ట్రంలోని అన్నిప్రాంతాల ప్రజలను అన్నిపక్షాల రాజకీయనాయకులు యాత్రలతో ముంచెత్తుతున్నారు. బహుశా ప్రజలను తమ నిత్య జీవిత సమస్యలనుంచి మైమరపించడానికి ఇంత ఆర్భాటంగా, ఇంత పెద్దఎత్తున రాజకీయ నాయకుల యాత్రలు జరిగిన సందర్భం మరొకటి లేకపోవచ్చు. అధికారపక్షం కాంగ్రెస్‌లోని రెండు ముఠాలూ, ప్రధాన ప్రతిపక్షాలలో తెలుగుదేశం, ప్రజారాజ్యం అధికారికంగా ఇప్పటికే యాత్రలు నిర్వహిస్తుండగా, తెలంగాణ రాష్ట్ర సమితి తన యాత్రా ప్రణాళికను ప్రకటించింది. అన్ని రాజకీయ పక్షాల ఛోటా మోటా నేతలూ తమ తమ స్థాయిలలో యాత్రలు నిర్వహిస్తూనే ఉన్నారు. రాజకీయ నాయకులు ఇలా ఎప్పుడో ఒకసారి అయినా ప్రజల దగ్గరికి వెళ్లడం మంచిదే. సాధారణంగా ఎన్నికలకు ముందు తప్ప మరెప్పుడూ ప్రజలు గుర్తుకురాని రాజకీయ నాయకులకు ఎన్నికలకు చాలముందుగానే (లేదా తెలంగాణలో ఉపఎన్నికలు, రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికలు రానున్న సందర్భంలో) ప్రజల దగ్గరికి వెళ్లాలని అనిపించడం మంచిదే. కాని నిజంగా ఇవి ప్రజల దగ్గరికి యాత్రలేనా, ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు, ఆ సమస్యలను పరిష్కరించేందుకు జరుగుతున్న యాత్రలేనా పరిశీలించవలసి ఉంది. ఈ యాత్రల వెనుక కనబడని ఉద్దేశాలు, ప్రజాసమస్యల పరిష్కారంతో సంబంధంలేని ఆలోచనలు మరేవయినా ఉన్నాయేమో చూడవలసి ఉంది. అధికారికంగా ముఖ్యమంత్రి కె. రోశయ్య నాయకత్వాన మంత్రులు, పార్లమెంటు సభ్యుల నుంచి స్థానిక ప్రజాప్రతినిధుల వరకు నాయకులు ప్రజలను కలిసి వారి సమస్యలు తెలుసుకొని పరిష్కరించడం కోసం ప్రారంభమయిన ప్రజాపథం కార్యక్రమం ఏప్రిల్ 19న మొదలయి మే 15దాకా సాగింది. ఈ ప్రజాపథం వేలాది గ్రామాలలో గ్రామసభలు జరిపిందనీ, స్థానిక ప్రతిపక్ష ప్రజాప్రతినిధులు కూడ పాల్గొన్నారనీ, ఎన్నో ప్రజాసమస్యలను అక్కడికక్కడే తీర్చామనీ ప్రభుత్వం ఊదరగొడుతోంది. కాని తమ సమస్యలు చెప్పడానికి ప్రయత్నించిన ప్రజలను బెదిరిస్తూ, వారి మీద దౌర్జన్యంతో, లాఠీఛార్జీలతో, విపరీతమైన సాయుధబలగాల పహారాలో, వందిమాగధులమధ్య ఈ కార్యక్రమం నడిచింది. అధికార పక్షంలోనే రెండు ముఖ్యమైన ముఠాలు ఉన్నాయి గనుక, అధికారంలో ఉన్న ముఠాకూ, అధికారం కోసం అర్రులు చాస్తున్న ముఠాకూ మధ్య ఈ ప్రజాకర్షక యాత్రలలో కూడ పోటీ నెలకొంది. పార్లమెంటు సభ్యుడు వై.ఎస్. జగన్ మోహనరెడ్డి ఓదార్పుయాత్ర ప్రారంభించారు. ఈ యాత్ర చనిపోయినవారి కుటుంబాలను ఓదార్చడానికే అయితే ఎనిమిదినెలల తర్వాత ఎందుకు జరుగుతున్నదో ఎవరికయినా స్పష్టంగానే కనబడుతున్నది. కేవలం తనను తాను ఒక విస్తారమైన ప్రజాకర్షణ గల నాయకుడిగా చూపెట్టుకుని కాంగ్రెస్ అధిష్టానవర్గం దగ్గర మళ్లీ ఒకసారి ముఖ్యమంత్రి పదవికి బేరం పెట్టడం కోసం తప్ప ఈ యాత్ర వెనుక మరొక ఉద్దేశమేమీ లేదు. రాజు అంత్యక్రియలు పూర్తికాకముందే పట్టాభిషేకం జరగాలనుకున్న యువరాజు, ఆ అవకాశం పోయినందుకు తనను తాను ఓదార్చుకోవడానికి జరుపుతున్న యాత్ర ఇది. ఇక ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా చంద్రబాబునాయుడు కూడ అధికధరలు, అవినీతి, రైతాంగ సమస్యలు వంటి సమస్యలపై యాత్ర మొదలుపెట్టారు. ఈ సమస్యలన్నీ తప్పనిసరిగా లేవనెత్తవలసినవే, వాటి మీద ఆందోళనలు జరపవలసిందే. కాని ఆ సమస్యలు తెలుగుదేశం పార్టీకి గుర్తు వచ్చిన సందర్భం ప్రత్యేకమైనది. రాష్ట్రంలోని రెండు ప్రాంతాలలోనూ పోయిన ప్రతిష్టను, విశ్వసనీయతను తిరిగి సాధించుకోవాలనే ప్రయత్నమే ఈ యాత్రకు పునాది. నిజంగా ఆ సమస్యల పరిష్కారం గురించి తెలుగుదేశం పార్టీకి ఏపాటి శ్రద్ధాసక్తులున్నాయో దాని పాలనాకాలమే రుజువుచేసింది. ఇక అన్ని యాత్రలలోకీ హాస్యాస్పదమైన యాత్ర, ఎందుకు యాత్ర చేస్తున్నారో వారికే తెలియకుండా సాగుతున్న యాత్ర ప్రజారాజ్యం పార్టీ అధినేత చిరంజీవిది. ఇప్పటికి ఆయన ఆరు కోస్తా జిల్లాలలో పోలవరం సాధన యాత్ర నిర్వహించారు. నిజానికి ఈ ఆరు జిల్లాల ప్రజలకూ, రైతులకూ, వ్యవసాయానికీ కూడ పోలవరం ఆనకట్ట నిర్మాణం ఉపయోగకరం కాదు. అది ప్రధానంగా కాకినాడ – విశాఖపట్నం కోస్తా కారిడార్, పెట్రో కెమికల్ కాంప్లెక్స్‌లో రానున్న బహుళజాతి సంస్థలకు, భారీ పరిశ్రమలకు నీరు అందించే పథకం. కోస్తాలో లక్షలాది ఎకరాల పంటభూములను నాశనం చేసి, లక్షలాది కుటుంబాలను విస్థాపితులను చేసి దేశదేశాల సంపన్నులకు కట్టబెట్టే పథకం అది. దానివల్ల ఖమ్మం అటవీ ప్రాంతంలో మూడువందల ఆదివాసి గ్రామాలు, సంపన్నమైన అటవీ వనరులు మునిగిపోనున్నాయి. సమాజం గురించీ, రాజకీయాల గురించీ ఇటీవలనే తెలుసుకుంటున్న చిరంజీవికి ఈ వాస్తవాలు తెలుసునో లేదో గాని, రానున్న ఆంధ్ర రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావాలంటే ప్రజల సమస్యలా కనిపించేదేదో పట్టుకుని ప్రజల మధ్య తిరగాలని అనుకుంటున్నట్టున్నారు. ఇక తెలంగాణ రాష్ట్ర సమితి పల్లెయాత్ర చేస్తానని ప్రకటించింది. ఇతర రాజకీయ నాయకులు కూడ తమ యాత్రా ప్రణాళికలు ప్రకటిస్తున్నారు. ఈలోగా, రాజకీయవాదుల విధ్వంసానికి తానేమీ తీసిపోలేదన్నట్టు బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కూడ కోస్తా జిల్లాల మీదికి తన బీభత్స దండయాత్ర సాగించింది. ఆ బాధితులను పరామర్శించడానికి మళ్లీ యాత్రలు సాగుతున్నాయి. ఈ విహారయాత్రలు సాగుతుంటే ప్రజల బతుకులు మరింత కడగండ్లపాలు అవుతున్నాయే గాని ప్రజలను, ప్రజల సమస్యలను పట్టించుకునేవారు లేరు. ఆ సమస్యల పరిష్కారాలు ఈ వ్యవస్థలో లేవని రోజురోజుకూ మరింత స్పష్టమవుతున్నది. వీ

మరణశిక్షతో సమస్య సమసిపోతుందా?

2008 నవంబర్ 26న ముంబయిలోని ఛత్రపతి శివాజీ టర్మినస్, తాజ్ హోటల్, నారిమన్ హౌజ్, కామా హాస్పిటల్ వంటిచోట్ల జరిగిన విధ్వంసం, హత్యాకాండలలో 170 మందికిపైగా చనిపోయారు, వందలాది మంది గాయపడ్డారు. ఆ హింసాకాండ కలిగించిన దిగ్భ్రాంతి వల్ల అందుకు బాధ్యులైన వారిమీద కఠినచర్యలు తీసుకోవాలని బాధితుల కుటుంబాలకు, సమాజానికి అనిపించడం సహజమే. ఆ హింసాకాండలో పాల్గొన్నవారిగా భావిస్తున్నవారిలో ఒకరు మినహా ఇతరులందరూ అక్కడికక్కడే కాల్చి చంపబడ్డారు. అక్కడ దొరికాడని పోలీసులు చెపుతున్న అజ్మల్ అమీర్ కసబ్‌కూ, ఛత్రపతి శివాజీ టర్మినస్‌లో సిసి కెమెరాలలో చిక్కిన చిత్రానికీ పోలికలు ఉండడం వల్ల మొత్తం విచారణ అంతా కసబ్ మీదుగా నడిచింది. దర్యాప్తులో వెల్లడయిన వివరాలను బట్టి మొత్తం 37 మంది మీద పదకొండువేల పేజీల ఛార్జిషీట్ దాఖలయింది. ఏడాదిన్నర విచారణ తర్వాత కసబ్‌కు మరణశిక్ష విధించడంతో దేశవ్యాప్తంగా ఒకరకమయిన సంతృప్తి కనబడింది. మామూలుగా మరణశిక్షలను వ్యతిరేకించే ఉదారవాదులు, మానవతావాదులు కూడ మాట్లాడలేని భయానకస్థితి వ్యాపించింది. పరిస్థితి ఎటువంటిదయినా భావోద్వేగాలను, 'పదుగురాడుమాటల'ను పక్కనపెట్టి చట్టానికీ న్యాయానికీ నాగరికతకూ ప్రజాస్వామ్యానికీ సంబంధించిన విషయాలు ప్రస్తావించకతప్పదు. మన అభిప్రాయాలూ ఊహలూ ఎటువంటివైనా తగిన, నిస్సందేహమైన సాక్ష్యాధారాలు ఉన్నప్పుడే, అత్యంత అరుదయిన సందర్భంలోనే మరణశిక్ష విధించాలని చట్టం నిర్దేశిస్తుంది. ఒక ఘటనల వరుసలో 166 మంది చనిపోయారనీ, ఆ ఘటనాస్థలంలో నిందితుడు దొరికాడనీ తప్ప, కచ్చితంగా ఆ నిందితుడే ఫలానివారిని చంపాడని ప్రాసిక్యూషన్ రుజువుచేయలేదు. అంతే కాదు, ఈ హింసాకాండకు పాల్పడిన బృందానికి సహకరించిన భారత పౌరుల గురించీ, అసలు ఈ విధ్వంసకాండకు మందస్తు ఏర్పాట్లు చేసిన అమెరికన్ పౌరుడి గురించీ వివరాలు ఉన్నప్పటికీ, భారతపౌరులను నిర్దోషులుగా విడుదల చేశారు, అమెరికన్ పౌరుడిని విచారించనేలేదు. తానసలు ఇరవై రోజులుగా ముంబయిలో తిరుగుతున్నాననీ, ఈ విధ్వంసకాండకు ముందే పోలీసుల అదుపులో ఉన్నాననీ, తనను చిత్రహింసలు పెట్టి తనతో నేరాలు ఒప్పించారనీ కసబ్ న్యాయస్థానంలో చెప్పిన మాటల నిజానిజాలు పరిశీలించాలని న్యాయమూర్తి అనుకోలేదు. సాధారణంగానే పోలీసులు తయారుచేసే ఛార్జిషీట్లు కట్టుకథలు అనే సంగతి అందరికీ తెలిసినా దాన్నే ప్రమాణంగా తీసుకున్నారు. ఆ ఛార్జిషీట్ ప్రకారమే చూసినా కసబ్‌కు బలమైన మత విశ్వాసాలు లేవు, తనకు శిక్షణ ఇచ్చినప్పుడు భారతదేశంలో, పాలస్తీనాలో ముస్లింల మీద జరుగుతున్న అత్యాచారాల గురించి చెప్పారని అన్నాడు. నిరుద్యోగిగా ఎవరు డబ్బులు ఇస్తే వారికి పనిచేస్తానని, కావాలంటే తాము చెప్పిన పని అయినా చేస్తానన్నాడని విచారణాధికారి అన్నాడు. కసబ్‌ను చంపినంత మాత్రాన ఈ కారణాలు రద్దయిపోవు. ఒక వ్యక్తిని సకారణంగా చంపుతామా, నిష్కారణంగా చంపుతామా అన్నది ముఖ్యం కాదు. ఆ మనిషి నేరస్తుడే అయితే ఆ నేరానికి దారితీస్తున్న కారణాలను తొలగిస్తామా లేదా అన్నది ప్రశ్న. కంటికి కన్ను, పంటికి పన్ను అనే గతకాలపు ప్రతీకార శిక్షాస్మృతిని వదులుకోవడమే నాగరికతకు గీటురాయి అనే అభిప్రాయాన్ని ఒప్పుకుంటామా లేదా అన్నది ప్రశ్న.

థాయిలాండ్‌లో పాలకుల దమనకాండ

సరిగ్గా ఏడాది కింద మే మూడో వారంలో ఈలం జాతి విముక్తి పోరాట నాయకుడు వేలుపిళ్లై ప్రభాకరన్‌ను, వందలాది మంది ఈలం సైనికులను ఊచకోత కోసి శాంతి భద్రతలు నెలకొల్పానని శ్రీలంక అధ్యక్షుడు మహింద రాజపక్ష ప్రకటించాడు. ఈ మే మూడో వారంలో థాయిలాండ్ ప్రధానమంత్రి అభిషిత్ వెజ్జజీవ కూడ సరిగ్గా అవేమాటలలో రాజధాని బ్యాంకాక్‌లోనూ, దేశంలోని ఇతర ప్రాంతాలలోనూ శాంతి భద్రతలను నెలకొల్పామనీ, పరిస్థితులు మామూలుగా ఉన్నాయనీ ప్రకటించాడు. ఆయన ఈ ప్రకటన చేసిన మే 19 నాటికి గడిచిన వారంలో ప్రభుత్వ సైనికులు రాజధానిలోని రాజప్రాసంగ్ కూడలిలోని సెంట్రల్ వరల్డ్ దుకాణ సముదాయంలో 52 మందిని కాల్చి చంపామనీ, వందలాది మందిని నిర్బంధంలోకి తీసుకున్నామనీ ప్రకటించారు. నిజానికి మృతుల సంఖ్య, నిర్బంధితుల సంఖ్య ఎన్నోరెట్లు ఎక్కువ అని స్వతంత్ర పరిశీలకులు చెపుతున్నారు. ఎనిమిది వారాలుగా రెడ్ షర్ట్స్ అనే ప్రభుత్వ వ్యతిరేక ప్రజాసంఘాల కూటమి ఆ దుకాణ సముదాయంలో 'బ్యాంకాక్ కమ్యూన్' నిర్వహిస్తున్నది. ఈ ఊచకోతతో ఆ కమ్యూన్ ధ్వంసమయిపోయింది. రెడ్ షర్ట్స్ అనేది ఒక విశాల ప్రజా ఐక్య సంఘటన ఉద్యమం. ఈ ఉద్యమంలో అన్ని ఛాయల, అభిప్రాయాల వాళ్లు ఉన్నారు. బహుళ జాతి సంస్థల సహాయంతో, సైన్యం సహాయంతో పాలన సాగించి తన ఆస్తులు ఇబ్బడి ముబ్బడిగా పెంచుకుని, అదే సమయంలో కొన్ని ప్రజాకర్షక పథకాలు కూడ ప్రవేశపెట్టిన మాజీ ప్రధాని, ప్రతిపక్ష నాయకుడు థక్షిన్ షినవత్ర అనుచరులు ఉన్నారు. కార్మికులు, రైతులు, యువజనులు, వామపక్ష నేతలు కూడ ఉన్నారు. వాళ్లు అడుగుతున్నది అవినీతిలేని పాలన కావాలని, పార్లమెంటుకు ఎన్నికలు నిర్వహించాలని, దేశ రాజకీయాలలో సైనిక జోక్యాన్ని, సంపన్నుల, బహుళజాతి సంస్థల జోక్యాన్ని తగ్గించాలని, పేదరికాన్ని తగ్గించాలని. ఈ కనీస ప్రజాస్వామిక డిమాండ్లపై రెండు సంవత్సరాలుగా సాగుతున్న ప్రజాందోళన ఏప్రిల్ నాటికి క్రియాశీల రూపం తీసుకుని బ్యాంకాక్ కమ్యూన్ ఏర్పాటయింది. ప్రభుత్వ బలగాల్లో కూడ ప్రజాందోళనపట్ల సానుభూతి ప్రకటించే వర్గం తయారయింది. ఈ ఉద్యమ డిమాండ్లతో థక్షిన్ షినవత్రకు, ఉద్యమంలో భాగస్వాములైన కొన్ని పాలకవర్గ బృందాలకు కూడ పూర్తి ఏకాభిప్రాయం లేకపోవచ్చు. కాని వాళ్లు కూడ ఆపలేని ప్రభుత్వ వ్యతిరేక ప్రజా వెల్లువ థాయిలాండ్‌ను ముంచెత్తింది. కనీసమైన పార్లమెంటరీ ప్రజాస్వామిక డిమాండ్లను కూడ పాలకవర్గాలు అంగీకరించవని, ఊచకోత ద్వారానే జవాబు చెపుతాయని థాయిలాండ్ మరొకసారి రుజువుచేసింది. గతంలో థాయిలాండ్‌లో నెత్తురుటేర్లు ప్రవహింపజేసి వామపక్ష ప్రజా ఉద్యమాలను తుడిచేశామని పాలకులు భావించారు. ఇప్పుడు పార్లమెంటరీ ప్రజాస్వామిక డిమాండ్లను కూడ ఇలా అణచివేయడం ద్వారా అజ్ఞాత ప్రజా ఉద్యమానికి వాళ్లే మార్గం సుగమం చేస్తున్నారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. వీ

లోపలి పేజీల్లో...

ఫోకస్ : అరవై సంవత్సరాల రాజ్యాంగం

రాజ్యాంగ లక్ష్యం కొద్దిమంది పౌరులకు కొన్ని హక్కులకు హామీ ఇవ్వడం మాత్రమే కాదు, సకల జనాలకు అన్ని హక్కులూ ఇవ్వడం. రాజ్యాంగం మన సమాజాన్ని సమగ్రంగా దృష్టిలో పెట్టుకుంది. మన సమాజంలోని సభ్యులలో ప్రతి ఒక్కరు హామీ పొందిన స్వేచ్ఛలలో భాగం పంచుకోవాలి. ఆదేశిక సూత్రాలను యథాతథంగా అమలు చేయకుండా రాజ్యాంగం ఆశించిన సంక్షేమ రాజ్యాన్ని నెలకొల్పడం అసాధ్యం. దారిద్ర్యం, అజ్ఞానం విస్తృతంగా ఉన్న మన సమాజం వంటి సమాజంలో ప్రతి ఒక్క పౌరుడి కనీస ఆర్థిక అవసరాలను తీర్చకుండా మానవ హక్కుల ప్రయోజనాన్ని సాధించడం సాధ్యం కాదు. రాజ్యాంగం కింద తీసుకున్న ప్రతిజ్ఞను పరిపూర్తి చేయడంలో విఫలమైన ఏ ప్రభుత్వమైనా రాజ్యాంగానికి గానీ, దాని నిబద్ధతలకు గానీ విధేయమైనదని చెప్పడానికి వీలులేదు.

'వీక్షణం'లో అచ్చువుతున్న రచనలలో వ్యక్తమైన అభిప్రాయాలన్నిటితో సంపాదకులకు ఏకీభావం ఉండనవసరం లేదు. 'వీక్షణం'ను నిజమైన ప్రజాపక్ష రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణా వేదికగా తీర్చిదిద్దడంలో అన్నిరకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాల ఛాయలకు స్థానం కల్పించాలని సంపాదక వర్గం భావిస్తోంది.

రచయితలకు సూచన

ఏ పత్రికయినా తాను అచ్చువేసే రచనలు తనకే ప్రత్యేకంగా ఉండాలని కోరుకుంటుంది. 'వీక్షణం' కూడా అలానే భావిస్తోంది. ఇటీవల కొందరు రచయితలు తమ రచనలను ఒకేసారి అనేక పత్రికలకు పరిశీలన కోసం పంపుతున్నారు. 'వీక్షణం' పరిశీలనలో ఉన్న రచనలు, రాబోయే సంచికలలో అచ్చుకోసం ఎంపిక చేసి పెట్టుకున్న రచనలు ఇతర దినపత్రికలలోనో, వార పత్రికలలోనో వెలువడడం మా దృష్టికి వస్తోంది. ఇతర పత్రికలకు పంపిన రచనలను 'వీక్షణం'కు పంపించగూడదని రచయితలకు విజ్ఞప్తి చేస్తున్నాము.

– సంపాదకులు

చందాదారులకు విజ్ఞప్తి

ఇటీవల కొంతమంది చందాదారులకు వీక్షణం సక్రమంగా అందడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి. వీక్షణం ప్రతినెల 29వ తేదీన మరుసటి నెల సంచిక పోస్ట్ అవుతుంది. ఏ కారణం చేతనైనా మీకు వీక్షణం మొదటివారంలోపు అందనట్లయితే, వెంటనే ఆ విషయం మాకు తెలపగలరు.

మీ చిరునామా వివరంగా రాయండి. పిన్‌కోడ్ రాయడం మరిచిపోకండి. పత్రిక వచ్చిందా రాలేదా పోస్ట్‌మాన్‌తో నిర్ధారించుకోగలరు.


– సర్క్యులేషన్ మేనేజర్
9949391028








- **పంబాలాస్ – ది వానిషింగ్ దళిత్ ప్రీస్ట్స్** (ఇంగ్లిష్) – చక్రపాణి ఘంటా – అనేక పబ్లికేషన్స్, 182 పేజీలు, 1/8 డెమీ, రు.275, ప్రతులకు:స్ఫూర్తి బుక్ హౌస్, హైదరాబాద్; సెల్ : 9849908929, ఇమెయిల్ : spoorthysolutions@gmail.com
- **కవిత 2009** – సాహితీ మిత్రులు ప్రచురణ, 176 పేజీలు, 1/8 డెమీ, రు.100, ప్రతులకు : సాహితీ మిత్రులు, 28–10–26/1, మజీద్ ఎదురుగా, అరండల్‌పేట, కారల్ మార్క్స్ రోడ్, విజయవాడ – 520 002; ఫోన్ :0866–2433359, సెల్ :9490634849
- **మహా దార్శనికుడు పూలే** – సంపాదకులు : తాటికొండ రమేష్ – హైదరాబాద్ బుక్ ట్రస్ట్, 250 పేజీలు, 1/8 డెమీ, రు.100, ప్రతులకు: హైదరాబాద్ బుక్ ట్రస్ట్, ఫ్లాట్ నెం. 85, బాలాజీనగర్, గుడిమల్కాపూర్, హైదరాబాద్ – 500 067. ఫోన్ : 23521849, www.hyderabadbooktrust.blogspot.com
- **పాట సంద్రమై...** – ఉదయమిత్ర – పాలమూరు ప్రచురణలు, పాలమూరు అధ్యయన వేదిక – 176 పేజీలు, 1/8 డెమీ, రు. 60, ప్రతులకు : ఉదయమిత్ర, 9–25, ఓల్డ్ బజార్, స్టేషన్ జడ్చర్ల, మహబూబ్‌నగర్ – 509301
- **సంస్మరణ** – తెలంగాణ అమరులు – నర్ర భగవాన్ రెడ్డి – మంజీరా రచయితల సంఘం – 50 పేజీలు, 1/8 డెమీ, రు. 20, ప్రతులకు : దిశ పుస్తక కేంద్రం, సహచర బూక్ మార్క్, విశాలాంధ్ర బుక్‌హౌస్, నవోదయ బుక్‌హౌస్
- **అనుపమాన** – కథా రూపకాలు – ఛాయరాజ్ – నడుస్తున్న చరిత్ర ప్రచురణ, 100 పేజీలు, 1/8 డెమీ, రు.50, ప్రతులకు : ఛాయరాజ్, గుజరాతిపేట (పోస్ట్), శ్రీకాకుళం – 532 005; సెల్ : 9440258275; నడుస్తున్న చరిత్ర, మాచవరం, విజయవాడ–4; నవోదయ బుక్‌హౌస్, నవోదయ పబ్లిషర్స్, విశాలాంధ్ర అన్ని బ్రాంచీలు
- **శ్రీకృష్ణ కమిటీకి బహిరంగ లేఖ** – (తెలంగాణ వ్యథలు... బాధలు... గాథలు...) – కూర్పు : డా. జి. లచ్చయ్య – డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ – 67 పేజీలు, 1/8 డెమీ, వెల లేదు, ప్రతులకు : డా. జి. లచ్చయ్య, 3–2–67, సరోజిని దేవి రోడ్, కామారెడ్డి, నిజామాబాద్ – 503111; సెల్ : 9440116162; పి. శంతన్, 6–1–203, న్యూ బ్యాంక్ కాలనీ, కంఠేశ్వర్, నిజామాబాద్ – 503002; సెల్ : 9440898729
- **మైకెల్ జాక్సన్** – పాప్ సంగీతానికి రారాజు – కస్తూరి మురళీకృష్ణ – పాలపిట్ట బుక్స్, 143 పేజీలు, 1/8 డెమీ, రు. 60, ప్రతులకు : పాలపిట్ట బుక్స్, 16–11–20/6/1/1, 403, విజయసాయి రెసిడెన్సీ, సలీంనగర్, మలక్‌పేట్, హైదరాబాద్ – 500036; ఇమెయిల్ : palapittabooks@gmail.com
- **మన 'సు'దర్శనం** – అభినందన చందనం – సంపాదక మిత్రులు : డా. నోముల సత్యనారాయణ, దేవులపల్లి కృష్ణమూర్తి, డా. అమ్మంగి వేణుగోపాల్, వేణు సంకోజు, గుడిపూడి సుబ్బారావు, దామరాజు సూర్యకుమార్ – సాహితీ సదన్ ప్రచురణ, 118 పేజీలు, 1/4 క్రౌన్, రు. 100, ప్రతులకు: కె. జితేంద్రబాబు, సాహితీ సదన్, మునగాల మం, నల్గొండ – 508233; ఫోన్ : 08683–280245; శ్రీమతి స్వర్ణలత, ఎ/267, హిల్ కాలనీ, నాగార్జునసాగర్, నల్గొండ – 508202; ఫోన్ : 08680–276320, సెల్ : 9440608208
- **'వేణు' గానం** – అభినందన సంచిక – తెలంగాణ జన జాగృతి ప్రచురణ, 142 పేజీలు, 1/4 క్రౌన్, రు. 100, ప్రతులకు: వేణు సంకోజు, 5, ఎల్.ఐ.జి.ఎచ్., ఎచ్.బి. కాలనీ, రాజీవ్ పార్క్, నల్గొండ – 508001; సెల్ : 9948419881





వీక్షణానికి చేయూత...

వరంగల్ జిల్లాలోని గ్రంథాలయాలకు వీక్షణంను పరిచయం చేయడానికి అనుమతించి, వీక్షణం సామాన్య పాఠకులకు చేరడంలో సహకారం అందించిన వరంగల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ **నాయిని రాజేందర్ రెడ్డి** గారికి, కార్యదర్శి **పి. పద్మజ** గారికి మా హార్దిక కృతజ్ఞతలు.

తమ వంతు బాధ్యతగా వీక్షణంకు విస్తృతంగా చందాదారులను చేర్పిస్తూ, పత్రికను పది మందికి పరిచయం చేస్తూ, నిరంతరం పత్రికకు సహకరిస్తున్న మిత్రులు **తల్లం రమేష్**, లెక్చరర్ (కరీంనగర్), **ఎర్రంరెడ్డి నర్సింహారెడ్డి**, టీచర్ (జనగాం), **ఎనిశెట్టి శంకర్**, టీచర్ (నిజామాబాద్), **పి.వి. రమణ**, పోర్ట్ రిటైర్డ్ ఉద్యోగి (విశాఖపట్నం), **సిఎచ్. శ్రీమన్నారాయణ,** టీచర్ (మంచిర్యాల) గార్లకు వీక్షణం తరఫున హార్దిక కృతజ్ఞతలు.

'వీక్షణం' ఏప్రిల్ 2010 సంచికలో 'ఇది అసమాన్యుల (అసామాన్యుల కాదు) బడ్జెట్' అంటూ వి. హనుమంతరావు సామాన్యులకు అర్థమయ్యే వివరాలు ఇచ్చారు తమ వ్యాసంలో. 'పేదరికం క్షేమం – పేదలూ క్షేమం' వ్యంగ్యం నసాళానికి అంటింది. ఎస్. శ్రీదేవి అంకెల వివరణ సామాన్యులకు అర్థంగాదు. పాలస్తీనా పోరాట నేపథ్యం 1904 నుండి 1948 ఏప్రిల్ 9 దాకా గల చారిత్రకాధారాలు చూపారు కాని, అప్‌డేట్ పొసీషన్ పాలస్తీనా గురించి మరో వ్యాసంలో కె. నరేంద్రమోహన్ రాస్తారని ఆశిస్తాను. ఈ అరవైయేళ్ల పాలస్తీనా కథ కావాలి ఇప్పుడు. మార్చ్ 2010 సంచికలో 15వ పేజీలో కులం అనేది మతానికి ప్రత్యామ్నాయం అనీ, తరగతి అనేది రాజ్యాంగ ప్రత్యామ్నాయంగా ప్రవర్తిస్తున్నారనీ రాశారు. దానిని 'ప్రత్యయం'గా ఎందుకు తప్పుదిద్దుతున్నారో అర్థం గాలేదు. ప్రత్యయం (విభక్తి ప్రత్యయం) అంటే అంత్య భాగంలో చేరి ఉపసర్గ మాత్రమే. ఆ అర్థం కులానికి, తరగతికి ఉపసర్గగానో (సఫిక్స్) గా వచ్చినది కాదే! అట్లాగే 53వ పేజీ (మార్చ్‌లో బి. రామరాజు 1972 జూన్ నుండి ఏప్రిల్ 1974 దాకా పి.జి. సెంటర్‌లో పనిచేసినాయన తిరిగి 1973 నుండి డిసెంబర్ 1983 దాకా ఓ.యు. హెడ్‌గా పనిచేశారన్నారు. 1973, 1974లలో రెండు పదవులలో పని చేశారని అర్థమా. ఈ తప్పులు దిద్దడంలో తప్పులేమిటో? వి. హనుమంతరావు తమ వ్యాసంలో పేదరికం స్వగతంగా ప్రారంభించి, 3వ పేరా నుంచి తిరిగి తామే వ్యాసకర్తగా మారి చివరలో పేదరికాన్ని ప్రవేశపెట్టారు.

– ఎస్. హజరత్ అలీ
వేమూరు, గుంటూరు

'వీక్షణం' మే 2010 సంచికలో వచ్చిన కార్మికుల జీవితాలపై వచ్చిన వ్యాసాలు చాలా బాగున్నాయి. ముఖ్యంగా బీడీ కార్మికుల జీవన స్థితిగతులు, పని పరిస్థితుల గురించి తెలియని విషయాలు తెలుసుకునే వీలు కలిగింది. అలాగే అసంఘటిత రంగంలో ఇంకా మిగిలిపోయిన వివిధ జీవన రంగాల గురించి ఇంకా వివరంగా తీసుకువస్తే బాగుంటుంది.

– బి. నాగరాజు
హాలియా, నల్గొండ

'వీక్షణం' మే 2010 సంచికలో రాయలసీమ వెనుకబాటు వెనకాల ఉన్న అనేక కారణాలను, దశాబ్దాలుగా రాజకీయ పక్షాల నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ పాలకులను నిలదీసిన 'రాయలసీమ వెనుకబాటు – కొన్ని ప్రశ్నలు' వ్యాసం బాగుంది.

– పి. శారద
కర్నూలు

తెలంగాణ ఆకాంక్షను బలహీనపర్చడంలో భాగంగానే హైదరాబాద్‌లో మతఘర్షణలు చోటు చేసుకున్నట్లు అవగతమవుతోంది. గతంలో కూడా అధికార మార్పిడి కోసం ఇలాంటి మతఘర్షణలు జరిగిన అనుభవాలు మనకు తెలిసినవే. మసీదులు, మందిరాలు కూల్చేయడం వెనుక రియల్ ఎస్టేట్ ప్రయోజనాలు కూడా కనబడుతున్నాయి. మత విశ్వాసాల సామాజిక ఆచరణలో అనవసర పోటీకి సంబంధించిన అంశాలు, ఉద్రేకాలు, వెనుకబాట్లు కూడా కనబడు తున్నాయి. ప్రజలు మాత్రం విశ్వాసాలతో సంబంధం లేకుండా పరస్పరం సహకరించుకోవడం చూస్తే దీని వెనుక కుట్ర ఉందనేది అర్థమవుతోంది.

– ఎం.ఎల్. లక్ష్మణ్
హైదరాబాద్

ఉద్యమ సాహిత్యాభిమానులకి విజ్ఞప్తి

పౌరహక్కుల, మానవ హక్కుల ఉద్యమానికి సైద్ధాంతికంగానూ, ఆచరణాత్మకంగానూ రాబోయే తరాలు సైతం గుర్తుంచుకొనేంత కృషి బాలగోపాల్ చేశారు. ఆయన ఆలోచనలని చర్చిండానికి, స్ఫూర్తిని కొనసాగించడానికి, మానవ సమాజ మార్పులో ఆయన జ్ఞాపకం సమష్టి జ్ఞాపకంగా ఎదగాలనే ఆకాంక్షతో పర్‌స్పెక్టివ్స్ సంస్థ కాకతీయ విశ్వవిద్యాలయాన్ని 'బాలగోపాల్ స్మారకోపన్యాసం'ని ప్రతి ఏటా అక్టోబర్ 8న నిర్వహించాల్సిందిగా కోరింది. నిజాయితీగా ప్రజల పక్షాన నిలబడ్డ మేధావులచే, ఉద్యమ నాయకులచే ఈ ఉపన్యాసాలుంటాయి. ఈ కార్యక్రమ నిర్వహణకు కావలసిన వనరులను పర్‌స్పెక్టివ్స్ విశ్వవిద్యాలయానికి సమకూర్చింది. ఇందుకు సానుకూలంగా స్పందించిన కాకతీయ యూనివర్సిటీకి మా అభినందనలు. ఈ కార్యక్రమం ప్రతి ఏటా విజయవంతం అయ్యేందుకు సమాజంలోని ప్రజాస్వామిక శక్తులందరికీ విజ్ఞప్తి చేస్తున్నాం.

పర్‌స్పెక్టివ్స్‌ని నిర్వహించే అయిదు మందిలో బాలగోపాల్ ఒకరు. ఆయన మార్క్సిస్ట్ – లెనినిస్ట్ ఉద్యమాలపై, దళిత ఉద్యమాలపై వివిధ పత్రికలలో రాసిన వ్యాసాలను తెలుగులో రెండు సంపుటాలుగా తెస్తున్నాం. ఈ సంవత్సరంలోనే అల్లం రాజయ్య కథా సంకలనం – మావో రచనల ఎంపిక చేసిన సంకలనం, పల్లీయ జీవితం – మానవీయ కథనాలపై జర్నలిస్ట్ మల్లేపల్లి లక్ష్మయ్య రిపోర్ట్ (జర్నలిస్ట్ రూరల్ డైరీ)ని మా ప్రచురణలుగా తెస్తున్నాం. ఉద్యమ, సాహిత్య అభిమానులందరూ తమ తోడ్పాటునందివ్వాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం.

పర్‌స్పెక్టివ్స్, 3-6-252, శిల్పా అపార్ట్‌మెంట్స్, ఎర్రమంజిల్ కాలనీ, సోమాజిగూడ, హైదరాబాద్ – 500 082;

వీక్షణంకు చందాలు, వీక్షణం పబ్లికేషన్ పుస్తకాల కోసం మీరు ఆన్‌లైన్ ద్వారా డబ్బులు కట్టడానికి వీలుగా
వీక్షణం అకౌంట్ నెంబర్ – **01391101100 2175,** ఆంధ్రాబ్యాంక్, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్

విత్తన కంపెనీలకు మేలు

పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చేసిన కీలక సిఫారసులకు చోటు లేకుండా రైతాంగానికి నష్టం చేసేదిగా విత్తన బిల్లు – 2004 రూపొందుతోంది. కంపెనీలకు వ్యతిరేకంగా ఉన్న అంశాలను తొలగించి ఈ బిల్లును ఆమోదించే దిశగా కేంద్ర ప్రభుత్వం పావులు కదుపుతోంది. విత్తన ఉత్పత్తి, పంపిణీ, ధరల నియంత్రణ, రైతులకు నాణ్యమైన విత్తనాల సరఫరా ఈ బిల్లు ముఖ్య ఉద్దేశాలు కాగా, ఆ ఉద్దేశాలకు తూట్లు పొడిచి, కంపెనీలకు లాభాలు, గుత్తాధిపత్యం కల్పించే దిశగా బిల్లు రూపొందు తోంది. దీనిపై మన రాష్ట్రంలో పలు రైతు సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, రైతులు తీవ్ర నిరసనను వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదాలు

రోడ్డు ప్రమాదాలకు సంబంధించి జాతీయ నేరాల సంస్థ తాజాగా విడుదల చేసిన గణాంకాలు కలవరపరుస్తున్నాయి. 2009లో రోడ్డు ప్రమాదాలలో 14,786 మంది మరణాలతో మన రాష్ట్రం అగ్రస్థానంలో ఉంది. 2004 నుంచి 2009 మధ్య ఐదేళ్లలో రోడ్డు ప్రమాదాలలో 78,044 మంది చనిపోయారు. అంతకు రెట్టింపు మంది గాయాల పాలయ్యారు. మన తర్వాత మహారాష్ట్ర రెండవ స్థానంలో నిలిచింది. మృతుల్లో ఎక్కువ మంది 15 నుంచి 45 సంవత్సరాల మధ్యవయస్కులే.

పరీక్షా ఫలితాలు

ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా 9,17,794 మంది ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాయగా, వారిలో 64.69 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. రెగ్యులర్ విద్యార్థులు 6,95,927 మంది, ప్రైవేట్ విద్యార్థులు 2,21,867 మంది ఉన్నారు. రెగ్యులర్ విద్యార్థుల్లో 64.69 శాతం, ప్రైవేట్ విద్యార్థుల్లో 33.77 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. పరీక్షలు రాసిన బాలికల్లో 67 శాతం, బాలురల్లో 63 శాతం ఉత్తీర్ణులు అయ్యారు. అలాగే మే 23న వెలువడిన పదోతరగతి పరీక్షల్లో ఈసారి 81.63 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 13,48,726 మంది పరీక్షలకు హాజరు కాగా, రెగ్యులర్ విద్యార్థులు 8,67,594 మంది, ప్రైవేట్ విద్యార్థులు 1,21,639 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 82.01 శాతం, బాలురు 81.27 శాతం ఉత్తీర్ణులయ్యారు. ఈసారి ఫలితాలను సి.బి.ఎస్.ఇ. తరహాలో తొమ్మిది పాయింట్ల గ్రేడింగ్ విధానంలో ప్రకటించారు. పదో తరగతిలో రికార్డు స్థాయి ఫలితాలు సాధించడం ఎస్.ఎస్.సి. బోర్డు చరిత్రలో ఇదే మొదటిసారి అని బోర్డు అధికారులు వ్యాఖ్యానించారు.

వసతులు లేని గిరిజన ప్రాంతాలు

కేంద్ర ప్రణాళికా సంఘం ప్రతినిధులు రంజన్ ఛటర్జీ, అర్చనా సింగ్ మూడు రోజులు ఎనిమిది గిరిజన ప్రాంతాల్లో పర్యటించి వాస్తవ పరిస్థితులను అధ్యయనం చేశారు. అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు, అటవీ భూములపై హక్కులు తదితర అంశాలను ఈ బృందం స్వయంగా పరిశీలించింది. తమ క్షేత్రస్థాయి పర్యటన, ప్రభుత్వ నివేదికలను పరిశీలించిన తర్వాత గిరిజన స్థితిగతులపై ప్రధానికి నివేదిక సమర్పించనున్నట్లు సమాచారం.

లాకప్ మరణాల్లో నాలుగో స్థానం

లాకప్ మరణాల్లో మన రాష్ట్రం ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్ల తర్వాత నాల్గవ స్థానంలో ఉంది. 2009–10 లెక్కల ప్రకారం దేశవ్యాప్తంగా పోలీసు కస్టడీలో 1,794 మంది మరణించగా, మన రాష్ట్రంలో 116 మంది మరణించారు. వారిలో 80 శాతం మంది దళిత, బిసి వర్గాలకు చెందినవారు.

ఒక పక్క చెత్త, మరోపక్క వేడి

ఒకప్పుడు శుభ్రమైన హరితనగరంగా పేరొందిన హైదరాబాద్ నగరాల పారిశుధ్య పరిస్థితిపై జరిపిన జాతీయ సర్వేలో 88వ స్థానానికి దిగజారిపోయింది. 423 నగరాల పారిశుధ్యంపై సర్వే చేయగా, వాటిలో 223 నగరాలు కనీసం బతికేందుకు అనువుగా లేవు. మరోపక్క గత పదేళ్లలో ప్రపంచ వ్యాప్తంగా పెరిగిన వేసవి ఉష్ణోగ్రత 5 డిగ్రీలు కాగా, హైదరబాద్లో మాత్రం 10 డిగ్రీలు పెరగడం ఆందోళనకరంగా ఉంది. పదేళ్ల క్రితం నగరంలో వేసవి సగటు ఉష్ణోగ్రత 32 డిగ్రీలు మాత్రమే. పెరుగుతున్న వాయు కాలుష్యం, చెట్ల నరికివేత, జనసాంద్రత పెరగడం (చదరపు కిలోమీటర్కు పన్నెండు రెట్లు ఎక్కువ మంది), పరిశ్రమల ఉద్గారాలు, అపరిమిత ప్లాస్టిక్ వినియోగం వంటివన్నీ ఒకదాన్ని మించి మరొకటి ప్రభావం చూపుతున్నాయి.

సిద్ధాంత ప్రచారం ప్రాథమిక హక్కు !

మావోయిస్టు సిద్ధాంత ప్రచారం భారత రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులకు లోబడినదేనని విప్లవ రచయితల సంఘం రాష్ట్ర కార్యదర్శి పాణి మే 7న చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మావోయిస్టు ఉద్యమాన్ని సమర్థించే సంస్థలు, వ్యక్తులపై చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామన్న కేంద్ర హోంశాఖ ప్రకటన రాజ్యాంగ ధిక్కారమని తెలిపారు. చర్యల మీద మాత్రమే నేరారోపణలు చేయవచ్చునని, శిక్షాస్మృతి ప్రకారం చర్యలు తీసుకోవచ్చని పేర్కొన్నారు. రాజకీయ ఉద్యమానికి పౌరులు ప్రచారకులుగా ఉండవచ్చునని, మావోయిస్టు పార్టీ జాతీయస్థాయి రాజకీయ పార్టీ అని తెలిపారు. బుద్ధిజీవులు, రచయితలు, కళాకారులు ఆ సిద్ధాంతాన్ని ప్రచారం చేయడం రాజ్యాంగం తమకు ఇచ్చిన హక్కును సద్వినియోగం చేసుకోవడమే అవుతుందన్నారు. హోం మంత్రిత్వ శాఖ మేధావులను బెదిరించడం సరికాదన్నారు.

పరిష్కారం ఢిల్లీ లో లేదు...

రాజ్యసభలో హోంశాఖ పద్దులపై జరిగిన చర్చ అనంతరం మే 6న కేంద్ర హోం మంత్రి పి. చిదంబరం మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని పార్టీల కోరిక మేరకే కేంద్రం డిసెంబర్ 9న తెలంగాణ ఏర్పాటు ప్రక్రియను అసెంబ్లీలో తీర్మానం మేరకు ప్రారంభిస్తామని ప్రకటించినట్లు చెప్పారు. మారిన పరిస్థితులలోనే శ్రీకృష్ణ కమిటీ వేసినట్లు తెలిపారు. తెలంగాణ సమస్యకు ఢిల్లీలో కాకుండా రాష్ట్రంలోనే ఏకాభిప్రాయం రావాలన్నారు. మే 7న దీనిపై జస్టిస్ శ్రీకృష్ణ స్పందిస్తూ రాష్ట్ర విభజనపై అంతిమ నిర్ణయం కేంద్రం, పార్లమెంటులదేనని స్పష్టం చేశారు. మే 7 నాటికి శ్రీకృష్ణ కమిటీకి ఒక లక్షా పదిహేను వేల నివేదికలు అందాయని తెలిపారు.

వడదెబ్బ – తుపాను దెబ్బ

గత నెల రోజులుగా ఎండ తీవ్రత పెరగడంతో రాష్ట్రంలో వడ దెబ్బ కారణంగా వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. వేసవి సగటు ఉష్ణోగ్రతలు పెరగిపోయాయి. తాగడానికి మంచినీళ్లు, కనీస వసతులు లేక ప్రజలు పిట్టల్లా రాలిపోతున్నారు. మే మూడవ వారం చివరలో వచ్చిన తుపానుకు కోస్తా జిల్లాలలో ముఖ్యంగా ప్రకాశం, కృష్ణా, గుంటూరు, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలలో దాదాపు నలభై మందికిపైగా చనిపోగా, వందలాది పశువులు, వేలాది ఎకరాల పంట నష్టం జరిగింది. ప్రాథమిక అంచనాల ప్రకారం పంట, ఆస్తి నష్టాలు కలిపి ఐదు వందల కోట్ల రూపాయలు ఉంటుంది. వీ

నిజమయిన అర్థంలో సామాజిక న్యాయాన్ని అందించడానికి వెనుకబడిన తరగతుల కులాల జనగణన జరగాల్సిందేనని అంటున్నారు **వెంకట్ సాధం**

కుల గణనకు జాప్యం ఎందుకు?

దేశ చరిత్రలో అంతర్భాగం జనాభా లెక్కలు. సమాజంలో సగంగా ఉన్న బి.సి.లను విస్మరించి జనగణన ప్రారంభించడం వల్లనే ప్రభుత్వానికి చిక్కులు, విమర్శలు ఎదురవుతున్నాయి. పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు ఆలస్యంగా స్పందించడమూ విచిత్రమే. బడికన్నా గుడే ముఖ్యం అనుకునే బిజెపి మండల్ కమిషన్ నాటి నుంచి బిసిలకు వ్యతిరేకమని బిసిలు భావిస్తున్నారు. కాని, జనగణన విషయంలో పార్లమెంట్‌లో ప్రతిపక్షాలతో బిజెపి గళం కలిపింది. మరోపక్క ఆర్.ఎస్.ఎస్. వ్యతిరేకించింది. విమర్శలు స్పష్టంగా చేసే సి.పి.ఎం. రాజ్యసభ్యులు సీతారాం ఏచూరి జనగణనలో కులం విషయంలో పాము చావకుండా, కట్టె విరక్కుండా అస్పష్టమైన స్టేట్‌మెంట్‌తో సరిపెట్టుకున్నారు. కులం వాస్తవిక సామాజిక స్థితి. దేశ చరిత్రలో కులాలు, మతాలు, వృత్తులు, జాతులు ఇమిడి ఉన్నాయనేది అక్షర సత్యం. ఈ సత్యాలను అర్ధసత్యాలుగా, అసత్యాలుగా చిత్రీకరించడం వల్లనే బలహీన వర్గాలకు అభ్యంతరాలున్నాయి.

దేశ అభివృద్ధి అంటేనే కులాల అభివృద్ధితో ముడిపడి ఉంది. కుల సమాజమే పునాదిగా ఉంటూ, కులాన్ని విడదీసి చూడడం సరైంది కాదు. బలహీన వర్గాలను సంక్షేమానికి సింబల్‌గా చేసి అవి ఎంతవరకు అందుతున్నాయో లెక్కా పత్రం లేకపోవడం ప్రభుత్వాల ద్వందనీతికి నిదర్శనం. కులం మనిషి జీవనంలో, జీవితంలో, వ్యవస్థలో అంతర్భాగం. కులంతో నిర్మితమైన వ్యవస్థలో, బిసి కులాలను చేర్చకుండా జనగణను చేయడం చరిత్రను వక్రీకరించడమే అవుతుంది. ప్రజల డబ్బుతో జరిగే జనగణన మెజారిటీ వర్గ బిసి కులాల లెక్కలు తీయక పోవడం ఎంత వరకు సమంజసం అని ఈ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. ప్రభుత్వం బిసిల సంక్షేమానికి తప్ప రాజ్యాధికారానికి అంతగా సరిపడరనే విభజన రేఖ గీసి పబ్బం గడిపే ప్రయత్నం జరుగుతోంది. రాజ్యాధికారాల్లో దామాషా వాటా దక్కని బిసిలకు, సంక్షేమం కూడా మధ్య దళారీల చేతిలో చిక్కి రెంటికీ చెడ్డ రేవడిలా పరిస్థితి తయారైంది. ఈ దుస్థితిని నివారించే బాధ్యత ప్రభుత్వాలకు లేదా?

సంక్షేమం, పేదరికం ఓటు బ్యాంకు రాజకీయాలకు కేంద్ర బిందువుగా ఉన్నాయి. ప్రభుత్వాలు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నా బిసి వర్గాలలో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. ఈ పరిస్థితిలో మార్పు తీసుకురావాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా? ప్రజల ధనాన్ని సద్వినియోగపరచి వారిని వాళ్ల కాళ్లమీద నిలబడేటట్లుగా చేయాల్సిన కర్తవ్యం ప్రభుత్వానికి ఉంది. ప్రజల జీవితంలో మార్పుకు సంక్షేమమే గీటురాయిగా ప్రభుత్వం చూస్తున్నప్పుడు, అది ఏ రకంగా ప్రజలకు చేరింది, ఎంత మందికి చేరింది, మిగిలి ఉన్న వాళ్లు ఎందరు అనే శాస్త్రీయ లెక్కలు లేకుండా ప్రభుత్వం చెప్పే అభివృద్ధి లెక్కలపైనే బిసి వర్గాలకు అపోహలు ఉన్నాయి. వీటిని నివృత్తి చేయడానికి నేడు జరుగుతున్న జనాభా లెక్కల్ని వేదికగా చేసుకుని జనగణనలో బిసి వర్గాలను చేర్చాల్సిన అవసరం ఉంది.

1960 నుంచి పెండింగ్‌లో ఉన్న ఈ అభ్యర్థనను ప్రభుత్వం విస్మరించడం అంటేనే, బలహీన వర్గాలను విస్మరించడం కాదా? 25 లక్షల మంది సిబ్బందితో, 6000 కోట్ల రూపాయల ఖర్చుతో 49 అంశాలతో జనగణన చేస్తున్న ప్రభుత్వం 50వ అంశంగా కులాన్ని ఎందుకు చేర్చకూడదు? కులం చేర్చటం వల్ల ప్రభుత్వానికి భారం ఏమీ కాదు కదా! పరిపాలనా అవసరాల కోసం చెట్టుకు, పుట్టకు, పక్షులకు, ఆవులకు, గేదెలకు, మేకలకు, గొర్రెలకు లెక్కలున్నాయి. కాని సమాజంలో సగానికి పైగా ఉన్న మానవ వనరులైన బీసీల జనాభా లెక్క లేకపోవడం, వీరంటే లెక్క లేకపోవడమే. లెక్క తెలిస్తే వ్యవస్థకు చిక్కులొస్తాయనే భయమా? చట్ట సభలలో బిసిల ప్రాతినిధ్యం పెంచాల్సి వస్తుందనే ఆందోళనా, వ్యూహాత్మక ఎత్తుగడా? కుట్రా? కుతంత్రమా? ఎందుకోసం జనాభా లెక్కల్లో బిసిలను చేర్చడం లేదు.

1931లో బ్రిటిష్ పాలకులు, ఇటు నైజాం పాలకులు కులాలు, వృత్తులు ఆధారంగా జన గణన చేశారు. ఇందులో అప్పటి ఆ పాలకుల స్వార్థం కూడా ఇమిడి ఉంది. వారు ఆదాయం పెంచుకునేందుకు వృత్తుల మీద పన్నులు వేశారు. కాని నేటి సంక్షేమ, శ్రేయోరాజ్య లక్ష్యాలను నెరవేర్చాల్సిన ప్రభుత్వం జనాభా లెక్కల్లో బిసిలను చేర్చకపోవడంలోని ఆంతర్యం ఏమిటని బిసి వర్గాల ప్రశ్న. లిబరలైజేషన్, గ్లోబలైజేషన్ నేపథ్యంలో, ఆధునిక టెక్నాలజీ వల్ల గ్రామీణ ఉపాధి రంగంలో కార్పొరేట్ రంగం ప్రవేశించింది. దీని వల్ల గ్రామాల్లో వృత్తిదారులు ఉపాధి కోల్పోయి దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. పేదలు మరింత పేదలుగా మారుతున్నారు. పల్లెటూళ్లే పట్టుగొమ్మలుగా ఉండాల్సింది పోయి, ఉపాధి కోసం పట్టణ, నగర ప్రాంతాలకు వలసలు పెరుగుతున్నాయి. వీరు నగరాలలో అడ్డా కులీలుగా పనికోసం ఎదురుచూడాల్సిన దుస్థితి నేడు నెలకొని ఉంది. కమ్మరి కొలిమి, కుమ్మరి వాము, సాలెల మగ్గం దేశ ప్రగతి చక్రాలుగా ఉండాల్సిన వృత్తుల వారు చేష్టలుడిగి ఆత్మహత్యలు చేసుకుంటున్న దయనీయ పరిస్థితి రోజు రోజుకూ పెరుగుతోంది. ఓ పక్క గ్రామీణ

ఉపాధికి ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతున్నా, పేదలైన వృత్తిదారుల జీవితాలలో ఆశించిన మార్పు రావడం లేదు. ఎందుకని ఇలా జరుగుతోంది?

బిసి వర్గాల జీవితాలలో వెలుగులు నింపే ప్రయత్నం ప్రభుత్వాలు చిత్తశుద్ధితో ఎందుకు చేయలేకపోతున్నాయి. ప్రజల అవసరాలకు తగ్గ స్థాయిలో సంక్షేమ కార్యక్రమాలు లేకపోవడం, సంక్షేమం మధ్య దళారీల చేతిలో బందీ కావడంతో పాటు వీటి అమలులో శాస్త్రీయ దృష్టి లేకపోవడమే కారణాలు. సంక్షేమం, సామాజిక న్యాయం, పేదరికాలను అస్త్రాలుగానే ఉపయోగించుకుంటూ, ఓటు బ్యాంక్ రాజకీయాలకు పాల్పడినంత కాలం నిజమైన అభివృద్ధి జరగదు. అభివృద్ధి లక్ష్యాలను చేరాలనుకుంటే, సంక్షేమ రంగానికి సరైన బడ్జెట్ కేటాయింపులు జరగాలి. అందుకు జనాభా లెక్కలే ప్రధాన భూమిక పోషిస్తాయి. భారత దేశం కులాలతో సమ్మిళితం అయి ఉంది. అందుకని ఈ జనగణనలో బిసి కులాన్ని చేర్చాల్సిన అవసరం ఉంది. ఎన్నో చట్టాలను ఆఘమేఘాల మీద తెచ్చిన ప్రభుత్వం జనగణనలో బిసిలను చేర్చకపోవడంలో ప్రభుత్వానికి ఏదైనా దురుద్దేశం ఉందా అని బిసిలు ఆలోచిస్తున్నారు.

మహిళా బిల్లు సందర్భంగా బిసి మహిళలకు సబ్ కోటా ఉండాలని రాజ్యసభలో జరిగిన చర్చలో జనగణన ప్రస్తావన మొదలైంది. బిసి జనాభా లెక్కలు లేకపోవడం వల్ల సబ్ కోటా సాధ్యం కాదని, దీనివల్ల వ్యూహాత్మక, సాంకేతిక సమస్యలు ఎదురవుతాయని సాక్షాత్తు ప్రధాని మన్మోహన్ సింగ్‌తో పాటు, న్యాయశాఖ మంత్రి వీరప్ప మొయిలీ పలు సందర్భాలలో పేర్కొన్నారు. దీంతో బిసి కులాలను జనగణనలో చేర్చాలనే విషయంపై దేశ వ్యాప్తంగా చర్చ మొదలైంది. కులాన్ని చేర్చాలని దేశ వ్యాప్తంగా బలమైన డిమాండ్ ఉంది. అనేకరకాలుగా బిసి వర్గాలు దీనిపై ఒత్తిడి తెస్తున్నా, ప్రభుత్వం నాన్చుడు ధోరణితో, విస్పష్టంగా ప్రకటించకపోవడం వల్ల కాలం గడపాలనే ఆలోచన ఉందా?

ఇప్పటికీ మించిపోయిందేమీ లేదు. మొదటి దఫా మే నుంచి జూన్ వరకు జరిగే ఇంటింటి సర్వేలో ఉద్యోగులు, నిరుద్యోగులు, స్వంత ఇల్లు, గ్యాస్ ఉందా తదితర వివరాలు సేకరిస్తారు. రెండవ దఫా ఫిబ్రవరి 9 నుండి 28 వరకు జరిగే గణనలోనే జనాభా లెక్కలు సేకరిస్తారు. ఇప్పటికీ జనగణనలో కులాన్ని చేర్చడానికి అవకాశం ఉంది. కర్ణాటకకు చెందిన సమతా ఫులే ట్రస్ట్ సుప్రీంకోర్టులో న్యాయపోరాటానికి దిగింది. కేరళ, చెన్నై హైకోర్టులలో కేసులు అడ్మిట్ అయ్యాయి. ఈ జనగణనలో కులాన్ని చేర్చకపోతే, న్యాయపరంగా ఎలాంటి సవాళ్లు ఏదురవుతాయనే భయం కూడా కేంద్ర ప్రభుత్వానికి ఉంది. 2005 జూలై 27న జరిగిన ఒబిసి కాన్ఫెడరేషన్ సదస్సులో ప్రధాని మన్మోహన్ సింగ్ బిసి జనాభాను రీజియన్, జిల్లాల వారిగా సమగ్ర లెక్కలు తీయాలని తీర్మానం చేసి అన్ని రాష్ట్రాలకు లేఖలు రాయడం జరిగింది. రాష్ట్రాలు ఖర్చుకు వెనుకాడడంతో అది మరుగున పడింది. పాలకవర్గాల ఉనికికి ఉపయోగపడే విధంగా బిసిలకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పిస్తున్న ప్రభుత్వాలు, సంక్షేమాన్ని కూడా అరకొరగా అందించి ఈ వర్గాలను సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో తిరోగమనంలోకి నెట్టే ఆలోచన ప్రభుత్వానికి ఏమైనా ఉందా? లెక్కలు వేసినంత మాత్రాన బిసిలకు చట్ట సభలలో సమాన ప్రాతినిధ్యం కల్పిస్తారనే భ్రమలలో బిసిలు లేరు. ఆ ప్రయత్నానికి ఆమడ దూరంలో ఉండడం వల్లనే బిసిలు కేంద్ర ప్రభుత్వం తీరుని అనుమానిస్తున్నారు. జనాభా లెక్కలను కేంద్ర ఉమ్మడి జాబితాలో పెట్టి అందని ద్రాక్ష పండులా చూపడం ఓ సాకు మాత్రమే. జిల్లాను యూనిట్‌గా చేసి జనాభా లెక్కలను రాష్ట్ర జాబితాలో పెట్టడం వల్ల కులాల సమగ్ర సమాచారం వస్తుంది.

ఉత్పత్తి కులాల సమస్యలతో సంబంధంలేని కాంట్రాక్టర్లు, డబ్బు సంచుల బడాబాబులు పాలనలో ప్రధాన భూమిక పోషించడం వల్లనే జనగణనలో బిసి వర్గాల ప్రాధాన్యతను గుర్తించలేక పోతున్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 304, 15 (4) ప్రకారం విద్యా, ఉద్యోగ రంగాలలో బిసి కులాలకు అవకాశాలు కల్పించాలంటే జనాభా లెక్కలు ఉండాల్సిందేనని స్పష్టం చేస్తోంది. స్థానిక సంస్థల రిజర్వేషన్‌ల అమలు శాస్త్రీయ జనాభా లెక్కలు లేక దశాబ్దాలుగా కోర్టులో వివాదాలు నడుస్తున్నాయి. కొన్ని సందర్భాలలో దళారీలు అనుసరించే లాటరీ పద్ధతిలో ఈ రిజర్వేషన్‌లు అమలు పరిచే దౌర్భాగ్య స్థితిలో మనం ఉన్నాం.

మండల్ కమిషన్, కాకా కాలేల్కర్, మురళీధర్‌రావు కమిషన్‌లు అన్నీ బిసిలను విద్యా, ఉపాధి, సామాజిక, ఆర్థిక రంగాలలో అభివృద్ధి చేయాలనీ, వీరిలో సాధికారత సాధించాలనీ నివేదికలు ఇచ్చాయి. ఆ స్ఫూర్తి నెరవేరాలంటే, బిసిల జనగణన చెయ్యాలి. మండల్ కమిషన్ అమలు విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు సందర్భంగా, కులాల లెక్కలు తీయాలని అత్యున్నత న్యాయస్థానం సూచించింది. మురళీధర్ రావు కమిషన్ సిఫారసుల మేరకు స్థానిక సంస్థలలో 34 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని రాష్ట్ర హైకోర్టు చెప్పిన సందర్భంగా, జనాభా లెక్కలు సేకరించాలని కోర్టు చెప్పింది. ముస్లింలను బిసి జాబితాలో చేర్చే విషయంలో బిసి జనాభా లెక్కల సేకరణ చేయాలని రాష్ట్ర హైకోర్టు సూచించింది. బిసిలలో కొత్త కులాలను చేర్చాలన్నా, అభివృద్ధి చెందిన కులాలను తీసెయ్యాలన్నా, జనాభా లెక్కలే ఆధారం. బిసిలను జనగణనలో చేర్చాలని రాష్ట్ర శాసనమండలిలో తీర్మానం చేసి చైర్మన్ కేంద్ర ప్రభుత్వానికి పంపించారు. బిసి కుల సంఘాలు నెత్తీ, నోరూ మొత్తుకుంటున్నా, రాజ్యాంగబద్ధ సంస్థలు సూచించినా, కులాన్ని లెక్క వేయకపోవడం ప్రభుత్వ వ్యూహాత్మక ఎత్తుగడా? లేక చిన్న చూపా అని అనుమానించాల్సి వస్తోంది. కులం చేర్చి లెక్కలు తీయడం వల్ల సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రభుత్వ డొల్లతనం బయటపడుతుందనే భయంతో కేంద్ర ప్రభుత్వం వెనకడుగు వేస్తోంది. అభివృద్ధిలో ఎవరెంత మంది ముందుకెళ్లారు, గత ప్రణాళికలో లోటుపాట్లు ఏమిటి, అభివృద్ధికి నోచుకోని వర్గాలకు బడ్జెట్‌లో ప్రాధాన్యతకు కులాల ఆధారంగా జరిగే జనాభా లెక్కలే ఆధారం. పదేళ్లకు ఓ మారు జరిగే ఈ మహా యజ్ఞంలో కులాన్ని చేర్చి లెక్కలు తీయకపోతే ఓ దశాబ్దం చరిత్ర వెనుకబడుతుంది. కులాల వారి లెక్కలు లేకుండా ప్రణాళికా బడ్జెట్ కేటాయించడం సమర్థనీయం కాదు.

ఉత్పత్తి కులాల శ్రమ సంపదకు మూలం అయి దేశ ఆర్థిక వ్యవస్థలో నిర్మాణాత్మక పాత్ర పోషిస్తున్నప్పుడు, సకల రంగాలలో దామాషా ప్రాతినిధ్యం ఎందుకు దక్కదని బిసిలు ప్రశ్నిస్తున్నారు. బిసిలు శ్రామికులుగా, కార్మికులుగా, సమాజ సంపదను సృష్టించే మూల వాసులుగా ఎండమావి జీవితాలు ఎన్నాళ్లు గడపాలి. బిసిలు ఓ పక్క

పరిశ్రమలు వ్యర్థాలను శుభ్రం చేయకుండా వదలడం వల్ల గాలి, నీరు, భూమి కలుషితమై, మనుషులు రోగాలకు గురై, జీవించే కనీస హక్కును కూడా కోల్పోతున్నారని అంటున్నారు **ఎన్. భగవాన్ రెడ్డి**

కాలుష్యానికి బలికావాల్సిందేనా?

ఆధునిక కాలంలో పారిశ్రామిక అభివృద్ధియే ఆర్థిక ప్రగతికి సూచికగా భావిస్తున్నారు. అలాంటపుడు ఆ ప్రగతి ప్రజలకు మేలు చేసేదిగా ఉండాలి తప్ప నష్టం కలిగించేదిగా ఉండకూడదు. పరిశ్రమల స్థాపననూ, వాటి సంఖ్యనూ, పారిశ్రామిక ఉత్పత్తులనూ వాటి వినియోగాన్నీ గొప్పగా చెప్పుకోవచ్చు. కొంతమందిని సంపన్నులుగా మార్చివేయవచ్చు. కాని ఆ పారిశ్రామిక వెలుగుల నీడన ఛిద్రమైపోతున్న బతుకుల్ని గురించి పట్టించుకోలేకపోవడం విచారకరం. పరిశ్రమల పట్ల సరైన నియంత్రణ లేకపోవడంవల్ల ఎన్నో రకాలుగా దుష్పరిణామాలు ఏర్పడుతున్నాయి. ఆ దుష్పరిణామాలు ప్రజలను అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేయడమే కాకుండా ప్రజల మనుగడకు ప్రమాదకరంగా మారుతున్నాయి. పారిశ్రామిక అభివృద్ధి మాటున ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిశ్రమలు నెలకొన్న ప్రాంతాల్లో ఎక్కడైనా ఇలాగే ఉంటాయనడానికి మెతుకు సీమలోని పారిశ్రామిక వాడల ప్రజల దుస్థితిని చూస్తే తెలుస్తుంది. పారిశ్రామిక అభివృద్ధితో పాటు మానవ జీవనాన్ని సవాల్ చేసే సమస్యలు నెలకొంటున్నవి.

తాగే నీరు, పీల్చే గాలి విషపూరితమైపోతున్నవి. వ్యవసాయరంగం దెబ్బతింటున్నది. మెదక్ జిల్లాలో పటాన్‌చెరు, జిన్నారం, బొల్లారం, కోహిర్ తదితర పారిశ్రామిక వాడల్లో వేలాది పరిశ్రమలున్నాయి. పరిశ్రమల వల్ల జరిగే అభివృద్ధిని ప్రచారం చేస్తున్న అధికారులు వాటివల్ల ఏర్పడుతున్న ఇబ్బందుల్ని తొలగించడం లేదు. పరిశ్రమల వల్ల ఏర్పడే కాలుష్య నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోకపోవడంతో ప్రమాదకరమైన పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

జిన్నారం, పటాన్‌చెరు మండలాల్లోని రసాయన పరిశ్రమలు అనుసరించిన విధానం ఇక్కడి ప్రజలను అనేక సమస్యలకు గురిచేస్తున్నాయి. కొన్ని వందల అడుగుల లోతున నీరు కలుషితమైంది. స్వచ్ఛమైన గాలి కరువైంది. రసాయన పరిశ్రమల నుండి వెలువడే విష వాయువుల్ని నియంత్రించడానికి ఏర్పాటు చేసిన స్క్రబ్బర్లను, కన్వర్టర్లను యజమానులు ఉపయోగించడం లేదు. విషవాయువులను నేరుగా గాలిలోకి వదిలిపెడుతున్నారు. ముంబాపూర్ వద్ద విజేత, బొంతపల్లి వినార్ ఆర్గానిక్స్, మెడికల్ న్యూలాండ్స్, ఒటిరా గ్రామికల్స్, గడ్డిపోతారం సరాక వంటి పరిశ్రమలు విషవాయువుల్ని వదులుతున్నాయి. జిన్నారంతో పాటు ఊట్ల, సోలక్‌పల్లి, కొడకంచి, మాదారం, నల్తూరు, వావిలాల తదితర గ్రామాలు వాయు కాలుష్యంతో వణుకుతున్నాయి. రాత్రి వేళల్లో చేసే ఎవాబ్రేషన్ పద్ధతి వల్ల సమీపంలోని పదిహేను కిలోమీటర్ల పరిధిలో ఘాటైన విషరసాయనం వ్యాపిస్తోంది. ఫలితంగా శ్వాస, ఉపరితిత్తులకు సంబంధించిన సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.

పరిశ్రమలు విడుదల చేసే వ్యర్థాలు ఎక్కడికక్కడ కుప్పలు కుప్పలుగా నిండగా, కుంటలు, చెరువుల్లో పారబోస్తున్నారు. ఎక్కడపడితే అక్కడ (పోయడంతో) వేయడంతో అవి రసాయనాలు కల్సిన కుప్పలైతే మనుషులు, పశువులు తెలియకుండా అటువైపు వెళ్లగా చర్మంపై బొబ్బలు ఎక్కిన సందర్భాలున్నాయి. కుంటలు, చెరువుల్లో ఈ వ్యర్థాలు నిండగా భూగర్భ జలాలు కలుషితమైనవి. ఈ అంశాల వల్ల స్థానికుల నిరసనలూ, ఆందోళనల వల్ల ఆ వ్యర్థాల్ని ప్రస్తుతం పచ్చని అడవుల్లోకి తరలిస్తున్నారు. ఈ వ్యర్థాల్ని మామూలుగా ఐతే ట్యాంకర్లతో శుద్ధికేంద్రాలకి తరలించాలి. పరిశ్రమల వద్దనే శుద్ధి చేయాలి. కానీ, ఇది ఖర్చుతో కూడిన వ్యవహారమని, తక్కువ ఖర్చుతో నర్సాపూర్ తదితర అటవీ ప్రాంతాలకు తరలిస్తున్నారు. మాఫియా అండదండలతో ఈ వ్యవహారం చేస్తున్నారు.

రాజ్యాధికారంలో సమాన వాటా దక్కాలని కోరుతున్నారు. ఉద్యోగులకు ప్రమోషన్‌లలో రిజర్వేషన్‌లు కావాలంటున్నారు. వాటికి కూడా ప్రధాన ప్రాతిపదిక కులాల ఆధారిత లెక్కలే.

సంక్షేమానికి, చట్టసభల ప్రాతినిధ్యానికి అభివృద్ధికి బిసి వర్గాల లెక్కలే ఆధారం అయినప్పుడు, వాటిని పక్కకు పెట్టడం అంటే, దేశ అభివృద్ధిని విస్మరించడమే. ప్రజలను పేదరికంలో ఉంచి, సంక్షేమం, సామాజిక న్యాయం పేరుతో బిసిలను కావాలని అణచిపెట్టడం వల్ల ప్రభుత్వాలే బిసిల రాజ్యాధికారానికి బాటలు వేసినట్లు అవుతుంది. ఈ జీవితాల మార్పుకు పాల కడవలు, పనిముట్లేకాదు రాజ్యాధికారంలో సరైన వాటా దక్కినప్పుడే ఈ వర్గాల ఆత్మగౌరవ ఆకాంక్ష నెరవేరుతుంది.

రాజ్యాంగంలోని ప్రియాంబుల్ (ప్రవేశిక)లో అందరికి సామాజిక, ఆర్థిక, రాజకీయ అవకాశాలు ఉండాలనేది లక్ష్యం. ఆరు దశాబ్దాల స్వాతంత్ర్యం అనంతరం అది నెరవేరక పోగా పేదలు మరింత పేదలుగా మారుతున్నారు. పేదలు, ధనికుల మధ్య అంతరాన్ని తగ్గించటానికి బిసి వర్గాలను జనాభా లెక్కల్లో చేర్చాలి. మెజారిటీ బిసి ప్రజల లెక్కలు లేకుండా, చట్టసభలలో సరైన ప్రాతినిధ్యం లేకుండా భారత్ అగ్ర దేశం, స్వర్ణ భారత్ కాలేదు.

(రచయిత సీనియర్ పాత్రికేయులు) వీ

మాఫియాలకు, యజమానులకు సిరులు కురిపిస్తున్నాయి. వ్యర్థాలను తరలించే ట్యాంకర్లకు రిజిస్ట్రేషన్ నెంబర్లు ఏవీ ఉండవు. సాయంత్రం ఆరు గంటల నుండి ఉదయం ఆరు గంటల వరకు ఈ అక్రమ పారబోతలు ఉండకూడదనే నిబంధనలున్నప్పటికీ రాత్రివేళల్లో మాఫియాల ఆధ్వర్యంలో నిరాటంకంగా నడుస్తోంది. శుద్ధికేంద్రానికి తరలిస్తే సుమారు ఇరవై వేల రూపాయల ఖర్చు అయ్యేది, ఈ పద్ధతిలో ఐదు నుండి పది వేల రూపాయలల్లో అయిపోతుంది. అలా ఈ వ్యర్థాల పారబోత ప్రవాహం అడవులకు పాకడంతో ప్రకృతి విధ్వంసం జరుగుతోంది.

ఇక జలకాలుష్య విషయాన్ని పరిశీలిస్తే వాగులు, చెరువులు, కుంటలు కాలుష్యానికి గురవుతున్నాయి. పటాన్‌చెరులో నెలకొల్పిన 'పటాన్‌చెరు ఎన్విరోటిక్ లిమిటెడ్' (పి.ఇ.టి.ఎల్) తీవ్రస్థాయిలో కాలుష్యాన్ని వెదజల్లుతోంది. ఈ పరిశ్రమ కాలుష్య జలాలను శుద్ధిచేసి మరోచోటికి పంపాల్సి ఉండగా దొంగచాటుగా శుద్ధి చేయకుండా వ్యర్థ జలాలను నక్కవాగులోకి వదులుతున్నారు. విదేశాల్లో నిషేధించిన రసాయన పదార్థాలను పటాన్‌చెరు, పాశమైలారం పారిశ్రామికవాడలలో ఉత్పత్తి చేస్తున్నారు. ఇక్కడి కాల్వలు వ్యర్థపదార్థాలు, రసాయనాల్తో పారుతూ కిష్టాపూర్ పెద్ద చెరువు కలుషితమైంది.

పటాన్‌చెరు, పాశమైలారం పరిసరాల్లోని ఇరవై కిలోమీటర్ల పరిధిలోని ఆవాసాల్లోని ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారు. కోహిర్ మండలం దిగ్వాల్ గ్రామ శివారులో గల ఓ రసాయనిక కర్మాగారం పరిసరాలను విపరీతంగా కలుషితం చేస్తుంది. కలుషిత నీరు వ్యవసాయ బోర్లు, బావుల్లో కలియడం వల్ల గత పదిహేను సంవత్సరాలుగా తాగు, సాగు నీరు కలుషితమైపోయింది. ఫలితంగా కంటిచూపు పోవడం, అల్సర్, గుండెజబ్బు, తలవెంట్రుకలు రాలడం, ఊపిరితిత్తుల వ్యాధులతో ప్రజలు నానా రకాలుగా బాధపడుతున్నారు. ఖాసిం అనే రైతు బోరులో కెమికల్ కల్సిన నీరు రావడంతో లక్షల పెట్టుబడితో పెట్టిన అల్లం పంట మొత్తం ఎండిపోయింది.

జిన్నారం, బొంతపల్లి, పటాన్‌చెరువు, పాశమైలారం తదితర పారిశ్రామికవాడల్లోని పరిశ్రమల వల్ల ప్రజలు వాయు, జల కాలుష్యాల బారిన పడుతున్నారు. ఒకప్పుడు తాగు, సాగు నీరందించిన నక్కవాగు నేడు పూర్తిగా కలుషితమై పరిశ్రమల వ్యర్థాల్ని తీసుకెళ్తూ ప్రవహిస్తోంది. దాంతో చెరువులు, కుంటలు, బోర్లు, బావులు జలకాలుష్యానికి గురవుతున్నాయి. జిన్నారం రాయుని చెరువు, కాజిపల్లి ఖాజి చెరువు, గండిగూడెం చెరువు, కిష్టారెడ్డిపేట చెరువు, సుల్తాన్‌పూర్ చెరువు, శభాష్‌పల్లి కుంట, బొంతపల్లి చెరువులు పూర్తిగా కలుషితమై వేలాది ఎకరాల భూములు నిరుపయోగంగా మారినాయి. వ్యవసాయానికి పనికి రాకుండా పోయాయి. వేలాది కుటుంబాలు ఉపాధిని కోల్పోయాయి. 100 నుండి 150 అడుగుల లోతు వరకు నీరు కలుషితమై కంపు బయటకు వస్తోంది. నక్కవాగు పరీవాహక ప్రాంతాల్లోని ఉపరితల, భూగర్భ జలాలపై సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంట్, ఐ.పి.జి.ఎస్., ఆర్.జె.ఎన్.టి.యు. విద్యాలయాలకు చెందిన నిపుణులు పరిశోధనలు చేసి ఈ విషయాన్ని ధృవీకరించారు. పటాన్‌చెరు, బొల్లారం ప్రాంతాల్లోని నీటి వనరులన్నీ కలుషితమై ఆ నీరు పరిశ్రమల్లో సైతం పనికి రాదని శాస్త్రవేత్తలు తేల్చి చెప్పారు. కాలుష్యం వల్ల బోర్లలోని నీరు రంగు

రసాయన జల కాలుష్యం	వ్యాధులు
ఫ్లోరైడ్	ఫ్లోరోసిస్ వ్యాధి, గూని, కాళ్లు వంకర్లు తిరగడం, మోకాళ్ల నొప్పి
నైట్రేట్లు	బ్లూ బేబి సిండ్రోం
పాషానం (ఆర్సెనిక్)	ఊపిరితిత్తుల వ్యాధులు, చర్మవ్యాధులు, మూర్ఛ, కడుపులో మంట, పేగుల వ్యాధి
సీసం	నరాల వ్యవస్థను పాడు చేస్తుంది; కంటి చూపుపై ప్రభావం
పాదరసం	అలసట, చికాకు, నీరసం, మెదడు దెబ్బతినడం, నిద్రలేమి
రాగి	జ్వరాలు, గుండెనొప్పి, అధిక రక్తపోటు
పురుగు మందులు	క్యాన్సర్, ట్యూమర్, మెదడు దెబ్బతినడం, అంధత్వాన్ని కలగచేస్తుంది
వాయుకాలుష్యం	**ఆరోగ్య సమస్యలు**
కార్బన్ డై ఆక్సైడ్	ప్రతిస్పందనపై ప్రభావం, తలనొప్పి, గుండె దడ పుట్టిస్తుంది
సల్ఫర్ ఆక్సైడ్	శ్వాసకోశంలో తడి ఆరిపోతుంది; అస్తమా, అలర్జీ కలిగిస్తుంది
హైడ్రో కార్బన్లు	ఊపిరితిత్తుల వ్యాధి
బెంజీన్	క్యాన్సర్
పాదరసం	విసుగు, జ్ఞాపక శక్తి లోపించడం, నిద్రలేమి, వణుకు
ఆక్సైడ్ ఆఫ్ నైట్రోజన్	అస్తమా, శ్వాసకోశ వ్యాధులు
కార్బన్ మోనాక్సైడ్	కళ్లమంట, రక్త సరఫరాలో అంతరాయం

రంగుల్లో బయటకు వచ్చి పంటలకు గానీ, మరోదానికి పనికి రావడం లేదు. వందలాది పంపుసెట్లు తుప్పుపట్టిపోయాయి. వేలాది పశువులు మరణించాయి. కప్పలు, చేపలు వంటి అన్ని రకాల జలచరాలు మరణిస్తున్నాయి. పారిశ్రామిక ప్రాంతాల్లోకి వెళ్తే ముక్కుపుటాలు అదిరిపోయే దుర్వాసన వస్తూ ఎలా భరిస్తున్నారనిపిస్తుంది.

ది అకాడమీ ఆఫ్ గాంధీయన్ స్టడీస్ 1990 నివేదిక ప్రకారం పటాన్‌చెరు ప్రాంతంలోని భూములు వ్యవసాయానికి పనికిరాకుండా పోయాయి. 1990 జూలై 29న కేంద్ర ప్రణాళికా శాఖ మంత్రి ఈ ప్రాంతాన్ని చూశాక ఇక్కడి పరిస్థితుల్లో ఎవరూ జీవించలేరని చెప్పారు.

జిన్నారం మండలంలోని ప్రజలు గత రెండున్నర దశాబ్దాలుగా రసాయన పరిశ్రమల కాలుష్యంతో నరకం అనుభవిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మనుషులే కాక, మూగజీవాలైన పశువులు సైతం మృత్యువాత పడుతున్నాయి. ఈ మధ్య గడ్డిపోతారంలోని పలు పరిశ్రమలు వదిలిన రసాయనాలు సేవించి లక్ష రూపాయల విలువగల పశువులు గాగిల్లాపూర్‌కు చెందిన భిక్షపతివి రెండు గేదెలు, జనార్ధన్‌వి రెండు గేదెలు రెండు రోజుల తేడాలో మృత్యు వాతపడ్డాయి. ఇక ప్రజలు రకరకాల వ్యాధులతో ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. చర్మవ్యాధులు, ఊపిరితిత్తుల సమస్య, తలనొప్పి తదితర సమస్యలతో అవస్థలు ఎదుర్కొంటున్నారు.

గ్రీన్‌పీస్ అనే అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ జిన్నారం

***మేడే పోరాట స్ఫూర్తి మన కష్టజీవుల వరకూ ఇంకా చేరనేలేదనీ, పోరాడి సాధించుకున్న కనీస హక్కులను కూడా కోల్పోతున్న తిరోగమన దశలో ఉన్నామనీ అంటున్నారు* ఎస్. సుధాకర్**

పోరాటాల స్ఫూర్తితో భవిష్యత్తు నిర్మిద్దాం

శతాబ్దాలుగా ప్రపంచ శ్రామికవర్గం మెరుగైన సమాజం, జీవన విధానం కోసం సాగించిన పోరాటాలకు ప్రతీక 'మేడే'. సమాజంలోని సకల సంపదల సృష్టికీ మూలమైన శ్రామికశక్తి ఒక 'మహాశక్తి'గా ఆవిర్భవించిన దినం. గత పోరాటాల స్ఫూర్తిని గుర్తు చేసుకుంటూ ఉజ్వలమైన భవిష్యత్ సమాజ నిర్మాణానికి ప్రతి కార్మికుడూ ప్రతినబూనే పర్వదినం. ప్రపంచంలో అన్ని దేశాల శ్రామికులూ ఎల్లలు మరచి పార్టీలు – జెండాలకు అతీతంగా మే 1న 'అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని' జరుపుకోవడం ఆనవాయితీ. 1886 మే మొదటివారంలో చికాగో కార్మికులు 8 గంటల పని దినాన్ని కోరుతూ సాగించిన ఉద్యమంలో చిందిన రక్తానికి చిహ్నమైన 'ఎర్రజెండా'ను చేతబూని, ఉద్వేగభరితమైన నినాదాలతో ఊరేగింపులూ, సభలూ జరిపి, నాటి పోలీసు కాల్పుల్లో వీరమరణం పొందిన కార్మికులకు నివాళులర్పిస్తారు. అయితే, మేడే అన్నది ఊరేగింపులకూ, ఉపన్యాసాలకూ మాత్రమే పరిమితమైన 'పండుగ' కాదన్న విషయాన్ని విస్మరించకూడదు. నేడు మనం అనుభవిస్తున్న కనీస హక్కుల, సదుపాయాల వెనుక వందల సంవత్సరాల పోరాటాలూ, వేలాది మంది బలిదానాలూ దాగున్నాయి.

మేడే లక్ష్యం కేవలం ఎనిమిది గంటల పనిదినాన్ని సాధించడానికే పరిమితమైనది కాదు. ఒక మనిషి ఆరోగ్యవంతమైన జీవనాన్ని సాగించడానికి 'ఎనిమిది గంటల పని, ఎనిమిది గంటలు కుటుంబంతో కలిసి గడిపే ఆనందం, ఎనిమిది గంటల విశ్రాంతి' అవసరమన్నది ఆ నాటికే ప్రధాన నినాదంగా ముందుకొచ్చింది. అందులో ఏ ఒక్కదాన్నీ నేటికీ మనం పరిపూర్ణంగా సాధించలేక పోయామన్నది మింగుడు పడని వాస్తవం. వాటిని సాధించుకోవడం అటుంచి, చరిత్రలో అనన్యమైన పోరాటాల ద్వారా సాధించుకున్న వాటిని కూడా కోల్పోతున్న ఒక తిరోగమన దశ నేడు మన కళ్లముందు కరాళ నృత్యం చేస్తోంది. దోపిడీ పాలకవర్గాలు పదే పదే వల్లెవేస్తున్న శ్రేయోరాజ్యం, సోషలిజం, సమ

మండలంలో పారిశ్రామిక వాడలున్న గ్రామాల్లో సర్వే చేసి ప్రజారోగ్యంపై ఆందోళన వ్యక్తం చేసింది. ఆ సంస్థ రూపొందించిన నివేదికలో ఏయే కాలుష్యం వల్ల ఏయే రకాల వ్యాధులు సోకే ప్రమాదముందో తెలిపింది.

బొల్లారం, పటాన్‌చెరు, పాశమైలారం, బొంతపల్లి, ఖాజిపల్లి, గడ్డిపోతారం లాంటి గ్రామాల్లో రసాయన పరిశ్రమలు అధికం. బల్క్ డ్రగ్స్, ఫార్మాస్యూటికల్స్, ఇంటర్మీడియేట్ ఉత్పత్తులు చేసే పరిశ్రమలు ఎక్కడ చూసినా కనిపిస్తాయి. ఇలాంటి పరిశ్రమలవల్ల ఆమ్లాలు, సల్ఫేట్‌లు, ఫాస్పరస్, సిలికా, ఫ్లోరిన్ వంటి కాలుష్యాలు వెలువడుతున్నాయి.

2004లో గ్రీన్‌పీస్ సంస్థ కాలుష్య రహిత గ్రామాలు, కాలుష్య ప్రభావ గ్రామాల్ని సర్వే చేసింది. ప్రతినిత్యం వివిధ రకాల వ్యాధులతో, నొప్పులతో కాలుష్య ప్రభావ గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారనీ ప్రభుత్వం తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ప్రజారోగ్యం పై ఎన్నో సూచనలు చేసింది.

పారిశ్రామికవాడల్లో వైద్యం చేస్తున్న పర్యావరణవేత్త, డాక్టర్ కిషన్ రావు కూడా కాలుష్య తీవ్రత పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి కలుషితమైన భూగర్భ జలాలు తాగడం, ఆహార పంటలు తినడం, గేదె, ఆవు, మేకల పాలు తాగడం, మాంసం తినడం, కలుషిత గాలి పీల్చడం వంటి పరిస్థితుల మూలంగా తల్లి శరీరంలో కాలుష్య తీవ్రత పెరిగి, తల్లిపాలు సైతం విషపూరితమైనవని అంటున్నారు. పరోక్షంగా బిడ్డలపై ప్రభావం పడుతోంది. ప్రత్యక్షంగా కాకపోయినా ప్రతి ఇంటా దీని ప్రభావం కనిపిస్తుంది. కాలుష్య ప్రాంతాల్లో ప్రతి ఇంటా తలనొప్పి బాధితులున్నారు. జీర్ణకోశ సంబంధ వ్యాధులు, కంటిచూపు మందగించడం, తొందరగా ముసలితనం రావడం, నీరసం, ఆహారం తినకపోవడం, కిడ్నీ, చర్మ, ఊపిరితిత్తులు, గుండె సంబంధ వ్యాధులు రావడం వంటివి ఇక్కడ సర్వసాధారణం. గర్భస్రావాలు జరుగుతున్నాయి. సుల్తాన్‌పూర్‌లో ఓ మహిళకు 12 పర్యాయాలు గర్భస్రావం కావడం కాలుష్య ప్రభావమేనన్నారు.

ఇలా పరిశ్రమలు వెదజల్లుతున్న కాలుష్యం వల్ల వేలాది ఎకరాల పంట భూములు పనికి రాకుండా పోయి లక్షలాది మంది ప్రజలు ఉపాధి కోల్పోయారు. కనీసం స్వచ్ఛమైన గాలిని పీల్చుకొని, స్వచ్ఛమైన నీరు తాగే పరిస్థితుల్లేక జీవించే హక్కును కోల్పోతున్నారు. ఎన్నో పర్యాయాలు ర్యాలీలు, ధర్నాలు చేసినా, అధికారులకు విజ్ఞప్తులు చేసి వందలాది దరఖాస్తులు పెట్టుకున్నా ప్రయోజనం లేకుండా పోతోంది. కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు వినతి పత్రాలిచ్చినా, ప్రజా ప్రతినిధులకు మొరపెట్టుకున్నా ఫలితం లేదు. కాలుష్యం కాటుకు విలవిలలాడుతూ బలికావాల్సిందేనా? కాలుష్యం నుండి విముక్తి లేదా అని ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకొని, జల, వాయు కాలుష్యాల బారినుండి రక్షణ కల్పించి జీవించే హక్కును కాపాడుతుందని, కాపాడాలని ఆశిద్దాం.

(రచయిత ఉపాధ్యాయులు) వీ

సమాజస్థాపన వంటి మాటలన్నీ ప్రజలను మభ్యపెట్టడానికేనన్నది 'ప్రైవేటైజేషన్'తో మరింత నగ్నంగా బయటపడుతున్న సందర్భం శ్రామిక లోకానికి ఒక సవాలు వంటిది.

అభివృద్ధి పేరుతో పాలకవర్గాలు ఘనంగా ప్రచారం చేసుకుంటున్న సాఫ్ట్‌వేర్ రంగంలో సాంకేతిక సిబ్బంది 14 గంటలకు మించి పనిచేయడం మన కళ్లముందు కొనసాగుతున్న వాస్తవం. పనిభారంతోనూ, కనిపించని ఒత్తిడితోనూ నలభై ఏళ్లకే శారీరకంగా, మానసికంగా నలిగిపోతున్న యువత ఒకవైపూ, పెరుగుతున్న ప్రైవేటీకరణతో గంట పనికి కూడా గ్యారంటీలేని లక్షలాది మంది నిరుద్యోగులు మరోవైపూ, కనీస వేతనాలు కరువైన మహిళలు, బాలకార్మిక వ్యవస్థకు బలైపోతున్న చిన్నారులూ గణాంకాల్లో మనం సాధించామని చెబుతున్న వికృతాలకు నిత్యం బలైపోతున్న వారే. చరిత్ర, అభివృద్ధికి సంబంధించిన నిర్వచనాలు తారుమారైపోతున్నా, వాటి వెనుక దాగిన కుటిలత్వాన్ని గ్రహించి ప్రజానీకాన్ని జాగృతం చేయడంలో 'సంప్రదాయ' కమ్యూనిస్టు పార్టీలు, ఉద్యమాలు విఫలం కావడం విషాదం. ప్రజల కోసమే సమస్త అభివృద్ధి అన్న ప్రజాస్వామిక నినాదం కాస్తా 'డెవలప్‌మెంట్ విత్ హ్యూమన్ ఫేస్'గా రూపాంతరం చెందింది. అభివృద్ధికి సామాన్య ప్రజలు ఆటంకంగా నిలిస్తే వారిని చంపి అడ్డు తొలగించుకోవచ్చు. అయితే, ఆ చంపడం నొప్పిలేకుండా చంపాలన్నదే హ్యూమన్ ఫేస్‌లో దాగిన మర్మం. 'సెజ్'ల పేరుతో లక్షల మంది రైతులను నిర్వాసితులను చేస్తున్నది ఈ హ్యూమన్ ఫేస్ బురఖా ధరించేనన్నది మనం చూస్తున్నదే. అలాగే, 'సైన్స్ విత్ హ్యూమన్ ఫేస్', 'ఇ-గవర్నెన్స్ విత్ హ్యూమన్ ఫేస్' నినాదాలన్నీ కూడా మొత్తం అభివృద్ధి - పాలనలను ప్రైవేట్ వ్యక్తులపరం చేయడానికి జరుగుతున్న కుట్రలో భాగమే. ఇంతటి అమానవీయ పరిస్థితుల మధ్య మనం జరుపుకునే కార్మిక దినోత్సవాలు, బలమైన పోరాటాల రూపకల్పనకు వేదికలు కావాలి. మేడే సందేశం అందించిన చైతన్యాన్ని సహచర కార్మికుల్లో రగిలించాలి. భావితరాలకు ఆ స్ఫూర్తిని మరింత భద్రంగా అందించాలి. అందుకే, ఆ చరిత్రను ఈ సందర్భంగా మరోసారి మననం చేసుకుని లక్ష్య సాధనకు పునరంకితం కావాలి.

శ్రమజీవుల కష్టాన్ని వెట్టి చాకిరీతో కూడిన 'బానిసత్వం'గా కొనసాగించిన భూస్వామ్య, రాచరిక వ్యవస్థలు మిగిల్చిన గాయాలు మానవజాతి చరిత్రలో అమానుష ఘట్టాలుగా మిగిలిపోయాయి. 18వ శతాబ్దంలో ప్రారంభమైన 'పారిశ్రామిక విప్లవం' పరోక్షంగా కార్మికుల్లో వేతనాలు, విశ్రాంతి, పని గంటలకు సంబంధించి రగిలించిన చైతన్యం పోరాటాల స్థాయికి ఎదిగింది. 19వ శతాబ్దంలో యూరోప్ అంతటా 'సంఘటిత' (ట్రేడ్ యూనియన్) కార్మిక పోరాటాలు విస్తరించాయి. 1886 మేలో ఎనిమిది గంటల పనిదినాన్ని చట్టబద్ధం చేయాలంటూ అమెరికా ప్రధాన నగరాల్లో చరిత్రాత్మకమైన పోరాటాలు సాగాయి. 40 వేల మందితో చికాగోలోని 'హే మార్కెట్' ప్రాంతంలో జరిగిన ప్రదర్శనపై పోలీసులు పాశవికంగా జరిపిన కాల్పుల్లో పదుల సంఖ్యలో కార్మికులు మరణించగా, ఏడు మందికి పైగా పోలీసులు మృతి చెందారు. ఆ ఉదంతమే అంతర్జాతీయ కార్మిక దినోత్సవమైన 'మేడే' ప్రకటనకు దారితీసింది. అప్పటి నుంచి ఉధృతంగా కొనసాగిన అనేక పోరాటాల అనంతరం 1920 దశాబ్దంలో అమెరికాతో సహా అనేక యూరప్ దేశాలు 8 గంటల పనిదినాన్ని చట్టబద్ధం చేయాలని తీర్మానించాయి.

ఆలస్యంగానైనా భారతదేశంలో మొట్టమొదట మేడే ఉత్సవాలను ప్రారంభించిన ఘనత రైల్వే కార్మికులకే దక్కింది. 1923లో 'లేబర్ కిసాన్ పార్టీ ఆఫ్ హిందుస్థాన్' వ్యవస్థాపకుడు సింగార్‌వేల్ చెట్టియార్ ఆధ్వర్యంలో నాటి మద్రాస్‌లోని హైకోర్టు ఎదురుగా, ట్రిప్లికేన్ బీచ్‌లోనూ మేడే సమావేశాలు జరిగాయి. భారతదేశంలో 'ఎర్రజెండా'ను ఎగురవేసిన సందర్భంగా కూడా దాన్ని చరిత్రకారులు వర్ణించడం గమనార్హం. అయితే, ఇప్పటికీ భారత కార్మికోద్యమం బాలారిష్టాలను అధిగమించలేదనే చెప్పాలి. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన రైల్వే, రవాణా రంగాలు, బొగ్గు గనులు, భారీ ఇనుము - ఉక్కు కర్మాగారాలు అనేకం ఉన్నప్పటికీ కార్మిక లోకంలో 'ఐక్యత' లోపించడంతో గణనీయమైన ఫలితాలను సాధించడంలోనూ, రాజకీయాలను ప్రభావితం చేయడంలోనూ విఫలమౌతూనే ఉన్నారు. అన్నిటికన్నా మించి, భారతదేశంలో నేటికీ 70 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి జీవించడం, గ్రామీణ ప్రాంత కూలీలు అసంఘటితంగా మిగిలిపోవడం విషాదంగా మారింది. సంఘటిత ఉద్యమాలు, ట్రేడ్ యూనియన్‌లు కాదు కదా, కనీసం అంతర్జాతీయ కార్మిక దినోత్సవం, మేడే వంటి మాటలు కూడా గ్రామీణ ప్రాంత శ్రమజీవులకు చేరకపోవడం పెద్ద వెలితిగానే భావించాలి. ఈ మేడే ఉత్సవాల సందర్భంగానైనా భారతదేశంలో కార్మిక - కర్షక - ఉద్యోగ - విద్యార్థి - యువజనుల మధ్య ఐక్యతకు ప్రతినబూని, కార్మికవర్గ శ్రేయోరాజ్య స్థాపనకు శ్రీకారం చుట్టాలని నినదిద్దాం.

(రచయిత పాత్రికేయులు) వీ

వచ్చే సంచికలలో...

- **ఫోకస్ - జూలై 2010 : పర్యావరణ సంక్షోభం**
- **ఫోకస్ - ఆగస్ట్ 2010 : వ్యవసాయ రంగం - నేటి స్థితి**
- **ప్రచార మాధ్యమాల ప్రయోజనాలు - డి. పాపారావు**
- **తెలంగాణ తోనే ఆదివాసులకు న్యాయం - ఎం. అరుణ్‌కుమార్**
- **టూరిజం - ఒక పరిశీలన - ఎస్. సరళా వందనం**

కలిసి ఉండాలా, విడిపోవాలా అనే అంశంపై కేవలం తెలంగాణ ప్రాంతంలోనే ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలని అంటున్నారు **కడియాల సుబ్బనాచారి**

తెలంగాణపై ఎవరి అభిప్రాయాలు అవసరం?

తెలంగాణ సమస్యను పరిష్కరించేందుకు కేంద్రం ఒక కమిటీని వేసి పరిశీలన చేయమని దేశం మీదికొదిలింది. అందరి అభిప్రాయాలు సేకరించి తదుపరి నిర్ణయం తీసుకోవడానికి వీలుగా ఉంటుందని కేంద్రం చెబుతోంది. ఇది ఎంతవరకు సమంజసం? ఏ విధంగా న్యాయం? నిజమైన ప్రజాభిప్రాయానికి ఇది వీలుకలుగుతుందా? లేక ఏ కొద్దిమంది అభిప్రాయానికి మాత్రమే వీలుకలుగుతుందా? ఈ విధంగా కమిటీలతో కాలయాపన చేస్తూ ఉద్యమం చల్లబడేదానికి ఇదొక కుటిల యత్నమా? అనే అంశాలను పరిశీలించాల్సిన ఆవశ్యకత కూడా జనానికి ఉంది. ఈ అంశాలతో పాలకవర్గాలకు ఆసక్తి లేకపోవచ్చు. కానీ ప్రజలకు మాత్రం ఇవి ఆసక్తి కలిగించే అంశాలు మాత్రమే గాక వారి భవిష్యత్తును వారే ఎంచుకోవడానికి ఎంతో దోహదం చేస్తుంది.

ఇది రెండు ప్రాంతాల మధ్య రగిలిన కార్చిచ్చు. ఈ కార్చిచ్చును అంత సులభంగా ఆర్పేయలేం. ఒకసారి చల్లారినా మళ్లీ మళ్లీ లేస్తూనే ఉంటుంది. న్యాయమైన పరిష్కారం జరగాలన్నా, ఈ కార్చిచ్చును మళ్లీ మళ్లీ రగలకుండా పూర్తిగా ఆపేయాలన్నా నిష్పాక్షికవైఖరి తీసుకొన్నప్పుడే జరగుతుంది. ఏ కొందరి స్వార్థప్రయోజనాలకు ఆశించి చేసినా ఈ సమస్య పరిష్కారం కాదు. ఈ సమస్య పరిష్కారం కాకుండా రాష్ట్రం అభివృద్ధి చెందదు. ప్రజల సమస్యలు తీరవు. ఇందుకు నిజాయితీగా పూనుకొంటే పరిష్కారం కానిదేదీ లేదు. ఆ పని ఈ పాలక వర్గాలు చేస్తాయా అన్నదే సందేహం. ఇదే కమిటీ ద్వారా నిజాయితీగా చేయవలసిన కర్తవ్యం ఏమిటంటే ఎవరి స్వార్థాలకు లోనుగాకుండా, ఏ ప్రాంతానికీ అన్యాయం జరగకుండా చేసే ఉద్దేశం ఉంటే సులభంగా పరిష్కరించవచ్చు. ఇందుకు రెండు ప్రాంతాల అభిప్రాయాలను తీసుకోవాలనుకోవడం గానీ, అసెంబ్లీలో మెజారిటీ అభిప్రాయం తీసుకోవాలనుకోవడం గానీ వంచన మాత్రమే. ఇది ఏకపక్ష న్యాయమే. ప్రత్యేక రాష్ట్రాన్ని కోరేది ఎవరో వారి పక్షాన న్యాయం జరగాలంటే వారి అభిప్రాయాన్ని మాత్రమే తీసుకోవాలి గదా? వారి కన్న మెజారిటీలో ఉన్నటువంటి వర్గాల అభిప్రాయాలతో పనేమున్నది? ప్రత్యేకంగా ఒక్క తెలంగాణ వరకే అభిప్రాయాన్ని సేకరించాలి గానీ మొత్తం ఆంధ్రప్రదేశ్‌లో అభిప్రాయాన్ని సేకరిస్తే ఎవరికి లాభం?

విడిపోవడమా లేక కలిసి ఉండడమా అనే సమస్య మీద తెలంగాణ వరకే నిజాయితీగా ఎన్నికలు జరిపించమనండి. పార్టీల పేరుతో కాకుండా కేవలం పై అంశాన్ని మాత్రమే ప్రధాన అజెండాగా తీసుకొని పోటీ చేయమనండి. అప్పుడు సాధారణ పౌరులందరి అభిప్రాయాలు ఆ ఎన్నికలలో తెలుస్తాయి. ఆనాడు విభజనకు సుముఖంగా ఉన్నారా లేక సమైక్యానికి సుముఖంగా ఉన్నారా అనేది కచ్చితంగా తెలుస్తుంది. అప్పుడు మాత్రమే ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుంది గాని, ఇలాంటి కుట్రపూరిత అభిప్రాయ సేకరణతో ప్రజాభిప్రాయలు తెలియవు.

ఎలాంటి అక్రమాలకు తావులేకుండా, పార్టీ ముద్ర లేకుండా ఈ ఒక్క లేబుల్‌తోనో అంటే సమైక్యంగా ఉండాలా లేక ప్రత్యేక రాష్ట్రంగా విడిపోవాలా అనే ప్రాతిపదికన పోటీకి దిగమనండి. అప్పుడు తెలుస్తుంది నిజమైన ప్రజాభిప్రాయం. ఈ పని ఎందుకని చేయకూడదు. ఎన్నికలలో డబ్బులు ఖర్చు గదా అనవచ్చు. ఇప్పుడు వేసిన ఈ కమిటీకి డబ్బులు ఖర్చు కావడం లేదా? ఈ ఖర్చును తెలంగాణ పాత బడ్జెట్ మీదనే మోపవచ్చు గదా! ఇది న్యాయం కూడానూ! కనుక ప్రత్యేక ఉద్యమకారులంతా చేయవలసిన పని నిజాయితీగా 'ప్రత్యేక తెలంగాణకు మాత్రమే ఎన్నికలు జరపండి' అని నినదించడం మాత్రమే. ఈ మార్గం ద్వారా సాధించుకొంటే సులువుగా ఉంటుంది కూడా. ఆత్మబలిదానాలు, సత్యాగ్రహాలతో పాలకవర్గాలు దిగిరావు అనే అంశాన్ని ఉద్యమకారులు గ్రహించగలరని ఆశిస్తున్నాను. కాబట్టి ఆత్మబలిదానాలు చేసుకోవద్దని, భవిష్యత్తును పాడుచేసుకోవద్దని జనాన్ని చైతన్యపరచండి. అప్పుడు జనం మెజారిటీ అభిప్రాయాన్ని గౌరవించక తప్పదు. ఈ రెచ్చగొట్టడాలు, పరస్పర నిందలు, సాధారణ జనానికి ఇబ్బంది కలిగించే అంశాలు ఏవీ ఉండవు గదా. కనుక ఎన్నికల ద్వారానే నిజాయితీగా ప్రజల మనోభావాలను అర్థం చేసుకోవచ్చును. అప్పుడు మాత్రమే స్వార్థపర వర్గాల ఆట కట్టించవచ్చు. ప్రాంతీయ దురభిమానాలుండరాదు. ఏ ప్రాంతంలోనైనా స్వేచ్ఛగా జీవించే వెసులుబాటు ఉంటుంది కూడా. అయితే అంత నిజాయితీగా ఎన్నికలకు పాలకవర్గం అంగీకరిస్తుందా అనేది కూడా సందేహం. ప్రజాపోరాటాల ద్వారా వచ్చే ఏ ఉద్యమాన్ని గానీ దాని ఫలితాన్ని గానీ ప్రజలకు దక్కనివ్వరు. దీనికో ఉదాహరణగా రెండు ముఖ్యమైన అంశాలను ప్రస్తావిస్తున్నాను. విశాలాంధ్ర నినాదం అనేది ఈనాటిది కాదు. స్వతంత్రం రాకముందు నుంచే ఉంది. ఆ పేరుతోనే రాష్ట్రం ఉండాలనుకున్నారు కూడా.

కానీ ఈ పేరు పెడితే కమ్యూనిస్టులకు కీర్తి దక్కుతుందనే కుటిలత్వంతోనే ఆంధ్రప్రదేశ్ అని నామకరణం చేశారు. విశాలాంధ్ర పేరు పెట్టే దానికి పాలకవర్గాలు ఇష్టపడలేదు. ఆంధ్ర – తెలంగాణ

తెలంగాణ ఆకాంక్ష అంటేనే అది అణగారిన ప్రజల, వర్గాల ఆకాంక్ష అనీ, అట్టడుగు వర్గాల ప్రజలను విస్మరించి తెలంగాణను సాధించలేరనీ అంటున్నారు **డా. తడకమళ్ల శేఖర్**

నాయకత్వంలో అణగారిన కులాలెక్కడ?

మన రాష్ట్రంలో గత కొంతకాలంగా తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం జరుగుతున్న తీరును మనం గమనిస్తూనే ఉన్నాం. తెలంగాణ ప్రాంతమనేది ప్రత్యేక పరిపాలనా ప్రాంతంగా నిజాం పాలనలో క్రీ.శ. 1724 నుండి 1948 వరకు అనగా దాదాపు 224 సంవత్సరాలుగా ఉంది. అందువల్ల నేడు ఈ ప్రాంత ప్రజలు కోరుకునే తెలంగాణ రాష్ట్ర డిమాండ్ ఈనాడు కొత్తగా వచ్చింది కాదని గతంలోనే ప్రత్యేక ప్రాంతంగా ఉన్న సత్యాన్ని ప్రజలు గుర్తు చేస్తున్నారన్న విషయాన్ని మనం గుర్తించాలి. ముఖ్యంగా నేటి పాలకులు మరింత గుర్తించాలి.

నైజాం పాలనలో హైదరాబాద్ రాష్ట్రం అనేది 16 జిల్లాలతో కలిసి ఉండేది. వాటిలో తెలంగాణ జిల్లాలు ఎనిమిది, మరట్వాడా జిల్లాలు ఐదు, కర్నాటక జిల్లాలు మూడు. ఈ ప్రాంతంలో మూడు స్థానిక భాషలు మాట్లాడే ప్రజలు కలిసిమెలిసి జీవించేవారు. కోస్తాంధ్ర ప్రాంతం మద్రాస్ రాష్ట్రంలో కలిసి ఉండేది. ఈ నిజాన్ని సమైక్యాంధ్ర నాయకులు గమనించాలి.

తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాలు విడివిడిగా ఉన్న వాటిని తెలుగు భాష మాట్లాడే ప్రజలంతా ఒకే రాష్ట్రంగా ఉండాలన్న ప్రయత్నంలో భాగంగానే ఫజల్ అలీ కమిషన్ నియమించబడింది. ఈ కమిషన్ తన నివేదికలో ఆంధ్ర ప్రాంతంలోని ప్రజలు ఆంగ్ల భాషను నేర్చుకోవడం వల్ల ఈ అవకాశం తెలంగాణ ప్రాంతానికి లేని కారణంగా ఈ రెండు ప్రాంతాలను కలిపితే తెలంగాణ ప్రజలు నష్టపోతారని చెప్పింది. అంతే కాకుండా ఈ రెండు ప్రాంతాల విలీనాన్ని నెహ్రూ కూడా వ్యతిరేకించి నప్పటికీ విలీనం తప్పని సందర్భం ఏర్పడుతున్న క్రమంలో 1955 మార్చ్ 5న నిజామాబాద్‌లో జరిగిన సభలో మాట్లాడుతూ ఈ రెండు ప్రాంతాలు కలిసి ఉండలేని సందర్భం ఏర్పడితే భార్య భర్తల మాదిరిగా విడిపోవచ్చని చెప్పాడు. ఈ విధంగా గత అనుభవాలను పరిశీలిస్తే ఈ రెండు ప్రాంతాలు అంతర్లీనంగా విడిపోయే ఉన్నాయని చెప్పవచ్చు.

తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాలను బలవంతంగా విలీనం చేయడం వల్ల తెలంగాణ ప్రాంతమే ఎక్కువగా నష్టపోయిందని చెప్పవచ్చు. 1958 నాటికే 25 వేల తెలంగాణ ఉద్యోగాలను ఆంధ్ర ప్రాంతం వారు కైవసం చేసుకున్నారు. ఇదే అంశాన్ని నిర్ధారిస్తూ 1969లో అప్పటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి జి.ఒ. నెం. 36ను విడుదల చేశారు. ఈ విధంగా కోల్పోయిన ఉద్యోగాలు 1985 నాటికి 59 వేలకు, ప్రస్తుతం సుమారు రెండు లక్షల యాభై వేలకు చేరుకున్నాయి. ఈ విధమైన దోపిడీ అన్ని రంగాలలో నాటి నుండి నేటి వరకు నిరంతరంగా జరుగుతోంది. తెలంగాణ రాష్ట్ర డిమాండ్‌లో న్యాయం ఉంది కాబట్టే అన్ని పార్టీలు, ప్రజా సంఘాలు ఈ ఉద్యమానికి మద్దతును తెలుపుతున్నాయి.

తెలంగాణ ఉద్యమానికి లభిస్తున్న మద్దతును ఉపయోగించుకొని ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న నాయకులు ఉద్యమాన్ని లక్ష్యం వైపు నడిపించడంలో విఫలమయ్యారని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు. సామాజిక న్యాయం ఊపిరిగా కలిగిన ఉద్యమంలో తెలంగాణ ప్రాంతంలో మెజారిటీ జనాభా దామాషా కలిగిన అణగారిన కులాల వారికి ఉద్యమ నాయకత్వంలో ఎంత స్థానం కల్పించబడిందో, ఉన్న నాయకులకు ఎంత ప్రాధాన్యం లభిస్తుందో ఈనాడు ఈ వర్గాలకు చెందిన ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ ప్రశ్న ఉద్యమాన్ని పెడదోవ పట్టించడానికి కాదని, మరింత జాగరూకత కలిగి శత్రువు పట్ల అప్రమత్తమై మరింత దృఢ సంకల్పంతో ముందుకు సాగడానికే అన్న విషయాన్ని గమనించాలి.

తెలంగాణ ప్రాంతంలో దళితులు, గిరిజనులు ఇతర వెనుకబడిన కులాల ప్రజలు వివిధ వృత్తులలో మమేకమై ఉత్పత్తి వర్గాలుగానున్న ప్రజలు. ఈ వర్గాల వారి వెనుకబాటుతనమే తెలంగాణ వెనుకబాటు తనమని చెపుతున్నాం. ఎందుకంటే ఈ ప్రాంతంలో ఈ వర్గాల ప్రజలే ఎక్కువగా ఉన్నారు. బతుకుదెరువు కోసం మస్కట్, దుబాయ్ పోయే మా పాలమూరు కూలీలని నాయకులు నిరంతరం ఊదరగొట్టే

అన్నారు. అఖిలాంధ్ర అన్నారు. ఆంధ్రభూమి అన్నారు. చివరగా ఆంధ్రప్రదేశ్ నామకరణం చేశారు. విశాలాంధ్ర పేరు మాత్రం రాకూడదు. ఇదే వారి ఎత్తుగడ. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత నందికొండ ప్రాజెక్ట్ కోసం కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన ఉద్యమం తీవ్రంగా కొనసాగింది. అదే పేరు పెడితే కమ్యూనిస్టులకు కీర్తి దక్కుతుందని నాగార్జునసాగర్ అని పేరు పెట్టారు. కనీసం పేరు పెట్టడానికే ఇష్టపడనివారు సవ్యంగా ఎన్నికలకు అంగీకరిస్తారా? ఇస్తే ప్రజలు వారి చేయి దాటిపోతారు గదా! అందుకే ఎప్పుడూ కూడా ప్రజలకు స్వతంత్ర అధికారం ఇవ్వడానికి పాలకవర్గాలు ఇష్టపడవు.

(రచయిత ఆర్.ఎం.పి. డాక్టర్) వీ

ప్రసంగాలలో ఆ కూలీలు అణగారిన వర్గాల ప్రజలేనని మర్చిపోకూడదు. తెలంగాణ ప్రాంత వెనుకబాటుతనం గురించి మాట్లాడే సందర్భంలో, ఎండిపోయిన పొలాలను బక్కచిక్కిన అమాయక ప్రజలను, ఉద్యోగ అవకాశాలను కోల్పోయిన నిరుద్యోగ యువతను, కనుమరుగవుతున్న తెలంగాణ సంస్కృతిని మొదలైన విషయాలను మన తెలంగాణ నాయకులు ఉదాహరణలుగా చూపిస్తారు. ఈ అంశాలన్నింటిలో అణగారిన వర్గాల ప్రజలకే ఎక్కువ సంబంధం ఉందనే సత్యాన్ని మర్చిపోరాదు. తెలంగాణ వెనుకబాటుతనాన్ని చూపించే సందర్భంలో మా వాస్తవ స్థితిగతులను ఉపయోగించుకుంటారు తప్పితే ఉద్యమానికి నాయకత్వం వహించే సందర్భంలో మేము పనికిరామా అనే ప్రశ్నలను ఈ వర్గాల ప్రజలు సంధిస్తున్నారు. వీటికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉద్యమ నాయకత్వంపై ఉంది.

మనం ఏ ఆంధ్రా ఆధిపత్యాన్ని, దోపిడీని భరించలేక వ్యతిరేకించి మన ప్రజల కోసం న్యాయమైన పోరాటం చేస్తున్నామో అదే ఆధిపత్యాన్ని మన ప్రాంతంలో మెజారిటీ జనాభాగా ఉన్న అణగారిన వర్గాల వారిపై ప్రదర్శించి వారిని వెనక్కినెట్టి వేయడం ఎంతవరకు కరెక్టో ఉద్యమ నాయకత్వం ఆలోచించాలి. నిజాన్ని అడిగినవారిని, అన్యాయాన్ని ప్రశ్నించినవారిని పక్కకుబెట్టుకుంటూ పోతుంటే చివరకు ఉద్యమంలో ఎంతమంది మిగులుతారో ఆలోచించాలి. ఈనాడు ఉద్యమంలో రోజుకో జె.ఎ.సి. చొప్పున ఎందుకు ఉద్భవించాల్సిన పరిస్థితి ఏర్పడిందో నాయకులు సమీక్ష చేసుకోవాలి.

ఈ సందర్భంలో డా. అంబేద్కర్ చెప్పిన మాటలను గుర్తుకు తెచ్చుకోవాల్సిన అవసరం ఉంది. ఆయన ప్రకారం ఒక దేశంపైన మరొక దేశం ఆధిపత్యాన్ని చెలాయించడం ఎంత తప్పో, ఒక జాతి కొన్ని జాతులపైన ఆధిపత్యం చెలాయించడం కూడా అంతే తప్పు అవుతుంది. కావున నేటి తెలంగాణ ప్రాంతంలో అసంఖ్యాకంగానున్న అణగారిన వర్గాల ప్రజలకు ఉద్యమ నాయకత్వంలో ఎంత వరకు భాగస్వామ్యం కల్పిస్తున్నారో ఆలోచించాలి.

కె.సి.ఆర్. చేతులలో నుండి ఉద్యమాన్ని ఉస్మానియా, కాకతీయ విద్యార్థులు తీసుకొని మహా ఉద్యమాన్ని నడిపిస్తున్నారు. ఆ క్రమంలో వందల మంది ప్రజలు ఆత్మబలిదానాలు చేసుకున్నారు. వారిలో కూడా ఎక్కువ అణగారిన వర్గాల ప్రజలే ఉన్నారన్న విషయాన్ని మర్చిపోరాదు. అణగారిన వర్గాల ప్రజలకు నాయకత్వం అప్పగించే క్రమంలో లాభనష్టాలు బేరీజు వేసుకుంటున్న నాయకులు ఒక పక్కన ఉంటే, ఉద్యమాన్ని ఉధృతం చేయడానికి, తమ ప్రాంతానికి జరిగిన నష్టాన్ని తట్టుకోలేకపోతున్న అమాయక ప్రజలు ఎటువంటి లెక్కలు, బేరీజులు వేసుకోకుండా ఆత్మబలిదానాలు చేసుకుంటున్నారనే కఠోర వాస్తవాన్ని ఉద్యమ నాయకులు గమనించాలి.

అణగారిన వర్గాల ప్రజలలో ఇప్పుడిప్పుడే నాయకులుగా ఎదుగుతున్న వారిని వెనక్కినెట్టివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. నాలుగు కోట్ల మంది గల ప్రజలకు సంబంధించిన ఉద్యమ నిర్ణయాలను ఇద్దరు, ముగ్గురు వ్యక్తులే తీసుకోవడం ఎంతవరకు న్యాయమైనదో ఆలోచించాలి. ఇటువంటి అంశాలనే ప్రస్తావించిన, ఉద్యమంలో కొందరి ఆధిపత్యాన్ని ప్రశ్నించిన మందకృష్ణ మాదిగపై వరంగల్ సభలో వాటర్ ప్యాకెట్ల వర్షం కురిసిందంటే ఈ వర్గాల నాయకులకు ఉద్యమంలో ఏ స్థానం ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇవే అభిప్రాయాలను ఎన్నో సందర్భాలలో ఎంతోమంది నాయకులు వ్యక్తం చేశారు. వారు మాట్లాడినప్పుడు లేని అభ్యంతరం కృష్ణ మాదిగ విషయంలో ఎందుకు వచ్చిందో అర్థం చేసుకోవాలి. ఇటువంటి అంశాలు వ్యక్తం అయినప్పుడు ఉద్యమ నాయకత్వం అనేది వాటిని పరిష్కరించాలి.

తెలంగాణ ఉద్యమం జరుగుతున్న 1969 నుండి నేటివరకు ఉద్యమం పేరుతో చెన్నారెడ్డి, ఇంద్రారెడ్డిలు వచ్చి వెళ్లినా, నేడు కె.సి.ఆర్. వచ్చినా, రేపు ఎవరు వచ్చినా గాని ఇంతవరకు ఉద్యమ పల్లకిలో వారిని కూర్చోబెట్టి అణగారిన వర్గాల ప్రజలు బోయిలుగా మారి ఉద్యమ పల్లకీని మోస్తున్నారనే సత్యాన్ని మర్చిపోరాదు. ఉద్యమాన్ని నిరంతరం జీవింప చేస్తున్న ఈ వర్గాలను విస్మరించి లక్ష్యాన్ని చేరుకోవాలనుకోవడం నేల విడిచి సాము చేయడమే అవుతుంది. అందువల్ల వెనుకబాటు ప్రభావం ఉన్న ఈ వర్గాల చేతుల్లోనే నాయకత్వం ఉన్నప్పుడు ఆ వెనుకబాటుతనం, అణచివేత నశించిపోతాయి. అలా జరగనప్పుడు ఇప్పటి వరకు దెబ్బలు తిన్న కులాలే పూలే చెప్పినట్లు పెదబొబ్బలు పెడతాయి.

(రచయిత లెక్చరర్)

మహా ముంబై సెజ్ వ్యతిరేక పోరాటం ఐక్య సంఘటనలకు మంచి ప్రతీక అనీ, వివిధ ప్రాంతాలలోని సెజ్ వ్యతిరేక ఉద్యమాలు ఆ స్ఫూర్తితో ముందుకు సాగాలనీ అంటున్నారు **నక్కా హేమా వెంకట్రావ్**

ప్రజా పోరాటాల విజయదుర్గం - రాయ్‌గఢ్

'కష్ట సమయాల్లో మనం సాధించుకున్న విజయాలను గుర్తు చేసుకొని, పోరాటానికి దాని నుండి ధైర్యం పొందాలి' – మావో.

సరిగ్గా ఇదే చేశారు సెజ్ పోరాటాల దుర్గంగా మారిన రాయ్‌గఢ్ ప్రజలు, మహా ముంబయి సెజ్ వ్యతిరేక ఉద్యమ కారులు. వీరు సెజ్ పోరాటంలో వేసే ప్రతీ అడుగు తాము సాధించిన విజయాలను అంచనా వేసుకుంటూ తమ ఉద్యమాన్ని మరింత పదును పెట్టుకొని దేశంలోని సెజ్ వ్యతిరేక పోరాటాలకు ఆదర్శంగా నిలిచారు. దేశంలోనే ఎంతో వ్యూహాత్మకంగా, అత్యంత సాహసంగా ప్రజల భాగస్వామ్యంలో కొనసాగుతున్నది మహా ముంబయి సెజ్ వ్యతిరేక పోరాటం. వాటిని ప్రస్తావించడమే ఈ వ్యాస ప్రధానోద్దేశ్యం.

దేశ విదేశీ సంస్థలు పరిశ్రమల స్థాపన పేరుతో దేశంలోని సహజ వనరుల్ని, శ్రమశక్తిని కారుచౌకగా దోపిడి చేసుకోవడానికి ఉద్దేశించినదే సెజ్ చట్టం. దేశంలో అత్యంత పెద్ద సెజ్‌గా పేరొంది అంతే ఘాటుగా సమస్యలను ఎదుర్కొంటోంది రాయ్‌గఢ్ జిల్లాలో ఏర్పాటు చేయబోయే మహా ముంబయి సెజ్. ప్రభుత్వానికి పెనుసవాలుగా నిలిచిన ఈ పోరాటంలో రైతులు, వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు, ప్రజాస్వామ్య వాదులు, స్వచ్ఛంద సంస్థలు ఉద్యమంలో విభిన్న పాత్రలు పోషిస్తూ అందరూ సెజ్‌ను వ్యతిరేకించాలన్న ప్రాతిపదికన కలిసి ఉద్యమిస్తున్నారు.

మహా ముంబయి సెజ్ పేరిట నవీ ముంబయి ప్రాంతంలో పెన్, ఉరాన్, పాన్‌వెల్ తాలుకాలలో 14 వేల హెక్టార్ల విస్తీర్ణంలో నెలకొల్పడానికి ప్రతిపాదించింది. వ్యవసాయ భూమిని తీసుకోకూడదన్న పాలసీకి అనుగుణంగా సాగునీటి సరఫరా ఆపివేసి బీడు భూములుగా మార్చడానికి ప్రభుత్వం ప్రయత్నాలు చేసింది. ముందుగా సెజ్ వివరాలలోకి వెళితే ఈ ప్రాంతం బొంబాయి, కొంకణ్ మార్గంలోని హైవేలో ఉంది. దక్షిణ ముంబయి నుంచి సుమారు 40 కి.మీ. దూరంలో ఉంది. ఇక్కడ ప్రధాన వృత్తి వ్యవసాయం. మత్స్యకార కుటుంబానికి చెందిన కుటుంబాలు సముద్రంలో చేపల వేట మీద మాత్రమే ఆధార పడుతున్నాయి. ఇక్కడ ఉప్పును కూడా తయారు చేస్తారు. అయితే ఉప్పును తయారు చేసేవారు స్థానికులైనప్పటికీ భూమి హక్కుదారులు మాత్రం స్థానికులు కాదు. ఇక్కడ అగ్ర కులమే జనాభా రీత్యా, నాయకత్వ రీత్యా కూడా సంఖ్యలో పెద్దది. వీరు ఒబిసి కులానికి చెందిన వారు. ఇంకా కాప్రోలి, పునార్చి, ఝూ, సర్దె, సంగపాలెక్కరి, కోలి కాటకారి, ఆదివాసి తెగవారు, దళితులు ఉన్నారు. ఆదివాసి తెగవారు చేపల వేటతో పాటు వంట చెరకు, తేనె, ఔషధ మూలికలు అడవి నుంచి సేకరించి తిండి గింజలకు మారుగా అమ్ముకుంటారు.

ప్రస్తుతం ఉన్న అన్ని పెద్ద గ్రామాలు రోడ్లు, కరెంటు, మౌలిక వసతులతో కలిపివేయబడ్డాయి. ప్రాథమిక, సెకండరీ పాఠశాలలు ఉన్నాయి. ఉన్నత విద్య కోసం విద్యార్థులు ఛందే, ఉరాన్, పాన్‌వెల్, పెన్‌లకు వెళుతుంటారు. వీరి అక్షరాస్యత శాతం మహారాష్ట్ర రాష్ట్ర అక్షరాస్యత కంటే ఎక్కువే. వీరికి సాంకేతిక విద్య తక్కువైనా ఉపాధికి ఢోకా ఏమి లేదు. పౌల్ట్రీ, డెయిరీ, హార్టీ కల్చర్, ఎస్.టి.డి షాపులు, హోటళ్లు, బేకరీలు లాంటి వాటితో స్వయం ఉపాధి కల్పించుకోవడానికి సులభ వాయిదాలలో బ్యాంకుల నుండి రుణాలు లభిస్తున్నాయి. ఎకరానికి సుమారు 25 వేలపైనే వ్యవసాయం నుంచి ఆదాయం వస్తుంది. చేపల వేటలో ప్రతి ఒక్కరికి రోజుకు రు.300 – 400ల వరకు గిట్టుబాటు అవుతాయి. పనికి వెళితే రోజు కూలి రు.150 నుంచి 200 వరకు ఉంటుంది. ఇంతగా ప్రజల జీవితాలలో సంపదని నింపుతున్న ప్రకృతిని, సముద్రాన్ని, వ్యవసాయ భూముల్ని, మడ అడవుల్ని కాదని వెళ్లిపోవడానికి సిద్ధపడని ప్రజలు ఉద్యమిస్తున్నారు.

1930లోనే ఆనాటి బ్రిటిష్ సామ్రాజ్యవాదులు స్థానికులను అడవి నుండి వంట చెరకుని ఏరుకోవడాన్ని నిషేధిస్తే పెద్ద ఎత్తున ప్రజలు ఉద్యమించారు. ఈ పోరాటంలో తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ కేసును స్వయంగా బి.ఆర్. అంబేద్కర్ వాదించారు. అప్పుడు ప్రజలు బ్రిటిష్ వలసవాదులకు వ్యతిరేకంగా నడుం బిగిస్తే ఇప్పుడు తరాలు మారిన తర్వాత కూడా స్వంతగడ్డపైన గుత్త పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తున్న ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతున్నారు. అప్పుడు ప్రజలు మౌలిక అవసరాల కోసం పోరాడితే ఇపుడు ప్రాథమిక హక్కు అయిన జీవించే హక్కుకై పోరాడుతున్నారు. అప్పటి పోరాటం బ్రిటిష్ వారిపైన, వారి వలసవాదం పైన, ఇప్పుడు తమను పాలిస్తున్న ప్రభుత్వం పైన, దేశ సార్వభౌమత్వాన్ని విదేశీయులకు తాకట్టు పెడుతున్న పాలకుల మీద. ఇక్కడ స్వతంత్రం ఎవరికన్నది ప్రశ్నే? అప్పటి ఈస్టిండియాకు ఇప్పటి రిలయన్స్, రస్ అల్‌ఖైమా లాంటి కంపెనీలకు పెద్ద తేడా లేదని ప్రజల అభిప్రాయం.

డబ్బు వస్తుంది పోతుంది కాని భూమి మనిషిని ఎప్పుడూ వదిలిపెట్టదు. కాబట్టి భూమిపై బతకగలమన్న నమ్మకమే ప్రజల్ని పోరుబాటలో నడుపుతుంది. 'ఈ సెజ్‌లు మాకు ఏమీ ఉపాధి కల్పించవు. అవి ఉన్నత చదువులు చదివిన వారికి మాత్రమే పరిమితం. డిగ్రీ చదివిన మా పిల్లలు పక్కనే ఉన్న నెహ్రూ ట్రస్ట్ పోర్టులో కూలీలుగా పని చేస్తున్నారు. దీని కంటె మా భూములలో వ్యవసాయం చేసుకుంటూ గౌరవంగా బతకడం మేలు కదా!' ఇది స్థానిక నాయకుడు ప్రఫుల్‌కర్

పాటిల్ వాదన. అందుకే 'భూసేకరణ చట్టం' ప్రకారం సెక్షన్ 4(1) నోటిఫికేషన్‌ను ఇస్తే 9 జూన్ 2006 మహా ముంబయి సెజ్ విరోధి శేత్‌కారీ సంఘర్ష్ సమితి ఆధ్వర్యంలో పెన్‌లోని భూసేకరణ ఆఫీసు ముందు సుమారు వెయ్యిమంది రైతులు నోటిఫికేషన్ కాపీలను తగలబెట్టారు. అదే సభలో ఉద్యమకారులు స్థానికంగా ఉద్యమాన్ని బలపర్చుకొని అహింసాయుతంగా ఉద్యమాన్ని నడిపించాలని తీర్మానించుకున్నారు.

రైతుల ఆగ్రహం వెనుక బలమైన కారణాలు ఉన్నాయి. రిలయన్స్ కంపెనీ వారు ఎకరా రు.3 లక్షలు ఇస్తామని ప్రకటించారు. మార్కెట్లో ఎకరం రు. 20-40 లక్షల వరకు ఉంది. ఇదే రిలయన్స్ కంపెనీ సెజ్ ప్రాంతానికి అతి దగ్గరగా ఉన్న నవీ ముంబయిలో ఎకరానికి రు. 20-40 లక్షలకు ముంబయి సిటీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుండి కొంటూంటే మేము మాత్రం ఎందుకు తక్కువకు అమ్ముకుంటామంటారు సెజ్ వ్యతిరేక నాయకులు డి.కె.పాటిల్. సెజ్ ప్రతిపాదిత ప్రాంతం నుంచి నవసేవ సేవరి వంతెన నిర్మిస్తే సెంట్రల్ ముంబయి చేరుకోవడానికి కేవలం 30 నిముషాలు చాలు. ఇదే కాకుండా జవహర్‌లాల్ నెహ్రూ పోర్టు ట్రస్ట్‌కు ప్రతిపాదిత మహా ముంబయి సెజ్ అతి దగ్గరగా ఉంది. కాబట్టి రిలయన్స్ కన్ను దీనిమీద పడింది. రిలయన్స్ కంపెనీ అతి చౌకగా భూముల్ని ప్రజల నుంచి లాక్కోవడానికి ప్రభుత్వాన్నే ఏజెంట్‌గా (బ్రోకర్) ఎన్నుకుంది. ఇంతగా ద్వంద్వ నీతిని ప్రజలపై ప్రయోగిస్తూ గుత్త పెట్టుబడిదారులకు వెన్ను కాచే ప్రభుత్వం పై ప్రజలకు నమ్మకం లేదు. వారి వాదనలకు బలంగా గత అనుభవాలు వాస్తవాలు ఉన్నాయి.

1980లో నవీ ముంబయి ఏర్పాటుకు సిటీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (సిడ్కో) 95 గ్రామాల నుంచి 30,000 కుటుంబాల్ని నిర్వాసితుల్ని చేసింది. ప్రజల నిరసనలతో హోరెత్తించినా, ఇద్దరు ప్రాణాలు కోల్పోయినా బాధితులకు లభించింది నామ మాత్రమే. ఎకరానికి రు.15,000 నుంచి రు.30,000 వేలకు పెంచుతామని, అభివృద్ధిపరిచిన భూమిలో 1/8 వంతు తిరిగి ఇస్తామని, ప్రతి ఇంటికి ఉపాధి కల్పిస్తామన్న సిడ్‌కో ప్రమాణాలు నిరర్థకమైనాయి. మమ్మల్ని బిచ్చగాళ్లుగా మార్చారని బాధితులు వాపోయారు. ఇంత కారుచౌకగా కొన్న భూమిని రిలయన్స్‌కు అమ్మేసి ప్రజా ప్రయోజనాల పేరుతో నవీ ముంబయి సెజ్‌లో 26 శాతం వాటా ప్రభుత్వం దక్కించుకొంటానని అంటోంది. ఈ ప్రభుత్వ భూసేకరణలో ప్రజా ప్రయోజనం దాగివున్నదన్న దానిని ప్రజలు నమ్మడం లేదు. అందుకే ఈ తిరుగుబాటు.

స్థానికులయిన కొందరిలో ఇంకొక వాదన ఏమిటంటే కేవలం ఉపాధి మాత్రమే కాకుండా రిలయన్స్ సంస్థ సెజ్ వ్యాపారంలో వాటా కూడా ఎందుకివ్వరు అని అడుగుతున్నారు. వారు సేవకులుగా కాకుండా యజమానులుగా బతకాలనుకుంటున్నారు. జీవన గవస్ అనే జిల్లా పరిషత్ మెంబరు, ఉరాన్ ఏమంటారంటే మా భూముల్ని లీజుకు ఇస్తాం గానీ మొత్తంగా అమ్మం. మాకు కంపెనీల్లో షేర్లు కావాలని అడుగుతున్నారు. మహాముంబయి సెజ్ ఆశ చూపించే అభివృద్ధి, ఉపాధి, మౌలిక సదుపాయాలను నిర్ద్వంద్వంగా ప్రజలు తోసిపుచ్చుతున్నారు. అసలు ప్రభుత్వానికి అభివృద్ధి పట్ల చిత్తశుద్ధి ఉంటే రైతులతో నేరుగా చర్చించాలని డిమాండ్ చేస్తున్నారు.

కానీ, ఈ రోజుకి అటు రిలయన్స్ గానీ, ప్రభుత్వం గానీ ప్రజలతో ఈ ప్రాజెక్టుల విలువ ఏమిటి? ప్రజలకు ఏ మేరకు లాభిస్తుంది అనేది వెల్లడించలేదు. ఫైనాన్స్ మంత్రిత్వశాఖ అంతర్గత లెక్కల ప్రకారం ప్రభుత్వం 90,000 కోట్ల రూపాయలను ప్రత్యక్ష, పరోక్ష పన్నుల ఆదాయాన్ని కోల్పోతుంది. ఇప్పటి వరకు ఎగుమతి సుంకం కట్టే పరిశ్రమలు కూడా ఇకముందు సెజ్‌ల అవతారమెత్తుతాయి. స్థానికులు ప్రభుత్వ ఖజానాకు ఎంత గండి పడుతున్నదో సరైన అంచనా వేయలేకపోయినా తమ మెదళ్లు నరికివేయబడతాయని బాగా గ్రహించారు. ఇది తమని అభివృద్ధి పథంలో నడిపించే కంటే పేద, ధనిక అంతరాలు బాగా పెంచుతాయని నమ్ముతున్నారు. వారి తుది నిర్ణయం ఏమిటంటే బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేసినట్టే భారత ప్రభుత్వానికి కూడా వ్యతిరేకంగా పోరాడుతాం అంటున్నారు.

ప్రజల చైతన్యం పోరాట స్ఫూర్తి వెనుక ఎన్నో ప్రజా సంఘాల, ప్రజాస్వామ్యవాదుల, సంస్థల కృషి ఉంది. బాధితులు అంతా కలిసి వివిధ జెండాల కింద ఉద్యమిస్తున్నా, వారి ఎజెండా మహా ముంబయి సెజ్‌ను తరిమికొట్టాలన్నదే. ఈ పోరాటానికి మద్దతునిస్తున్న కొన్ని సంస్థలలో ముఖ్యమైనవి మహాముంబయి సెజ్ విరోధి సంఘర్షణ సమితి, జాగృతి కరణ్ విరోధ్ కృత సమితి రైతాంగ, కార్మికుల పార్టీ, జాతీయ ఉద్యమాల సమాఖ్య, ప్రగతిశీల కార్మిక సంఘం, 24 గ్రామాల సెజ్ వ్యతిరేక సంఘర్షణ సమితి, లోక్‌శాసన్ ఆందోళన్, పంచకోశకర్ భూమి కేతి బచావో సమితి మొదలైనవి. ప్రజాస్వామ్య వాదులు ముఖ్యంగా మహిళా సామాజిక ఉద్యమకారులు పోరాటంలో ప్రధానపాత్ర వహిస్తున్నారు. అందులో మేధాపాట్కర్, ఉల్కా మహాజన, వైశాలి పాటిల్, సురేఖా దాల్మియా ఇలా ఎందరో, ఎంతో మంది కళాకారులు తమ కలాలకు పదును పెట్టి సెజ్‌కు వ్యతిరేకంగా గళం విప్పుతున్నారు.

అస్తిత్వ సామాజిక ఉద్యమాలకు పుట్టినిల్లు అయిన మహారాష్ట్రలో మహా ముంబయి సెజ్ ప్రతిపాదన విన్న విప్లవ, వామపక్ష పార్టీలు, లోక్‌శాసన్ ఆందోళన్ లాంటి ప్రగతిశీల సంఘాలు గ్రామాల్లో ప్రజలతో సమావేశాలు ఏర్పాటు చేసి మహా ముంబయి సెజ్ విరోధి సంఘర్షణ సమితిగా ఏర్పడ్డాయి. ఒక్క విప్లవ పార్టీలేనా, ప్రభుత్వ సహకారంతో స్వయం సహాయక బృందాలను నడుపుతున్న కిరణ మాత్రే లాంటివారు కూడా పంచకోశికర్ భూమి కేతి బచావో సమితిని ప్రజా భాగస్వామ్యంతో ఏర్పాటు చేసారు. ఆ పార్టీ స్థానిక జిల్లా పరిషత్ ఎన్నికలలో గెలిచిన అభ్యర్థులు ప్రజలకు వెన్నంటి నిలిచారు. 23 మార్చ్ 2006న రాస్తారోకోతో మొదలైన వీరి పోరాటం ఇంకా కొనసాగుతూనే ఉంది. మొట్టమొదట్లో అంటే 2006లో సి.పి.ఎం. వీరి వెన్నంటే ఉంది. అవసరమైతే సెజ్ ఆపుదల కోసం యు.పి.ఏ. ప్రభుత్వం నుంచి తప్పుకుంటామంది. ఎప్పుడైతే నందిగ్రామ్ సి.పి.ఎం. ప్రజావ్యతిరేక విధానాలను బట్టబయలు చేసిందో అప్పట్నుంచి సి.పి.ఎం. జాతీయ నాయకత్వం పోరాటం నుంచి వైదొలగింది. మహిళా ఉద్యమకారిణి ఉల్కా మహాజన్ అభిప్రాయం ప్రకారం సి.పి.ఎం. ప్రజల ముందుకు రాలేకపోయింది.

వందల మందితో మొదలైన ధర్నాలు వేల మంది కలయికతో మరింత ఉధృతంగా ముందుకు సాగాయి. ఉద్యమం కేవలం స్థానిక కార్యక్రమాలకే పరిమితం కాలేదు. ఉద్యమాన్ని ముంబయి, దేశ రాజధాని ఢిల్లీ వరకు తీసుకెళ్లారు. రాష్ట్రస్థాయిలోని ప్రతిపక్షాల నాయకులను కలుసుకొని పరిస్థితిని వివరించారు. అసెంబ్లీ సమావేశాలలో విపక్ష నేతలంతా మహా ముంబయి సెజ్‌ను చర్చలలో పెట్టించగలిగారు. 2006 శీతాకాల సమావేశాలలో అప్పటి మహారాష్ట్ర ముఖ్యమంత్రి విలాస్‌రావ్

దేశ్‌ముఖ్, పునరావాస మంత్రి పతంగ్‌రావు కదమ్ వ్యవసాయ భూములను సేకరించబోమని హామీ ఇచ్చారు. ప్రభుత్వం హామీ నిలబెట్టుకోనందున సుమారు మూడు వారాలు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. వేల మందితో జైల్‌భరో కార్యక్రమాల్ని నిర్వహించారు. ఉద్యమ ప్రారంభంలో ఉద్యమాన్ని పట్టించుకోకుండా ఎం.ఆర్. అంతూలే లాంటి నాయకులు పుట్టిన రోజును కొన్ని కోట్లు ఖర్చు పెట్టి జరుపుకుంటుంటే కోపోద్రిక్తులైన ఉద్యమకారులు రాత్రికి రాత్రే భగత్‌సింగ్, రాజ్‌గురు, స్టాలిన్ పోస్టర్లతో నింపేసారు. సహజ పద్ధతుల్లోనే పోలీసులు పోస్టర్లను అన్నింటిని చింపేసారు. సెజ్ వ్యతిరేక ఉద్యమకారులు స్వాతంత్ర్య పోరాట యోధులైన భగత్‌సింగ్ లాంటి ఉద్యమకారుల జయంతిని ప్రజావ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న ప్రభుత్వానికి వ్యతిరేకంగా 'బ్లాక్ దే'గా జరిపారు.

పార్లమెంటరీ సెలక్ట్ కమిటీ కాశీరావు లాంటి వారు కూడా రిలయన్స్‌కు మద్దతుగా నిలిచి ప్రజలను కలవడానికి తిరస్కరిస్తే ఉద్యమకారులు మూకుమ్మడిగా అతన్ని ఘేరావ్ చేసారు. తమ సమస్యలను రాతపూర్వకంగా తీసుకునేదాకా వదలలేదు. ఇలా, ఒకటేమిటి, ధర్నాలు, ర్యాలీలు, మౌనవ్రతాలు, దీక్షలు, పత్రాలు తగల బెట్టడం ఇలా ఎన్నో పోరాట రూపాల్ని తీసుకున్నారు. రాయ్‌గఢ్, పునె, గొర్రై, ఔరంగాబాద్, దూలె, నందుర్‌బార్, నాందేడ్, కొల్హాపూర్, నాసిక్ ఇలా అనేక ప్రాంతాల రైతులు వీరి పోరాటాలకై రాష్ట్రం నుంచే కాక దేశం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున మద్దతు కూడగట్టారు. సెజ్ ప్రతిపాదిత ప్రాంతంలో ఎవర్ని అడుగుపెట్టనివ్వలేదు. నోటిఫికేషన్‌లో పేర్కొన్న కాలపరిమితి లోగా భూమిని సెజ్ యాజమాన్యం పొందలేక పోయింది. 'బోర్డు ఆఫ్ అప్రూవల్స్' భూ సేకరణ కోసమై రెండుసార్లు కాలపరిమితి పొడిగింపును పొందిన తరువాత కూడా సెజ్ యాజమాన్యం ప్రజల నుండి భూమిని తీసుకోలేకపోయింది. రెండుసార్లు కంటే ఎక్కువ సార్లు కాలపరిమితిని చట్ట ప్రకారం పెంచకూడదు, కాబట్టి చేసేది లేక సెజ్ యాజమాన్యం వెనుదిరిగింది. గత కొన్ని సంవత్సరాల పోరాట ఫలితంగా ప్రభుత్వం సెజ్ పాలసీ ప్రకారం, హేతవానె ఆనకట్ట కింద ఉన్న వ్యవసాయ భూముల్ని సేకరించబోమని, దానికోసం ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందని ప్రభుత్వం రాత పూర్వకంగా రాసిచ్చింది.

సెప్టెంబరు 21, 2007న హేతువానె ఆనకట్ట కింద ఉన్న గ్రామాలలో ప్రజాభిప్రాయ సేకరణలో 90 శాతం పైగా ప్రజలు సెజ్‌లు వద్దని, భూసేకరణ కోసం ఇచ్చిన నోటీసులు వెనక్కి తీసుకొమ్మని చెప్పారు. దేశంలోనే మొట్టమొదటి సారిగా రైతులలో జరిగిన ఈ అభిప్రాయ సేకరణలో 6,000 మంది భూ హక్కుదారులు 22 గ్రామాల నుండి పాల్గొన్నారు. భూమిని ఇచ్చిన రైతులు కూడా సెజ్ వ్యతిరేకంగా ఓటు వేసారు. బాల్‌గ్రామ్ మాజీ సర్పంచ్ సదాశివ మహలే ప్రజాభిప్రాయ సేకరణలో ఓటు వేసిన తర్వాత ఏమంటారంటే 'మాకు కోటి రూపాయలు ఆశ చూపించినా మా భూమిని మా నుండి లాక్కోలేరు. మా ఆశయం ఒకటే, సెజ్ పారదోలడం, కొంకణ్‌ను కాపాడుకోవడం.' ఈ పోరాటం వర్తమాన సామాజిక ఉద్యమాలకు ఎలాంటి సందేశాల్ని ఇచ్చింది! దేశ వ్యాప్తంగా సాగుతున్న సెజ్ వ్యతిరేక ఉద్యమ శక్తుల మధ్య స్తబ్దతను ఏ మేరకు పోగొట్టి వర్తమాన ఉద్యమ గమనాన్ని ఏ మలుపు తిప్పింది అన్నదే ప్రధాన అంశం. సామ్రాజ్యవాద ప్రపంచీకరణలో భాగంగా మన భారత ప్రభుత్వం ప్రత్యేక ఆర్థిక మండలాల చట్టాన్ని తెచ్చిందన్నది వాస్తవం. అలాగే మన దేశంలోని అన్ని బూర్జువా పార్టీలు సామ్రాజ్యవాద ప్రపంచీకరణను, ప్రత్యేక ఆర్థిక మండలాలను బలపరుస్తున్నాయి, అమలు పరుస్తున్నాయి కూడా. ఇలాంటి దశలోనే రాయ్‌గఢ్ సెజ్ వ్యతిరేక పోరాటం మన ముందు కొన్ని వాస్తవాలను ఉంచింది.

మహారాష్ట్రలో భారీ ప్రాజెక్టుల వలన నిర్వాసితులైన ప్రజల అనుభవాలను గుణపాఠంగా తీసుకొని మహా ముంబయి సెజ్ వ్యతిరేక ఉద్యమకారులు తమ పోరాటాలకు రూపకల్పన చేసుకున్నారు. సెజ్‌లు తెచ్చే పారిశ్రామికీకరణ తమకు ఉపయోగపడదని, ప్రజావ్యతిరేకమైందని, గుత్త పెట్టుబడిదారులకు అనుకూలమైనదని గ్రహించగలిగారు. ప్రభుత్వం చెప్పే పారిశ్రామికీకరణలో బహుళజాతి కంపెనీలు, వాటి అనుకూల వర్గాల చేతిలో తమ సంపదలు, వనరులు దోచిపెట్టడానికి ఇష్టపడటం లేదు. ఒక ఎత్తుగడగా రిలయన్స్ సంస్థ ప్రతిపాదించే పరిశ్రమలలో దమ్ముంటే ప్రజలకు భాగస్వామ్యం ఇవ్వాలని, బానిసలుగా కాక యజమానులుగా ఉండాలని ప్రజలు డిమాండ్ చేసారు. అవసరమైతే తమ భూములను లీజుకు ఇస్తాం గానీ కోటి రూపాయలు ఇచ్చినా, ధారాధత్తం చేయమని పోరాడుతున్నారు. భారత ప్రభుత్వం చేసిన చట్టాలకే విలువలేని దేశంలో విదేశీ భూభాగంగా ప్రకటించబడే తమ ప్రాంతంలో ఎలాంటి న్యాయం జరుగుతుందని ప్రశ్నిస్తున్నారు. తమకు భూతల స్వర్గంగా చూపించే అభివృద్ధిని వారు వద్దని నిరసిస్తున్నారు. ఉన్న ఉపాధి అవకాశాలను మెరుగుపర్చుకోవాలనుకుంటున్నారు తప్ప, తమ జీవితాల్ని , తమని కబ్జా చేసే సెజ్‌లను కోరుకోవడం లేదు. తమ సంపదలైన ప్రకృతి వనరుల్ని కాపాడుకోవడం జీవించే హక్కులో భాగంగా, మానవ హక్కుల ఉల్లంఘనగా భావించి సంఘటితమయ్యారు. ఫలితంగా 14 వేల హెక్టార్ల భూమిలో కేవలం 1100 ఎకరాలు మాత్రమే సెజ్ యాజమాన్యం పొందగలిగింది. అవి కూడా 13 షరతులతో కూడినవి. అంటే సెజ్ కోసం ప్రతిపాదించిన భూములలో కేవలం 4 శాతం మాత్రమే పొందగలిగారు. ఇది సమైక్య ప్రజా పోరాటాల విజయం. ఈ విజయాన్ని భూమికగా చేసుకొని 'పబ్లిక్ ఆడిటింగ్'ను మహా ముంబయి సెజ్ ప్రతిపాదిత ప్రాంతాల్లో మార్చి 25, 26 – 2010 తేదీలలో నిర్వహించారు. సెజ్ చట్టాన్ని రద్దు చేయాలని, ఇకముందు దేశంలో వనరుల దోపిడి జరగకూడదనే లక్ష్యంతో ఇతర ప్రజా సంఘాలతో కలిసి జాతీయ ఉద్యమాల సమాఖ్య నేతృత్వంలో ఈ 'పబ్లిక్ ఆడిట్'ను నిర్వహించబోతున్నారు.

ఇక్కడ ప్రధానంగా జరిగిందేమిటంటే భౌతిక పరిస్థితులు, సైద్ధాంతిక అవగాహన పరస్పర ప్రేరకాలై వీరి పోరాట ఉనికికి ఊతమిచ్చాయి. ఉద్యమ ఉధృతిలో అన్ని శ్రేణుల్ని ఉద్యమంలోకి తీసుకురావడం ఒక చారిత్రక వాస్తవం. అప్పటి వరకు కేవలం పొదుపు సంఘాలు, ప్రభుత్వం చేత గుర్తింపబడ్డ సంఘాలు కూడా ఉద్యమ స్ఫూర్తితో అదే ప్రభుత్వంపైన తిరగబడడం ఓ నిదర్శనం. సెజ్‌ని వ్యతిరేకించే వారంతా వారి సైద్ధాంతిక రాజకీయ అవగాహన ఏదైనప్పటికీ అందరూ ఒక తాటిపైన నిలబడి, గుత్త పెట్టుబడిదారీ వర్గాన్ని కొమ్ముకాస్తున్న ప్రభుత్వాన్ని ఎదుర్కోవడమే లక్ష్యంగా చేసుకొని పోరాటం చేస్తున్నారు. ఎన్నో సంఘాలు, విప్లవ సంఘాలు కావచ్చు, ప్రగతిశీల భావాలు గల సంఘాలు కావచ్చు, మరేవైనా స్వచ్ఛంద సంస్థలు పొదుపు సంఘాలే కావచ్చు, తమ పోరాటానికి మద్దతు నిచ్చే ప్రజాస్వామ్య వాదులను, సంస్థలను, సంఘాలను కలుపుకొని ముందుకు వెళుతున్నారు.

ప్రజల మధ్య అసమానతలు రద్దు చేసి, వ్యత్యాసాలు తగ్గించే దిశగా రాసుకున్న ఆదేశిక సూత్రాలు అమలు కానప్పుడు ప్రజలకు తిరుగబడే హక్కు ఉందంటున్నారు కె.జి. కన్నబిరాన్

ఆదేశిక సూత్రాలే అంతిమ లక్ష్యం

రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల ఉద్దేశం గురించీ, ప్రాధాన్యత గురించీ రాజ్యాంగ నిర్ణయ సభ సభ్యుల మనస్సులలో చాలా తప్పుడు అభిప్రాయాలు ఉన్నాయని డా. అంబేద్కర్ గుర్తించారు. అందుకే ఆదేశిక సూత్రాల గురించి ఆయన స్పష్టంగా వివరించారు : 'ప్రభుత్వాలు ఏర్పర్చబోయే వాళ్ల ముందు ఒక ఆదర్శాన్ని నిలపాలని కూడా రాజ్యాంగం భావిస్తున్నది. ఆ ఆదర్శం ఆర్థిక ప్రజాస్వామ్యం. ఇక్కడ మనం కేవలం అధికారాన్ని హస్తగతం చేసుకోవడానికి ఒక యంత్రాంగాన్ని తయారు చేసే పని మాత్రమే పెట్టుకోలేదు... అయితే ఆర్థిక ప్రజాస్వామ్యాన్ని సాధించే మార్గమేమిటో, మనకు కచ్చితంగా తెలుసా అనే ప్రశ్న ఉండనే ఉంటుంది. ఆర్థిక ప్రజాస్వామ్యం సాధించడానికి వేరువేరు మార్గాలున్నాయని ప్రజలు అనుకుంటారు. కొందరేమో ఆర్థిక ప్రజాస్వామ్యాన్ని సాధించడానికి అత్యుత్తమ రూపం సోషలిస్టు రాజ్యమే అనుకుంటారు. మరికొందరు ఆర్థిక ప్రజాస్వామ్యం సాధించడానికి సరైన రూపం కమ్యూనిస్టు భావనే అనుకుంటారు. ఇలా ఆర్థిక ప్రజాస్వామ్యాన్ని సాధించే విభిన్న మార్గాల గురించి స్పష్టమైన అవగాహనతోనే మన ఆదేశిక సూత్రాలలో నిర్దిష్టమైన భాషను ఉపయోగించాం. ఆ భాష సంకుచితమైనది కాదు. స్థిరమైనది కాదు... ఎందుకంటే రాజ్యాంగంలో రూపొందించిన విభిన్న యంత్రాంగాల ద్వారా ఒక పార్లమెంటరీ తరహా ప్రభుత్వాన్ని స్థాపించడం మాత్రమే మన ఉద్దేశం కాదు. ఆ ప్రభుత్వానికి మన ఆర్థిక లక్ష్యం గురించిన దిశా నిర్దేశం లేకుండా, మన సామాజిక ధర్మం ఎలా ఉండాలనే ఆలోచన లేకుండా ఉండకూడదు. ఆ ఉద్దేశంతోనే మనం రాజ్య విధానానికి సంబంధించిన ఆదేశిక సూత్రాలను తయారు చేసాం.'

ఈ ఆదేశిక సూత్రాలు ఉన్న నాలుగో అధ్యాయంలో 38వ అధికరణంలో 'కృషి చేస్తుంది' అనే మాట వాడకం మీద చాలా చర్చ జరిగింది. ఆ అధికరణంలో 'కృషి చేస్తుంది' అనే మాట చాలా ముఖ్యమైనదని అంబేద్కర్ వివరించారు. 'ఈ మాట వాడడంలో మన ఉద్దేశమేమంటే ఆదేశిక సూత్రాలను అమలు చేయడానికి ప్రయత్నించినప్పుడు ప్రభుత్వాన్ని ఆటంకపరిచే, ప్రభుత్వానికి అడ్డుగా నిలిచే పరిస్థితులు ఉన్నప్పటికీ, కష్టతరమైన, అసాధ్యమైన పరిస్థితులు ఉన్నప్పటికీ ప్రభుత్వం అన్నివేళలా ఈ ఆదేశిక సూత్రాలను పరిపూర్తి చేయడానికి కృషి చేస్తుంది. అందుకే మనం బలమైన 'కృషి చేస్తుంది'

ఇదే, మన రాష్ట్రంలో సెజ్ వ్యతిరేక పోరాటాలలో కొరవడుతున్న అంశం. అటు కాకినాడ సెజ్ వ్యతిరేక పోరాటం నుండి పోలేపల్లి, సత్తివీడు, కోస్టల్ కారిడార్ వ్యతిరేక పోరాటాల వరకు ఇదే పద్ధతి. విప్లవాలకు, విప్లవ శక్తులకు పుట్టినిల్లు అయిన ఆంధ్రప్రదేశ్‌లో ఐక్య సంఘటనకు సంబంధించి ఒక్క కార్యాచరణ కనపడదు. ఇదంతా అవగాహన రాహిత్యం నుంచి చెప్పేది కాదు. మాకు కాకినాడ సెజ్ వ్యతిరేక పోరాట ఉద్యమం నేర్పిన అనుభవం. నందిగ్రాం పోరాటం విజయవంతం కావడానికి ప్రజల విప్లవ చైతన్యం వెనుక విప్లవ శక్తులు, సంఘాల పాత్ర ఉన్నదన్నది వాస్తవం. మానవ హక్కుల వేదిక కన్వీనరు బాలగోపాల్ ఒక పత్రికా వ్యాసంలో అన్నట్లుగా మనకు కావలసింది మమతా బెనర్జీ లాంటి రివజనిస్టు పార్టీ నాయకులు కాదు. ప్రజల చైతన్య స్ఫూర్తిని ముందుకు తీసుకుపోగలిగిన ఒక ప్రజా ఉద్యమం. గత వర్తమాన ఉద్యమాల నేపథ్యంలో సమకాలీన పరిస్థితుల పట్ల ఎరుక పెంచుకొని సరికొత్త వ్యూహాలతో సామ్రాజ్యవాద ప్రపంచీకరణను, అందులో భాగమైన ప్రత్యేక ఆర్థిక మండలాలకు వ్యతిరేకంగా పోరాడే విప్లవ శక్తులు, ప్రగతిశీల శక్తులు ముందుకు రావాలి. భూమికి భూమి, సముద్రానికి సముద్రం, ఊరుకు ఊరు ఇవ్వగలరా అన్న ప్రజల గొంతులకు నినాదమై సాగడం.

మరొక సమస్య, ఏమిటంటే విదేశీ విరాళాలతో పనిచేస్తున్న సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు సెజ్‌లలో పని చేస్తున్నాయి. కాబట్టి విప్లవ సంఘాలు, వాటి ప్రజాసంఘాలు సెజ్ ఉద్యమాలకు (కొన్నింటికి) దూరంగా ఉండాలన్నది. ఇది కూడా అప్రజాస్వామిక ధోరణే. స్వచ్ఛంద సంస్థలకు కొన్ని లక్ష్యాలు ఉంటాయి. అవి ఉద్యమాల్ని పక్కదోవ పట్టించడం లేదా నీరుగార్చడం అని మనం భావిస్తే విప్లవ కార్యాచరణ స్వచ్ఛంద సంస్థలను పారదోల లేవా? రాజ్యం స్వభావానికి, అణచివేత ధోరణిని ఎదుర్కోవడంలో ప్రజాపోరులో ముందుకు సాగే ఐక్య సంఘటనలో నిలవగలరా? అయినా ప్రజలు కదా, తీర్పు చెప్పవలసింది! మాకు కులం, మతం, లింగబేధాలు లేవు. మేమంతా సెజ్ పీడితులం, మాదంతా ఒకే వర్గం, మా ప్రాణాలిచ్చైనా ప్రకృతి వనరులపై, మా సంస్కృతిపై గుత్తాధిపత్యాన్ని అడ్డుకుంటామంటున్న ప్రజల చైతన్యం ముందు విప్లవ విద్రోహ శక్తులు నిలవగలవా? సామ్రాజ్యవాద ప్రపంచీకరణను వ్యతిరేకిస్తూ ప్రజా ఉద్యమాలని నిర్మిస్తున్న శక్తులన్నీ ఏకంకావాలి. దేశవ్యాప్తంగా ప్రత్యేక ఆర్థిక మండలాలను, భూఆక్రమణను, నిర్వాసితత్వానికి వ్యతిరేకంగా పోరాడే వేదికను నిర్మించగలగాలి. చాప కింద నీరులా వెల్లువెత్తుతున్న పోరాటాలకు దిశానిర్దేశం చేయగలగాలి. ఇదే ఈనాటి అవసరం. ఒక వాస్తవ దృక్పథం కూడా!

(రచయిత సామాజిక కార్యకర్త) వీ

అనే మాట వాడాం' అని అంబేద్కర్ అన్నారు. అంతేకాదు, ప్రభుత్వం తన బాధ్యతలను విస్మరించే అవకాశం ఉందని కూడా అంబేద్కర్ గుర్తించారు. 'మనమీ మాట వాడకపోతే ప్రభుత్వాలు పరిస్థితులు కష్టతరంగా ఉన్నాయనీ, ఆర్థిక వనరులు సరిపోయినంతగా లేవనీ, అందువల్లనే రాజ్యాంగం నిర్దేశించిన దిశలో తాము చర్యలు చేపట్టలేకపోతున్నామనీ అనవచ్చు' అని కూడా ఆయన అన్నారు.

నిజానికి ఆదేశిక సూత్రాలనేవి రాజ్యాంగానికి సంబంధించిన ఆర్థిక సూత్రాలు. రాజ్యాంగ అధికరణం 38 ప్రకారం : ప్రజా సంక్షేమాన్ని అభివృద్ధి చేసే సామాజిక వ్యవస్థను స్థాపించడం రాజ్య కర్తవ్యం – జాతీయ జీవనంలోని అన్ని నిర్మాణాలలోనూ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం కొనసాగే సామాజిక వ్యవస్థను వీలైనంత శక్తిమంతంగా స్థాపించి పరిరక్షించేందుకు తద్వారా ప్రజా సంక్షేమాన్ని అభివృద్ధి చేసేందుకు రాజ్యం కృషి చేస్తుంది. ప్రత్యేకంగా రాజ్యం ఆదాయ అసమానత్వాన్ని తగ్గించడానికి కృషి చేస్తుంది. వ్యక్తుల మధ్య మాత్రమే కాక విభిన్న ప్రాంతాలలో నివసించే, విభిన్న వృత్తులలో పనిచేసే ప్రజా సమూహాల మధ్య హోదాలోను, సౌకర్యాలలోను, అవకాశాలలోను అసమానతలు రద్దు చేయడానికి కృషి చేస్తుంది. ఈ మౌలికమైన బాధ్యతను రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు బహిరంగంగా ఉల్లంఘిస్తూ వచ్చాయి. అందువల్లనే ప్రజలు సంఘటితంగా నిరసన తెలుపుతున్నారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ ప్రాంత ప్రజలు ప్రత్యేక రాష్ట్రం కొరకు ఉద్యమం జరపడం ఈ ఉల్లంఘన ఫలితమే.

రాజ్య విధానం పౌరులందరికీ, స్త్రీలకూ, పురుషులకూ కూడా తగిన జీవనోపాధి అవకాశాలను కల్పించాలని అధికరణ 39 రాజ్యాన్ని ఆదేశిస్తుంది. స్త్రీల విషయంలో 'పౌరులు' అనే మాట వాడడం చాలా ప్రాధాన్యత కలిగింది. ఎందుకంటే, అది స్త్రీలకు సమాన రాజకీయ హోదాను కల్పిస్తుంది. సాధారణంగా భాగస్వామ్య ప్రజాస్వామ్యంలో స్త్రీలకు ఆ హోదా కల్పించబడలేదు.

అలాగే సమాజానికి చెందిన భౌతిక వనరులపై యాజమాన్యం గానీ, అదుపు గానీ సమాజ శ్రేయస్సుకు తగినట్టుగా మాత్రమే పంపిణీ కావాలని అధికరణం 39 ఆదేశించింది. రాజ్యం నిర్వర్తించవలసిన ఈ బాధ్యతను ఏ ఒక్క సందర్భంలోనూ అమలు చేయలేదు.

సామాజిక శ్రేయస్సుకు భంగకరమైన పద్ధతిలో సంపద గానీ, ఉత్పత్తి సాధనాలు గానీ గుత్తాధిపత్యం కిందికి వెళ్లకుండా ఆర్థిక వ్యవస్థా నిర్వహణ జరగాలని అధికరణం 39 ఆదేశించింది.

ఇవన్నీ కీలకమైన సూత్రాలు. ఇవి మన సమాజంలో సాగుతున్న దోపిడీ వ్యవస్థను కూలదోయడానికి ఉద్దేశించినవి. అలాగే, ఈ అధ్యాయంలోని ఇతర అధికరణాలు పౌరుల మధ్య వారి పనిస్థలాలలో సమానత్వానికి సంబంధించినవి. ఈ నాలుగో అధ్యాయంలో ఉన్న అధికరణాలు న్యాయస్థానాల ద్వారా అమలు చేయించగలిగినవి కావు అని ఒక అధికరణం ఉండడంతో, దాన్ని మన మేధావులూ, అభిప్రాయ నిర్మాతలూ అవి ప్రజలకు ఎందుకూ పనికిరానివని అర్థం చేసుకున్నారు. నిజం చెప్పాలంటే, ప్రాథమిక హక్కులను చెప్పిన మూడవ భాగం సామాజిక కార్యాచరణకు చట్టబద్ధ మార్గాలను వినియోగించుకునే వారికి మాత్రమే ఉద్దేశించినది. కాగా, ఆదేశిక సూత్రాలను చెప్పిన నాలుగో భాగం 'ప్రజలు' అనే సమూహానికి చెందిన హక్కులకు సంబంధించినది. అందువల్ల ఆదేశిక సూత్రాలను అమలు చేయించుకునే రాజకీయ హక్కు ప్రజలకూ ఉంది. ఆదేశిక సూత్రాలను ఓటు హక్కుతోనూ, భావ ప్రకటనా స్వేచ్ఛతోనూ కలిపి చదువుకుంటే, ప్రజలకు ప్రభుత్వాలను పునర్ నిర్మించే హక్కు ఉందని అర్థమవుతుంది. ఆ హక్కును ఒకసారి అంగీకరించామంటే ప్రజలకు తిరగబడే రాజకీయ హక్కు కూడా అందులో భాగమేనని అంగీకరించవలసిందే. ప్రజాస్వామ్య తత్వవేత్త జాన్ లాక్ చెప్పిన 'ఒప్పంద రాజకీయాల సూత్రం' ప్రకారం కూడా దుష్పరిపాలనను ప్రతిఘటించే, తిరుగబడే హక్కు ప్రజలకు ఉంది. ఆయన తాను ప్రతిపాదించిన సామాజిక ఒప్పందం సూత్రం ఆధారంగానే ఈ ప్రజల హక్కులను గుర్తించాడు. అదే విధంగా రాజ్యం భావన గురించి తన రాజకీయ సిద్ధాంతం రాస్తూ, లాస్కీ 'చట్టబద్ధమైన పాలన అనే దాని నుంచి అర్థం చేసుకోవలసినదేమంటే, ప్రతి ఒక్క వ్యక్తికీ రక్షణ ఇచ్చే, సంపూర్ణమైన సంఘీభావాన్ని అందించే బాధ్యత రాజ్యానికి ఉంది. ఈ బాధ్యత వల్లనే రాజ్యం ఆ లక్ష్యం సాధించడం కోసం బల ప్రయోగమైనా చేయవచ్చు అని అంగీకరిస్తున్నాం. అంతేకాదు ఈ లక్ష్యం సాధించడానికి రాజ్యం పనిచేసే అంతిమ చట్రంలో రాజ్యాంగ బద్ధమైన హామీలు కూడా ఉండవలసి ఉంటుంది. ఆ హామీలను గనుక రాజ్యం బహిరంగంగా ఉల్లంఘిస్తే, ఆ ప్రయోజనాల నిరాకరణకు గురైన ప్రజలకు తిరగబడే హక్కు వస్తుంది.'

నిజానికి అంబేద్కరే స్వయంగా రాజ్యాంగ నిర్ణయ సభలో ఆదేశిక సూత్రాల ప్రాముఖ్యత గురించి మాట్లాడుతూ ఒక మాట అన్నారు. అభివృద్ధి నిరోధకుల కుట్ర సాగినప్పుడే ఆదేశిక సూత్రాల ప్రాముఖ్యత అర్థమవుతుంది అన్నారు. ఇవాళ అమలులోకి వస్తున్న అన్ని వ్యాపార ఒప్పందాలు (ఎం.ఒ.యు.లు) రాజ్యాంగ వ్యతిరేకమైనవి. అవన్నీ రాజ్యాంగ బాధ్యతలలో ఏదో ఒకదాన్ని ఉల్లంఘించేవే. అందువల్ల రాజ్య పాలన మౌలిక సూత్రాల ఉల్లంఘనలను నిరసిస్తూ ఏ రూపంలో జరిగే పోరాటమైనా ఆదేశిక సూత్రాలను అమలు చేయించడానికి జరిగే చట్టబద్ధమైన, న్యాయబద్ధమైన పోరాటమే అవుతుంది.

రాజ్యాంగానికి సవరణలు చేసే అధికరణం గురించి, ఇమిడి ఉన్న బాధ్యతల భావన గురించి వ్యాఖ్యానిస్తూ సుప్రసిద్ధమైన కేశవానంద భారతి కేసులో ప్రధాన న్యాయమూర్తి సిక్రి 'రాజ్యాంగం ఇచ్చిన ప్రజాస్వామిక నిర్మాణాన్ని ధ్వంసం చేయకుండా, మూడో భాగంలో నిర్దేశించిన అవిభాజ్యమైన హక్కులను ధ్వంసం చేయకుండా, ప్రవేశికలో సూచించిన పరిధిని దాటకుండా దేశంలో సామాజిక, ఆర్థిక విప్లవాన్ని సాధించగలిగిన అవకాశం ఇచ్చే అర్థమే సరైనదని నేనుకుంటాను' అన్నారు. ఇది పార్లమెంట్‌కు ఉన్న రాజ్యాంగ సవరణా అధికారానికి సంబంధించినది. మరి ఇప్పుడు మన్మోహన్ సింగ్, చిదంబరం, మోంటెక్ సింగ్ అనే దుష్టత్రయానికి రాజ్యాంగ ప్రవేశికను ఉల్లఘించే అధికారాన్ని ప్రజలు కట్టబెట్టారా?

'రాజ్యాంగ ఆదేశిక సూత్రాలు భారత సామాజిక విప్లవ లక్ష్యాలైన మానవతావాద సమసమాజ ఆదర్శాన్ని ప్రకటించాయని గ్రాన్‌విల్ ఆస్టిన్ వ్యాఖ్యానించారు. ఆయన ప్రాథమిక హక్కులకూ, ఆదేశిక సూత్రాలకూ మధ్యన ఉన్న అంతస్సంబంధాన్ని మదింపు చేస్తూ ఈ మాట అన్నారు. రాజ్యాంగ నిర్ణయ సభ సభ్యులు ప్రాథమిక హక్కులను, ఆదేశిక సూత్రాలను భారత దేశంలో జరగవలసిన సామాజిక విప్లవ సంస్కరణలకు ప్రధాన సాధనాలుగా భావించారు' అని న్యాయమూర్తులు షెలాత్, గ్రోవర్‌లు ప్రకటించారు.

ఆ తీర్పులోనే ముగింపులో 'మూడో భాగంలో నిర్దేశించిన విభిన్న స్వేచ్ఛలనూ, మౌలిక హక్కులనూ కల్పిస్తూ వ్యక్తి హోదాను కాపాడడం, నాలుగో భాగంలో నిర్దేశించిన సంక్షేమ రాజ్యాన్ని నిర్మించడం' ఇతర లక్ష్యాలతో పాటు పాలనకు అంతిమ లక్ష్యం అని వారన్నారు.

వలస చట్టాల ప్రభావం

(ప్రాథమిక హక్కులకు హామీ 1950లోనే ఇచ్చుకున్నా, ఆ హక్కుల ఉల్లంఘనను మన ప్రభుత్వాలు అంతకు ముందునుంచే మొదలుపెట్టాయని దేవులపల్లి పబ్లికేషన్‌గా వచ్చిన కె.జి. కన్నబిరాన్ ఆత్మకథాత్మక సామాజిక చిత్రం '24 గంటలు' పుస్తకంలో నుంచి కొంత భాగం...

– సం.)

ఇప్పటిదాకా చెబుతున్న కుట్ర కేసుల వ్యవహారం చూస్తే ఇదంతా ఏదో ఆంధ్రప్రదేశ్ సంగతి మాత్రమేనని అనిపిస్తుందేమో. కాని రాజకీయంగా భిన్నాభిప్రాయాలున్న వాళ్ల మీద 1947 నుంచీ కూడా భారత ప్రభుత్వం, అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న వైఖరి అదే. భారత ప్రజలమైన మనకు మనం రాజ్యాంగం ద్వారా ప్రాథమిక హక్కులకు హామీ 1950 జనవరిలో ఇచ్చుకున్నాం గాని, అంతకు ముందు నుంచే మన ప్రాథమిక హక్కులను ప్రభుత్వాలు ఉల్లంఘించడం మొదలుపెట్టాయి.

1947 ఆగస్టు 15న మద్రాసు రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ ఖైదీలందరినీ విడుదల చేసింది. కాని అప్పటికి జైలులో ఉన్న ఎ.కె.గోపాలన్‌ను మాత్రం విడుదల చేయలేదు. ఆగస్టు 14న ఆయన ఒక చెరసాలలో ఏకాంతవాస శిక్షను అనుభవిస్తున్నాడు. ఆ మర్నాడు స్వాతంత్ర్య దినోత్సవాన్ని జైలు ఆవరణలోనే జరుపుకోవాలని ఆయన నిశ్చయించుకున్నాడు. కొందరు తోటి ఖైదీలు వెంటరాగా ఆయన ఆ ఆగస్టు 15 ఉదయం జైలు ఆవరణలోనే జాతీయ పతాకం పట్టుకుని ఊరేగింపు జరిపాడు. మూడో బ్లాకు పైకప్పు మీద జెండా ఎగురేసి జెండా వందనం కూడా జరిపాడు. అక్కడ గుమిగూడిన ఖైదీలను ఉద్దేశించి ఆయన ఓ నాలుగైదు నిమిషాలు ఉపన్యాసం కూడా చేశాడు. ఈ పని చేసినందుకుగాను ఆయనను కాలికట్ అదనపు జిల్లా మెజిస్ట్రేటు ముందు హాజరుపరిచి రాజద్రోహం నేరం ఆరోపించారు. మహాఘనత వహించిన చక్రవర్తికి వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొట్టే రాజద్రోహానికి పాల్పడ్డాడని ఆయన మీద నేరం ఆరోపించారు. అప్పటికి చక్రవర్తి ప్రభుత్వం పడిపోయింది, స్వతంత్ర ప్రభుత్వం అధికారానికి వచ్చింది. కాని మన న్యాయవ్యవస్థకు ఈ మార్పులతో ఏ సంబంధమూ లేదు.

ఆ నేరారోపణకు జవాబు చెబుతూ ఎ.కె. గోపాలన్ న్యాయస్థానం ముందు చేసిన ప్రకటన చాలా ముఖ్యమైనది. ఎందుకంటే స్వతంత్ర భారత ప్రభుత్వం కూడా వలసవాద పాలనా సంప్రదాయాలనే పాటించ బోతున్నదని ఆ ప్రకటన స్పష్టం చేసింది.

"చట్టబద్ధంగా ఏర్పడిన బ్రిటిష్ భారత సామ్రాజ్య చక్రవర్తికి

'స్వాతంత్ర్యం తర్వాత అసంపూర్ణ కర్తవ్యంగా మిగిలిపోయిన సామాజిక, ఆర్థిక విప్లవాన్ని సాధించేందుకే రాజ్యాంగంలో నాలుగో భాగం రూపొందించడం జరిగింది. రాజ్యాంగ లక్ష్యం కొద్దిమంది పౌరులకు కొన్ని హక్కులకు హామీ ఇవ్వడం మాత్రమే కాదు, సకల జనాలకు అన్ని హక్కులూ ఇవ్వడం. రాజ్యాంగం మన సమాజాన్ని సమగ్రంగా దృష్టిలో పెట్టుకుంది. మన సమాజంలోని సభ్యులలో ప్రతి ఒక్కరు హామీ పొందిన స్వేచ్ఛలలో భాగం పంచుకోవాలి. రాజ్యాంగంలోని నాలుగో భాగాన్ని విస్మరించడం అంటే, రాజ్యాంగపు పోషక పదార్థాన్ని విస్మరించడమే. జాతికి రాజ్యాంగం చూపిన ఆశలను విస్మరించడమే. రాజ్యాంగం ఏ పునాదుల మీద నిర్మాణం అయిందో ఆ పునాదులను విస్మరించడమే. ఆదేశిక సూత్రాలను యథాతథంగా అమలు చేయకుండా రాజ్యాంగం ఆశించిన సంక్షేమ రాజ్యాన్ని నెలకొల్పడం అసాధ్యం. దారిద్ర్యం, అజ్ఞానం విస్తృతంగా ఉన్న మన సమాజం వంటి సమాజంలో ప్రతి ఒక్క పౌరుడి కనీస ఆర్థిక అవసరాలను తీర్చకుండా మానవ హక్కుల ప్రయోజనాన్ని సాధించడం సాధ్యం కాదు. రాజ్యాంగం కింద తీసుకున్న ప్రతిజ్ఞను పరిపూర్తి చేయడంలో విఫలమైన ఏ ప్రభుత్వమైనా రాజ్యాంగానికి గానీ, దాని నిబద్ధతలకు గానీ విధేయమైనదని చెప్పడానికి వీలులేదు' అని న్యాయమూర్తులు హెగ్డే, ముఖర్జీ అన్నారు.

రాజ్యాంగపు మౌలిక నిర్మాణం అనే మాటలో ప్రవేశికలో ప్రస్తావించిన మౌలిక మానవ హక్కులు అన్ని ఉన్నాయనీ, వాటినే ప్రాథమిక హక్కుల అధ్యాయంలో వివరంగా చెప్పడం జరిగిందనీ న్యాయమూర్తి పాలేకర్ అన్నారు.

'ఒక న్యాయమైన సామాజిక వ్యవస్థను నిర్మించే క్రమంలో కొన్ని సందర్భాలలో ప్రాథమిక హక్కుల కన్న ఆదేశిక సూత్రాలదే పైచెయ్యి అవుతుందని ఈ సందర్భంలో గుర్తుంచుకోవడం అవసరం. రాజ్యాంగ నిర్మాతలకు ఉన్న భవిష్యత్తు దృష్టి ఏమంటే ప్రతి ఒక్క పౌరుడికీ స్వేచ్ఛా, సమానత్వాలూ అర్థవంతమైన ఆదర్శాలుగా ఉండాలని... ఆర్థిక లక్ష్యాలే నిస్సందేహంగా ప్రధానమైనవి. సైద్ధాంతిక లక్ష్యాలు ఆ తర్వాతే వస్తాయి. మనుగడ ఉంటేనే ప్రతిభ సాధించవచ్చు అని అందరికీ తెలుసు' అని న్యాయమూర్తి మాథ్యూ అన్నారు.

'ఒక మనిషి జీవితంలో ప్రాథమికమైనది ఏమిటి అనేది ఎంత ముఖ్యమో, ఒక దేశపు పాలనలో ప్రాథమికమైనది ఏమిటి అనేది అంతే ముఖ్యం. వీటిలో ఒకటేమో న్యాయస్థానాలలో ప్రశ్నించగలిగినది. మరొకటి ప్రశ్నించలేనిది అనడం చట్టబద్ధ క్రమాల ఆచరణకు సంబంధించినదే తప్ప, ఈ తేడా వాటి సాపేక్షిక ప్రాధాన్యతలకు సంబంధించినది కాదు... మూడో భాగంలోనూ, నాలుగో భాగంలోనూ ఉన్న అధికరణాలను చూసినప్పుడు నిస్సందేహంగా నాకేమనిపిస్తుందంటే నాలుగో భాగంలో ప్రకటించిన ఆదర్శాల అంతిమ సాఫల్యాలు మూడో భాగంలో ప్రకటించిన వ్యక్తిగత మౌలిక స్వేచ్ఛలే. అవి మన రాజ్యాంగపు మనస్సాక్షికి నిదర్శనాలు' అని న్యాయమూర్తి చంద్రచూడ్ అన్నారు. రాజ్యాంగం గాలిమేడ అయిపోవడానికి అనుమతించగూడదని ఆయన ఆశించాడు. ప్రస్తుతం ప్రపంచీకరణ దుష్టత్రయం సరిగ్గా ఆ పనే చేసింది.

పై తీర్పులోనే న్యాయస్థానం రాజ్యాంగాన్ని సునిశితంగా అధ్యయనం చేసింది. ఆ విధాన పత్రంలో ఏమి రాసి ఉందో అర్థం చేసుకుంది. అన్ని తీర్పులలోకి ఈ తీర్పులోనే న్యాయస్థానం స్పష్టంగా రాజ్యాంగానికి చేసే ఏ వ్యాఖ్యానాన్నైనా ప్రజల దృష్టి నుంచి మాత్రమే చేయాలని ప్రకటించింది. ఎందుకంటే రాజ్యాంగాన్ని తయారు చేసిన వాళ్లు ప్రజలే. అది ఒక శక్తిమంతమైన తిరుగులేని ఆధారం.

(రచయిత పి.యు.సి.ఎల్. జాతీయ అధ్యక్షులు) ❖

వ్యతిరేకంగా శత్రుత్వ భావాలు రెచ్చగొడుతున్నాననే నేరం మీద విచారణ ఎదుర్కోవడం నాకు చాలా గర్వకారణంగా ఉన్నది. ఈ దేశంలోని స్వేచ్ఛాప్రియులందరూ, స్వాతంత్ర్యోద్యమ ప్రారంభం నుంచీ గాంధీ, నెహ్రూల దాకా నాయకులందరూ ఈ చక్రవర్తి ప్రభుత్వానికి వ్యతిరేకంగా అటువంటి శత్రుత్వభావనను కల్పించేందుకే ప్రయత్నించారు. ఆ లక్ష్యం కోసం పని చేసినందుకే మహాత్మాగాంధీని భారత శిక్షాస్మృతిలోని సెక్షన్ 124-ఎ కింద రాజద్రోహ నేరం ఆరోపించి విచారించారు.

దానంతటి ఫలితంగానే ఈ రోజున మహాఘనత వహించిన ప్రభుత్వం, బ్రిటిష్ ఇండియా అంతర్ధానమైపోయాయి. నాతోపాటు ఆ నేరం చేసిన నా సహకార్యకర్తలెందరో ఇవాళ మంత్రులుగా, గవర్నర్లుగా ఉన్నారు. సరిగ్గా మనం స్వాతంత్ర్యం సంపాదించిన ఈ సమయంలో నా మీద ఈ నేరం ఆరోపించడంలో కొంచెం అనౌచిత్యం ఉందని నా కనిపిస్తోంది" అని ఎ కె గోపాలన్ అన్నాడు.

ఈ కేసులో ప్రభుత్వం తరపున కాంగ్రెస్ నాయకుడు, న్యాయవాది కె పి రామున్ని మీనన్ వాదించాడు. మొత్తానికి ఆ కేసు నుంచి ఆయనను 1947 అక్టోబర్ 12న విడుదల చేశారు. కాని రెండు నెలల తిరగకుండానే డిసెంబర్ 17న ఆయనను మళ్లీ అరెస్టు చేశారు. ఈసారి మరొక చట్టం సాయంతో ఆయనను అరెస్టు చేశారు. ఆ చట్టం పేరు ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టం. ఆయనను ఈసారి ఒక జైలు నుంచి మరొక జైలుకు మారుస్తూపోయారు. మన రాజ్యాంగం 1950 జనవరి 26న అమలులోకి వచ్చింది. ఎ కె గోపాలన్ మాత్రం జైలులోనే ఉండిపోయాడు. రాజ్యాంగం ఇచ్చిన అధికారాలతో స్వతంత్ర భారత ప్రభుత్వం 1950 ఫిబ్రవరి 26న ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టాన్ని పకడ్బందీగా తీసుకు వచ్చింది. ఎ.కె. గోపాలన్‌ను ఇప్పుడు ఈ కొత్త చట్టం కింద నిర్బంధించారు.

నిర్బంధపూరిత పాలనా యంత్రాంగం వలసవాదుల సంప్రదాయాలను యథాతథంగా కొనసాగించడం మొదలుపెట్టింది. న్యాయస్థానాలు కూడా ఆ వలసవాద సంప్రదాయాన్నే కొనసాగించాయి. రాజ్యాంగం ఏర్పాటు చేసిన పాలనా వ్యవస్థలపై రాజ్యాంగ ప్రభావం ఏమిటో అర్థం చేసుకోవాలంటే 1947 ఆగస్టు 15 తర్వాత కూడా ఎ కె గోపాలన్ జైలులో ఉండవలసి వచ్చిందంటే వాస్తవాన్ని గమనంలో ఉంచుకోవాలి. భారత స్వాతంత్ర్యోద్యమాన్ని అణచడానికి, చేసిన చట్టాలతో సహా బ్రిటిష్ ఇండియాలోని అన్ని చట్టాలూ స్వతంత్ర భారతదేశంలో యథాతథంగా అమలయ్యే చట్టాలయిపోయాయి. అందువల్ల సహజంగానే వలస వాద చట్ట, న్యాయ వ్యవస్థ స్వతంత్ర భారత చట్ట, న్యాయ వ్యవస్థ అయిపోయింది.

రాజ్యాంగంలోని ఉపోద్ఘాతంలో రాసిన ఆదర్శాలను వాస్తవీకరించేందుకు అవసరమైన చట్ట, న్యాయ వ్యవస్థను రూపొందించాలనే ప్రయత్నమే జరగలేదు. బహుశా అటువంటి న్యాయ వ్యవస్థను తయారు చేసి ఉన్నట్లయితే, ప్రభుత్వం తన మౌలిక కర్తవ్యాలను నెరవేర్చేలా న్యాయస్థానాలయినా ప్రయత్నించి ఉండేవి. అటువంటి పని, న్యాయస్థానాలు కల్పించుకుని ప్రభుత్వాల కర్తవ్యాలను గుర్తు చేసే పని 1970లలో జరిగిందిగాని అప్పుడు కూడా ఎక్కువగా జరిగినది వాగాడంబరమే తప్ప నిజమైన న్యాయవ్యవస్థ నిర్మాణం కాదు.

అసలు మొత్తం సుప్రీంకోర్టు చరిత్రలోనే, దేశ పాలనా వ్యవస్థలో మార్పు తేవడం రాజ్యాంగ లక్ష్యమనే వాస్తవాన్ని గుర్తించిన న్యాయమూర్తి ఒకే ఒక్కరున్నారు. రాజ్యాంగం ప్రజలకు ఏమి చేస్తుందో, అందువల్ల అది రాజ్యాంగ,పాలనా వ్యవస్థలకు ఏమి చేయాలో, రాజ్యాంగంలోని ప్రవేశికలో చెప్పిన లక్ష్యాలను ఏ విధంగా అమలులోకి తేవాలో గుర్తించిన ఆ న్యాయమూర్తి జస్టిస్ వివియన్ బోస్. ఎస్ కృష్ణన్ వర్సస్ స్టేట్ ఆఫ్ మద్రాస్ అనే కేసులో ప్రివెంటివ్ డిటెన్షన్ గురించి ఆయన చెప్పిన మాటలు తప్పనిసరిగా గమనించవలసినవి.

"భారత ప్రజలు తమకు తాము స్వతంత్ర జీవన విధానాన్ని ఎంచుకున్నారు. తమ అభిప్రాయాలకు ప్రాతినిధ్యం వహించే పార్లమెంటుకు వారు ఆ జీవన విధానానికి హామీ పడే బాధ్యతను అప్పజెప్పారు. ప్రజలు తమకు తాము ఇచ్చుకున్న స్వేచ్ఛలపైన ఏవయినా పరిమితులు విధించవలసి వస్తే, పార్లమెంటు అతిజాగ్రత్తగా ఆ పరిమితులను నిర్ణయించాలని వారు భావించారు. రాజ్యాంగంలో పొందుపరచిన స్వేచ్ఛలు, హక్కులు ఊహాజనితమైనవని, అర్థరహితమైనవని రాజ్యాంగ నిర్మాతలు భావించి ఉంటారనుకోను. ఆ హక్కులను ఎవరో ఒక వ్యక్తి ఆటబొమ్మలాగ వాడుకుంటారని కూడా వాళ్లు ఊహించి ఉండరు. మన రాజ్యాంగ నిర్మాతలు భారత ప్రజలపైన ఒక నిర్దాక్షిణ్యమైన, నిర్జీవమైన, జడమైన, ఎటువడితే అటువంచగల ముద్దను రుద్దారని నేననుకోవడంలేదు. వారు ఒక సజీవ రాజ్యాంగాన్ని సృష్టించారు. దానిలో ప్రాణం నింపారు. దానికి ఒక లక్ష్యాన్ని, శక్తిని కల్పించారు. అది స్వతంత్ర పద్ధతిలో అంటే ప్రజాస్వామిక జీవన విధానంలో ఆరోగ్యవంతంగా, దృఢంగా ఎదగాలని వారు సంకల్పించారు.

యుద్ధమో, అత్యవసర పరిస్థితో వచ్చినప్పుడు తయారయ్యే శాసనాలలో ఆ హడావుడివల్ల భాష, వ్యక్తీకరణలు సక్రమంగా ఉండవని వచ్చే వాదనలు ఈ సందర్భంలో వర్తిస్తాయని నేను అంగీకరించదలచు కోలేదు. నేను ప్రస్తుతం మాట్లాడుతున్నది రాజ్యాంగం గురించి. అది చాలా గంభీరమైన, ఉద్దేశ్యపూర్వకమైన, జాగరూకమైన చర్చ ద్వారా ఆమోదం పొందింది. అందువల్ల ఎప్పుడైనా అస్పష్టతగాని సందేహంగాని ఉంటే, సర్వసత్తాక ప్రజాస్వామిక గణతంత్ర రాజ్యపు స్వతంత్ర జీవన విధానానికి అనుకూలమైన నిర్ణయం తీసుకోవాలని నేననుకుంటాను. అసలు విషయానికొస్తే ఈ రాజ్యాంగాన్ని రచించినవారెవరు? ఎవరి ప్రయోజనాల కోసం ఈ రాజ్యాంగం రూపకల్పన జరిగింది? ఏదో కొద్ది కాలం అధికారంలో ఉండే వారి కొరకు కాదు. న్యాయవాదుల కోసమో, తార్కికుల కోసమో కాదు. రాజ్యాంగం తయారయినది భారతదేశంలోని సాధారణ ప్రజల కొరకు. అందువల్ల ఆ అధికరణాల భాష గురించి శషభిషలకు పోకుండా దాన్ని చాలా మామూలుగా సూటిగా వ్యాఖ్యానించ వలసి ఉంటుంది. అంటే వీధుల్లో తిరుగాడే మనిషికి అర్థమయ్యేలా దాన్ని వ్యాఖ్యానించవలసి ఉంటుంది. ఆ రకంగా సాధారణ ప్రజానీకం రాజ్యాంగపు భావాన్ని అర్థం చేసుకోగలరు, దాన్ని పాటించగలరు" అని వివియన్ బోస్ అన్నారు.

నిజానికి మన న్యాయ వ్యవస్థ తన ఆలోచనలను రాజ్యాంగం దగ్గర ప్రారంభించాలని అనుకోవడంలేదు. స్వాతంత్ర్యం తర్వాత, రాజ్యాంగం ఉనికిలోకి వచ్చిన తర్వాత కూడా ఎ కె గోపాలన్ నిర్బంధంలోనే ఉండడం, ఆయన హెబియస్ కార్పస్ రిట్ దరఖాస్తుపై తీర్పు అన్నీ కూడా బ్రిటిష్ వలసవాద సంప్రదాయానికి కొనసాగింపే. ఆ మధ్యలో రాజ్యాంగం అమలులోకి వచ్చిందని, అందువల్ల అసలు న్యాయ వ్యవస్థ పని తీరులోనే తేడా రావలసి ఉంటుందని న్యాయమూర్తులు గుర్తించనే లేదనడానికి ఆయన కేసులో న్యాయమూర్తుల తీర్పులే నిదర్శనం.

ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టం, 1950 రాజ్యాంగంలోని 19, 21 అధికరణాలను భంగపరుస్తున్నదని, అందువల్ల దాన్ని రాజ్యాంగంలోని అధికరణం 13(2) కింద కొట్టివేయవచ్చునని, ఆ చట్ట నిబంధనలు అధికరణం 22 స్ఫూర్తికి వ్యతిరేకమని అనేక వాదనలు వచ్చాయి. అసలు

ఆ నిర్బంధ ఉత్తర్వుల అధికార దుర్వినియోగం గుర్తించాలని కూడా వాదనలు జరిగాయి.

అసలు ఈ ముందస్తు నిర్బంధం అనేది ఇంగ్లండులో మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో అమలులోకి వచ్చిందని, అది కేవలం యుద్ధ పరిస్థితులవల్ల వచ్చిన చట్టమని కనుక యుద్ధం తర్వాత అది చెల్లనేరదని జస్టిస్ మహాజన్ అభిప్రాయపడ్డారు. భారతదేశంలోనైతే ఈ ముందస్తు నిర్బంధానికి తగిన మూలాలు లేవని ఆయన అన్నాడు.కాని వాస్తవాలు మరొకరకంగా ఉన్నాయి. కారణాలు చూపకుండా మనిషిని నిర్బంధంలో ఉంచడమనే బ్రిటిష్ కాలపు పాలనా పద్ధతి పందొమ్మిదో శతాబ్దపు తొలి రోజుల నుంచీ అమలులో ఉంది. 1818లో అమలులోకి వచ్చిన బెంగాల్ రెగ్యులేషన్, బొంబాయి, మద్రాసు ప్రెసిడెన్సీలలో వచ్చిన అదే మాదిరి చట్టాలు ఏ వ్యక్తినైనా కారణం చూపకుండా, ముందస్తుగా నిర్బంధించే అధికారాన్ని ప్రభుత్వానికి ఇచ్చాయి. రౌలట్ చట్టంలో భాగమైన 1919 అరాచక, విప్లవ నేరాలచట్టం అనేది ఆ దిశలో మరొక అడుగు. ఇవన్నీ వ్యక్తిగత స్వేచ్ఛ మీద నిర్ణయాత్మకమైన దాడులు.

ఆ తర్వాత రౌలట్ కమిటీ నివేదిక ఆధారంగా మూడు బిల్లులను ప్రవేశపెట్టడం జరిగింది. అవి, ఒకటి పత్రికలను అదుపులో పెట్టడానికి ఉద్దేశించినది, రెండవది, రాజకీయ నేరస్తులను న్యాయపీఠం లేకుండానే విచారించడానికి వీలు కల్పించేది, మూడవది తిరుగుబాటు లక్ష్యాలు కలిగి ఉన్నారనే అనుమానం ఉన్న వారికి దేశాంతరవాస, బహిష్కార శిక్షలు విధించడానికి వీలు కల్పించేది. చివరికి 1935 భారత ప్రభుత్వ చట్టం వచ్చే నాటికి, ప్రివెంటివ్ డిటెన్షన్ అనేది శాంతి సమయంలో కూడా ఉపయోగపడే ఆధునిక శాసనం అయిపోయింది. న్యాయశాస్త్ర ప్రపంచంలో, ముందస్తు శిక్షకూ, విచారణ తరువాత శిక్షకూ మధ్య తేడా చెరిగిపోయేంతగా మెరుగుపెట్టడం జరిగింది. ఆ రెండు పదాల ఏకైక లక్ష్యం ఒక సమాజాభివృద్ధికీ, ప్రజల అభివృద్ధికీ అత్యవసరమైన స్వేచ్ఛ మీద ఆంక్షలు విధించడమే అయిపోయింది.

1784 ఈస్టిండియా కంపెనీ చట్టం నాటి నుంచి కూడా బ్రిటిష్ పాలకులు నేరశిక్షాస్మృతి, చట్టం అనే వాటిని భారత ప్రజానీకాన్ని అదుపులో ఉంచే, అణచి ఉంచే సాధనాలుగానే భావించారు. భారత ప్రజానీకంలో బ్రిటిష్ పాలనపై అసంతృప్తి, ప్రతిఘటన పెరిగినకొద్దీ కొత్త కొత్త చట్టాలు రావడం మొదలైంది.

మన రాజ్యాంగ రూపకల్పనకు కూచున్నప్పుడు మన రాజ్యాంగం లోని మాటలను మనం పోరాటాలు నిర్వహించే బదులు, మనం కూడా పాత బ్రిటిష్ వలసవాద నిర్బంధపూరిత పాలనా, న్యాయ వ్యవస్థలను ఔదల దాల్చడానికే ఉత్సాహం చూపించాం. ఒక కార్యనిర్వాహక వర్గానికి దాని పుట్టుక ఇంగ్లీషుదా, భారతీయమైనదా అనే దానితో నిమిత్తంలేదు. దాని స్వభావం ఆ కారణంవల్ల మారిపోదు. దాని పని తీరును నిర్ణయించే మార్గదర్శక సూత్రాలే దాని స్వభావాన్ని నిర్ణయిస్తాయి. ప్రజలు నడిపిన పోరాటాల ఆదర్శాలన్నిటినీ ఆ మార్గదర్శక సూత్రాలలోకి రచించవలసి ఉంటుంది.

ప్రాథమిక హక్కులు, ప్రివెంటివ్ డిటెన్షన్ అనే అంశాల మీద మన రాజ్యాంగ నిర్ణయసభ చర్చలను ఒక్కసారి పరిశీలిస్తే, భారతదేశంలోని వేర్వేరు ప్రాంతాలలో జరిగిన ఘటనల వల్ల, అత్యవసర పరిస్థితులలో, రాజ్యభద్రత ప్రమాదంలో పడిన సందర్భాలలో ప్రజల హక్కులపై తీవ్రమైన ఆంక్షలు విధించాలని అనిపిస్తున్నదని ఆ సభలో నామినేటెడ్ సభ్యుడైన అల్లాడి కృష్ణస్వామి అయ్యర్ అన్నాడు. వర్గద్వేషాన్ని రెచ్చగొట్టేట్టయితే భావ ప్రకటనా స్వేచ్ఛపై కూడా పరిమితులు విధించాలని ఆయన అన్నాడు.

రాజ్యాంగ ముసాయిదాలో ప్రాథమిక హక్కుల అధ్యాయం చర్చించేటప్పుడు రాజ్యాంగ నిర్ణయసభ సభ్యులు అమెరికన్ రాజ్యాంగం నుంచి "చట్ట విహిత క్రమం" అనే మాట సాయం తీసుకున్నారు. ఒక వ్యక్తి జీవితానికిగాని, స్వేచ్ఛకు గాని భంగం కలిగించేటప్పుడు చట్ట విహిత క్రమంలో తప్ప మరొక రకంగా ఆ పని జరగకూడదని వారు అన్నారు. స్వాతంత్ర్యోద్యమ క్రమంలో బ్రిటిష్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అనేక నిర్బంధ చట్టాల గురించి అవగాహన ఉన్న సభ్యులు ఆ సభలో చాలా మంది ఉన్నారు. గనుక వారి వ్యక్తిగత స్వేచ్ఛ మళ్లీ అటువంటి దాడులకు బలికావద్దని కోరుకున్నారు. సభలో అత్యధిక సభ్యులు ఈ "చట్ట విహిత క్రమం" అనే నిబంధనను చేర్చాలని పట్టుబట్టారు. కె ఎం మున్షీ కూడా ఈ నిబంధన ఉండాలని వాదించారు.

అల్లాడి కృష్ణస్వామి అయ్యర్ ఒక్కరు మాత్రం "చట్టం నిర్దేశించిన పద్ధతి" అనే వ్యక్తీకరణ ఉండాలని వాదించారు. "చట్ట విహితక్రమం" అనేమాటను స్వార్థపరశక్తులు తమకు అనువుగా వ్యాఖ్యానించవచ్చునని, తమ ప్రయోజనాలు కాపాడుకోవడానికి వాడుకోవచ్చునని ఆయన తన అనుమానాన్ని వ్యక్తం చేశారు. మొత్తానికి జరిగింది అదేననేది వేరే విషయం. అమెరికాలో ఆ మాట న్యాయవాదులు ఎన్నెన్ని వైపుల వక్రీకరించి ఉపయోగించారో, అది ఎన్ని రకాల వ్యాఖ్యానాలకు దారి తీసిందో వివరించడానికి ఆయన చాలా ప్రయత్నించారు. "భారత సుప్రీంకోర్టు న్యాయమూర్తులు అమెరికన్ న్యాయవ్యవస్థలో జరిగినట్టు కాకుండా, మరీ ముఖ్యంగా తొలిదశలో, భారత పరిస్థితులకు తగినట్టుగా, దేశపు ప్రగతికీ, సౌభాగ్యానికీ తగినట్టుగా వ్యాఖ్యానించగలిగితే ఈ మాట తగినంత సంతృప్తికరంగానే ఉంటుంది" అని ఆయన భావించారు.

అంటే స్వతంత్ర భారత న్యాయవ్యవస్థ అనేది ఒకటి ఆవిర్భవించాలని, ఆవిర్భవించబోతున్నదని ఆయన కోరుకున్నారన్నమాట. ఈ సమస్యను చర్చించేటప్పుడు రాజ్యాంగ నిర్ణయసభ భారతదేశపు భవిష్యత్ ప్రగతిని దృష్టిలో పెట్టుకోవాలని ఆయన అన్నారు. "ఒక నిర్ణయానికి వచ్చే ముందు రాజ్యపు సౌభాగ్యాన్నీ, సుస్థిరతనూ, కనీస స్వేచ్ఛను కాపాడవలసిన అవసరాన్ని, సామాజిక నియంత్రణనూ, వ్యక్తిగత స్వేచ్ఛనూ సమన్వయం చేయవలసిన అవసరాన్ని" దృష్టిలో పెట్టుకోవాలని ఆయన అన్నారు. చట్టవిహితక్రమం అంటే ఏమిటో ముగ్గురో ఐదుగురో నిర్ణయించడం కన్నా, ప్రజా ప్రతినిధులు లేదా అటువంటి ప్రజా ప్రతినిధులకు బాధ్యత వహించే కార్యనిర్వాహక వర్గం అభిప్రాయాల ద్వారా నిర్ణయించడం ఎక్కువ ప్రజాస్వామికమని ఆయన అన్నారు.

అయితే ఈ వ్యవస్థలు, యంత్రాంగాలు ఎట్లా పని చేస్తాయోనన్న విషయమ్మై ఇదంతా ఎక్కువగా సైద్ధాంతిక అభిప్రాయమే తప్ప ఆచరణాత్మకమైన వ్యక్తీకరణ కాదు. సరిగ్గా ఈ చర్చ సాగుతున్నప్పుడే, యూరప్‌లో నాజీ, ఫాసిస్టు శక్తులు పెద్ద ఎత్తున మూకుమ్మడిగా, ప్రజాస్వామిక వ్యవస్థల పని తీరును ఎంతగా వక్రీకరించగలవో మనం ప్రత్యక్షంగా చూశాం. అందువల్లనే, "చల్లవిహిత క్రమం" అనాలా అని వాదనలు జరుగుతున్నప్పుడు ఆ చర్చ జరుపుతున్న వారందరి మనసుల లోనూ ఒక ఆందోళన ఉండింది. యూరప్‌లో అప్పుడప్పుడే జరిగిన సంఘటనలు వారి మనసులలో తాజాగా ఉన్నాయి. మన జాతీయ విముక్తి కొరకు జరిగిన పోరాటాన్ని అణచి వేయడానికి బ్రిటిష్ పాలకులు అమలు చేసిన దమన నీతి కూడా వారికి ఇంకా గుర్తుంది.

నిజానికి రాజ్యాంగ నిర్ణయ సభలో ఒక హక్కుల పత్రం వెలువరించాలనే ఆకాంక్ష చాలా బలంగా ముందుకు వచ్చింది. హెబియస్ కార్పస్ రిట్ ద్వారా న్యాయస్థానాన్ని ఆశ్రయించే హక్కు పౌరులకు

కల్పించాలని, అటువంటి హక్కును అటు కార్యనిర్వాహక వర్గానికి గాని, ఇటు శాసనాధికార వ్యవస్థకుగాని ఇవ్వగూడదని కూడా అభిప్రాయాలు వచ్చాయి.

అధికారంలో ఉన్న రాజకీయ పార్టీ చట్టసభలను పూర్తిగా తన మనుషులతో, తన సమర్థకులతో నింపవచ్చుగదా, తన ఇష్టం వచ్చిన చట్టాలు చేయవచ్చుగదా అనే ప్రశ్న కూడా ఆ చర్చల క్రమంలో వచ్చింది. అటువంటి అవకాశం ఉండవచ్చునని అంబేద్కర్ కూడా అంగీకరించారు. న్యాయమూర్తులు ముందే ఏర్పరచుకున్న దురభిప్రాయాలు, దురభిమానాలు లేకుండా ప్రవర్తిస్తారని తను అనుకోవడంలేదని కూడా అంబేద్కర్ అన్నారు. "ఇది ముందు నుయ్యి, వెనక గొయ్యి లాంటి పరిస్థితి అందువల్ల నేనేమీ చెప్పను" అని ఆయన అన్నారు.

రాజ్యాంగ నిర్ణయ సభలో చాలా మంది అధికరణం 15 ముసాయిదా (ప్రస్తుత రాజ్యాంగంలోని అధికరణం 21) పార్లమెంటుకు నిరంకుశంగా మనిషిని నిర్బంధంలోకి తీసుకునే అధికారం ఇస్తున్నదని, అందువల్ల ఆ పద్ధతి ఏమిటో నిర్దేశించే మరొక శాసనం కావాలని కోరుకున్నారు. అందువల్లనే ఆ ముసాయిదా అధికరణం 15కు ఎ అనే అదనపు నిబంధన (ప్రస్తుత రాజ్యాంగంలోని అధికరణం 22) చేర్చవలసి వచ్చింది.

ఒక రాజ్యాంగ పత్రంలో ముందస్తు నిర్బంధం గురించిన నిబంధనను ప్రవేశపెట్టడం గురించి అప్పుడే చాలా విమర్శలు వచ్చాయి. బక్షీ టేక్ చంద్ ఈ అధికరణాన్ని అత్యంత అభివృద్ధి నిరోధకమైనదిగా అభివర్ణించారు. నిర్ణీత సాధారణ వ్యవధిలోపల విచారణ జరపకుండా వ్యక్తులను నిర్బంధంలో ఉంచే నిబంధనలను తనలో ఇముడ్చుకున్న లిఖిత రాజ్యాంగం ప్రపంచం మొత్తంలో ఇది ఒక్కటేననీ అందువల్ల ఇది ప్రతీఘాతుకమైనదని ఆయన విమర్శించారు. ఈ నిబంధనను ఆమోదించడమంటే ప్రాథమిక హక్కుల మీద ఉన్న అధ్యాయాన్ని ఒక శిక్షాస్మృతిగా మార్చినట్టే అవుతుందని, అటువంటప్పుడు అది పాత బ్రిటిష్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన డిఫెన్స్ ఆఫ్ ఇండియా రూల్స్ కన్నా ఘోరమైన పని అవుతుందని మహావీర్ త్యాగి అన్నారు. రాజ్యాంగ నిర్ణయసభ సమావేశమైనది ప్రజలకు హక్కులను హామీ ఇవ్వడానికే తప్ప, ప్రజల నుంచి వారి హక్కులను లాగి వేయడానికి కాదని ఆయన అన్నారు.

ఈ రెండు నిబంధనలు వ్యక్తిగత స్వేచ్ఛ మీద గుదిబండలుగా మారిపోయాయి. రాజ్యాంగం అమలులోకి వచ్చిన ఈ యాభై ఏడు సంవత్సరాలుగా మోసుకుంటూ, లాక్కుంటూ రావలసి వస్తోంది. అంబేద్కర్ అనుమానించినట్టుగానే చట్టసభలలో అధికారపార్టీ సమర్థకులు నిండిపోయి శాంతి సమయంలో కూడా ఒక ముందస్తు నిర్బంధ (ప్రివెంటివ్ డిటెన్షన్) చట్టాన్ని ఆమోదింపజేశారు. ఆ చట్టాన్ని వ్యాఖ్యానించే సమయంలో న్యాయస్థానం కూడా రాజ్యాంగ నిర్మాణానికి ఉన్న చరిత్రను విస్మరించింది. రాజ్యాంగాన్ని కేవలం ఒక రాజకీయ పత్రంగా పరిగణించింది. రాజ్యాంగంలోని పదాల అర్థాన్ని వివరించడం మొదలు పెట్టింది.

అందువల్లనే స్వతంత్ర భారతంలో మొదటి ప్రధాన కేసు అయిన, 1950లో వచ్చిన ఎ.కె. గోపాలన్ కేసులో వ్యక్తిగత స్వేచ్ఛ సారాంశం గురించి, వ్యక్తిగత స్వేచ్ఛ అనే వ్యక్తీకరణకు ఏ అర్థం చెప్పాలనే దాని గురించి చర్చ జరగలేదు. మొత్తంగా వ్యక్తిగత స్వేచ్ఛను దాని మీద విధించే ఆంక్షల, పరిమితుల దృష్టి నుంచే నిర్వచించే ప్రయత్నం జరిగింది.

ఎ.కె. గోపాలన్ కేసులో 1950 ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టం రాజ్యాంగబద్ధత గురించి పరిశీలన జరిగినప్పుడు చర్చ జరిగినదీ, బహుశా అప్పటికి పరిష్కృతమైనదీ ఏమంటే ఒక మనిషికి ఉండే ప్రయాణ స్వేచ్ఛ, ఇష్టం వచ్చిన చోటికి వెళ్లగలిగే స్వేచ్ఛ మీద పరిమితులు విధించవచ్చునా లేదా అనేది మాత్రమే. కాని నిజంగా చర్చించి ఉండవలసినది ఏమంటే, స్వాతంత్ర్యోద్యమానికి వ్యక్తిగత స్వేచ్ఛకూ మధ్య ఉన్న సంబంధం ఏమిటనేది.

స్వాతంత్ర్య సాధన రాజ్యాంగం గురించిన మన దూరదృష్టినీ, అవగాహననూ మసకబార్చింది. అప్పుడప్పుడే పుట్టిన భారత రాజ్యం ఒక వికలాంగ శిశువుగా జన్మించింది. రాజ్యాంగంలోని ప్రవేశికలో స్పష్టమైన వ్యక్తీకరణ పొంది రాజకీయ స్వాతంత్ర్యం ద్వారా మనం సాధించలేకపోయినవేవో మన రాజ్యాంగ ఆదర్శాలుగా రాసుకున్నాం.

అవి సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం, మానవ గౌరవం, సౌభ్రాతృత్వం. అస్పృశ్యతను, బాల కార్మిక వ్యవస్థను, వెట్టిచాకిరిని రద్దు చేసిన, శిక్షార్హమైన నేరంగా పరిగణించిన ప్రాథమిక హక్కుల అధ్యాయం. మన రాజ్యాంగం అధికరణం 15 కింద బహిరంగ బావులలో, చెరువులలో, భోజనశాలలో, బహిరంగ ప్రదేశాలలో వెలి, అటువంటి అసమానతలను పాటించడాన్ని నిషేధించింది. అత్యల్ప సంఖ్యాక వర్గాలకు తమ జీవితంలోని అన్ని అంశాలలో అవసరమైన హక్కులు కల్పించింది. ఒక సమసమాజాన్ని నెలకొల్పే బాధ్యతను ప్రభుత్వం మీద పెట్టి ఒక మౌలిక లక్ష్యాన్ని కల్పించింది.

ఇదంతా రాజకీయ సమాజానికీ, పౌర సమాజానికీ మధ్య ఉన్న అఖాతాన్ని పూడ్చివేసే ఒక బృహత్తర ప్రయత్నం. రాజకీయ సమాజమైన రాజ్యానికీ పౌర సమాజానికీ ఈ ఐక్యతను సాధించే ప్రయత్నాన్ని రాజ్యాంగం నిర్దేశించాలనీ, ఆ రాజ్యాంగ కర్తవ్యాలను రాజ్యం పాటించాలనీ నిర్ణయించడం జరిగింది. రాజ్యాంగం మొత్తంలో రాజ్యాన్ని ఎక్కడా దాని హక్కులు, అధికారాల ద్వారా నిర్వచించడం జరగలేదు. కేవలం దాని పరిమితుల ద్వారా నిర్వచించడం జరిగింది. ఈ పరిమితుల లోపల పని చేయవలసిన రాజ్యంలో చట్టసభలు కూడా భాగమే.

ఒక రాజకీయ సమాజంలో నివసించే మనిషి తనను తాను సామూహిక మానవునిగా భావించుకుంటాడు. కాని సొంత వ్యక్తిత్వంతో ఒంటరి మనిషిగా క్రియాశీలంగా జీవించే పౌర సమాజంలో మనిషి ఇతర మనుషులందరినీ అమానవీయ సాధనాలుగా భావిస్తాడు. తనను తాను కూడా ఒక సాధనంగా భావించుకుంటాడు. అతీత శక్తులచేతిలో ఆటబొమ్మగా మారిపోతాడు అని మార్క్స్ 'ఆన్ ది జ్యూయిష్ క్వశ్చన్' అనే వ్యాసంలో రాశాడు.

ఈ రకమైన అమానవీయతను మార్చడానికే మన ఆదేశిక సూత్రాలు, ప్రాథమిక హక్కులు ఉద్దేశించబడ్డాయి. రాజ్యాంగంలో ఈ నిబంధనలు ఉన్నాయంటే అర్థమేమంటే, ప్రజలు తమ ఏ అధికారాలను రాజ్యాంగం సృష్టించిన వ్యవస్థలకు అప్పగించారో అధికారాలన్నిటినీ వెనక్కి తీసుకునే అధికారం కూడా వారికి ఉంది అని.

రాజ్యాంగంలో అంత స్పష్టంగా ప్రకటితమైన మహత్తర కర్తవ్యంపట్ల న్యాయస్థానాలు అవగాహనను కలిగి ఉండవలసింది. దానికి బదులుగా న్యాయస్థానాలు రాజ్యాంగాన్ని ప్రజలకు వ్యతిరేకంగా నిలబడిన అధికారానికి అనువుగా వ్యాఖ్యానించడం అనే వలసవాద సంప్రదాయానికి కట్టుబడి పోయాయి. అదీ అసలు సమస్య. వీ

రాజ్యాంగం రాసుకున్న నాటికీ, ఇప్పటికీ ప్రజల సమస్యలు పెరిగిపోయాయనీ, అవనీతి, అధికార కేంద్రీకరణలు పెరిగి వనరులను మరింతగా దోచుకుపోయే విధానాలు రూపొందాయనీ అంటున్నారు **మాడభూషి శ్రీధర్**

సమాఖ్యకు సమాధి కట్టిన రాజకీయం

మన రాజ్యాంగం లేదా సంవిధానం అగ్నిపరీక్షకు గురవుతున్నది. నాయకుల అవినీతికి అక్రమార్జనకు, పదవీ లాలసత్వానికి ప్రజల ఆకాంక్షలు బలవుతున్నాయి. కేంద్రంలో అధికారం కేంద్రీకృతమైంది. అధిష్టాన దేవతల అనుగ్రహం సంపాదిస్తే చాలు రాష్ట్రంలో రాజ్యం ఏలే ఈ దేశంలో మన రాజ్యాంగం సమాఖ్యా లేక యూనియనా లేక కాన్ఫెడరేషనా అనే సిద్ధాంత చర్చకు అర్థం ఉండదు.

ఇప్పటికీ సమస్య భూమి చుట్టూ తిరుగుతూనే ఉంది. భూ సంస్కరణల చట్టాలను కోర్టుల్లో సవాలు చేయడం కోర్టు రాజ్యాంగ నియమాల ఆధారంగా కొట్టివేయడం, పార్లమెంటుకు సుప్రీంకోర్టుకు మధ్య ఒక సంఘర్షణ వంటి వాతావరణం ఏర్పడడంతో కొన్ని దశాబ్దాలు గడిచిపోయాయి. చివరకు ఇటువంటి సంస్కరణ చట్టాలను 9 వ షెడ్యూలులో చేర్చితే సవాలు చేయడానికి వీల్లేదని మరో సవరణ. అసలు ప్రాథమిక హక్కులను సవరించే అధికారం లేదని తీర్పుల వరస. కనీసం ఈ మాత్రం కూడా సవరించే అధికారం లేకపోతే ఇక పార్లమెంటు ఉనికికి అర్థం ఏమిటనేది మరో సవాలు. 1973 లో కేశవానంద భారతి కేసులో సుప్రీంకోర్టు తీర్పుతో ఈ వివాదం కొంత ముగిసింది. మౌలికమైన స్వరూపాన్ని మార్చకుండా ఇతర సవరణలు ఏవైనా చేసుకోవచ్చునని, సవరణ అనే పేరుతో పూర్తిగా రాజ్యాంగ స్వరూపాన్నే మార్చే అధికారం ఉండదని ఒక మౌలిక స్వరూప సిద్ధాంతాన్ని ప్రతిపాదించింది. ఏది మౌలికమో తేల్చే అధికారం సుప్రీంకోర్టు దగ్గరే మిగిలింది. పైచేయి న్యాయస్థానానికే దక్కింది. ఆ తరువాత న్యాయ సమీక్షాధికారం రాజ్యాంగ మౌలిక స్వరూపం అని స్పష్టం చేసి దాని జోలికి రాకుండ చేసుకుంది న్యాయస్థానం. అది ఆ తరువాత పరిణామం. కాని అంతకు ముందు అంటే 1973 తర్వాత ఎమర్జన్సీ విధించి నిరంకుశాధికారాల్ని చేజిక్కించుకుని ప్రజాస్వామ్యంలో చీకటి శకానికి తెరతీసిన ఇందిరాగాంధీ పదవీ కాలం న్యాయస్థానం ఔన్నత్యానికి దెబ్బకొట్టింది. ముగ్గురు సీనియర్లను కాదని ఆ తరువాత వ్యక్తికి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పదవిని కట్టబెట్టి, స్వతంత్ర న్యాయస్థానాన్ని భయభ్రాంతులకు గురి చేసింది. అయితే అప్పటికే మౌలిక స్వరూప సిద్ధాంతం స్థిరపడింది.

ఎమర్జన్సీలో నాలుగోస్తంభం అయిన పత్రికా ప్రపంచాన్ని కూడా ఆంక్షలతో గడగడలాడించింది. రాష్ట్రపతి మారుమాట్లాడే పరిస్థితిలో లేరు. ఎవరూ ఎదిరించలేరనుకున్న ఇందిరాగాంధీని 1977లో ప్రజానీకం ఓటు ద్వారా ఓడించింది. నిజంగా ఈ దేశంలో ప్రజాస్వామ్యం బతికే ఉందని నిరూపించింది కేవలం జనమే. కాని ఆనాటి జనతా పార్టీ అతకని పార్టీల అతుకుల బొంత కావడం, నేతల్లో స్వార్థాన్ని రెచ్చగొట్టి ఇందిరాగాంధీ ఎత్తుగడలకు అర్ధాంతరంగా సర్కారు పడిపోవడం, 1980లో ఎన్నికలురావడం మళ్లీ ఆమెకే జనం పట్టం గట్టడం ఒక మార్పు.

1984లో దారుణంగా హత్యకు గురికావడానికి ముందు అనుసరించిన విధానాలు ఈ దేశంలో అధికార వికేంద్రీకరణకు జనం స్వపరిపాలన విధానానికి, స్వయం నిర్ణయాధికారానికి విఘాతంగా పరిణమించాయి. ఆమె మరణం సృష్టించిన సానుభూతి పెనుతుపానువల్ల రాజీవ్ గాంధీకి 400 స్థానాలకు పైగా లభించాయి. మిస్టర్ క్లీన్ బిరుదుతో ప్రారంభమైన రాజీవ్ పాలన బోఫోర్సు కుంభకోణం తో భ్రష్టు పట్టిపోవడం ఈ దేశంలో సంకీర్ణశకానికి తెరతీసింది. పశ్చిమ బెంగాల్, కేరళ, జమ్మూ కాశ్మీర్, తరువాత తమిళ నాడు, 1983 తర్వాత ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో, మరికొన్నాళ్లకు ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రాశస్త్యం కోల్పోవడం జరిగింది. కేంద్రంలో రాష్ట్రంలో ఒకే పార్టీ అధికారంలో ఉండే రోజులు గతించి పోయాయి. ఢిల్లీసుల్తానులకు తాబేదార్లుగా సుబేదార్లుగా రాష్ట్రపాలకులు బతుకులీడ్చే సంస్కృతి కొంతతగ్గింది. ప్రాంతీయపార్టీలు ఆత్మగౌరవ నినాదంతో సొంత గొంతుక వినిపించాయి. ఢిల్లీ సీల్డు కవర్ రాజకీయాలతో ముఖ్యమంత్రుల నియామకం జరిగే దురాచారం తగ్గి, కొంచెం ఫెడరల్ లక్షణాలు పొడచూపడం మొదలైంది.

సమాఖ్య రాజ్యాంగ స్ఫూర్తి అంటే కేంద్రం, రాష్ట్రం, స్థానిక సంస్థలు అని మూడంచెలలో కూడా ప్రజలు స్వయంగా నిర్ణయాలు తీసుకుని స్వతంత్రంగా స్వయంగా పాలన సాగించడమని అర్థం. ఎక్కడికక్కడ పాలన జరిగిపోతే అక్కడి ప్రజలకే ప్రాధాన్యత ఇస్తూ ఒకరికొకరు దాస్యంచేసుకోనవసరం లేకుండా తలెత్తుకు తిరిగే అవకాశం ఉండాలి. వనరుల సమ పంపిణీకి ఇది ప్రాతిపదిక కావాలి. జాతీయ స్థాయిలో జాతీయ సమస్యలపైన నిర్ణయాలు తీసుకోవాలి. రాష్ట్ర నిర్ణయాలు, రాష్ట్రస్థాయి పాలనలో వారి అవసరాలు వారే తీర్చుకోవాలి. అభివృద్ధికి వారే కృషిచేయాలి. ఇక తాలూకాస్థాయి అవసరాలను తీర్చడంలో జిల్లా స్థాయి పాలనలో జిల్లాపరిషత్‌లు గ్రామపంచాయితీలు, నగరపాలక సంస్థలు పేదల అవసరాలు తీర్చాలి. తాగునీరు, సాగునీరు, పౌర

సరఫరాలు చూసుకోవాలి. కాని జరుగుతున్నదేమిటి? పంచాయితీలకు ఎన్నికలు జరపరు. జరిపితే పాలక సంస్థలను రద్దు చేస్తారు. ప్రత్యేకాధికారాల ద్వారా మంత్రులు పాలిస్తారు. ఆ మంత్రులను ముఖ్యమంత్రి శాసిస్తాడు. ముఖ్యమంత్రులను ఢిల్లీలో ఉన్న ప్రధానమంత్రి లేదా సోనియాగాంధీ వంటి అధిష్టాన దేవత, లేదా రాహుల్ వంటి రాబోయే రాకుమారుడు శాసిస్తాడు. ముఖ్యమంత్రుల కొడుకులు, మంత్రుల కూతుళ్లు ప్రజారాజ్య సింహాసనానికి వారసులౌతారు. కేంద్రం రాష్ట్రాలపై రాజకీయ పెత్తనంతో పాటు ప్రణాళికా నిధుల కేటాయింపులలో కేంద్రానిదే అధికారం. సి.బి.ఐ. విచారణలు, కేంద్ర రిజర్వ్ పోలీసు దళాలు, అర్ధసైనిక దళాలు, రాష్ట్రంలో శాసనసభను రద్దు చేసి రాష్ట్రపతి పాలన విధించే అధికారం వంటి అసాధారణ అధికారాలను విచక్షణా రహితంగా వినియోగిస్తూ రాష్ట్రాలను సామంత రాజ్యాలుగా కేంద్రం మార్చుతూ ఉంటే, రాష్ట్ర ప్రభువులు స్థానిక సంస్థలకు నిధులు ఇవ్వకుండా, విధులు చేయనీయకుండా, అధికారాలు దఖలు పరచకుండా తొక్కిపెడుతున్నాయి. ఈ విధంగా వికేంద్రీకరణ ఒక భ్రమగా మిగిలింది. కేంద్రీకరణ మామూలైపోయింది. సమాఖ్య జబ్బు పడింది.

అయినా సరే నాయకత్వ లక్షణాలు, రాజకీయ పార్టీల విశ్వసనీయత నానాటికీ క్షీణిస్తూ పార్టీలు చీలిపోతూ, చిన్న చిన్నకొత్త పార్టీలు, ప్రాంతీయ పార్టీలు, ఉపప్రాంతీయ పార్టీలు అవతరించడం ఆరంభమైంది. కొన్ని వేల పార్టీలున్న దేశం మనది. ఒక శాసనసభ స్థానం మాత్రమే గెలుచుకున్న పార్టీలు, ఒక్క పార్లమెంటు స్థానానికే పరిమితమైన పార్టీలు ఎక్కువైపోయినాయి. నలుగురైదుగురు ఎంపీలున్న పార్టీ అధికార పార్టీని అవసరమైన దశలో గడగడలాడించే స్థాయి, బలం సంపాదించుకున్నాయి. జె.ఎం.ఎం. పార్టీ ఈ రోజు జార్ఖండ్‌లో ఉన్న తక్కువ బలంతోనే అటు కాంగ్రెస్‌ను ఇటు బిజెపిని ముప్పుతిప్పలు పెట్టగలుగుతోంది. తమిళనాడులో డి.ఎం.కె. గానీ అన్నా డి.ఎం.కె.గానీ 30 ఎంపీలను చేతిలో పెట్టుకుని కేంద్రంలో ఏ సంకీర్ణం ఉన్నాసరే కీలకమైన శాఖలను డిమాండ్ చేయగలుగుతున్నది. మెజారిటీ అండ చూసుకుని ఎవరిమాటా వినని నిరంకుశులు పుట్టే అవకాశాలు తగ్గిపోయాయి. కాని కొన్ని పార్టీలను గుప్పిట్లో పెంచుకుని అధికారం చెలాయించే పరిస్థితులు ఇంకా ఉన్నాయి. సంకీర్ణయుగం రావడం వల్ల ఫెడరల్ సంస్కృతి మళ్లీ తలెత్తుకున్నా నిజమైన అధికార వికేంద్రీకరణ ఇంకా రాలేదు. అది వచ్చేదాకా మన రాజ్యాంగం ఇంకా ఢిల్లీ పెత్తందార్ల గుప్పిట్లో ఉన్నట్టే.

మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన దశలో జరిగిన దారుణమైన విభజన జన మారణహోమం, రాజ్యాంగ నిర్మాతల్లో సమైక్యతకు సమగ్రతకు ప్రాధమ్యం ఇవ్వాలన్న ఆలోచనను నిలిపింది. అది సరైనదే కూడా. కాశ్మీర్ మొదటినుంచి రగులుతూనే ఉంది. సిక్కులు వేరు పడాలంటున్నారు. తెలంగాణ అప్పుడు జమీందార్ల మీద సాయుధ పోరాటం సాగిస్తూ విప్లవపథంలో ఉంది. ఈశాన్య రాష్ట్రాలతో కేంద్రానికి సఖ్యత లేదు. ఒక్క సిక్కు సమస్య తప్ప మిగిలిన సమస్యలలో ఇప్పటికీ ఏ మార్పూలేదు. అన్ని అధికారాలు కలిగిన నెహ్రూ నుంచి మొదలై, మిగిలిన అందరి అధికారాలూ లాక్కున్న ఇందిరాగాంధీ పాలనతో సాగి, చివరకు ఏ అధికారాలులేని రబ్బరు స్టాంపు వలె మిగిలిపోయిన రెండో టర్మ్ ప్రధాని మన్మోహన్ సింగ్ దాకా ఈ సంక్షోభాలను పట్టించుకున్న వారు లేరు. కాశ్మీర్ రావణ కాష్టం, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం రగిలే దశ రావడానికి కుటిల కుయుక్తులు, దోపిడీ రాజకీయాలు, స్వార్థ పూరితమైన కాంగ్రెస్ ఎత్తుగడలు ఇప్పటికీ కారణాలే. స్వయంగా సమస్యలు పెంచుకునే రాజకీయాలే కాని ప్రజాభిమతం పట్టని రాజ్యాంగ పాలన లేని కారణంగా సమగ్రతకు ముప్పు వచ్చింది. నెహ్రూ పాలనలో మత వాదానికి, మతాతీత పాలనా సిద్ధాంతానికి మధ్య ఘర్షణ పడేవారు. ఇప్పుడు హిందూ మతతత్వానికి, ముస్లిం మతతత్వానికి మధ్య ఘర్షణలకు రాజకీయాలు ఇంధనం సమకూర్చుతున్నాయి. సెక్యులరిజం పుస్తకాలకు పరిమితమైంది. ఏం చేసైనా సరే అధికారం నిలుపుకోవడమే లక్ష్యం అందుకు వ్యవస్థ నాశనమైతే ఫరవాలేదనే ధోరణి. కనుక రాజ్యాంగం రాసుకున్న రోజున్న సమస్యలకు ఇప్పటి సమస్యలకు పరిమాణం పెరగడం సంఖ్య పెరగడం తప్ప పెద్ద తేడా ఏదీ లేదు. కుటుంబం, తమ తెగ, ఆ తెగ ఉన్న కులం, మతం, ప్రాంతం ఇవి మన ప్రాధాన్య క్రమం. రాజకీయ నాయకులైనా సివిల్ సర్వీసు ఉద్యోగులైనా లేక మామూలు వ్యక్తులైనా సరే ఇదే సంగతి. మనిషి గురించి సమాజం గురించి దేశం గురించి మాట్లాడే వాడే లేడు. ఇప్పటికీ ఎప్పటికీ ఇవే అడ్డంకులు. వీటిని జయించడానికి ఎవరూ ప్రయత్నించకపోగా వీటిని వాడుకుని అధికారంలో కొనసాగడానికి ప్రయత్నిస్తున్నారు.

రాష్ట్రాలకు స్వయం ప్రతిపత్తి ఇవ్వడానికి కేంద్రం వెనుకాడుతోంది. స్థానిక సంస్థలకు కావలసిన అధికారాలు ఇవ్వడానికి రాష్ట్రం ఇష్టపడడం లేదు. భూముల సంస్కరణ ద్వారా భూమిలేని వ్యవసాయ కూలీలకు సాయం చేయాలన్న కనీస సంక్షేమవిధానం మూడంచెల సమాఖ్యలో ఎవరూ పాటించడంలేదు. సెజ్ అని ప్రత్యేక మండలాలను సృష్టించి భూములను అమ్ముకునే అవినీతి ఒక విధానంగా అమలు చేస్తున్నారు. భూసంస్కరణలకు భిన్నమైన పూర్తి వ్యతిరేకమైన విధానాలను అనుసరించి, జాతి వనరులను కొందరి గుప్పిట్లో కేంద్రీకృతం కాకుండా కాపాడాలన్న రాజ్యాంగ మార్గదర్శక సూత్రానికి వ్యతిరేకంగా లక్షల ఎకరాల భూముల్ని పరిశ్రమలకోసం, విదేశీ సంస్థల కోసం వ్యవసాయదారుల నుంచి సేకరించే ప్రజావ్యతిరేక విధానాలతో ప్రభుత్వాలు రాజ్యాంగాన్ని పూర్తిగా వదిలేసాయి.

అరణ్యాలను కాపాడడం, గనులను కాపాడడం, ఖనిజ సంపదను దేశ ప్రగతికి వినియోగించడం మన రాజ్యాంగ లక్ష్యాలు. కాని అడవులలో గిరిజనులను వెళ్లగొట్టి, అడవులను కొల్లగొట్టి వాటి కింద గనులను ఎవరికో కట్టబెట్టడం ఈనాటి రాజకీయ పథకాలు. చైనాలో కొండలు, గ్రానైట్ నిక్షేపాలు కోకొల్లలుగా ఉన్నాయి. వాటిని వారు కొల్లగొట్టరు. వారికి ఆ అవసరం లేక కాదు. వారికి గ్రానైట్ ఎంతో అవసరం ఉంది. అయినా పర్యావరణం కోసం అక్కడి కొండలను భూములను తవ్వకుండా నిషేధించింది చైనా. కాని పక్కనే ఉన్న మన దేశం నుంచి మన రాష్ట్రం నుంచి, కరీంనగర్ వరంగల్ వంటి జిల్లాల నుంచి వేల టన్నుల గ్రానైట్‌ను తవ్వి తీసుకుపోతున్నది. దీనికి కారణం మన రాజకీయ అవినీతి, పాలసీల దివాళాకోరుతనం. పది శాతం రాయల్టీ ఇచ్చి ఎంతైనా తవ్వుకోవచ్చు అనే విధానం. గనుల కాంట్రాక్టు ఇవ్వడం వెనుక లంచాలు. ఈ కాంట్రాక్టును ఆ వ్యక్తి మరెవరికో అమ్ముకోవడం, ఇతనికి లక్షల రూపాయల లాభాలు, అతనికి కోట్లరూపాయల లాభాలు. చివరకు మన జిల్లాలు పూడ్చలేని గుంటలతో నిండిపోవడం, పర్యావరణానికి

తీరని హాని కలగడం. కొందరు లంచగొండి రాజకీయ నాయకులు, మైనింగ్ శాఖ అధికారులు, కాంట్రాక్టర్లు, వారికి లీజులు ఇప్పించిన పలుకుబడి కలిగిన దళారులు ధనవంతులౌతున్నారు. దేశం నష్టపోతున్నది కాని లాభపడుతున్నది చైనా వంటి ఇతర దేశాలు. ఓబుళాపురం గనుల నుంచి ఇనుప ఖనిజంకూడా ఇదే విధంగా చైనాకు తరలిపోతున్నది. ఇదివరకు భారతదేశాన్ని దోచుకోవాలంటే ఇక్కడికి వచ్చి ఆక్రమించుకుని రాజకీయాధికారం సాధించి, నిరంకుశ పాలన సాగించాలి. అది 1947కు ముందు. ఇప్పుడు ఆ అవసరం లేదు. ఇప్పుడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, అధికార ప్రతిపక్ష పార్టీలు, గనుల అధికారులు, కాంట్రాక్టర్లు అందరూ సహకరిస్తారు. ప్రభుత్వానికి 10 శాతం రాయల్టీ ఇచ్చి, కాంట్రాక్టరుకు రేటు ఇచ్చి అంతా కొనుక్కోవచ్చు. ఆ ఇంధనం, ఖనిజం, ముడిసరుకు ఈ దేశానికి అవసరం అని సుప్రీంకోర్టుతో సహా ఎవరి దృష్టికీ రాదు. ఎవరూ అడగరు. ఇంత లోపభూయిష్టమైన, దారుణంగా నష్ట దాయకమైన విధానాలను అనుసరించే రాజకీయం క్షమార్హంకాదు. కనుక రాజ్యాంగంలో ఏ నియమాలున్నా రాజకీయం భ్రష్టు పట్టిపోయినపుడు ఇది సమాఖ్యా లేక మరొకటా అనే మీమాంసకు అర్థం లేదు.

జనం ఎన్నుకున్న ప్రభుత్వాలను రద్దు చేసి సొంత అధికారాన్ని చెలాయించే అధికారం కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంపైన వాడుతున్నది. 100 సార్లకు పైగా రాష్ట్రపతి పాలన ఆయుధాన్ని దుర్వినియోగం చేసింది. గవర్నర్లను తమ ఏజంట్లుగా మార్చి రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని చెప్పుకింద అణచివేస్తున్నది. సర్కారియా కమిషన్, జాతీయ రాజ్యాంగ సమీక్షా సంఘం కేంద్ర రాష్ట్రాల సంబంధాలను ఏవిధంగా పెంచాలో ఇచ్చిన సలహాలను తుడిచిపెట్టింది కేంద్రం. గవర్నర్ల ద్వారా రాష్ట్రాలను గడగడలాడించడం, లేదా వేరే పార్టీ నియమించిన గవర్నర్లు ఉంటే వారిని నౌకర్లను తీసేసినట్టు తీసేయడం, తమ అనుయాయులకు భజన పరులకు పంచుకునే అందలాలుగా వాడుకుంటున్నారు. ఇటీవలే సుప్రీంకోర్టు గవర్నర్లు కేంద్రం ఏజంట్లు కాదని, ఉద్యోగులు అంతకన్నా కాదని, నచ్చకపోతే తొలగించడానికి వీల్లేదని, దుష్ప్రవర్తన ఉంటే తప్ప పూర్తికాలం పనిచేయనీయాలని, వేరే పార్టీ వారు నియమించిన గవర్నర్లన్న ఏకైక కారణంతో పదవినుంచి తప్పించడం ఫెడరల్ సూత్రాలకు విరుద్ధమని వివరించింది.

రాజ్యాంగంలో అన్నీ రాయడం సాధ్యం కాదు. కొన్ని విచక్షణకు వదిలేయాలి. విచక్షణేలేని వారు ఉన్నత స్థానాల్లో ఉంటే రాజ్యాంగం మాత్రం ఏం చేయగలదు? కనుక అదొక కనకపు సింహాసనం వంటిది. అందులో అర్హులనే కూర్చోబెడతారని నెహ్రూ, అంబేద్కర్ వంటి రాజ్యాంగ రచయితలు ఎంతో ఆశపడ్డారు.

రాజకీయంగా పరిణతి చెందిన నేతలకు, మాజీ ముఖ్యమంత్రులకు, లేదా మాజీ న్యాయమూర్తులకు స్థానంగా ఒకనాడు భాసిల్లిన గవర్నర్ పదవి ఇటీవలి కాలంలో విజ్ఞత, పరిణతి వంటి అంశాలతో సంబంధం లేకుండా అనుయాయులను నియమించడం, అంతేవాసులకు ఇచ్చే అందలాల్లో ఒకటిగా వాడుకోవడం మొదలైంది. ఈ గవర్నర్ ఆకాశం నుంచి ఊడిపడదు. మంత్రివర్గ సలహాపైన రాష్ట్రపతి నియమిస్తారు కనుక గవర్నర్ రాజకీయాల నుంచే వస్తారు. ఎన్నికల్లో ఓడిపోయిన ఘనులకు, పదవుల పంపిణీలో స్థానం దొరకని గవర్నర్ పదవిని సమర్పించుకునే సంప్రదాయాన్ని కాంగ్రెస్ పార్టీ చాలాకాలం నుంచి పాటిస్తున్నది. తెలంగాణ ఉద్యమాన్ని నీరుగార్చి, ఆ ఉద్యమ నాయకుడు చెన్నారెడ్డిని కొనిపారేయడానికి గవర్నర్ పదవి ఎరవేయడం రాష్ట్రం మరిచిపోని చరిత్ర. మరోవైపు కాంగ్రెస్ కంచుకోటపైన తెలుగుదేశం జెండా ఎగరేసిన ఎన్.టి. రామారావును పదగొట్టడానికి రాంలాల్ వంటి రాజకీయ ఎత్తుగడల కుట్రదారులను గవర్నర్‌లుగా నియమించిన ఘనచరిత్ర కూడా వారిదే. ముఖ్యమంత్రి పదవినుంచి గవర్నర్ హోదాకు మారి, మళ్లీ వెంటనే గవర్నర్ పదవికి రాజీనామా చేసి ముఖ్యమంత్రి పదవి అందుకున్న సుశీల్‌కుమార్ షిండే మరొక ఉదాహరణ. ఇప్పుడు ఏ ఐ.ఎ.ఎస్ అధికారినో లేక ఐ.పి.ఎస్. అధికారినో నియమించడం పరిపాటిగా మారింది. ఉద్యోగులను బదిలీ చేసినట్టు గవర్నర్లను బదిలీ చేయడం కూడా ప్రారంభించారు.

మన దేశంలో గవర్నర్‌లను తొలగించే అవసరం రాలేదు. ఒక్కఫోన్ కాల్‌తోనో, ఫాక్స్ సందేశంతోనో గవర్నర్‌పదవి ఊడిపోయింది. నియామకం కష్టమేమో కాని ఉద్వాసనకు నిముషం పట్టదు. నారాయణ్ దత్ తివారి ఆంధ్రప్రదేశ్ రాజ్‌భవన్‌లో జరిపిన కార్యకలాపాలకు సోనియాతో సహా దేశం యావత్తూ నిర్ఘాంత పోయినా అందుకు ఆయన్ను తొలగించలేదు. ఒక ఫోన్ దెబ్బతో రాజీనామా చేయడంతో ఆయన రాజపాలన ముగిసింది. 2004లోనే యు.పి.ఎ. ప్రభుత్వం అసలు సిసలు తొలగింపులు మొదలైనాయి. తాము కాకుండా ఇతర పార్టీ అధికారంలోకి వస్తే ఏమైనా చేసి ఆ ప్రభుత్వాన్ని రద్దు చేయడం, వేరే పార్టీల వారు నియమించిన గవర్నర్లను తొలగించడం, వేరే పార్టీ ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాల్లో అక్కడ అల్లరి చేయడానికి వివాదాలు సృష్టించడానికి తమ అనుయాయులను గవర్నర్లుగా పంపించి తమాషా చూడడం కేంద్రంలో ఢిల్లీసుల్తానులకు అలవాటుగా మారింది. కాంగ్రెస్ పాతకాపులకు ఈ వేధింపులు వెన్నతో పెట్టిన విద్యలే. తమ పార్టీకి వ్యతిరేకుడని గవర్నర్‌ను తొలగించడం రాజ్యాంగ సమ్మతం కాదు నిజమే. సుప్రీంకోర్టు చాలా బాగా తీర్పు ఇచ్చింది. కాని తమ అనుయాయిని, పార్టీ స్థాయి రాజకీయాలలో నిండా మునిగిపోయిన అంతేవాసిని నియమించితే, అతను పార్టీ పక్షపాతంతో, ఆ తరువాత ఎన్నికైన ప్రభుత్వాలను వేధిస్తే, వేధించేందుకే కొందరిని తయారు చేస్తే ఏం చేయాలి? దీనికి సమాధానం ఎవరివ్వాలి?

రాజ్యాంగ సూత్రాలను దేశ సంపదను, స్వపాలనాధికారాన్ని చైతన్యవంతులైన ప్రజలు రక్షించుకోవలసిందే.

(రచయిత నల్సార్ న్యాయశాస్త్ర విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్) వీ

ప్రజలకు కూడు, గుడ్డ వంటి కనీస సౌకర్యాలు కల్పించలేకపోతే రాజ్యాంగం పనికిరాని, ప్రయోజనం లేని రాతప్రతిగా మిగిలిపోతుందన్న నెహ్రూ మాటలను గుర్తు చేస్తూ, రాజ్యాంగపు మూలభావనని విశ్లేషిస్తున్నారు **ఎస్. శేషయ్య**

అరవై సంవత్సరాల చరిత్రలో రాజ్యాంగం

భారత రాజ్యాంగం ఇంద్ర ధనుస్సులో రంగులు వెదజల్లే ఒక రాజకీయ పత్రం. మన రాజ్యాంగం ఉదార భావజాలంపై ఒక మంచి వ్యాసం లాంటిదని కొందరు వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యం, సోషలిజం, లౌకికవాదం విలువలు రాజ్యాంగంలో పొందుపరచబడ్డాయి. జస్టిస్ మాథ్యూ 'రాజ్యాంగాన్ని సమీక్షించేటప్పుడు, విశ్లేషించేటప్పుడు పై విలువలను ప్రతిబింబించాలి' అన్నారు. అంతేకాకుండా, 'మన రాజ్యాంగం న్యాయవాదుల భాషలో వ్యక్తీకరించిన రాజకీయ సిద్ధాంతం అని, న్యాయమూర్తులు తీర్పులు వెలువరించే క్రమంలో వారు న్యాయ సిద్ధాంతానికి సంబంధించిన రాజకీయాలను జోడిస్తార'ని చెప్పాడు.

రాజ్యాంగం ఎంత గొప్పదైనా, ఉదాత్తమైనా దాన్ని అమలు చేయాల్సింది రాజకీయ నాయకత్వం. రాజకీయ నాయకత్వం (పాలక వర్గాలు) ప్రజలకు ఎంత చేరువగా ఉంటే, వారి సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధి ఉంటే రాజ్యాంగం ప్రజలకు అనుకూలంగా ఉంటుంది. సమాజంలో ప్రజాస్వామిక విలువలను, హక్కులను వ్యవస్థీకృతం కావడానికి దోహదం చేస్తుంది. ఒక విధంగా రాజ్యాంగ పీఠిక రాజకీయ పార్టీల మానిఫెస్టో కాదు. అది ప్రజల మానిఫెస్టో. స్వాతంత్ర్యం తర్వాత పాలకులు ప్రజలకు ఇచ్చిన వాగ్దానం గత అరవై సంవత్సరాలుగా రాజ్యాంగం ఎలా అమలయ్యింది, ఎవరి ప్రయోజనాలను నెరవేర్చింది, రాజ్యం, సమాజం ప్రజాస్వామికీకరణ చెందడానికి ఎంతవరకు దోహదం చేసిందని సమీక్షించడం అవసరం.

రాజ్యాంగ లక్ష్యం, కర్తవ్యాల గురించి నెహ్రూ స్పష్టం చేయగా, వైవిధ్యాలతో, వైరుధ్యాలతో ఉన్న మన సమాజంలో రాజ్యాంగం అమలు కావడం చాలా కష్టం అని అంబేద్కర్ వివరించాడు. నెహ్రూ రాజ్యాంగ సభ తొలి సమావేశంలో మాట్లాడుతూ 'ప్రస్తుతం దేశం ప్రధానంగా ఎదుర్కొంటున్న ప్రశ్న పేదల సమస్యలకు పరిష్కారం వెతకడం. మనం రూపొందించే కొత్త రాజ్యాంగం కర్తవ్యం ఆకలితో అలమటించే వారికి కూడు, నగ్నంగా ఉన్నవారికి బట్ట కల్పించడం. ఈ సమస్యను త్వరగా పరిష్కరించకపోతే రాజ్యాంగం ఒక పనికిరాని, ప్రయోజనంలేని రాతప్రతిగా మిగిలిపోతుంది' అని అన్నాడు. మన సామాజిక వ్యవస్థ స్వభావాన్ని గుర్తు చేస్తూ మనం కొత్త రాజ్యాంగంతో పాటు వైరుధ్యాల్లోకి వెళుతున్నాం అని అంబేద్కర్ భావించాడు. భారత రాజ్యాంగం ఎంత ఉన్నతమైందీ, ఆదర్శవంతమైనప్పటికీ అసమానత, ఆధిపత్యం, దోపిడీ, పీడన స్వభావం గల భారత సామాజిక వ్యవస్థలో రాజ్యాంగం సాఫీగా అమలు కావడం సాధ్యం కాదు అని అభిప్రాయపడ్డాడు. భారత నేల మీద ప్రజాస్వామ్యం మేలిముసుగు లాంటిదనీ, సామాజిక, ఆర్థిక అసమానతల ప్రాతిపదిక పునాదిగా ఉన్న సమాజంలో కొందరు ఎదగడం, మరికొందరు చితికిపోవడం జరుగుతుందనీ, ఒకవైపు అధిక సంపదతో, మరోవైపు కడు పేదరికంతో బాధ పడుతున్నారనీ రాజ్యాంగం అమల్లోకి వస్తున్న సందర్భంలో చెప్పాడు. అంబేద్కర్ రాజ్యాంగంలోని విలువల చట్రానికి, సామాజిక వ్యవస్థలోని అప్రజాస్వామిక వైఖరికి మధ్య ఉన్న వైరుధ్యాల్ని స్పష్టంగా గుర్తించాడు.

రాజ్యాంగం విలువలు, నీతి సమాజంలో ఏ స్థాయిలో పురోగతి సాధించాయనే సమీక్ష చాలా అవసరం. ఈ సమీక్షలో చట్టసభలు, అధికార యంత్రాంగం, న్యాయవ్యవస్థల ప్రస్తావన లేకుండా సాధ్యం కాదు. సామాజిక, ఆర్థిక, రాజకీయ సంక్షోభాలు రాజ్యాంగ సంక్షోభానికి దారితీస్తాయి. రాజ్యాంగానికి సవరణలు అవసరమవుతాయి. రాజ్యాంగ చరిత్రలో చరిత్రాత్మకమైన కేశవానంద భారతి కేసులో తీర్పు ఫలితంగా పార్లమెంట్‌కు రాజ్యాంగాన్ని సవరించే, మార్చే అధికారం ఉందని, ప్రాథమిక హక్కులను సహితం సవరించినా రాజ్యాంగం మౌలిక చట్రాన్ని మార్చడానికి వీలు లేదని పదమూడు జడ్జిలతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు తర్వాత రాజ్యాంగ మౌలిక చట్రానికి ఎవరికి తోచిన అంశాన్ని వారు చేర్చుతూ పోయారు. ప్రస్తుతం న్యాయ వ్యవస్థ స్వేచ్ఛ, న్యాయ సమీక్ష అధికారం, మౌలిక చట్రంలో భాగం. అందుకే ఈ మౌలిక చట్రాన్ని 'పూర్తికాని కవిత' అని అభివర్ణించారు. దాదాపుగా రాజ్యాంగ పీఠికలోని అన్ని విలువలు మౌలిక చట్రంలో భాగమే. రాజ్యాంగం మన సమాజాన్ని పురోగతి వైపు తీసుకువెళ్లిందా లేక తిరోగమనం వైపు మళ్లించిందా అన్న దానికి సులభంగా సమాధానం చెప్పడం కష్టం. గత రెండు దశాబ్దాలుగా ప్రాథమిక హక్కుల అర్థం విస్తృతం అయ్యింది. సమాచార హక్కు, చదువుకునే హక్కు, పని హక్కు, పర్యావరణ హక్కు మొదలయినవి ప్రాథమిక హక్కుల స్థాయిని పొందాయి. ప్రజా ఆందోళనలు, ఒత్తిడి కారణంగా న్యాయస్థానాల క్రియాశీలక విశ్లేషణల వలన ఈ పరిణితి సాధ్యం అయ్యింది.

మన రాజ్యాంగంలో ప్రగతిశీల అంశాలు, ప్రజావ్యతిరేక అంశాలు ఉన్నాయి. అరవై సంవత్సరాలుగా రాజ్యాంగం అమలులో ఒక క్రమం ఉంది. ప్రజా ఉద్యమాల నుండి ప్రజాస్వామిక ఆకాంక్షలు ముందుకు రావడం, వాటిని ఇతర ప్రభుత్వాలు గుర్తించి కొంతమేరకు సంస్కరణల చట్టాల రూపంలో స్పందించడం, వాటి అమలు కోసం మళ్లీ మళ్లీ పోరాటాలు చేయడం, చివరగా పోరాడే ప్రజలపై అణచివేత

కొనసాగించడం ఈ క్రమం. 1950 నుండి నేటికీ జరుగుతూ ఉంది. ఈ అరవై సంవత్సరాల చరిత్రను మూడు దశలుగా విభజించి చూస్తే పైన చెప్పిన క్రమం అర్థం అవుతుంది.

1950–75

ఈ ఇరవై ఐదు సంవత్సరాల కాలంలో రాజ్యాంగంలోని సమానత్వపు హక్కును సంకుచితమయిన అర్థంలో కోర్టులు విశ్లేషించాయి. ఆస్తి హక్కుకు ప్రాధాన్యత ఇచ్చాయి. ఆస్తి హక్కును కాపాడడానికి కోర్టులు ఇచ్చిన తీర్పులను బలహీనపరచడానికి రాజ్యాంగ సవరణలు జరిగాయి. 1950 దశకంలో జమీందారీ, జాగిర్దారీ విధానాన్ని రద్దు చేస్తూ చట్టాలు వచ్చాయి. ఈ చట్టాలను కోర్టుల్లో సవాలు చేశారు. జమీందారులకు అనుకూలంగా కోర్టులు స్పందించాయి. సమాజంలో సమానత్వం తీసుకురావడానికి ఆస్తి సంబంధాల్లో మౌలికమైన మార్పులు అవసరం. ఆస్తి హక్కుపై ప్రభుత్వ నియంత్రణ అవసరం. ఫ్యూడలిజానికి ప్రతీకలైన జమిందారీ విధానాన్ని నిర్మూలించడానికి ప్రయత్నిస్తే రాజ్యాంగంలోని సమానత్వపు హక్కు అడ్డుగోడగా మారింది. ప్రభుత్వ చర్యలు రాజ్యాంగ వ్యతిరేకం అయ్యాయి. ఆదేశిక సూత్రాలను అమలు చేసే బాధ్యతలో భాగంగా ప్రభుత్వం పై చర్యలకు పూనుకుంటే ప్రాథమిక హక్కులను ఏ లక్ష్యం కోసం అయినా ఉల్లంఘించకూడదని కోర్టులు ప్రకటించాయి. ఈ వైరుధ్యం రాజ్యాంగం లోనే సహజంగా ఇమిడి ఉందా? లేక కోర్టులు సృష్టించిన కృత్రిమ వైరుధ్యమా?

భూస్వామ్య విధానానికి ప్రజలకు ఉన్న వైరుధ్యం హక్కుల మధ్య వైరుధ్యంగా చిత్రీకరించబడింది. ఎవరి హక్కులకు ప్రాధాన్యత ఇవ్వాలి? కోర్టులు భూస్వాములవైపు నిలబడ్డాయి. అందుకు రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కుల, సమానత్వపు హక్కు (సహేతుకమైన వర్గీకరణ) ఆస్తి హక్కు ఆర్టికల్ 19 (1) (ఎఫ్), 31ల ప్రభుత్వం జోక్యం చేసుకున్నదని, ఈ చర్య రాజ్యాంగ వ్యతిరేకం అని కోర్టులు సమర్థించు కున్నాయి. ఈ ఇబ్బందిని తొలగించుకోవడానికి మొదట రాజ్యాంగ సవరణ (1951) తీసుకువచ్చారు. ఈ సవరణతో కొత్తగా 9వ షెడ్యూల్‌ను జత చేసారు. ఈ జాబితాలో ఏ చట్టం చేర్చినా దాన్ని ప్రాథమిక హక్కుల ఉల్లంఘన అని కోర్టులో సవాలు చేయడానికి వీలు లేదు. భూ పరిమితి చట్టాలు, భూమి కౌలుకు, పారిశ్రామిక అభివృద్ధికి, పన్నులకు సంబంధించిన చట్టాలను చేర్చారు. ప్రస్తుతం 9వ షెడ్యూల్లో 284 చట్టాలు ఉన్నాయి. ఇందులో ఈ మధ్యనే వివాదాస్పదం అయిన తమిళనాడులో 69 శాతం రిజర్వేషన్‌లు కల్పించిన చట్టం కూడా చేర్చారు. ఎందుకంటే సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాలకు విద్యా సంస్థల్లో, ఉద్యోగాల్లో రిజర్వేషన్‌లు కల్పించినప్పుడల్లా సమానత్వం హక్కు ఉల్లంఘించబడిందని కోర్టులకు వెళ్లిన సంగతి తెలిసిందే. మరో ముఖ్యమైన అంశం భూసంస్కరణల కోసం భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నప్పుడు చెల్లించాల్సిన నష్టపరిహారం గురించి సవరణ చేసారు. ప్రభుత్వం ఎంత నిర్ణయిస్తే అంత మొత్తం చెల్లించబడుతుందని, అది తుది నిర్ణయం అని సవరించారు.

వ్యవసాయ భూ పరిమితి చట్టాలు, రాజభరణాల రద్దు, బ్యాంకుల జాతీయికరణ, ప్రాథమిక హక్కులను ఉల్లంఘించాయనే కారణంతో కోర్టులు అడ్డు పడ్డాయి. ఈ ఇబ్బందిని తొలగించుకోవడానికి 24, 25, 26 రాజ్యాంగ సవరణలు జరిగాయి. మొత్తంగా వ్యక్తిగత ఆస్తి హక్కుకు ప్రాధాన్యత ఇవ్వబడింది. కాని పౌరస్వేచ్ఛకు సంబంధించి రాజ్యాంగ సవరణల ద్వారా అనేక పరిమితులు విధిస్తూ పోయారు. 1963లో 16వ రాజ్యాంగ సవరణ ద్వారా వాక్, సభా స్వాతంత్ర్యాలను సమావేశపు హక్కు, సంఘాలుగా ఏర్పడే హక్కులపై ఆంక్షలు విధించారు. దేశ సార్వభౌమత్వం, సమగ్రతకు ఎవరైనా భంగం కలిగించే విధంగా ప్రవర్తిస్తే ఈ హక్కులు అనుభవించడానికి వీలులేదు.

1950–70 మధ్య కాలంలో రాజ్యాంగం అమల్లో కొన్ని అభ్యుదయ పరిణామాలు జరిగినా భూస్వామ్య విధానం పూర్తిగా రద్దు కాలేదు. భూ సంస్కరణ చట్టాల్లోని లొసుగుల సహాయంతో కోర్టుల విచిత్రమైన తీర్పులతో భూ సంబంధాల్లో మార్పులు రాలేదు. హైకోర్టుల జడ్జీల్లో మెజారిటీగా భూస్వామ్య కుటుంబాల నుంచి రావడం కూడా ఒక కారణం కావచ్చు. మరోవైపు జాతీయికరణ విధానాల ద్వారా ప్రభుత్వరంగ పరిశ్రమలు పెరిగినా, ప్రైవేట్ పెట్టుబడిదారుల ప్రభావం తగ్గలేదు. మౌలిక సదుపాయాలు కల్పించడానికి జాతీయికరణ కేంద్రీకరించబడింది.

మరోవైపు రాజ్యాంగం ప్రాథమిక హక్కులను కల్పించినా వాటి ఉల్లంఘన తీవ్రస్థాయిలో జరిగింది. ప్రజాస్వామిక దేశాల్లో ఏ రాజ్యాంగంలో లేని విధంగా ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టం మన దేశంలో రాజ్యాంగబద్ధం అయ్యింది. దీనితోడు డి.ఐ.ఆర్. చట్టాల కింద కమ్యూనిస్టులను అరెస్ట్ చేశారు. 1962 చైనా – భారత్ మధ్య ఘర్షణ, 1971లో బంగ్లాదేశ్ ఉద్యమం నేపథ్యంలో ఎమర్జెన్సీ కొనసాగింది. 1971లో ఎం.ఐ.ఎస్.ఎ. (మిసా) చట్టం వచ్చింది. ఆ తర్వాత ఎమర్జెన్సీ దిశలో రాజ్యం 1975 నుండి 1977 వరకు కొనసాగింది. ఈ చట్టాల కింద ప్రభుత్వ విధానాలను విమర్శించేవారిని, ప్రజా ఉద్యమ కార్యకర్తలను నిర్బంధించారు. ఎమర్జెన్సీలో దాదాపు దేశవ్యాపితంగా లక్ష మందికి పైగా అరెస్ట్ అయ్యారు. ఎమర్జెన్సీ ఉన్నంత కాలం ప్రాథమిక హక్కులు అనుభవించడానికి వీలులేదు. హెబియస్ కార్పస్ పిటిషన్‌ను కోర్టులు స్వీకరించడానికి వీలు లేకుండా చేసారు. ఎమర్జెన్సీని సుప్రీంకోర్టు సమర్థించింది. పరోక్షంగా ఇది ఇందిరాగాంధీ నియంతృత్వానికి వత్తాసు పలకడమే. 39, 42వ రాజ్యాంగ సవరణలు ప్రజాస్వామిక వ్యవస్థలు, ప్రభుత్వ వ్యవస్థలను బలహీనం చేశాయి. ఎమర్జెన్సీ లేకుండానే అలాంటి పరిస్థితి ప్రస్తుతం అప్రకటితంగా కొనసాగుతూ ఉంది.

ఎమర్జెన్సీ తర్వాత

పాలకవర్గాల మధ్య వైరుధ్యాన్ని పరిష్కరించుకోవడానికి అధికారంలో ఉన్న వర్గాలు ఎమర్జెన్సీని ఆశ్రయించాయి. దీనికి ప్రతిపక్షాలు కూడా బలయ్యాయి. మరింత ఎక్కువగా ప్రజాస్వామిక వాదులు, ఉద్యమకారులు బలయ్యారు. దేశవ్యాప్తంగా ఎమర్జెన్సీని ప్రజలు నిరసించారు. చివరికి ఇందిరాగాంధీ అధికారం కోల్పోయింది. జనతా పార్టీ అధికారంలోకి వచ్చింది. ఇందిరాగాంధీ ప్రభుత్వం తీసుకువచ్చిన 39, 42వ రాజ్యాంగ సవరణలను తొలగించి, 44వ రాజ్యాంగ సవరణ చేసింది. ఆస్తి హక్కును ప్రాథమిక హక్కుల జాబితా నుండి తొలగించి 300ఎలో చేర్చారు. ప్రస్తుతం ఆస్తి హక్కు కేవలం చట్టబద్ధమయిన హక్కు. ఈ మార్పువల్ల పెద్దగా ఆస్తి సంబంధాల్లో మార్పులు రావు. కోర్టుల ప్రమేయం తగ్గుతుంది. ప్రభుత్వ నియంత్రణ పెరుగుతుంది.

ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసం సాగిన ఉద్యమం ఫలితంగా ప్రజల్లో హక్కుల స్పృహ, చైతన్యం పెరిగింది. సుప్రీంకోర్టు ఎమర్జెన్సీలో కోల్పోయిన ప్రాభవాన్ని తిరిగి సంపాదించుకోవడానికి ప్రయత్నించింది. 1980లో మేనకా గాంధీ కేసు రాజ్యాంగ చరిత్రలో ఒక మైలురాయిగా పేర్కొంటారు. గతంలో ప్రాథమిక హక్కుల్లో ప్రధానంగా 19, 21 సంబంధం లేదనీ, వాటికవే భిన్నమయిన హక్కులన్న సూత్రీకరణకు భిన్నంగా హక్కుల మధ్య అవినాభావ సంబంధం ఉంటుందనీ, ఒక హక్కుపై ఉల్లంఘన మరోహక్కుపై ఉంటుందని పేర్కొన్నాయి. వాస్తవానికి బ్యాంక్ నేషనలైజేషన్ కేసులో (ఆస్తి హక్కు కాపాడటానికి) ఈ సూత్రీకరణ ప్రాతిపదిక ఏర్పడింది. అంతేకాకుండా ఏ చట్టమయినా అందులోని పద్ధతి ప్రాథమిక హక్కులను గౌరవించాలనే పద్ధతి కూడా సహేతుకుంగా, న్యాయంగా ఉండాలని ఈ తీర్పు ప్రకటించింది.

ఈ నేపథ్యంలో ఆర్టికల్ 21 హక్కుల అర్థం విస్తృతం అయింది. దాదాపు 15 హక్కులు ఆర్టికల్ 21 కింద ఇవ్వాళ ఉనికిలోకి వచ్చాయి. ప్రజాహిత వాజ్యం ద్వారా, హక్కుల ఉద్యమం కారణంగా పేదల, అణగారిన ప్రజల హక్కులకు భంగం జరిగినప్పుడు కోర్టుకు వెళ్లే అవకాశం ఏర్పడింది.

ఒకవైపు హక్కుల విస్తృతి పెరిగింది. మరోవైపు వాటి ఉల్లంఘన కూడా పెరిగింది. ఈశాన్య రాష్ట్రాలు, ప్రత్యేకించి త్రిపుర, మణిపూర్, అస్సాం రాష్ట్రాల ప్రతిపత్తిని గౌరవిస్తూ, చట్టసభల్లో ఈ ప్రాంత ప్రజలకు రిజర్వేషన్‌లు కల్పిస్తూ రాజ్యాంగ సవరణలు వచ్చాయి. అయితే వారు ఎంతో రక్తతర్పణ చేసిన తర్వాతే ఈ ఫలితం వచ్చింది. 1977 మిసా చట్టం కొనసాగింది. ఆ తర్వాత దాని స్థానంలో ఎన్.ఎస్.ఎ. చట్టం వచ్చింది. దీనికి బలైంది కార్మిక సంఘాల నాయకులు. ఈ చట్టం రాజ్యాంగబద్ధమని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. పంజాబ్ రాష్ట్రంలో ఖలిస్థాన్ ఉద్యమం మొదలై తీవ్రరూపం దాల్చకుండా దాన్ని అణచడానికి చట్టాలు చేసారు. 59వ రాజ్యాంగ సవరణ తీర్పు గతంలో అంతరంగిక భద్రత కారణంపై ఎమర్జెన్సీ విధించే వెసులుబాటు కల్పించారు. (ఆర్టికల్ 359 ఎ). కానీ ఈ సవరణ పంజాబ్‌కు మాత్రమే వర్తిస్తుందనీ తర్వాత సవరించారు. పంజాబ్‌లో మూడున్నర సంవత్సరాల పాటు రాష్ట్రపతి పాలన సాగింది. పంజాబ్, కాశ్మీర్, ఈశాన్య రాష్ట్రాల్లో కొనసాగుతున్న జాతిపోరాటాలను అణచివేయడానికి వాటిని టెర్రరిస్ట్ ఉద్యమాలుగా చిత్రీకరించి అణచివేయడానికి చట్టాలు వచ్చాయి. 1958 నుండి సైనిక బలగాల ప్రత్యేక అధికారాల చట్టం అమల్లో ఉంది. ఈ చట్టం సైనికులకు కాల్చి చంపే అధికారం ఇచ్చింది. సైనికులకు రక్షణ కల్పించింది. దీన్ని ఉపసంహరించుకోవాలని ఉద్యమం నడుస్తూనే ఉంది.

1990 తర్వాత

1990లో ప్రారంభమైన సరళీకృత ఆర్థిక విధానాలతో పరిస్థితి మరింత దిగజారిపోయింది. సరళీకరణ, ప్రపంచీకరణ విధానం మన ఆర్థిక విధానాన్ని శాసిస్తూ, సామాజిక సంక్షోభం తీవ్రతరమవుతోంది. హక్కులకు భరోసా లేకుండా పోయింది. రాజ్యాంగం ఈ పరిస్థితిని ఆపగలుగుతుందా? ప్రైవేటీకరణను, పెట్టుబడి ఉపసంహరణలను వ్యతిరేకిస్తూ ఇవి రాజ్యాంగ వ్యతిరేకం అని కోర్టులకు వెళ్తే, అభివృద్ధికి అడ్డుపడుతున్నారని సుప్రీంకోర్టు తిరస్కరించింది. నర్మదా బచావో ఆందోళనను కోర్టు ఎలా పరిహసించిందో అందరికీ తెలుసు.

రాజ్యాంగం కంటే ఇవ్వాళ రెండు చట్టాలు చాలా బలమైనవి. ఒకటి భూసేకరణ చట్టం, రెండు ప్రత్యేక ఆర్థిక మండలాల చట్టం. ఈ రెండు చట్టాలు లక్షలాది మంది రైతులను, పట్టణ పేద ప్రజలను నిర్వాసితులు చేస్తున్నాయి. పరిశ్రమల కోసం, మౌలిక సదుపాయాలను అభివృద్ధి పరచడం కోసం ప్రభుత్వం భూమిని సేకరిస్తోంది. వేలాది ఎకరాలను స్వదేశీ, విదేశీ కంపెనీలకు అప్పజెప్పుతోంది. సెజ్ చట్టాన్ని సుప్రీంకోర్టులో సవాలు చేయగా ప్రభుత్వానికి ఎమినెంట్ డొమైన్ కింద రాజ్యం భూమిని సేకరించే అధికారం ఉందనీ, ఇది రాజ్యం సార్వభౌమాధికారంలో భాగం అని చెప్పింది. గతంలో ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని ప్రోత్సహించిన సుప్రీంకోర్టు ప్రస్తుతం చాలా ఆంక్షలు పెడుతోంది. హక్కుల పేరుతో అభివృద్ధికి ఆటంకపరుస్తున్నారని అసహనాన్ని చూపిస్తోంది.

రాజ్యాంగ సూత్రాల్లో ప్రధానమైన అధికార విభజన సిద్ధాంతం (థియరీ ఆఫ్ సపరేషన్ ఆఫ్ పవర్స్) క్రమక్రమంగా బలహీనపడుతూ ఉందని చాలామంది అభిప్రాయపడుతున్నారు. రాజ్యం ప్రధాన వ్యవస్థలైన చట్టసభలు, కార్యనిర్వాహక రంగం, న్యాయవ్యవస్థ స్వతంత్రమైనవి. విధినిర్వహణ పేరుతో ఇతర సంస్థల అధికారాల్లో జోక్యం చేసుకోకూడదు. కానీ ఇవ్వాళ సుప్రీంకోర్టు కార్యనిర్వాహక రంగం అధికారాల్లో జోక్యం చేసుకుంటోంది. స్వయంగా విచారణ కమిటీలను వేయడం, విచారణా పద్ధతులను నిర్దేశించడం, పర్యవేక్షించడం చేస్తూ ఉంది. పార్లమెంట్ అధికారాల్లో జోక్యం చేసుకుంటున్నదని విమర్శ ఉంది.

అయితే రాజ్యాంగ వ్యవస్థలు విఫలమయినపుడు న్యాయం కోసం కోర్టులను ఆశ్రయిస్తున్నదని కోర్టు తన వ్యవహార శైలిని సమర్థించుకుంటూ ఉంది. కానీ వాస్తవానికి ఈ మూడు వ్యవస్థలు వర్గ స్వభావరీత్యా ఒకటే. వాటి మధ్య అభిప్రాయాలు తాత్కాలికమే. ప్రజల మౌలిక సమస్యలను దాటవేయడంలో, పరిష్కరించడంలో ఒకేరకంగా వ్యవహరిస్తాయి. ఉదహరణకు ఇవ్వాళ దేశ భద్రత, టెర్రరిస్టుల అణచివేత, ప్రజా ఉద్యమాలపై అణచివేతలో వీటిది ఒకే గళం టాడా, పోటా చట్టాలు రాజ్యాంగబద్ధం అని సుప్రీంకోర్టు తీర్పులిచ్చింది. ఈ చట్టాల పట్ల తీవ్ర వ్యతిరేకత రాగా వాటిని ఉపసంహరించింది. అయితే ఈ చట్టాలను దొంగదారిలో 2004లోను, 2008లోను చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టంతో తీసుకువచ్చారు. ప్రజా ఉద్యమాలను అణచడానికి ఈ చట్టాలను సాధనంగా ప్రభుత్వం ఉపయోగించింది.

ప్రారంభంలో ప్రస్తావించినట్టు ప్రజా ఆందోళన ద్వారానే రాజ్యాంగంలో అనేక ప్రజాస్వామిక హక్కులకు స్థానం ఏర్పడింది. ప్రజల ఆకాంక్షలను ప్రభుత్వం గుర్తించి సంస్కరణలను తీసుకువచ్చినా వాటిని అమలు చేయడానికి ఇష్టపడదు. రాజ్యాంగంలోని స్ఫూర్తి ఆచరణలో అమలవ్వాలన్నా, హక్కులు అందుబాటులోకి రావాలన్నా ప్రజా చైతన్యం, చొరవ అవసరం. రాజ్యం – సమాజం ఏమేరకు ప్రజాస్వామికీకరణ అవుతుందో ఆమేరకు రాజ్యాంగం ప్రజలకు అందుబాటులోకి వస్తుంది. రాజ్యాంగంలోని ప్రజాస్వామిక విలువలను పరిరక్షించుకుంటూ, అందులోని ప్రజావ్యతిరేక అంశాలను తొలగించాల్సిన బాధ్యత అందరి మీదా ఉంది.

(రచయిత న్యాయశాస్త్ర ప్రొఫెసర్, ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం అధ్యక్షులు) వీ

కుల సమస్యను పరిష్కరించకుండా ఈ దేశంలో ప్రజాస్వామ్యం అనే భావనకు అర్థం లేదన్న అంబేద్కర్ మాటలను, హెచ్చరికలను గుర్తు చేస్తూ, రాజ్యాంగం అమలు గురించి చర్చిస్తున్నారు మల్లేపల్లి లక్ష్మయ్య

అరవై ఏళ్ల రాజ్యాంగం - అంబేద్కర్

భారతదేశ చరిత్రలో 26 జనవరి 1950కి ఒక ప్రముఖమైన స్థానం ఉంది. అపసవ్య దిశలో సాగుతున్న దేశ సామాజిక గమనానికి అడ్డుగా నిలిచి సవ్యంగా ముందుకెళ్లడానికి చేసిన ఒక మహా ప్రయత్నం జరిగిన రోజది. మనిషి మనిషిగా గాకుండా కులాలుగా గౌరవం, అవమానం పొందుతున్న అప్రకటిత చట్టానికి చరమగీతం పాడి, మనుషులంటే ఒక్కటేననే ప్రజాస్వామ్య స్ఫూర్తికి పట్టంకట్టిన సందర్భం అది. స్వతంత్ర భారతదేశం తనను తాను నిర్మించుకునే ప్రణాళికలో భాగంగా ఏర్పరిచి, రాజ్యాంగ సభ రూపొందించిన భారత రాజ్యాంగం ఆమోదం పొందిన రోజు అది.

దాదాపు రెండున్నర సంవత్సరాల కాలంలో 141 రోజులు పూర్తిస్థాయిలో చర్చలు జరిపి రాజ్యాంగానికి రూపకల్పన చేశారు. అయితే రాజ్యాంగ రచనాసభకు ఛైర్మన్‌గా వ్యవహరించిన బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగ సభలో ధన్యవాదాలు తెలుపుతూ ప్రవేశపెట్టిన తీర్మానం, ఆయన చేసిన ప్రసంగం ఒకసారి మననం చేసుకుంటే తప్ప 'అరవై ఏళ్ల రాజ్యాంగం' అమలు జరగిన తీరు మనకు అర్థం కాదు.

'జనవరి 26 1950 రోజున మనం వైరుధ్యాల మయమైన జీవనంలోకి అడుగు పెడుతున్నాం' అని ఒక సంచలనమైన ప్రకటన చేశారు. 'రాజకీయ రంగంలో సమానత్వాన్ని ఈ రాజ్యాంగం ద్వారా ఇవ్వగలిగాం. కానీ సామాజిక, ఆర్థిక రంగాలలో అసమానత్వం సాగుతూనే ఉంది. ఒక మనిషి, ఒక ఓటు – ఒక ఓటు, ఒక విలువ అనే సూత్రాన్ని అమలు చేయగలం. అయితే మన సామాజిక, ఆర్థిక నిర్మాణంలో ఒక మనిషి, ఒక విలువ అనే విధానాన్ని తిరస్కరిస్తున్నాం. ఈ విధమైన వైరుధ్యాలతో ఎంతకాలం జీవనం సాగిస్తాం? ఎంతకాలం మన సామాజిక, ఆర్థిక జీవితాలలో సమానత్వాన్ని తిరస్కరిస్తాం! ఇదే పద్ధతి ఇలాగే కొనసాగితే మన ప్రజాస్వామ్యం, పెను ప్రమాదంలో పడుతుంది. ఈ వైరుధ్యాలను ఎంత వీలైతే అంత తొందరగా తొలగించాలి. లేనట్లయితే, ఈ అసమానత్వంతో సతమతమవుతున్న వాళ్లు, ఈ రాజ్యాంగ సభ ఎంతో శ్రమకోర్చి నిర్మించిన రాజకీయ ప్రజాస్వామ్యసౌధాన్ని పేల్చివేస్తారు' అని కూడా అంబేద్కర్ రాజ్యాంగ సభను హెచ్చరించారు.

ఆనాడు అరవై ఏళ్ల కిందట అంబేద్కర్ చేసిన ప్రకటన ప్రకంపనల ఫలితాలు మనం చూస్తున్నాం. ఏ అసమానతలనైతే అంబేద్కర్ రూపుమాపాలని కోరారో అవి రోజురోజుకూ మరింతగా పెరుగుతున్నాయే కానీ తరగడం లేదు. ఈరోజే కాదు, గత నలభై ఏళ్లుగా దేశవ్యాప్తంగా అనేక కులాల, వర్గాల, ప్రాంతాల ప్రజలు పోరాటాలు చేస్తూనే ఉన్నారు.

ఈరోజు భారత రాజ్యాంగంపై జరుగుతున్న చర్చ నేల విడిచి సాము చేసినట్టుగా ఉంది. దేశంలో నెలకొన్న పరిస్థితులకు రాజ్యాంగం మాత్రమే కారణమైనట్లుగా భావిస్తున్న వాళ్లు కొందరున్నారు. అది పూర్తిగా అవాస్తవం. దురుద్దేశం కూడా. అంబేద్కర్ ఇదే ఉపన్యాసంలో దీనికి సంబంధించిన విషయాలను కూడా ప్రస్తావించారు. 'ఈ రాజ్యాంగం మంచి చెడులు కేవలం దాని స్వరూపం మాత్రమే నిర్ణయించదు. దానిని అమలు చేసే వ్యవస్థ మీద ఆధారపడి ఉంటుంది. ఎవరు అమలుకు పూనుకుంటారో వాళ్లు దీని మంచి చెడులను నిర్ణయించడంలో కీలకపాత్ర వహిస్తారు. ముఖ్యంగా రాజకీయ పార్టీల మీద దీని భవిత్యం ఆధారపడి ఉంటుంది.'

ఈ విషయాల గురించి మనం ఎక్కువగా చర్చించాల్సిన అవసరం లేదు. ప్రజాస్వామ్యంలో ఎన్నికల ప్రక్రియ ప్రధాన అంశంగా స్వీకరించిన పార్టీలు పూర్తిగా రాజ్యాంగ స్ఫూర్తిని తుంగలో తొక్కాయి అంటే అభ్యంతరం ఎవరికీ ఉండకపోవచ్చు. అణగారిన కులాలకు ప్రజాస్వామ్యంలో తగిన భాగస్వామ్యం లేనట్లయితే, చట్టసభలు కూడా పనిచేయవు. నిట్టనిలువునా చీలి ప్రజాస్వామ్య వ్యవస్థకే ప్రమాదం ఏర్పడుతుందని అంబేద్కర్ అభిప్రాయపడ్డారు.

అంబేద్కర్ ఈ ఉపన్యాసంలో ఇంకా కొన్ని విషయాలను చర్చించారు. ఆయన దేశ భవిష్యత్ మీద ఆరోజు చేసిన ఈ వ్యాఖ్యలు మనల్ని మనం అర్థం చేసుకోవడానికి మరింతగా ఉపకరిస్తాయి.

'నేను ఎక్కువగా మాట్లాడదలచుకోలేదు. కానీ నా మనసు నిండా ఈ దేశ భవిష్యత్‌కు సంబంధించిన భావాలు నిండి ఉన్నాయి. వీటిలో కొన్నింటిని మీతో పంచుకోదలచుకొన్నాను. 26 జనవరి 1950 నుంచి మనది స్వతంత్ర భారతదేశం. ఆ స్వతంత్రం ఏమవుతుంది? ఈ దేశం ఆ స్వాతంత్ర్యాన్ని కాపాడుకోగలదా? ఓడిపోగలదా? ఇది నా మనసుకు తట్టిన మొదటి ఆలోచన. భారతదేశం ఇప్పటిదాకా ఎన్నడూ స్వతంత్ర దేశంగా లేదనడం సరియైంది కాదు. ఇప్పటికి ఒకసారి ఆ స్వతంత్రతను కోల్పోయింది. అయితే మళ్లీ తన స్వతంత్రతను కోల్పోతుందా? ఇది నన్ను తీవ్రంగా వేధిస్తోంది. భారతదేశం స్వతంత్రతను కోల్పోవడానికి తన సొంత మనుషులే కారణమన్న విషయం మరువరానిది. దహర్

చక్రవర్తి, రాజా జయచంద్ర, సిక్కుల రాజ్యాన్ని బ్రిటిష్ వాళ్లు ఆక్రమించుకుంటున్న సమయంలో గులాబ్ సింగ్ మౌనం ఇట్లా చెప్పుకుంటూ పోతే ఎన్నైనా ఏకరువు పెట్టవచ్చు. అదే విధంగా 1857లో బ్రిటిష్‌కు వ్యతిరేకంగా దేశంలోని చాలా చోట్ల పోరాటాలు జరిగితే, సిక్కు సైనికులు మౌనం వహించారు' అంటూ, 'రాబోయే కాలంలో కులాలు, జాతిపరంగా రాజకీయ పార్టీలు అవతరించి ఒకరకంగా ఈ దేశాన్ని విచ్ఛిన్నం చేస్తాయనే ఆందోళన ఉంది' అని వాపోయారు.

ఈ విధమైన అనైక్యతకు పునాది ఆయన కుల సమాజంలోనే చూసారు. కుల సమాజం వల్లనే ఈ దేశంలో ఒక జాతి అనే భావన ఏర్పడడం లేదని స్పష్టం చేశారు.

అందుకే ఆయన ప్రజాస్వామ్య భావన అనే అంశాన్ని రెండో విషయంగా చర్చకు పెట్టారు. 'సామాజిక ప్రజాస్వామ్య సూత్రాలను అనుసరించకుండా రాజకీయ ప్రజాస్వామ్యం మనగలగడం అసంభవం. సామాజిక ప్రజాస్వామ్యమంటే ప్రజల జీవన విధానం. స్వేచ్ఛ, సమానత్వం, సోదరత్వం దీని ప్రధాన సూత్రాలు. ఇవి మూడు వేర్వేరు కాదు. పైగా ఒకదానిలో మరొకటి కలగలసిపోయి ఉంటాయి. వీటిని ఒకదాని నుంచి ఇంకొకదానిని విడదీస్తే ప్రజాస్వామ్య ప్రయోజనం వీగిపోతుంది. సమానత్వంలేని స్వేచ్ఛ కొంతమంది పెత్తనాన్ని అందరి మీద రుద్దుతుంది. స్వేచ్ఛలేని సమానత్వం వ్యక్తిగత ప్రగతిని అడ్డుకుంటుంది. సోదరత్వంలేని స్వేచ్ఛ, సమానత్వాలు సహజమైన ప్రజాస్వామ్య మనుగడను కొనసాగించనివ్వవు. ఇక్కడ మనం ఒక విషయాన్ని గుర్తించాలి. భారత సమాజంలో రెండు విషయాలు మృగ్యమైపోయాయి. అందులో ఒకటి సమానత్వం. భారత సమాజం కులాల దొంతరలుగా విడిపోయి ఉంది. దీనివల్ల సంపద కొందరి ఆధిపత్య కులాల చేతుల్లో ఉండి, అత్యధికులను ఆకలితో మలమల మాడుస్తుంది.

రెండో విషయం, సోదరత్వం. సోదరత్వమంటే, భారత ప్రజలు ఒక్కటేననే భావన కలిగించడం. ఇది ప్రజల మధ్య ఐక్యతను, సౌహార్దాన్ని పెంచుతుంది. ఇది సాధించడం చాలా కష్టం. దీనికే ఉదాహరణలో, అమెరికా సంయుక్త రాష్ట్రాలకు సంబంధించిన ఒక సంఘటనను ఉదహరించారు. అయితే ఇది భారతదేశంలో మరింత కష్టమ'ని తేల్చారు.

'అమెరికాలో కుల సమస్య లేదు. భారతదేశం కులాలమయం. కులమంటేనే జాతికి వ్యతిరేకమైనది. ఆ కులాలు సామాజిక జీవితాన్ని నిట్టనిలువునా విడదీస్తాయి. ప్రజల మధ్య ద్వేషం, అసూయలను కులాలు సృష్టిస్తాయి. ఒకవేళ మనం ఒకజాతిగా ఏర్పడాలంటే, వీటన్నింటినీ అధిగమించాలి. ఒక జాతిగా ఏర్పడితే తప్ప సోదరత్వం అనేది వాస్తవం కాదు. సోదరత్వం, సమానత్వం, స్వేచ్ఛలేని ప్రజాస్వామ్యం పాత గోడకు రంగులద్దిన చందంగా ఉంటుంది' అంటూ రాజ్యాంగ సభను అంబేద్కర్ తట్టి లేపడానికి ప్రయత్నం చేసారు. అయితే ఇంకొక మాట కూడా అన్నారు. 'భవిష్యత్ కర్తవ్యాలను గుర్తు చేయడానికి నాకున్న కొన్ని అభిప్రాయాలను మీముందుంచాను. అయితే కొందరికి ఇష్టంగా ఉండకపోవచ్చు. కానీ ఒక రాజకీయ అధికారం కొందరి చేతుల్లోకి వెళ్లకుండా ఉండడానికి ఈ చర్యలు అవసరం' అని సూటిగా చెప్పారు.

ఆయన ఉపన్యాసాన్ని ముగిస్తూ 'నేను ఈ సభను ఇంకా మరింతగా విసిగించను. స్వతంత్రం సంతోషించదగిందే. అందులో సందేహం అక్కరలేదు. కానీ ఈ స్వతంత్రత మనం తక్షణం చేపట్టాల్సిన కొన్ని కర్తవ్యాలను మన ముందుంచుతుంది. ఈ స్వతంత్రతను సాధించడం వల్ల, మన మీద బాధ్యత పెరిగింది. ఇంకా జరగబోయే తప్పులకు గతంలో లాగా బ్రిటిష్ వాళ్లను నిందిస్తూ కూర్చోలేం. మనల్ని మనమే నిందించుకోవాలి' అంటూ ప్రజలను ప్రభుత్వంలో నిజమైన భాగస్వాములను చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

25 నవంబర్ 1949న రాజ్యాంగ సభలో ప్రవేశపెట్టిన 26 తీర్మానంలోని ప్రధాన అంశాలను ఇక్కడ పేర్కొనడం జరిగింది. అంటే ఈ రోజు ఉత్పన్నమవుతున్న సమస్యల గురించి అంబేద్కర్ ఆనాడే ఒక హెచ్చరికను మనముందుంచారు.

భారతదేశంలో ఈరోజు కొనసాగుతున్న రాజకీయ, ఆర్థిక, సామాజిక అసమానతలకు కులం ఒక ప్రధానమైన అడ్డంకి అనే విషయాన్ని బాబాసాహెబ్ అంబేద్కర్ ఆనాడే చెప్పారు. కుల సమస్యను పరిష్కరించకుండా ఈ దేశంలో ప్రజాస్వామ్యం అనే భావనకు అర్థం లేదని కూడా ఆయన భావం.

అయితే కుల అసమానతలు, అంటరానితనం, ఆర్థిక వ్యత్యాసాలు వీటన్నింటిని తొలగించడానికే రాజ్యాంగం ద్వారా కొన్ని ప్రయత్నాలు జరిగాయి. ఆ పరిష్కారాలు ఆర్టికల్స్ రూపంలో మనకు కనిపిస్తాయి. 25 నవంబర్ 1950న చేసిన ఈ ప్రసంగంలో అంబేద్కర్ మరొక విషయాన్ని కుండబద్దలు కొట్టినట్టు చెప్పారు. 'షెడ్యూల్డ్ కులాల ప్రయోజనాల రక్షణ ఆశయంతోనే నేను రాజ్యాంగ సభలోకి అడుగుపెట్టాను. అంతకన్న గొప్ప ఆకాంక్ష ఏమీలేదు' అని చెప్పారు. అయితే షెడ్యూల్డ్ కులాల కోసం రాజ్యాంగంలో పొందుపరిచిన అంశాలేమిటి? వాటి అమలు తీరు ఎలా ఉందనే విషయాన్ని ఆర్టికల్స్ వారిగా పరిశీలిస్తే బాగుంటుంది.

(రచయిత సీనియర్ పాత్రికేయులు)

రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా కుల వ్యవస్థను నిలిపి ఉంచడంలో పాలకుల ప్రయోజనాలు ఉన్నాయంటున్నారు

తోట సత్యనారాయణ, తిరునగరి మనోహరస్వామి

సామాజిక న్యాయం అందేదెప్పుడు?

'సామాజిక న్యాయం' అనే పదం భారత రాజ్యాంగ చట్టంలోనూ, మార్గదర్శక సూత్రం లోనూ వివరించబడింది. ప్రాథమిక హక్కులలో కూడా చేర్చారు. ఆర్టికల్ 13, 14, 15, 16లలో వివరించారు. దీని సారాంశం ఏమంటే వివిధ కులాలుగా ఉన్న ప్రజలు అంతా సమానులే. అంటరానితనం, ఉచ్చనీచాలు చూపడం, ఒకరికి ఎక్కువ ప్రాధాన్యత, మరొకరికి తక్కువ ప్రాధాన్యత ఉండకూడదు. మానవులు అంతా సమానులే. కులం, మతం, లింగ బేధాలతో అసమానతలు ఉండ కూడదు. చట్టం ముందు అంతా సమానులే అనేది కూడా ఇందులో భాగమే.

సమాజంలో ప్రస్తుతం కొన్ని అగ్రకులాలకు ఒక ప్రత్యేక గౌరవస్థానం ఉంది. బ్రాహ్మణ, క్షత్రియ, రెడ్డి, కమ్మ, వెలమ మొదలైన కులాల వారు మిగిలిన కులాల వారికన్నా అధికులుగా ఉన్నారు. మాల, మాదిగ, రెల్లి, డక్కలి, సింధు మొదలగు షెడ్యూల్డ్ కులాలవారు అధములుగా చూడబడుతున్నారు. వెనుకబడిన కులాలలో చాకలి, మంగలి వారిని కూడా అధములుగా చూస్తారు. కమ్మరి, కుమ్మరి, కాపు, గౌడ, గొల్ల మొదలగు వెనుకబడిన కులాలవారు అటు అగ్రవర్ణాలకు ఇటు అధమ కులాలకు మధ్యగా ఉంటారు. అటు అగ్రకులాలకు చెందరు. అస్పృశ్యతలాంటి వివక్షాయుత నీచ అవమానాలకు గురికారు కాని, వీరు కూడా అగ్రవర్ణ అధికార దురహంకారానికి కొంత మేరకు గురవుతూ ఉంటారు. మరొకవైపున అధమ కులాలకన్నా గొప్పవారమన్నట్లు ప్రవర్తిస్తారు.

'కుల వివక్షత' అనే ఈ సాంఘిక జబ్బు సమాజంలో క్యాన్సర్ వ్యాధిలాగా పని చేస్తోంది. కుర్చీల మీద, మంచాల మీద, అరుగులపై కూర్చోవడం (ఒక్క మాటలో చెప్పాలంటే ఎత్తైన ప్రదేశంలో కూర్చోవడం) ఒక్క అగ్రవర్ణాలకే ప్రత్యేక హక్కుగా పరిగణించబడుతోంది. అగ్రవర్ణాల వారు చూడని ఎత్తైన ప్రదేశాలలో మాత్రమే అధములు, వెనుకబడిన కులాలవారు కూర్చుంటారు.

అలాగే పలకరింపులలో కూడా తేడాలు ఉంటాయి. అగ్రవర్ణాల వారిని 'అయ్యా', 'ఏమండి', 'గారు' అని విధిగా పిలువ వలసి ఉంటుంది. కాని అధములు 'ఒరేయ్', 'ఏరా', 'వారి' అని పిలువబడతారు. అవమానపరిచే రీతిలో కులం పేరు పెట్టి సంబోధిస్తారు. మధ్యస్తంగా ఉండే వెనుకబడిన కులాల వారిలో కొందరు చాకలి, మంగలి, గొల్ల, కురములు, ముదిరాజులు, కుమ్మరివారు 'వారి', 'ఒరేయ్' అని సంబోధించబడతారు.

అగ్రవర్ణాలలో పేదలుగా ఉన్నవారు కూడా తమ వర్ణంలోని ధనిక, పెట్టుబడిదారీ భూస్వాముల చేత నీచంగా, అగౌరవంగా చూడబడతారు. కూర్చుండే స్థలం, పలకరింపుల విషయాలలో తక్కువగా చూడబడతారు. సాంఘికంగా ఉన్న ఈ అసమానతలు పోవాలి. సామాజిక న్యాయంలో ఇదే కీలక అంశం.

అధములు, వీరినే నిమ్న కులాల వారు, దళితులు అని కూడా అంటారు. వీరికి ఉత్పత్తి సాధనాలైన భూములు, పశువులు, ఫ్యాక్టరీలు ఏమీ ఉండవు. కొద్దో గొప్పో భూమి ఉన్నా వారి పోషణకు కూడా సరిపోదు. ప్రధానంగా వీరు రెక్కలమ్ముకొని కూలీ నాలీ చేసుకొని జీవిస్తారు. ఉండడానికి ఇంటి వసతి ఉండదు. ఒంటికి బట్ట ఉండదు. కడుపుకు సరిపోను తిండి ఉండదు. పిల్లలు, పెద్దలు, వృద్ధులు అంతా పొట్ట కూటి కోసం కాయకష్టం చేస్తారు. వీరికి వైద్య, విజ్ఞానాలు శూన్యం. లేదా బహు తక్కువ. వీరి ఆర్థిక పరిస్థితి చక్కబడకపోతే మనుగడ సాగించలేరు. అందుకోసం వీరికి దున్నుకోవడానికి భూమి కావాలి. ఏదో ఒక తరహా పరిశ్రమలైనా లేదా ఉద్యోగాలైనా ఉండాలి.

అగ్రవర్ణాలలో కొద్దిమంది మాత్రమే భూస్వాములుగాను, ధనికులు గాను, పెట్టుబడిదారులు గాను ఉన్నారు. అత్యధిక శాతం భూములు వారి చేతుల్లోనే ఉన్నాయి. నూటికి నూరు పరిశ్రమలు, బ్యాంక్‌లు వీరి చేతుల్లోనే ఉన్నాయి. ప్రధానమైన ప్రభుత్వ ఉద్యోగాలు, ఉన్నత పదవులు అన్నీ వీరి చేతుల్లోనే ఉన్నాయి. రాజ్యాంగంలో ఆదేశించినదానికి విరుద్ధంగా, సంపాదనంతా వీరి చేతుల్లోనే కేంద్రీకృతమవుతోంది. గుత్తాధిపతులు అవుతున్నారు. వెనుకబడిన కులాలలో అత్యధిక భాగం భూమి గాని, పరిశ్రమలుగాని లేనివారే ఉన్నారు. ఆర్థిక పరిస్థితి బాగు పడకుండా మనుషులుగా మనుగడ సాగించలేరు. విద్యా, వైద్యం లభ్యం కావు.

రాజ్యాంగ చట్టంలో నిర్దేశించబడిన సూత్రం – ఆదాయాలలో వ్యత్యాసాలు బహు తక్కువగా ఉండాలనే సూత్రం, దారిద్ర్యరేఖకు దిగువన లేకుండా చేయాలనే సూత్రం, సంపద అంతా కొద్దిమంది చేతులలో పోగుపడకుండా ఉండాలనే సూత్రం మన పాలకులు ఏనాడో గాలికి వదిలేశారు. అంతా సమానంగా బతకాలనే సోషలిస్టు సమాజస్థాపన లక్ష్యం కూడా వదిలేశారు. భూస్వాముల భూములు పేదలకు పంచకుండా, గుత్తసంస్థల ఆస్తులు, పెట్టుబడులు, పరిశ్రమలు, బ్యాంకులు మొదలయినవి స్వాధీనం చేసుకొని ప్రభుత్వ రంగంలో నడపకుండా పేదరికం పోదు.

ఈ వ్యత్యాసాలు ఉండడానికి మూలకారణం దోపిడి వర్గాల రాజ్యాంగ యంత్రాంగం. భారతదేశంలోని కులవ్యవస్థ తొలుత కుల వ్యత్యాసాలు, హెచ్చు తగ్గులు లేని వివిధ వృత్తులతో కూడిన వ్యవస్థగా ఉండేది. శ్రమ గౌరవప్రదంగా పరిగణించేవారు. ఎప్పుడైతే బానిస వ్యవస్థ ఏర్పడిందో అప్పటి నుండి మార్పులు వచ్చాయి. భారతదేశంలో బానిస వ్యవస్థ సుమారు ఆరు వేల సంవత్సరాల క్రితం ఏర్పడినట్లు చరిత్రకారుల అభిప్రాయం. బానిస వ్యవస్థ తొలి దోపిడి వ్యవస్థ. ధనికులు – పేదలు, ఉన్నవారు – లేనివారు, బానిస ప్రభువులు – బానిసలు అనే వర్గ వ్యవస్థ ఏర్పడింది. అందులోనే వివిధ వృత్తులను సమానంగా కాకుండా ఎక్కువ ఆదాయం రాగల వృత్తులను ఎక్కువ దృష్టితో చూడడం, తక్కువ ఆదాయం రాగల వృత్తులను హీన దృష్టితో చూడడం అప్పుడే ప్రారంభమైంది. వృత్తులను బట్టి కులాలు ఏర్పడ్డాయి. ఆ కులాలను అగ్రకులాలుగాను, నిమ్నకులాలుగాను చూడడం ప్రారంభమైంది.

వేదాలను, ధర్మశాస్త్రాలను, పురాణాలను తొలి దోపిడి వ్యవస్థను కాపాడే విధంగా ధనిక, పేద తేడా కలిగిన వర్గ వ్యవస్థను కాపాడే విధంగా, కులాలకు ఉచ్చ, నీచ స్వభావాలను కల్పించే విధంగా రూపొందుతూ వచ్చాయి. అదే మత భావనగా, అంతా దైవసృష్టి అని, వర్గ వ్యత్యాసాలు, కుల వ్యత్యాసాలు చేసుకున్న పాప పుణ్యాలను బట్టి భగవంతుడు నిర్ణయిస్తాడని, భగవంతుని ప్రార్థించి పుణ్యం చేసుకొని వచ్చే జన్మలో నీచకులాలలో కాకుండా అగ్రకులాలలో పుట్టవచ్చునని, ఇంకా పుణ్యం చేసుకుంటే మోక్షం వస్తుందని, మళ్లీ పుట్టుకే లేకుండా ఉంటుందని సిద్ధాంతాలు చేశారు. కేవలం ప్రజలను విభజించి ఉంచడానికి అణచి ఉంచడానికి బానిసలను, నిమ్నకులాలను మోసం చేయడానికి చేసిన ప్రయత్నమది. దీనినే హిందూ ధర్మశాస్త్రమని చెబుతుంటారు.

కొన్ని వేల సంవత్సరాలుగా కులం పేరుతో ప్రజలను విభజిస్తూ వచ్చారు. పాలకవర్గాలు ఒక కులానికి వ్యతిరేకంగా మరొక కులాన్ని రెచ్చగొడుతూ తమ మనుగడను కొనసాగించుకుంటున్నాయి. తద్వారా కులద్వేషాలు బాగా పెరిగాయి. ఈ రాజ్యాంగ యంత్రాన్ని అగ్రవర్ణాలకు చెందిన ప్రభువులు, జమీందారులు, భూస్వాములు, పెట్టుబడిదారులు వరుసగా నడుపుతున్నారు. పాలకులు తమ ఆధిపత్యాన్ని, దోపిడీని రక్షించుకోవడానికి అవసరమైనపుడల్లా తమ కులస్తులను 'మనమంతా ఒకటి, మన కులమంతా ఒకటి' అన్న నినాదాలతో సమీకరించుకుంటూ ఉండే వారు. ఇప్పటికీ ఆ పని చేస్తూనే ఉన్నారు.

దళిత, గిరిజన, వెనుకబడిన కులాల వారిలో చదువుకున్న వారి సంఖ్య పెరుగుతున్నాకొద్దీ తమ ఆత్మగౌరవ చైతన్యంతో ప్రశ్నిస్తున్నారు. కుల వ్యత్యాసాలకు, సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా ఆత్మగౌరవ పోరాటాలు చేస్తున్నారు. అగ్రకులం, అధమకులం ఏమిటి? అందరూ సమానంగా ఎందుకు ఉండకూడదు అనే ప్రశ్నలు వారిని కలవర పరుస్తున్నాయి. జ్యోతిబాపూలే, అంబేద్కర్, పెరియార్ మొదలగు వారి రచనలు చదువుతున్నారు. తమ తమ కులాలకు రాజకీయ నాయకుల నుండి ఏమైనా పనులు చేయించుకోవాలంటే తాము కుల సంఘంగా ఏర్పడాలి. కులాన్ని సంఘటిత పరుచుకోవాలి. ఓట్ల సమయంలో బేరసారాలు చేయగలగాలి. తమ కులస్తులున్న వీధులకు రోడ్లు వేయించుకోవడం, మంచినీటి సదుపాయాలు కలుగచేసుకోవడం, విద్యా సంస్థలు విస్తృత పరుచుకోవడం, ఇళ్ల స్థలాలు, ఇళ్లు, ఉద్యోగాలు పొందడం, శాసనసభలలోనూ, స్థానిక సంస్థల ఎన్నికలలోనూ కొంత ప్రాతినిధ్యం పొందడం మొదలయినవి సాధించుకోవడానికే పరిమితమైనారు. ఏ రాజకీయ నాయకుడు తమకు ఇలాంటి సదుపాయాలు కలుగజేస్తే ఆ రాజకీయ నాయకుని వెంట ఉండడం జరిగింది.

ఒకే కులానికి చెందిన వివిధ సంఘాలు నాలుగు ప్రధాన కూటముల కింద సంఘటితమైనాయి, అవుతున్నాయి. (1) గిరిజనుల సంఘం (2) దళిత ఫెడరేషన్ (3) వెనుకబడిన తరగతుల సంఘం (4) ముస్లిం మైనారిటీల సంఘం. ఈ నాలుగు కూటములు వివిధ పేర్లతో పిలువబడుతున్నప్పటికీ మన పరిశీలనా సౌలభ్యం కోసం ఈ విధంగా విభజించడం జరిగింది. ఇప్పుడు ఈ నాలుగు కూటముల వారు కూడా కలిసి పోరాడనిదే తమ సమస్యలు పరిష్కారం కావని గమనించారు. ఈ నలుగురు ఐక్యత కోసం – ఎస్.సి., బి.సి., ముస్లిం మైనారిటీ సంఘాల ఐక్యత కోసం పిలుపునివ్వడం జరుగుతూ ఉంది. సంయుక్త సమావేశాలు నిర్వహిస్తున్నారు.

ఇంతకూ ఈ సంఘాల లక్ష్యం ఏమిటి? విడివిడిగా చూసినప్పుడు ప్రతి కుల సంఘం తమ జనాభా నిష్పత్తి ప్రకారం విద్యాసంస్థలలోనూ, ఉద్యోగాలలోనూ, సంక్షేమ పథకాలలోనూ రిజర్వేషన్లు కావాలని కోరుతోంది. రాజకీయ సంస్థలలో కూడా తమకు రిజర్వేషన్లు కావాలని అడుగుతోంది. అంతిమంగా అణగారిన కులాలు తమ హక్కులను ఐక్యతతో పోరాడి సాధించుకోవాల్సిందే.

(రచయితలు కాకతీయ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్, రిసెర్చ్ స్కాలర్)

పాలకపార్టీలు చేపడుతున్న ప్రజాకర్షక పథకాలు ప్రజల మౌలికావసరాలు తీర్చకున్నా, అత్యధికంగా పేదలున్న మనదేశంలో తిండి గింజలకు భరోసానిచ్చే ఆహార భద్రత చట్టం అవసరం అంటున్నారు **వి. చలపతిరావు**

జాతీయ ఆహార భద్రత చట్టం

యు.పి.ఎ. – 2 ప్రభుత్వం జాతీయ ఆహార భద్రత చట్టం పేర ఒక చట్టాన్ని తెచ్చి పేద ప్రజలకు ఆహార భద్రత కల్పిస్తామని ప్రకటించింది. ఇది సహజంగానే ప్రజలలో ఆశలను రేకెత్తించింది. ఇదే యు.పి.ఎ. ప్రభుత్వం గత హయాంలో తాము తెచ్చిన ప్రతిష్ఠాత్మక గ్రామీణ ఉపాధి హామీ పథకం 2009 ఎన్నికలలో తమను మరల గెలిపించిందని కాంగ్రెస్ అధిష్ఠానం గట్టిగా నమ్ముతోంది. అయితే ఈ పథకం అమలులో ప్రజాధనం భారీగా రాజకీయ నాయకుల జేబులలోకి పోతోందనీ, ఈ పథకం కింద చేయించిన పనులతో గ్రామాలలో సరి అయిన అసెట్స్ గానీ, వసతుల కల్పనకు లేదా చెరువు కట్టలు, రోడ్ల నిర్మాణాలు లాంటి మౌలిక సదుపాయాలు కల్పించే పనులు జరగడం లేదనీ దేశమంతటా నిర్వహించిన సోషల్ ఆడిట్ రిపోర్ట్‌ల వల్ల తెలుస్తోంది. అది వేరే సంగతి. ఓట్లు గ్యారంటీగా తేగలవనే ఏ పథకాన్నయినా, ఏ చట్టాన్నయినా తీసుకరావడానికి ఏ రాజకీయ పార్టీ అయినా వెనకాడబోదు కదా!

అందుకే పేదలకు పట్టెడన్నం పెట్టడానికి, జాతీయ ఆహార భద్రత చట్టం పేర ఒక చట్టం తేవడానికి సోనియాగాంధీ ఆలోచిస్తున్నట్లు కనబడుతోంది. దీని ప్రకారం దేశంలో గల బీదరికం రేఖ కింద ఉన్న (బి.పి.ఎల్.) కుటుంబాలకు ప్రతి కుటుంబానికి మూడు రూపాయలకి కిలో బియ్యం చొప్పున 35 కిలోల బియ్యం, రెండు రూపాయలకు కిలో గోధుమలు చొప్పున 35 కిలోలు తప్పనిసరిగా ఇవ్వాలని ప్రభుత్వ ఉద్దేశం అని ప్రకటించింది. అయితే ఈ చట్టం కింద పైవిధంగా తిండి గింజల కోటా ఇవ్వడానికి ప్రభుత్వం ఎందుకో దారిద్ర్యరేఖను పునర్ నిర్వచించదలచుకుంది. దీనికి కారణం యు.పి.ఎ. చైర్‌పర్సన్ సోనియాగాంధీ ఈ చట్టం పరిధిలోకి ఇంకా ఎక్కువ కుటుంబాలను తీసుకరావాలని కోరుతున్నది. ఈ బాధ్యత ప్లానింగ్ కమిషన్‌కు ఒప్పచెప్పారు. కాని ప్రణాళికా సంఘంలో ఇచ్చిన నిర్వచనం ప్రకారం ప్రస్తుతం దేశంలో 27 శాతం బి.పి.ఎల్. కుటుంబాలు ఉన్నాయి. వీటిని ఓట్ల కొరకు సోనియాగాంధీ పెంచాలని చూస్తోంది. కనుక చివరికి టెండూల్కర్ కమిటీ వేసిన ఎస్టిమేట్ ప్రకారం 37 శాతం బి.పి.ఎల్. కుటుంబాలు ఉన్నట్లు, ఇష్టం లేకున్నా ప్లానింగ్ కమిషన్ సదరు ఆహార భద్రత చట్టం పరిధిని పెంచడానికి ఒప్పుకొని ఆమోద ముద్ర వేసినట్లు వార్తలు వచ్చాయి. ఇక్కడే దేశంలోని ఆర్థికవేత్తల అభిప్రాయాలకు, పాలకుల అభిప్రాయాలకు పెద్ద వైరుధ్యం ఉండి దేశ ఆర్థిక వ్యవస్థ దెబ్బ తింటోంది. అందుకే 60 శాతం ప్రజలు ఆధారపడి బతుకుతున్న దేశ వ్యవసాయరంగం గత నాలుగు అయిదేళ్ల నెగటివ్ గ్రోత్ (0.2 శాతం) లో ఉంది. ఈ రంగవృద్ధి రేటును 4 శాతం వరకు తేగలమని ప్రతిసారి మన ప్రధాని మన్మోహన్ సింగ్ చెప్పడం జరుగుతోంది. కాని దీని వృద్ధిరేటు అరశాతం కూడా ముందుకు జరిగింది లేదు. ఇక వ్యవసాయ ఉత్పత్తులరంగం స్థితి ఇంత అధ్వాన్నంగా ఉన్నప్పుడు దేశంలోని 37 శాతం కుటుంబాలకు ఆహార భద్రత ఎలా కల్పించగలుగుతారో, ఎం.ఎస్. స్వామినాథన్ లాంటి ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్తలు చెప్పాలి. ఎందుకంటే సోనియాగాంధీ కోటరిలో వ్యవసాయరంగం గురించిన అవగాహన ఉన్న మనిషి ఒక్కరు కూడా ఉన్నట్లు లేరు.

ఈనాడు ప్రపంచ దేశాలలో చాలా ప్రభుత్వాలు తమ ప్రజలకు ఆహార భద్రత కల్పించాలని చూస్తున్నాయి. ఇవి మంచి సూచికలే. లేకపోతే సోమాలియా లాంటి పరిణామాలు పునరావృతం అవుతాయి. సంపన్న దేశాలు కూడా ఈ సమస్యను పరిష్కరించడానికి తమ బాధ్యతను స్వీకరించవలసి ఉంది. ప్రస్తుతం ఉన్న ప్రపంచ జనాభా 600 కోట్లలో సగం మందిని క్షుద్బాధ పీడిస్తున్నట్లు వివిధ సర్వేలు చెపుతున్నాయి. భారతదేశంలో కూడ లక్షలాది పేద గిరిజనులు ఇప్పటికీ కాయగడ్డలు ఏరుకుని తిని తమ కడుపులు నింపుకుంటున్నట్లు, వీరంతా అర్ధాకలితో అలమటిస్తున్నట్లు, మహాశ్వేతాదేవి లాంటి ప్రముఖ రచయితలు పరిశీలించి చెపుతున్నారు. ఈ పరిస్థితి దేశ జనాభాలో 30 శాతం ఉన్న పేద గిరిజనులకు ఉన్నది. కనుక ఆహార భద్రతే కాక పౌష్టికాహార సరఫరా, ఆరోగ్య భద్రత, వీరి పిల్లలకు విద్యా హక్కు లాంటివి కూడ తప్పనిసరి చేయాలి. బ్రిటిష్ పరిపాలన కాలం నుండి వీరికున్న రక్షణ చట్టాలను కూడా తు.చ. తప్పకుండ అమలుపరచవలసి ఉంది. గిరిజనుల దయనీయ స్థితిని బ్రిటిష్ పాలకులు గుర్తించినట్లు మన పాలకులు గుర్తించడం లేదు. ఒకవేళ నిజంగా ఇప్పటి పాలకులు గుర్తించినట్లయితే చంద్రబాబు గిరిజనుల పట్టా భూములను దురాక్రమణ చేసిన వారికి ల్యాండ్ ట్రాన్సఫర్ రెగ్యులేటరీ చట్టం (రక్షణ చట్టం), 1/70 రెగ్యులేషన్స్‌కు వ్యతిరేకంగా పట్టాలు ఇప్పించడానికి ప్రయత్నం చేస్తాడా? అదే విధంగా వై.ఎస్.ఆర్. కూడా వారి పట్టా భూములను వారికి ఇప్పించక, దాని ప్రత్యామ్నాయంగా పర్యావరణ సమతుల్యం దెబ్బతినే విధంగా, రిజర్వ్ ఫారెస్ట్ భూములను వారికి పంచి పెడతాడా? వీరిద్దరూ రక్షణ చట్టాలను తృణీకరించినట్లు కాదా? పైగా దండకారణ్యం ప్రాంతంలోని గిరిజనులకు సంబంధించిన ఖనిజ సంపదనంతా

పాలకులు, కంపెనీలు కుమ్మక్కయి రక్షణ చట్టాలకు వ్యతిరేకంగా దోచుకుంటున్నాయి. ఈ కారణాల వల్లె మావోయిస్టులు ఈ ప్రాంతంలో సమాంతర పాలన నడుపుతున్నారు. సమస్య మూలాలను విడిచిపెట్టి చిదంబరం ఆయుధ శక్తితో మావోయిస్టులను అణచివేస్తానని అనడం మూర్ఖత్వం కాదా? కనుక ఈ పరిస్థితిలో పేద గిరిజనులకు పకడ్బందీగా ఆహార భద్రత ప్రతిపాదించిన విధంగా కల్పించగలిగితే గిరిజనులు శాంతించి నక్సల్ సమస్య పరిష్కారానికి మార్గం ఏర్పడవచ్చును.

ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని తమ తమ రాష్ట్రాలలో బి.పి.ఎల్. కుటుంబాలకు ఇచ్చిన రేషన్ కార్డుల ప్రకారం దేశంలో అరవై శాతం ప్రజలు దారిద్ర్యరేఖ కింద నివసిస్తున్నట్లు లెక్క. ఇక ఆంధ్రప్రదేశ్‌లో అయితే రాజశేఖరరెడ్డి హయాంలో ఇచ్చిన తెల్లకార్డుల (బి.పి.ఎల్.) సంఖ్య ప్రకారం ఈ రాష్ట్రంలో 85 శాతం ప్రజలు దారిద్ర్య రేఖ కింద నివసిస్తున్నట్లు లెక్క. ఇలా స్తోమత ఉన్నవారికి, లేనివారికి తెల్లకార్డులు ఎందుకు ఇచ్చారో అందరికి తెలిసిన విషయమే. ప్రభుత్వంలో ఉన్న పాలకులు వారి ఓట్లు ఆశించారు. ఆరోగ్యశ్రీ లాంటి పథకాలతో లాభం పొందవచ్చని అందరూ తెల్లకార్డులకు ఎగబడ్డారు. అలాంటి బోగస్ కార్డులు ఇప్పుడు పది లక్షలు ఉన్నాయని ప్రభుత్వ లెక్కలు చెప్తున్నాయి. ఇప్పుడు వాటిని తీసివేయడం చాలా జటిల సమస్యగా మారింది.

రేపు ఆహార భద్రత చట్టం కింద ఇలాంటి బోగస్ బి.పి.ఎల్. కుటుంబాలందరికి రెగ్యులర్‌గా 35 కిలోల ఆహార ధాన్యాలు ఇవ్వాలంటే రోశయ్య బడ్జెట్ కేటాయింపులు ఎన్ని చేసినా సరిపోవు. అధికార కాంక్షతో విచక్షణా రహితంగా అమలు చేసిన సంక్షేమ పథకాలను అదే విధంగా రోశయ్య ప్రభుత్వం పొడిగించలేకపోవడానికి కారణం తెలిసింది. అయితే చాలా అనుభవజ్ఞుడు, ఎన్నోసార్లు బడ్జెట్లు ప్రవేశపెట్టిన ఆర్థిక ప్రవీణుడు అని పేరు ఉన్న రోశయ్య కూడ రాజశేఖరరెడ్డి చేసిన పుణ్య పాపాలను పంచుకోవలసిందే. ఇటీవల కాగ్, ప్లానింగ్ కమిషన్ వీరు ఇరువురు కలసి ఈ రాష్ట్రంలో అమలు చేసిన సంక్షేమ పథకాల అమలు తీరును తీవ్రంగా తప్పుపట్టాయి.

అన్నింటికన్న ముఖ్యంగా అసలు దేశంలో ఆహారోత్పత్తి సమృద్ధిగా ఉంటేనే కదా దేశ ప్రజలకు ఆహార భద్రత చట్టం ద్వారా భద్రత కలిగించ కలిగేది. ఇప్పుడు ఆహారోత్పత్తుల ధరలు పెరగడానికి లేదా ఆహారోత్పత్తుల ద్రవ్యోల్బణం 17 శాతం వరకు పెరగడానికి కారణం, ఒకటి మిల్లర్లు, చీకటి వ్యాపారస్తులతో ప్రభుత్వంలో ఉన్న పెద్దలు కుమ్మక్కయి పోవడం. రెండవ ముఖ్య కారణం, దేశంలో ఆహారోత్పత్తుల దిగుబడి చాలా పడిపోవడం. వెరసి ఆహారోత్పత్తులు, ముఖ్యంగా బియ్యం, కందిపప్పు, ప్రస్తుతం పెసర పప్పు లాంటి వాటి ధరలు 10 శాతం వరకు పెరిగి పేద, మధ్యతరగతి ప్రజలను బాధ పెడుతున్నాయి. ధరలు పెరిగి ప్రజలను గత మూడేండ్ల నుండి పీడిస్తుంటే ఇప్పుడు ప్రతిపక్షాలు అన్నీ ఏకమై 27 ఏప్రిల్‌న దేశవ్యాప్తంగా హర్తాళ్‌కు సిద్ధమయ్యాయి. పార్లమెంట్‌లో ఈ అంశంపై కట్‌మోషన్ లేపడానికి సిద్ధమయినాయి. దీనికి తోడుగా ప్రభుత్వం డీజిల్, పెట్రోల్ ధరలను కూడా మరోసారి పెంచడం వలన రవాణా చార్జీలు పెరిగి ధరలు మరింత పెరిగే అవకాశముంది.

ప్రస్తుత దశలో దేశంలో వ్యవసాయరంగం ఆహారోత్పత్తులలో వెనుకబడి ఉన్నా, ఆహారోత్పత్తుల ధరలు ఆకాశాన్నంటి ఉన్నప్పటికీ, రాష్ట్రాలలో ఉన్న బి.పి.ఎల్. రేషన్ కార్డుల ప్రకారం 60 శాతం జనాభాకు బియ్యం, గోధుమలు సరఫరా చేస్తున్నప్పటికీ, సోనియాగాంధీ 2014 ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని సదరు జాతీయ ఆహార భద్రత చట్టాన్ని పార్లమెంట్‌లో ప్రవేశపెట్టదలచుకుంది. ఇది కూడా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వలె ప్రజాకర్షణ చట్టం అవుతుందని ఆమె ఆలోచన. మహిళా రిజర్వేషన్ చట్టంతో పాటు ఈ చట్టాన్ని కూడ తీసుకవచ్చి నట్లయితే వచ్చే ఎన్నికలలో కాంగ్రెస్ మరల అధికారంలోకి రావడం చాలా సులువు అని ఆమె ఆలోచన. అప్పుడు తన తనయుడు రాహుల్ గాంధీ దేశ ప్రధాని కావడం తథ్యం అని ఆమె ఆలోచన. దాని కొరకు ఆమె ఇదివరకే రాహుల్‌ను కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీగా నియమించింది. ఇప్పుడు ఆయనను ఏకంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించింది. ఈ ఎక్సర్‌సైజ్ అంతా రాహుల్‌ను గద్దె ఎక్కించడానికే అన్నది కనబడుతోంది.

జాతీయ ఆహార భద్రతా చట్టం తీసుకరావడానికి రాజకీయ ఉద్దేశాలు ఏమున్నప్పటికీ, భారతదేశం లాంటి పేద దేశానికి ఈ ఆహార భద్రత చట్టం వరంలాటిది అని చెప్పవచ్చు. అయితే ఇది సరిగ్గా అమలు చేయగలగాలి. వాస్తవానికి ఇప్పుడున్న ప్రజా పంపిణీ వ్యవస్థకు మరింత బలం చేకూర్చి కూడ ఆహార భద్రత చేకూర్చవచ్చు. ఇప్పుడు సదరు ఆహార భద్రత చట్టం కింద సరఫరా అవుతున్న తిండి గింజలు ఇదే ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారానే సరఫరా చేస్తూ లేదా వేరే ఇంకొక వ్యవస్థ సమాంతరంగా నడుపుతారా వేచి చూడవలసి ఉంది.

ఏది ఏమయినప్పటికి దేశంలోని పేద ఎస్.సి., ఎస్.టి., బి.సి. వర్గాలకు సదరు చట్టం కింద తిండి గింజలు తప్పనిసరిగా ఆహార హక్కుగా ఇవ్వవలసిందే. ముఖ్యంగా దేశ జనాభాలో 30 శాతంగా ఉన్న గిరిజనులను ఈ చట్టం పరిధిలో తీసుకవచ్చి వారందరికి తప్పని సరిగా లోటుపాట్లు లేకుండా ఆహార ధాన్యాలను సరఫరా చేయడమే కాక వారికున్న రక్షణ చట్టాలను తు.చ. తప్పక అమలుపరిస్తే, ప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న మావోయిస్టు సమస్య దానంతట అదే పరిష్కారమవుతుంది.

(రచయిత రిటైర్డ్ ప్రభుత్వ అధికారి) వీ

పెట్టుబడిదారీ విధానంలో సంక్షోభాలు అనివార్యమన్న కార్ల్‌మార్క్స్ సిద్ధాంతం మళ్లీ మళ్లీ రుజువు అవుతోందనీ, మార్క్స్ చెప్పిన పరిష్కారాల వైపు అందరూ చూడాల్సిన అవసరం ఉందనీ అంటున్నారు **ఇ.ఎస్. బ్రహ్మచారి**

అమెరికా స్తబ్ధ దశాబ్దం

'ఎకానమీ ఇంత తీవ్రంగా ఉన్నప్పుడు చర్యలు తీసుకోవడంలో జాప్యం చేస్తే, దాన్నుంచి బయటపడడం మరింత కష్టమవుతుంది. అలా జరగడం 1990లలో జపాన్‌లో మనం చూశాం. అక్కడ వాళ్లు స్తబ్ధ దశాబ్దాన్ని అనుభవించారు' అన్నాడు ఒబామా. 2009 ఫిబ్రవరి 9 న తన పాకేజ్ అవసరం అనేందుకు రుజువుగా చెప్పాడు. అది పాసయ్యాక ఆ ఊసే ఎత్తలేదు. కాని అమెరికా స్తబ్ధ దశాబ్దాన్ని చవిచూచింది.

జపాన్ గురించి రెండు రకాల మాటలు వింటూంటాం. ఒకటి జపాన్ మిరాకిల్ అయితే రెండోది జపాన్ స్తబ్ధ దశాబ్దం. మొదటిది ప్రపంచాన్ని అబ్బుర పరిస్తే రెండోది కలవరపరిచింది.

రెండో ప్రపంచయుద్ధం తర్వాత జపాన్ ఎకానమీ ఊపందుకుంది. జపాన్ మిరాకిల్ మొదలైంది. 1991 లో జపాన్ ఆస్తుల బుడగ పేలింది. పదేళ్లపాటు (1991-2000) స్తబ్ధత నెలకొన్నది

రెండో ప్రపంచ యుద్ధం తర్వాత జపాన్ నాశనమయింది. 1950లకల్లా పుంజుకుంది. ఏడాదికి 10 శాతం వృద్ధి నమోదు చేసింది. ఏ ఇతర పెట్టుబడిదారీ దేశమూ అప్పట్లో ఇంత వేగంగా పెరగలేదు. 1965లో జపాన్ జాతీయోత్పత్తి 9100 కోట్ల డాలర్లు. 1980కల్లా అది 11 రెట్లయి, 1లక్ష డాలర్లు దాటిపోయింది. ఇకెడా హయాం అయ్యేసరికి జాతీయోత్పత్తి వృద్ధి రేటు 13.9 శాతం ఉంది. 1956 - 1973 మధ్య ఏటా 9 శాతం వృద్ధి ఉంది. 1980లలో కూడా 4 శాతం ఉంది. సంపదలో అమెరికాని తలదన్ని నిలబడుతుందని అన్నారు. జపాన్ స్వర్ణయుగం అంటూ కొనియాడారు. జపాన్ సూపర్ మాన్ అజేయుడనీ, ఆ జగన్నాథ రథ వేగాన్ని నిరోధించడం అసాధ్యమని అమెరికన్లు అనేవారు. 'రైజింగ్ సన్' అనీ, 'జపాన్ నం.1' అనీ పుస్తకాలు వెలువడ్డాయి.

ఎగుమతులు జపాన్ వృద్ధికి చోదకాలు. అదంతా ఎగుమతుల వల్ల వచ్చిందే. పోటీ దేశాలు యెల్లో పెరిల్‌గా భావించాయి. పెద్ద పెట్టుబడిదారీ దేశం రూపుదిద్దుకొంటున్నదనే అర్థంలో ఆ పదాల్ని ఉపయోగించేవారు. 1945 తర్వాత ప్రపంచ వర్తకం డాలర్లలో జరిగేది. డాలర్ రిజర్వ్ కరెన్సీగా ఉండేది. ఇతర కరెన్సీలతో మారకపు విలువ నిలకడగా ఉండేది. యుద్ధానంతరం ఎక్కువ కాలం డాలర్‌కి 360 యెన్లు. అదే జపాన్ ఎగుమతులు పెరగడానికి కారణం. అయితే 1971లో అమెరికా బిల్లులు చెల్లించలేక డాలర్ మారకపు విలువ తగ్గడానికీ పెరగడానికీ అనుమతించింది. అప్పటి నుంచీ ఫ్లోటింగ్ మారకపు విలువలొచ్చాయి. యెన్ బలపడింది. 1970ల మధ్యలో డాలర్‌కి 210 యెన్లు వచ్చేవి. 1988 కి 120 మాత్రమే వచ్చేవి. అయినా 70 దశకంలో 5 శాతమూ, 80లలో 4 శాతమూ వృద్ధి ఉంది. రీగన్ కాలంలో అమెరికా ఎకానమీ మరింత దెబ్బతింది. లోటు పూడ్చుకోడానికి 1985 (ప్లాజా అకార్డ్)లో డాలర్ని పడిపోనివ్వాలని నిర్ణయించారు. దీంతో యెన్ పైకి పోయింది. ఎగుమతులు తగ్గాయి.

జపాన్ బ్యాంకులు ఉదారంగా అప్పులివ్వడం మానేశాయి. భూమి చూపిస్తేనే అప్పులిచ్చేవి. 1985 తర్వాత భూముల ధరలు పెరగడానికి కారణం ఇదే. వడ్డీ అయిదున్నర శాతం నుంచి రెండున్నర శాతానికి తగ్గించింది. ఎగుమతులు తగ్గాయి గనక వృద్ధి కొనసాగడానికి ఇది తప్పదని ప్రభుత్వం భావించింది. జనం భూములు కొనడానికి అప్పులు చేశారు. ఆ భూముల్ని చూపి మరిన్ని అప్పులు చేశారు. భూమికి గిరాకీ పెరిగి 1985-90 మధ్య ధరలు విపరీతంగా పైకెక్కాయి. కంపెనీల భవనాలూ, మిషన్లూ, సరుకులూ అన్ని కలిపినా అవి ఉన్న భూమి ఖరీదు కంటే తక్కువయ్యాయి. 1985-90 మధ్య టోక్యోలో భూమి ధరలకు రెక్కలొచ్చాయి. 1989లో గింజా జిల్లాలో చదరపు అడుగు 93 వేల డాలర్లు పలికిందట. కాలిఫోర్నియా రాష్ట్రం విలువకంటే జపాన్ రాజ ప్రాసాదం (ఇంపీరియల్ ప్యాలెస్) విలువే ఎక్కువని గొప్పలు పోయేవారు జపనీయులు.

1989 డిసెంబర్ 29 న నిక్కీ ఒకదశలో 38,957 పాయింట్లు తాకింది.

1980ల మధ్యలో యెన్ బలపడి, జపాన్ సరుకులు ప్రపంచ మార్కెట్‌లో ప్రియమయ్యాయి. దక్షిణ కొరియా, తైవాన్ దేశాలు గట్టి పోటీదారులయ్యాయి. అప్పటి నుంచీ జపాన్ ఎగుమతులు తెచ్చిన వృద్ధి ముగిసింది. 1990లలో సగటున ఏడాది వృద్ధి రేటు కేవలం 1.5 శాతమే. 1990లో నిరుద్యోగం రేటు 2.1శాతం. 2001 కి 5శాతానికెక్కి కూచుంది. ఆస్తుల ధరలు మహాసంక్షోభంలో ప్రపంచమంతటా పడినట్లు పడ్డాయి. ఇక నిక్కీ 1990 సెప్టెంబర్ కి సగానికి పడిపోయింది. 2003 ఏప్రిల్‌లో 7830 కి దిగిపోయింది. వ్యాపార పెట్టుబడి 1990లో ఎంత ఉందో, 2002 లోనూ అంతే ఉంది. ఏకోణంలో చూసినా అది జపాన్ కోల్పోయిన దశాబ్దమే. బుడగలు పేలితే నియంత్రించడం సాధ్యం కాదు అనడానికి జపాన్ ఒక ఉదాహరణ. జపాన్ ప్రభుత్వం చేతులు ముడుచుకు కూర్చోలేదు. విశ్వ ప్రయత్నం చేసింది. కీన్స్ పద్ధతులు అవలంబించింది. పదేళ్లలో కోటి కోట్ల యెన్లు వెచ్చించింది. దీంతో భారీ లోటు ఏర్పడింది. అంతేకాదు, ద్రవ్య విధానాలూ చేపట్టారు. వడ్డీని

అర శాతానికి తగ్గించారు. ఇవేవీ పని చెయ్యలేదు. స్పెక్యులేటర్లు తక్కువ వడ్డీకి తీసుకుని అమెరికా లాంటి ఎక్కువ ఆదాయం వచ్చే దేశాలకు తరలించి లాభించారు. 1989 నుంచి ఈ 20 ఏళ్లలో పెద్దగా వృద్ధయింది లేదు. పారిశ్రామికోత్పత్తి 1980ల స్థాయిలోనే ఉంది. ప్రస్తుతం ప్రతి ద్రవ్యోల్బణంలో మగ్గుతోంది. ప్రభుత్వ అప్పు జి.డి.పి కి రెట్టింపుంది. జపాన్ లాంటి పరిస్థితినే పాశ్చాత్య దేశాలూ అనుభవిస్తున్నాయి. జపాన్ ఏమి చేసిందని ఈ దేశలు పరిశీలిస్తున్నాయి. కాని ఏమిచేసినా అక్కడ జరిగిందేమీ లేదు. జపాన్ అమెరికాని మించి మొదటి స్థానాన్ని దక్కించుకుంటుందనుకున్నారు. అయితే తన రెండో స్థానాన్ని చైనాకిచ్చి మూడో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వస్తుందని ఇప్పుడంటున్నారు.

2004 వచ్చేసరికి ఇళ్లధరలు అతిఎక్కువ ఉన్నప్పుడు దానిలో 10వ వంతుకి దిగాయి. వ్యాపార రియల్ ఎస్టేట్ 100 వంతుకు కుప్పకూలింది. జపాన్ ఆస్తిబుడగ పేలడంవల్ల 16 లక్షల కోట్ల ఆస్తులు ఆవిరయ్యాయి. ఇది ఆ దేశ జాతీయోత్పత్తికి మూడు రెట్లు.

భూముల ధరలు చుక్కలు చూడడంతో, వ్యాపారాలకి పెట్టుబడులు ఎక్కువ కావలసి వచ్చాయి. దాంతో లాభం రేటు సగానికి పడిపోయింది. వికాసం ముగిసే సరికి లాభం రేటు కొద్ది స్థాయికి పడిపోయింది అని ఆంద్రూ గ్లిన్ తన పుస్తకం 'కాపిటలిజం అన్‌లీష్డ్'లో రాశాడు. ఇదంతా ఒక బుడగ అని తెలుసుకున్నాక కూడా ఇటలీ, ఇంగ్లండ్, అమెరికా, ఐర్లండ్, స్పెయిన్‌లలో పెరిగిన ఇళ్ల ధరల గురించి ఆలోచించని ఆర్థికవేత్తల్ని ఏమనాలి?

జపాన్ 19 ఏళ్లు స్తబ్దతలో మగ్గింది. జాతియోత్పత్తి సగటున 0.6 శాతం మాత్రమే. బుడగ పేలినప్పటి నుంచీ ప్రభుత్వం 8 ఉద్దీపన పథకాలు పెట్టింది. లక్ష కోట్ల డాలర్లు ఖర్చు చేసింది. అయినా సమస్య సమసిపోలేదు. ప్రభుత్వ రుణం జాతీయోత్పత్తికి ఒకటిన్నర రెట్లయింది. ఇప్పుడయితే రెండు రెట్లు.

ఇక అమెరికా విషయానికొస్తే, 1991 మార్చ్‌లో వికాసం మొదలైంది. పదేళ్లు నడిచింది. ఆ పదేళ్లలో 2 కోట్లా 40 లక్షల ఉద్యోగాలొచ్చాయి. నెలకి సగటున 2 లక్షలన్నమాట. నిరుద్యోగం రేటు 4 శాతానికి తగ్గి దాన్ని చుట్టుకొని కొంతకాలం నిలకడగా ఉంది. నెల నెల ఉత్పాదకత పెరిగింది. స్థూల జాతీయోత్పత్తీ అంతే. వడ్డీ రేట్లు తక్కువ. ద్రవ్యోల్బణం రేటూ తక్కువే. బడ్జెట్ లోటుపోయింది. చాలా మంది అమెరికా శ్రామికులకి ఆదాయం పెరిగింది. ఇంతటి సూచికలున్నది 1960లలో మాత్రమే. అయితే ఇదే చరిత్రలో ఎక్కువ కాలం ఉన్న వికాసం.

అయితే 1999 చివర నుంచి 2009 చివరవరకూ పదేళ్లు అమెరికా ఎకానమీ ఏమాత్రం ఎదగలేదు.

స్టాక్స్ విషయానికొస్తే, 1999 చివరికంటే తగ్గిఉన్నాయి. అప్పుడు 10,000 తాకగానే ఆ సంబరం అంబరాన్నంటింది. '36,000' అనే పుస్తకంలో త్వరలో 36 వేలు చేరతుందని ఉంది. అయితే 2009 చివరలో ఎక్కడ ముగిసిందీ తెలిసిందే – 10428. 1999 డిసెంబర్ 31న 11,497. అంటే ఈ 10 ఏళ్లలో 9.28 శాతం తగ్గింది. అలాగే ఎస్.అండ్ పి. 24.1 శాతం, నాస్డాక్ 44.2 శాతం పడిపోయాయి. మాంద్యాలు ఇకముందు రానే రావు అనే నమ్మకంతో రాసిన పుస్తకం అది.

కార్మికశాఖ సమాచారం ప్రకారం 1999 ముగిసేసరికి అమెరికాలో ప్రైవేట్ సంస్థల్లో 11 కోట్ల ఉద్యోగాలు ఉన్నాయి. సరిగ్గా పదేళ్లకి అంటే 2009 చివరకి10 కోట్ల 84 లక్షలున్నాయి. 16 లక్షలు తగ్గాయన్నమాట. శాతంలో చెబితే 1.4 శాతం. ప్రభుత్వ ఉద్యోగాలని కూడా కలిపితే అప్పుడు 13 కోట్లా 5 లక్షలుంటే ఇప్పుడు 13 కోట్లా 9 లక్షలున్నాయి. ఈ పదేళ్లలో పెరిగింది 4 లక్షలే. 0.3 శాతం మాత్రమే. అదే కాలంలో జనాభా 9.8 శాతం పెరిగింది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఏ పదేళ్లలోనూ ఇలా మొదటికంటే చివరలో ప్రైవేట్ ఉద్యోగాలు తగ్గింది లేదు. 1990లలో ప్రైవేట్ ఉద్యోగాలు 21.2 శాతం పెరిగాయి. ఆ పదేళ్ల జనాభా వృద్ధి 13.1 శాతం.

1940 దశకంలో ఉద్యోగ వృద్ధి 38 శాతం. 50లలో 24 శాతం. 60లలో 31 శాతం. 70లలో 27 శాతం. 80లలో20 శాతం. 90లలో 21.2 శాతం. పోయిన పదేళ్లలో ప్రభుత్వోద్యోగాలన్నీ కలిపి చూస్తే 0.3 శాతం పెరిగాయి

2010 జనవరి మొదట్లో కాన్ఫరెన్స్ బోర్డ్ చేసిన సర్వే ప్రకారం ఉన్న ఉద్యోగుల్లో నూటికి 45 మంది మాత్రమే తృప్తిగా ఉన్నారు. 1987లో 61 మంది బాగున్నామన్నారు. పోయిన రెండు దశాబ్దాలలోనూ అసంతృప్తి పెరుగుతూ వస్తోంది. 25 ఏళ్ల లోపు వాళ్లు మరీ అసంతృప్తితో ఉన్నారు. క్రిస్మస్ కాలంలో పిల్లలు శాంతాక్లాస్ ని తమ తల్లిదండ్రులకు ఉద్యోగాలు ఒచ్చేటట్లు చెయ్యమని కొరారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఊహించవచ్చు.

ఒక సాధారణ కుటుంబానికి అదనంగా అర్థిక ప్రయోజనాలేవీ ఒనగూరినది లేదు. 2007 బుష్ వికాసకాలంలో కూడా సగం కుటుంబాలకి ఉన్న నిజ ఆదాయం 1999లో కంటే తక్కువే. 2007 తర్వాత పరిస్థితి అందరికీ తెలిసిందే. మహా మాంద్యమూ, ఉద్యోగాలు పోతూ ఉండడమూ, ఆదాయాల పతనమూ, 2009 లో నిజ వేతనాలు 1 శాతం తగ్గాయి. కుటుంబాల అప్పు 1999తో పోలిస్తే 2008 మొదట్లో 117 శాతం పెరిగింది.

ఇళ్ల ధరలు పైస్థాయిలో ఉన్న 2006 తో పోలిస్తే అప్పటికి 40 శాతం తగ్గిపోయినట్లు యజమానుల్లో మూడవవంతు – దాదాపు 1 కోటీ 60 లక్షలమంది వాళ్ల ఇళ్ల ధరలకంటే ఎక్కువ బాకీ ఉన్నారు. ఇంకా ధరలు తగ్గితే ఇళ్ల తాళాలిచ్చి వెళ్లిపోవడమే. కొత్తవీ, అమ్ముడు కానివీ 32 లక్షల ఇళ్లు అలానే ఉన్నాయి.

ఈ పదేళ్ల మధ్యలో ధరలు అర్థం లేనివిగా ఉన్నాయి అని చెప్పినా వినే స్థితిలో లేరు. 2004 లో అప్పటి ఫెడ్ అధ్యక్షుడు అలాన్ గ్రీన్‌స్పాన్ ఇళ్ల ధరలు పెరుగుతూ ఉండడం పెద్దగా పట్టించుకోవాల్సిన విషయం కాదన్నాడు. 2005 లో బెన్ బెర్నాంకె – అప్పుడు బుష్ ప్రభుత్వంలో అధికారి– ఇళ్ల బుడగ ఏర్పడే అవకాశం లేదన్నాడు. మళ్లీ 2007 మేలో సబ్ ప్రైం మార్కెట్ వల్ల మిగతా ఎకానమీకి పెద్ద ఇబ్బందులు ఉంటాయనుకోవద్దని చెప్పాడు. ఏర్పడుతున్న ఇళ్ల బుడగని ఎందుకు గుర్తించలేక పోయారు మీ ఆర్థ శాస్త్రజ్ఞులు? బెర్నాంకె ఇంతలావు బుడగని మిస్ అయినట్లు ఎక్కడా చెప్పడు. ఆర్థిక మూలాల్ని పరిశిలిస్తే ఈ విషయం అంతుబట్టడం కష్టమేమీకాదు. చాలామంది దీన్ని గమనించారు కూడా.

2009లో వ్యక్తి దివాలాలు 14 లక్షలు మించిపోయాయి. ఇందుకు ఫోర్ క్లోజర్లూ, ఉద్యోగాలు పోవడమూ రెండూ కారణాలని వాల్ స్ట్రీట్ జర్నల్ రాసింది. 4 కోట్లా 74 లక్షలమంది అమెరికన్లు దారిద్ర్య రేఖకి దిగువన ఉన్నారు. మొత్తం జనాభాలో 15.8 శాతం అన్నమాట. వ్యవసాయ శాఖ లెక్కని బట్టి 4 కోట్ల 91 లక్షలమందికి సరైన ఆహారం లేదు. జనభాలో 6 వ వంతు. 60 లక్షలమందికి అన్నం చీటీలకొచ్చే డబ్బు తప్ప మరో ఆధారమేదీ లేదు. పిల్లల్లో దాదాపు సగం మంది వాళ్ల బాల్యంలో ఎప్పుడో ఒకప్పుడు అన్నం చీటీలమీద ఆధారపడ్డ వాళ్లే. ప్యూ రీసెర్చ్ సెంటర్ 2009 నవంబర్‌లో చేసిన అధ్యయనంలో 35 ఏళ్ల లోపు వయసు వాళ్లు నూటికి 10 మంది తలిదండ్రుల గూటికి చేరారు. 18- 24 ఏళ్లవాళ్లయితే సగం మంది అమ్మానాన్నలతో ఉన్నారు. యువకుల్లో సగం మందికి మించి ఉద్యోగాలు లేవు. ఆధునిక యుగంలో అమెరికా ఎకానమీకి సంబంధించి ఇదే అతి గడ్డు దశాబ్దం.

గట్టెక్కడానికి అప్పుడు జపాన్ ఏమి చేసిందో అమెరికా అదే చేస్తున్నది. ఫలితాలూ అవే. ఫెడ్ ఫండ్స్ రేట్‌ని 0.5 శాతానికి తగ్గించింది. ద్రవ్య సరఫరాని భారీగా పెంచింది. 2లక్షలా 70 వేల కోట్ల డాలర్లు అప్పులకీ, బెయిలవుట్లకీ, రుణాల కొనుగోలుకీ ప్రాజెక్టులకీ ఖర్చుపెట్టింది. 10 లక్షల కోట్ల డాలర్లు గ్యారెంటీలిచ్చింది. రాగల పదేళ్లలో 10 లక్షల కోట్ల జాతీయ రుణం పెరుగుతుందని ప్రభుత్వం అనుకుంటున్నది. దీంతో రుణం జాతీయోత్పత్తికి రెండింతలవుతుంది.

ఈ పదేళ్లలో రెండు మాంద్యాలొచ్చాయి. రాకుండా ఉన్నట్లయితే అంతా సజావుగానే ఉండేది గదా? మాంద్యం రావడానికి ప్రభుత్వ పొరపాట్లు కారణమా? లేక కంపెనీల నిర్వహణ లొపాలా?

పొరపాట్లయితే సరిదిద్దుకోవచ్చు. ప్రభుత్వానికి గొప్ప గొప్ప సలహాదారులే ఉన్నారు. వాళ్లు పొరపాట్లను తేలిగ్గా గుర్తించగలరు. అయితే మాంద్యాలు వచ్చేది ప్రభుత్వ వైఫల్యాలవల్లో, కంపెనీల పొరపాట్లవల్లో కాదు. పెట్టుబడిదారీ విధానంలో ఉన్న వైరుధ్యాలవల్ల. కనక మాంద్యాలకి కారణమైన విధానంలోనే ఉంటూ మాంద్యం రాకుండా చెయ్యడం సాధ్యం కాదు. అమ్మకం కోసం ఉత్పత్తయిన సరుకులు అమ్ముడు పోకపోతే మాంద్యం వచ్చినట్లే. వాటన్నిటినీ కొనడానికి సరిపడేంత డబ్బు జనం దగ్గర లేకపోవడమే అందుకు కారణం. మాంద్యంలో ప్రజలకి కొనేసత్తా మరింత తగ్గుతుంది.

మాంద్యాలు రాకుండా చెయ్యడం లక్ష్యంగా పెట్టుకోవాలి. అంటే పెట్టుబడిదారీ విధానాన్నే వ్యతిరేకించాలి. వీళ్లంతా పెట్టుబడిదారీ వ్యవస్థని సమర్థించేవారే. కాకపోతే దానికి పరిమితులూ, నియంత్రణలూ ఉండాలంటారు. గతంలో ఇలాంటివెన్నో ఉన్న సందర్భాలలో కూడా మాంద్యాలు వచ్చిన సంగతి అందరికీ తెలిసిందే.

ఒబామా అరకొర చర్యలు మాత్రమే తీసుకుంటున్నారనీ, ఇందువల్ల చివరకి ఎకానమీ మరింత దిగబడుతోందనీ కృగ్మన్ అన్నాడు. వృద్ధిని పునరుద్ధరించేందుకు మరొక ఉద్దీపన పథకం అవసరమని అభిప్రాయపడ్డాడు. 'మనం అరకొర చర్యలే చేస్తున్నాం. వీటివల్ల ఎకానమీ కుంటుతుందే తప్ప పూర్తిగా కోలుకోదు. బ్యాంకులు నిజంగా థ్రైవ్ కాకుండా బతికే చర్యలే ఉన్నాయి. 1990లలో జపాన్ ఏమి చేసిందో మనమూ అదే చేస్తున్నాం' అన్నాడు. ద్రవ్య మార్కెట్ల అనుకూల పరిస్థితులు బహు కొద్ది కాలమే ఉంటాయనే కృగ్మన్ అభిప్రాయం (అలాగని పైకి చెప్పడు). ఆయనతో ఏకీభవించే కొద్దిమందిలో డేవిడ్ రోజెంబర్గ్ ఒకరు.

అమెరికా జపాన్ అనుభవం నుంచి ఏమీ నేర్చుకోలేదు. జపాన్90 లలో ప్రతి ద్రవ్యోల్బణమూ స్తబ్దతా జంటగా తగిలాయి. ఆ దేశాన్ని మరీ దెబ్బ తినకుండా చేసిందేమంటే ఆ కాలంలో ప్రపంచం వికాసంలో ఉంది. కనక జపాన్ ఎగుమతులు బాగానే ఉన్నాయి. ఇవ్వాళ మొత్తం ప్రపంచం ఒకేసారి దిగబడి ఉంది. అమెరికాని అలాంటి ఊబి నుంచి ఎవరు కాపాడతారు? అని ప్రశ్నిస్తాడు కృగ్మన్.

2010 రెండో ఆరు నెలల్లో ఎకానమీ క్షీణించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నాడు పాల్ కృగ్మన్ 2009 డిసెంబర్ 27న. స్టిగ్లిట్జ్‌తో ఏకీభవిస్తున్నానన్నాడు. మరొక ఉద్దీపన ఉండాలంటాడు. లేకపోతే కోలుకున్నట్లే కనపడి మళ్లీ మాంద్యంలోకి జారుకుంటుందంటాడు. 2009 ఫిబ్రవరిలోనే ఉద్దీపన పథకం చాలా కొద్దిదనీ, చాలనే చాలదనీ బాధ వ్యక్తం చేశాడు. క్రిస్టినా రొమర్ కూడా ఇంకొక ఉద్దిపన అవసరమనే అంటున్నది. కీన్సియన్లు ఉద్దీపన చాలీచాలనిదనో, సరైన సమయంలో ఇవ్వకుండా జాగుచేశారనో అంటారు. పాల్ కృగ్మన్ చెప్పేదదే. జపాన్‌లో ఇలాగే స్థలాల బుడగ పేలింది. ప్రభుత్వం ఫెడ్ ఫండ్ రేటు సున్నా చేసింది. బ్యాంకులకి మద్దతిచ్చింది. మౌలిక సదుపాయాలకి భారీగా ఖర్చు పెట్టింది. అయితే ఏమయింది? ఆర్థిక స్తబ్దత. అంతులేని అప్పు. అమెరికా అలాంటి తప్పులే చేస్తున్నదని కొందరి భావన. కీన్స్ చెప్పింది మాంద్యాన్ని వెనకడుగు వేయించలేకపోయింది. అందుకు కీన్సియన్లు జపాన్ త్వరత్వరగా చర్యలు తీసుకోలేదు అంటారు.

ఎకానమీ ఎత్తుకుంటున్నది అంటారు. వెంటనే లోటు భయం పట్టుకుంటుంది. ఉద్దీపన ఆపుతారు. మళ్లీ మొదటికొస్తుంది. ఇలా జపాన్ 15 ఏళ్లు చేసింది అంటాడు రిచర్డ్ కూ. రికవరి నిలబడగలిగే దాకా ఉద్దీపనలుండాలి అంటాడు. ఎకానమీ మాంద్యం నుంచి అలా తేరుకుని ఇలా పడిపోతుంది.

మహామాంద్య కాలంలో 80 లక్షల ఉద్యోగాలు కల్పించినా సంక్షోభం సమసిపోలేదు. కార్మికులు షాక్‌ని భరించక తప్పలేదు.

పదే పదే మాంద్యం ఎందుకొస్తున్నట్టు? ఏ అధ్యక్షుడూ ఎందుకు నిలువరించలేకపోతున్నట్టు? కనీసం అదుపు చేయడం ఎందుకు కుదరనట్టు? కీన్స్ సలహాలూ, మిల్టన్ ఫ్రీడ్‌మన్ సూచించిన ద్రవ్య విధానాలూ ఎందుకు విఫలమవుతున్నట్టు? చిట్కా వైద్యాలు పనిచెయ్యడం లేదు. కాయకల్ప చికిత్స గురించి కూడా ఆలోచించాలి గదా! వివిధ దేశాలూ పోటీ పడి అనుసరిస్తున్న ఆర్థిక సంస్కరణల్నీ, వాటికి మూల కారణమైన పెట్టుబడిదారీ విధానాన్నీ నిశితంగా నిష్పక్షపాతంగా పరిశీలించాలి. కాపిటల్ గ్రంథంలో కార్ల్ మార్క్స్ చేసిన విశ్లేషణని పరిగణనలోకి తీసుకోవాలి. కమ్యూనిస్ట్ ప్రణాళికలో మార్క్స్, ఎంగెల్స్‌లు చూపిన పరిష్కారాలు సరైనవేమో తేల్చుకోవలి. ఉదారవాదులు ఇదంతా చెయ్యటం ఇష్టపడరు. వాళ్లు పెట్టుబడిదారీ ఆర్థిక విధానానికి కట్టుబడి ఉన్నారు. దానివల్ల ఉత్పన్నమయ్యే సమస్యలకి దానిలోనే పరిష్కారాల్ని వెదుకుతుంటారు.

ఎకానమిస్టులు మాంద్యం వచినప్పుడల్లా కారణాల గురించి, దాన్నుంచి నేర్వాల్సిన గుణపాఠాల గురించి వల్లెవేస్తుంటారు. పాలకులు అది చేస్తున్నాం, ఇది చేస్తున్నం మాంద్యం పోబోతున్నది, పోయింది

ఇలా కల్లబొల్లి కబుర్లు చెప్పి కాలం గడుపుతారు. ఈలోగా ప్రజలు పడరాని పాట్లు పడుతుంటారు. ఆకలితో నిరుద్యోగంతో ఆక్రందిస్తారు. షాక్ అంతా శ్రామికులు తీసుకోవాల్సిందే. కార్పొరేటర్లు పెద్ద పెట్టుబడిదారుల లాభాలు పెరగకపోతే పాలకులు వాళ్లకి అనుకూలమైన విధానాలు అవలంబిస్తారు. శ్రామికుల్ని మాంద్యానికి పూర్తిగా బలిచేస్తారు. ఈ కార్యక్రమాల్ని పెట్టుబడిదారీ అర్థశాస్త్రజ్ఞులు వేనోళ్ల కొనియాడుతుంటారు. ఇక ఉదారవాద ఆర్థిక వేత్తలున్నారు. వీళ్లూ పెట్టుబడిదారీ విధానానికి అనుకూలురే.

1930 సంక్షోభం నుంచి బెర్నాంకె ఫెడ్‌కి రాకముందు ఒక విషయం చెప్పాడు 'ద్రవ్య విధానాన్ని పతనం కానివ్వ కూడదు. 1970లలో మహా ద్రవ్యోల్బణం అనుభవించాక ఆర్థికవేత్తలు కేంద్ర బ్యాంకులు ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచాలి అన్నాయి. ఈ బుడగ అనంతరం నిలకడగా కొనసాగే వృద్ధి నమూనాని చేరుకునేదెలా అనేది మనకొక ఛాలెంజ్ అని ఒబామా 2009 నవంబర్‌లో అన్నాడు.

ఎవరికి స్తబ్ద దశాబ్దం? కార్పొరేట్లు ఎంత ఎదిగారో కనబడుతూనే ఉంది. దిగబడుతుందల్ల శ్రామికులూ, చిన్న వర్తకులూ. అమెరికా కార్మికులకి ఇది 'నష్ట దశాబ్దం' అయినా కార్పొరేట్లకి లాభ దశాబ్దమే. కంపెనీలు ఉద్యోగుల్ని తగ్గించి, లాభాలు పెంచుకుంటున్నాయి. తగ్గకుండా చూసుకుంటున్నాయి. ఫోర్డ్ కంపెనీ 2006 నుంచీ 15 ప్లాంట్లు మూసేసింది. 53 వేలమందికి ఉద్వాసన చెప్పింది. అయినా, 2009 మూడో క్వార్టర్ లో 100 కోట్ల లాభం ఆర్జించింది. మైక్రోసాఫ్ట్ 5 వేలమందిని ఇళ్లకు పంపింది. దాని లాభం 2009 లో 1460 కోట్లు. ఐ.బి.ఎం 10 వేలమందిని తీసేసింది కాని దాని లాభం 2008 కన్నా 18 శాతం పెరిగింది. వాల్‌మార్ట్‌తో సహా అనేక భారీ వ్యాపార సంస్థలు పనిలేదని ఉద్యోగుల్ని తొలిగిస్తూ లాభాలు పెంచుకుంటున్నాయి.

అంత ఆశావహంగా మొదలైన దశాబ్దం ఇంత దయనీయంగా ఎందుకు ముగియాల్సి వచ్చింది? దీన్ని గురించి మరో మాద్యం వచ్చే దాకా నెమరేస్తూనే ఉంటారు. కాని మార్క్స్ రుజువు చేసినా, అనుభవం చెబుతున్నా పెట్టుబడిదారీ విధానంలో మాంద్యాలు అనివార్యమేమో అనే విషయాన్ని పరిశీలించరు. ఇందులో పెట్టుబడిదారీ విధానాన్ని వెనకేసుకొచ్చే ఆర్థికవేత్తలకూ, ఉదారవాదులకూ తేడా ఏమీలేదు.

మొదటి సార్వత్రిక సంక్షోభం 1825లో వచ్చింది. అప్పటి నుంచీ 1877కి 6 వచ్చాయి. ఉత్పాదక శక్తుల మీద ప్రభుత్వ యాజమాన్యం సంఘర్షణని పరిష్కరించదు. కార్మికులు కార్మికులుగానే ఉంటారు. ఉత్పత్తి సాధనాలని సమాజం స్వాధీనం చేసుకుంటేనే గాని ఇది సాధ్యం కాదు.

ఉద్దీపన పనిచేస్తుందా? అప్పుడు ప్రయోజనం తేలేదు, ఇప్పుడూ తేదు–అని కొందరంటుంటే, మరికొందరు అప్పుడూ పనిచేసింది, ఇప్పుడూ చేస్తుంది అంటున్నారు. ఉదారవాదులు రూజ్వెల్ట్ ఉద్దీపన పథకం పెట్టి కాపాడాడు అంటారు. లోటు తప్పదు. ఎకానమీకి ఒక తోపు అవసరం. 'ముందు రోగిని బతికిద్దాం. ఆతర్వాత మిగిలిన విషయాలు మాట్లాడుకుందాం.' ఎక్కువమంది ఆర్థికవేత్తలు ఈ ఆలోచనలో ఉన్నారు. అమిటి షేల్స్ తన పుస్తకం 'ది ఫర్గొటన్ మాన్' లో ఉద్దీపన నాడు సంక్షోభం నుంచి బయట పడెయ్యలేదు అని తేల్చింది. హూవర్, రూజ్వెల్ట్‌లు మామూలు మాంద్యాన్ని దశాబ్దకాల సంక్షోభంగా చేశారు అన్నది. ప్రభుత్వం భారీగా ఖర్చు చేస్తే మాంద్యం పోతుందని రుజువులు లేవు. పైగా ఈ ఖర్చు పరిస్థితిని ఇంకా దిగజారుస్తుంది అని అనేకమంది వాదిస్తున్నారు. రూజ్వెల్ట్ ప్రభుత్వ వ్యయాన్ని రెట్టింపు చేశాడు. అయినా, 1938 కల్లా నిరుద్యోగం రేటు మళ్లీ పెరిగి20 శాతం అయింది. ప్రభుత్వ పరిశ్రమలూ, నియంత్రణలూ, కేంద్రీయ ప్రణాళికలూ పన్నుల విధానమూ, ఇవేవీపని చెయ్యలేదు. వ్యాపారాల్నీ లాభాల్నీ దెబ్బతీశాయి. నిరుద్యోగమూ, దారిద్ర్యమూ భారీ స్థాయికి చేరాయి.

1999 లో మాంద్యాలు పాతకాలపు సమస్యలు. ఇక రానే రావు –అని కొందరు అర్థ శాస్త్రజ్ఞులు ప్రచారం చేశారు. అక్కడ్నుంచీ పదేళ్లలో రెండు మాంద్యాలొచ్చాయి. రెండోది 1930ల మహాసంక్షోభాన్ని తలపించే మహా మాంద్యం.

పెట్టుబడిదారీ విధానంలో సంక్షోభాలు అనివార్యం అని మార్క్స్ సిద్ధాంత రీత్యా రుజువు చేశాడు. 1825 నుంచి ఎన్నో మాంద్యాలని చరిత్ర రికార్డ్ చేసింది. 1930 దశకపు మహా సంక్షోభం ప్రపంచాన్ని గడగడలాడించింది. 1854 నుంచి 2001 వరకు ఎన్.బి.ఇ.ఆర్ ప్రకారం అమెరికాలో 32 మాంద్యాలొచ్చాయి. నడుస్తున్నది 33 వది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఇది 11 వది.

స్టాలిన్ కాలంలో మహాసంక్షోభం సోవియట్ యూనియన్‌ని తాకలేకపోయింది. అంతేకాదు, సోషలిస్ట్ వ్యవస్థ ఉన్నంత వరకూ (స్టాలిన్ కాలంలో సోవియట్ యూనియన్‌లోనూ, మావో ఉన్నంత వరకు చైనాలోనూ) మాంద్యాలు రాలేదు.

పెట్టుబడిదారీ విధానానికి ఒక సరైన పద్ధతి ఉండదు. ప్లాన్ ఉండదు. దాన్ని నియంత్రించడం కుదరదు. జపాన్ వికాసమూ దాని వెంటానంటి వచ్చిన స్తబ్దతా ఈ విషయాన్నే హెచ్చరిస్తున్నాయి.

చిట్కా వైద్యాలు పనిచెయ్యవు. కాయకల్పచికిత్స అవసరం. ముందు సరైన కారణాలు తెలిస్తేనే పరిష్కారం సాధ్యం. ఉద్దీపన మహా సంక్షోభాన్ని వెనక్కి తిప్పలేక పోయింది. జపాన్ని స్తబ్ద దశాబ్దం పాలు కాకుండా కాపాడలేక పోయింది. కూరుకున్న అమెరికా ఎకానమీ బండిని ముందుకు నెట్టలేక పోతొంది. మరేదైనా మార్గముందా? మాంద్యాలకి కారణం ఏమిటి? ఇవి రాకుండా ఉండాలంటే ఏమిచెయ్యాలి? కమ్యూనిస్ట్ ప్రణాళికలో ఏముందో చదవడానికిది సమయం. 'కాపిటల్' పుస్తకంలో మార్క్స్ సంక్షోభాల గురించి రాసిన విషయాల్ని చర్చించడానికిది సరైన సందర్భం.

(రచయిత రిటైర్డ్ లెక్చరర్)

వీక్షణంకు ఉత్తరాలు రాసేవాళ్లు, మనీఆర్డర్లు పంపేవాళ్లు తమ వివరాలను పూర్తిగా రాయవలసిందిగా కోరుతున్నాం. అలాంటి వివరాలు లేనందువల్ల ఉత్తరాలకు జవాబు రాయడంగాని, మనీఆర్డర్ల మేరకు పుస్తకాలు, పత్రికలు పంపడంగాని వీలుకావడం లేదు.

- వై. రామచంద్రం *(సర్క్యులేషన్ మేనేజర్)* ***9949 391028***

Email : yatelliram@gmail.com

ప్రాచీన భారత చరిత్రలో ఆర్థిక సంక్షోభాలు లేవనే వాదనను ఖండిస్తూ కౌటిల్యుని అర్థశాస్త్రం మరో ముఖాన్ని చూపుతున్నారు **మచ్చ ప్రభాకర్**

కౌటిల్యుని అర్థశాస్త్రం సర్వరోగ నివారిణా?

'సంక్షోభాన్ని అధిగమించే ఆర్థిక విధానం' పేర డా. వి. త్రివేణి వీక్షణం మే 2010 సంచికలో వచ్చిన వ్యాసంపై సమీక్ష చేసేటంత బలమైన అంశాలు కావు. అయినప్పటికీ నేటికి ఆమె వ్యక్తం చేసిన భావజాల బీజాలు మృతప్రాయమైనా, బలంగా సాంఘిక, సాంస్కృతిక, రాజకీయపరంగా ఉన్నప్పటికీ ఆర్థికపరంగా ప్రాచీన కాలం నుంచి 21వ శతాబ్దం వరకు కౌటిల్యుని అర్థశాస్త్రంతో పాఠాలు నేర్పడం ఆలోచించదగ్గ అంశమే. ప్రాచీన కాలం నుంచి మన దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్ఠమైనదనీ, అందువల్లే ఆర్థిక మాంద్య ప్రభావం మనపై అంతగా లేదనీ, కౌటిల్యుడి అర్థశాస్త్రం మన పాలకులకు ఆదర్శమనీ, నేటికీ వారు దానిని పాటిస్తున్నారనీ చెప్పడం నిజంగా సాహసోపేతమే. ఆధునిక వేదాంతులు, మనుస్మృతి ధర్మశాస్త్రకారులు, ఆధునిక చాణక్య రాజనీతితో బాటు, ఆధునిక చాణక్య అర్థశాస్త్ర మార్గదర్శకులు ఈ మధ్యకాలంలో వ్యక్తి విశ్వాసాల (హైందవ మతోన్మాద) బలహీనతలను వాడుకొని కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో పాలకవర్గాలుగా మారి ఇదే రకమైన భావజాలంతో రాజ్యాలు ఏలారు, ఏలుతున్నారనేది సుస్పష్టం. గుజరాత్‌లో మోడీ ముస్లిం మారణహోమాలపై చూపిన రాజధర్మం - దండనీతి, ఎన్.డి.ఎ. ప్రదర్శించిన 'షైనింగ్ ఇండియా' రాజనీతి శాస్త్రం పరోక్షంగా త్రివేణి పాటి ప్రస్తావన లేవనెత్తకుండానే సవాలు విసిరిన అంశాలుగా పరిగణించాల్సి ఉంటుంది.

ముందుగా భారతదేశం అభివృద్ధి చెందిన దేశం కాబట్టి చాలా ప్రధానమైన రంగాలలో ప్రాచీన పద్ధతులను అవలంబిస్తోందంటూ తక్కువ శాతం గల కీలమైన రంగాలలో తప్ప మరే ఇతర రంగాల్లో సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకోవడం లేదు అని రాశారు. అంతేకాదు, దీనివలననే ప్రపంచ ఆర్థిక మాంద్యం పూర్తిగా భారతీయ ఆర్థిక వ్యవస్థను ప్రభావం చేయలేకపోయిందంటున్నారు. వీటి అర్థం ఏమిటి? ప్రధానమైన రంగాలు భారతదేశ వ్యవస్థలో ఏమున్నవి? వ్యవసాయం, పరిశ్రమలు, చేనేత తదితర కులవృత్తులు. ఇందులో వ్యవసాయం కీలకరంగం తదుపరి చేనేత రంగం అన్నది అందరికీ తెలిసిన విషయమే. బ్రిటిష్‌వారి పారిశ్రామిక విధానంతో పెట్టుబడిదారీ బట్టల మిల్లు యంత్ర సామాగ్రి, మార్కెట్ ప్రవేశించి గ్రామీణ చేనేత వృత్తిరంగాల పునాదులను కదిలింప చేసి లక్షలాది కులవృత్తి నైపుణ్య శక్తులు పట్టణాలకు, నగరాలకు వలస వెళ్లి నూతన కార్మిక వర్గంగా ఎదిగింపజేశాయి.

పెట్టిబడిదారీ విధానాల లాభాల వేటలో తమ న్యాయమైన హక్కుల కోసం సంఘటిత పోరాటాలు చేసిన చరిత్ర వారికి ఉంది. పోటీకి నిలబడి, ప్రమాణాలు పెంచుకుంటూ గ్రామాల్లోనే స్థిరపడి ముందుకు వెళ్లాలని నిశ్చయించుకున్న వర్గాలు సహితం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని ఆత్మహత్యల మార్గం పట్టిన చరిత్ర తెలిసిందే. మాడర్నైజేషన్ విధానాలతో మిల్లులు మూతపడి తిరిగి చేనేత రంగంలో ఎలాగూ నైపుణ్య కార్మికులు చేరలేరు. కాని వాటికి సమాంతరంగా చేనేత రంగానికి పోటీగా ఎదిగింప చేసిన పవర్‌లూం రంగాల్లో చేరి ఇప్పుడు వీరూ ఆత్మహత్యల మార్గం పట్టిన ఘటనలు (సిరిసిల్లా) నిరూపిస్తున్నవి. ఇలాగే వ్యవసాయ రంగంలోనూ ఎంత ప్రాచీన నాగలినే వాడినప్పటికీ ఆధునిక రసాయన ఎరువులు, విద్యుత్, నీటిపారకం వాడకుండా దిగుబడి రాలేని పరిస్థితిలో అనావృష్టి మూలంగానో, అప్పుల పాలైయ్యో ఎందరో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్న విషయం దేశ ప్రజలందరికీ తెలుసు. ఇదే పరిస్థితి వివిధ కులవృత్తుల వర్గాల్లోనూ ఉంది. బాటా వచ్చి మాదిగల చెప్పులను తన్నేసింది, ప్లాస్టిక్ వచ్చి కుమ్మరి కుండలను మింగేసింది. ఫారెన్ బ్రాండ్ బీర్లొచ్చి గౌడ్‌ల సాంప్రదాయ ఆదాయాన్ని గుంజుకుంది. ఇలా ఎన్నో విధాలుగా కీలకరంగాల్లోనే పాలకవర్గాలు విదేశీ విధానాలు అవలంబించడం వల్ల కోట్లాది ప్రజలు నిరుద్యోగులయి వలసలతో చావు బతుకుల్లో ఉన్నా, ప్రాచీన పద్ధతులు అవలంబించడం వల్లనే భారతదేశం ఆర్థిక మాంద్యంలో లేదనడం విచిత్ర వాదనే. ప్రాచీన విధానాల వల్ల ప్రధాన కులవృత్తులు సజీవంగా జీవించగల్గితే, కౌటిల్యుని అర్థశాస్త్రం అమలు చేయడం వల్ల భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా చేరితే మరి చైనాలో ఏ కౌటిల్యుడి అర్థశాస్త్రం, కులవృత్తి పద్ధతులు ప్రాచీన విధానాలు ఉన్నాయి? మరి, అది అభివృద్ధి చెందిన దేశంగా మారిందని త్రివేణి సెలవిస్తున్నారు. అందుకు కారణాలు మాత్రం తెలియజేయలేదు.

ఇక ఋగ్వేద కాలంలో సింధూ పరీవాహక ప్రాంతంలో ఆర్యులు నివసించే ప్రదేశం ఆర్యావర్తనం అని వివరిస్తూ, వృత్తులను బట్టి విభజన ఏర్పడినా విషయంలా వర్ణ వ్యవస్థ లేదన్న భావనలో వేదయుగాంతంలో శూద్ర వర్ణం కూడా నాల్గో వృత్తిగా ఆర్య కుటుంబంలో చేరిందని ప్రస్తావించారు. ఆర్యులు రాకముందే ప్రపంచ ప్రసిద్ధి గాంచిన అతిగొప్ప హరప్పా, మొహంజదారో నగరాలు ఉన్నాయి. అనార్య ద్రావిడులు మైదానాల్లో నాగజాతి, కిరాతకులు, కొండజాతులుగా ప్రాక్, ద్రావిడ భాషలతో గొప్ప సంస్కృతిని నిర్మించుకొని ఎదిగినవారు. వీటి ద్వారానే

భారతదేశ ప్రాచీన చరిత్రకు గొప్ప కీర్తి లభించింది. అలాంటి సంస్కృతిని ధ్వంసం చేసి, వైదిక వర్ణ వ్యవస్థను సృష్టించిన వారు వైదిక ఆర్యులు. ప్రాచీన సాహిత్యంగా వేదాలకు తగినంత గుర్తింపు ఇవ్వాల్సిందే. అందులోని రుగ్వేద రుక్కుల ప్రకారమే ఆనాటి ఇంద్ర – అసుర యుద్ధాల, ఆనాటి సామాజిక పరిస్థితుల, ఘర్షణల, వర్గ, వర్ణ వైరుధ్యాల స్వభావాలు ఏ రూపంలో ఉండేవో చారిత్రక ఆధారాలు లభించినప్పటికీ ఊహాజనితంగానైనా కొంత విశ్లేషణ జరిపే అవకాశం లభించింది. వైదిక, వర్ణ వ్యవస్థను సమర్థించే వశిష్ఠుడు, విశ్వామిత్రుడు, భరద్వాజుడు ఇంద్ర దేవతల విజయాన్ని కోరుతూ ప్రకృతి దేవతలను స్తుతిస్తూ యుద్ధంలో శత్రుకూటాలైన ద్రావిడులనూ, అనార్యులనూ, కిరాతకులనూ, నాగజాతికి చెందిన శంభరుడి లాంటి యోధులను ఓడించి వారిని దస్యులుగా చేసుకున్నట్లు తెలుస్తోంది.

ఆర్య వంశానికి చెందిన సుధామ, దివోదాసు, భారత రాజ్యాల పరిరక్షణార్థం స్థానిక మూలవాసులైన అనార్యులతో, ఆదిమ కొండజాతులతో యుద్ధ నైపుణ్యాలు నేర్చి భీకర యుద్ధాలు చేసి చివరికి విజయం సాధించి వర్ణవ్యవస్థ భావజాలాన్ని విస్తరించుకొన్నట్లు ఆధారాలు తెలుపుతున్నాయి.

రుగ్వేదం పురుష సూక్తం, చివరి సూక్తంలో బ్రహ్మాండమయ విరాట పురుషుని రూపకల్పన ఉంది. ఆయన ముఖం నుంచి బ్రాహ్మణుడు, చేతుల నుంచి క్షత్రియుడు, తొడల నుంచి వైశ్యులు, రెండు కాళ్ల నుండి శూద్రులు పుట్టినట్లు ప్రస్తావించాడు. దీని ఆధారంగానే తర్వాత పురాణాల్లో మనుస్మృతులు సహితం విషమతా వర్ణ, వర్గ విచక్షణా వైఖరిని ప్రదర్శించాయి. ఈ వివరాలేవీ త్రివేణి ప్రస్తావించకుండానే నేరుగా భారతీయ తత్వశాస్త్ర దర్శనంలోకి దూకారు. మొట్టమొదటిగా తత్వ దర్శనానికి నాంది పలికింది భారతీయ సంస్కృతి అంటూ వైదిక యుగం నుంచి తత్వశోధన ఆరంభమైందని, సుసంపన్నమైన ఇంద్రియాతీత జ్ఞాన సంపద చేత జరామరణ చక్రాన్ని అధిగమించ వచ్చునని నాటి తాత్వికుల అభిప్రాయంగా తెలిపారు.

అంతేకాదు, ప్రపంచ జ్ఞానానికి పుట్టినిల్లుగా ఆర్యావర్తనం వెల్లివిరిసిందని తీర్మానించారు. యజ్ఞయాగాది, కర్మలు, మంత్ర తంత్రాలు, బల్లులు, నిరంతరం ఆగకుండా యుద్ధాల కొనసాగింపు వైదిక సంస్కృతి వర్ణ ఆధిపత్యాల మూలంగా వేదకాలంలోనే ఉత్పత్తి శక్తులు కోల్కోలేని విధంగా నష్టపోయాయి. తద్వారా ఉత్పత్తి శక్తులకు – ఉత్పత్తి సంబంధాలకు మధ్య ఘర్షణ తీవ్రతరమై, నూతన తత్వశాస్త్రాలైన జైన, బౌద్ధ, సాంఖ్య శాఖలు వికసించి సరికొత్త సాంఘిక వ్యవస్థలను సృష్టించ గలిగాయన్నది చారిత్రక ఆధారలతో నిరూపించబడ్డ సత్యాలు.

వీటి మూలంగానే వేదకాలం పిదప భారతదేశం హేతువాదాన్ని, మానవతావాదాన్ని, భౌతిక వాదాన్ని, విజ్ఞాన వాదాన్ని, శిల్ప గాంధర్వ కళా నైపుణ్య శక్తులను, సాహిత్యాన్ని ఒకటేమిటి శాంతి, సమతా, న్యాయ, బంధుత్వలాంటి సంప్రదాయాలను అభివృద్ధి పరుచుకొని సమాజంలోని అన్ని రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చెందిన దాఖలాలు చరిత్ర నిండా (భావజాలపరంగానైన) ఉన్నాయి. బుద్ధుని ద్వారానే భారతదేశ తత్వ దర్శనాలకు ప్రపంచవ్యాప్తంగా ఒక గుర్తింపు లభించింది. సామ్రాట్ అశోకునితో భారతదేశ రాజకీయాలు ఒక మలుపు తిరిగి ప్రపంచ దేశాలకు ఆ కాలంలో మార్గదర్శకంగా మారాయి. నాగార్జునుడు, దిగ్నాగుడు, నాగసేనుడు, ధర్మకీర్తి, ఆర్యభట్ట, బ్రహ్మగుప్త, అశ్వఘోషుడు, కణాదుడు, కాళిదాసు, పతంజలి, భానుడు లాంటి ఎందరో తత్వవేత్తలు, విజ్ఞానవేత్తలు ఉదయించారు. ప్రపంచ ప్రసిద్ధ నలంద, తక్షశిల లాంటి విశ్వ విద్యాలయాలు వెలిశాయి. అజంతా, ఎల్లోరా, సాంచీ, సారనాథ లాంటి చిత్రకళ, శిల్పకళా నైపుణ్యాల విహారాలు వెలుగొందాయి.

తాత్విక భావజాల రీత్యా భారతదేశాన్ని తొలి మానవతా దేశాంగా, భౌతికవాద, హేతువాద దేశంగా గుర్తించాలి. పురోగమన భావజాలంతో మొదలైన భారతదేశం కాలక్రమేణా చారిత్రక, భౌతిక, సామాజిక పరిణామాల రీత్యా భావవాదంలోనికి చేరుకుంది. ప్రచ్ఛన్న బుద్ధుడిగా పేరుగాంచిన శంకరాచార్యుల మాయ, వేదాంత తత్వశాస్త్రాలతో తిరోగమన భావజాలాలకు ఊపు లభించింది. మొగలుల, బ్రిటిష్ల రాకతో కొంతవరకు ఆటుపోట్లను ఎదుర్కొన్నా స్వాతంత్ర్యానంతరం లభించిన స్వేచ్ఛతో తమ భావజాలాన్ని వారు మరింత ఉన్నత స్థాయిలోకి తీసుకోని పోగలిగారు. ప్రస్తుతం బ్రాహ్మణవాద భావజాలంగా మూడోకంటికి తెలియకుండా ఎదిగిన ఇదే భావజాలం వేద సంస్కృతిని పునరుద్ధరిస్తూ, వర్ణ, విశిష్ఠ కుల, వర్గ వ్యవస్థను పరిరక్షించే భాగంలోనే కౌటిల్యుడి అర్థశాస్త్ర రాజనీతిని త్రివేణి ప్రతిపాదించారు.

ప్రపంచ దేశాల కంటే పూర్తి భిన్నమైన మన సంస్కృతి ప్రపంచ పండితులచే ప్రశంసలు పొందిందని స్తుతించారు. అంతేకాదు పాశ్చాత్య దేశస్తులు, విశ్వవిద్యాలయాలు పాఠ్య గ్రంథంగా దాన్ని వాడుకుంటు న్నాయని, భారత కేంద్ర ప్రభుత్వం సహితం ఆర్థిక విధానాల రూపకల్పనలో దీనినే అనుసరిస్తోందని తేల్చివేశారు. నిచ్చెనమెట్ల భారతదేశ కుల వ్యవస్థలో అంటరానివాళ్ల, వృత్తి కులాల ఉత్పత్తి నైపుణ్యాల, బడుగు బలహీన వర్గాల సమగ్ర మార్పుకోసం డా. అంబేడ్కర్కు అందని అర్థశాస్త్ర నిగూఢ రహస్యాలు, మార్క్స్ ప్రతిపాదించిన ఆర్థిక శాస్త్రాల కన్నా ఉన్నతమైన శాస్త్రంగా కౌటిల్యుని అర్థశాస్త్రం 'సర్వరోగ నివారిణిగా' పనిచేస్తే, మరి దేశంలో ఇంత దారిద్ర్యం, నిరుద్యోగం అసమానత, వివక్షలు, అంతర్యుద్ధాలు, మత కలహాలు ఎందుకు తగ్గించి, నివారించ లేకపోయాయో అమర్త్యసేన్కు సహితం అర్థం కాకపోవచ్చు. ఏదేమైనా ఇక ముందు ఏ ఆర్థిక శాస్త్రవేత్తకు ఇవ్వలేని అత్యున్నత పోస్థుమస్ నోబుల్ప్రైజ్ ఇక ఆర్థికరంగంలో కౌటిల్యునికే ఇవ్వాల్సిందేమో!

అంతేకాదు చరిత్రలో కుట్రలు, కుహకాలు, కుతంత్రాలకు మారుపేరుగా 'చాణుక్యుని' ప్రతీకగా తీసుకుంటారు. భారతదేశ రాజకీయాలలో శరద్పవార్ లాంటి అపర చాణుక్యులెందరో ఉన్నారన్న విషయం త్రివేణిగారికి తెలియదనుకోవాలా? లేదా తెలిస్తే మోడీ, అద్వానీ, ఆర్.ఎస్.ఎస్., వి.ఎచ్.పి. సంస్థల ప్రముఖులతో బాటు శరద్ పవార్ లాంటి వారిని కూడా చేర్చి అర్థశాస్త్రాల పాఠాలు నేర్పిస్తే ఇక ఈ దేశం అభివృద్ధి చెందుతున్న దేశంగా ఏం కర్మ, రాత్రికి రాత్రే అభివృద్ధి చెందిన దేశంగా అన్నిరకాల ఆర్థిక మాంద్యాలను తట్టుకొని ఎదిగిపోక తప్పదు. అలాంటప్పుడు ప్రపంచ ఆర్థికశాస్త్రాలతోబాటు దళారీ దేశీయ చిదంబరం ఆర్థికశాస్త్రాల విధానాలను కట్టగట్టి బంగాళాఖాతంలో విసిరేస్తే మంచిదేమోనన్న ఉచిత సలహా ఒకటి పారేస్తే మరీ బాగు! వీ

రాయలసీమ వెనుకబాటుపై, అక్కడి ప్రజల ఆకాంక్షలపై **రాయలసీమ విద్యావంతుల వేదిక** రాసుకున్న ముసాయిదా అవగాహన పత్రం

రాయలసీమ వెనుకబాటు వెనుక ...

ఇటీవలి తెలంగాణ రాష్ట్ర ఉద్యమం గతానికంటే భిన్నంగా, తీవ్రంగా తెలుగు జాతిలోని అసమానతలను చర్చనీయాంశం చేసింది. ప్రాంతీయ అసమానత, వెనుకబాటుతనం, వివక్ష, సాంస్కృతిక ఆధిపత్యం, ప్రత్యేక ప్రాంతీయ అస్తిత్వం, ఆత్మగౌరవం, స్వయంపాలన మొదలైన అంశాలను ముందుకు తీసుకొని వచ్చింది.

ఈ వాతావరణం నుంచే 'సమైక్యాంధ్ర' పేరుతో కోస్తా, రాయలసీమలలో కూడా ఆందోళనలు జరుగుతున్నాయి. తెలంగాణ, కోస్తా ప్రాంతాల మధ్య ప్రధానంగా సాగుతున్న ఈ సంవాదంలో రాయలసీమ మౌన ప్రేక్షక పాత్రనో, అయోమయ భాగస్వామ్య పాత్రనో పోషిస్తోంది. అదే సమయంలో తొలిసారిగా కోస్తా సంపన్నులు రాయలసీమను గుర్తించారనడానికి గుర్తుగా 'సీమాంధ్ర' అనే పద బంధాన్ని ప్రచారంలోకి తెచ్చారు. ఇందులో రాయలసీమ అనే ప్రాంతం ఆంధ్ర ప్రాంతంలో భాగం కాదనీ, దానికి ఒక ప్రత్యేక అస్తిత్వం ఉన్నదనే గుర్తింపు కూడా ఉంది. అంతకు మించి కోస్తా అగ్రకుల సంపన్న వర్గాలు తెలుగుజాతి మీద, అందులోని వెనుకబడిన ప్రాంతాల మీద తన శాశ్వత ఆధిక్యాన్ని నిలబెట్టుకోడానికి సీమను వాడుకుంటున్నదనీ స్పష్టమవుతోంది. అట్లా తెలంగాణ – కోస్తా మధ్య సాగుతున్న ఈ సంవాదంలో రాయలసీమ ప్రాంతం కోస్తా అనుబంధ, అనుకూల పాత్ర పోషిస్తోంది. దీనికి రాయలసీమ నాయకుల స్వప్రయోజన కాంక్ష తప్ప మరేమీ కారణం కాదు. రాజకీయ నాయకులకు స్వప్రయోజనాలుండడం సహజమే అయినా రాయలసీమలో ప్రజా ప్రయోజనాలకూ, నాయకుల ప్రయోజనాలకూ అంతులేని దూరం ఉంది. ప్రాంతీయ ప్రయోజన స్పృహ ఏ మాత్రమూ లేని సీమ నాయకత్వం వల్ల ఈ ప్రాంత సమస్యలు కనీసంగా చర్చకు నోచుకోవడం లేదు.

తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ, దాని వెనుక సాగుతున్న ఉద్యమం రాయలసీమ భవిష్యత్తు గురించి ఆలోచించడానికి ఒక అనివార్యమైన, అరుదైన అవకాశం ఇచ్చాయి. అయితే ఈ ఉద్యమ – ప్రతి ఉద్యమాల్లో గత 54 సంవత్సరాల సమైక్య రాష్ట్రంలో రాయలసీమకు ఒరిగిందేమిటో, జరిగిన అన్యాయమేమిటో, రాయలసీమ భవిష్యత్తు స్వప్నమేమిటో వినిపించే గొంతుక ఒక్కటి కూడా లేకుండా పోయింది.

ఈ సందర్భంలో రాయలసీమకు ఒక అస్తిత్వం, ఒక వ్యక్తిత్వం ఉన్నాయా? లేదా? అనే ప్రశ్నలు ఉదయించాయి. రాయలసీమకు తనదైన గాథ, తనదైన వ్యథ, తనదైన ఆకాంక్ష, తనదైన స్వప్నం ఉన్నాయా? లేదా? అన్నది కూడా చర్చనీయాంశమవుతుంది. ఈ ప్రశ్నకు జవాబు వెతికే గాఢమైన తపనలోంచి రాయలసీమ విద్యావంతుల వేదిక పుట్టింది.

సమైక్య 'ఉద్యమం' ఆర్భాటంగా జరుగుతున్నప్పటికీ రాయలసీమలోని విద్యావంతులు, రచయితలు, మేధావులు సమైక్యత వల్ల సీమకు జరిగిన లాభమేమిటి అనే ప్రశ్న లేవదీశారు. అయితే సమైక్యవాదుల శబ్ద కాలుష్యంలో ఆ ప్రశ్న ఎవరికీ వినిపించకుండా పోయింది. రాయలసీమ దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న వివక్షకు, అన్యాయలకు కారణం ఏమిటి? పరిష్కారం ఏమిటి? గతంలో జరిగిన రాయలసీమ ఉద్యమ స్వభావం ఏమిటి? అనే అన్వేషణలో ప్రత్యేక రాయలసీమ రాష్ట్ర సాధనే లక్ష్యం అనే దిశగా విద్యావంతుల వేదిక అవగాహన ప్రయాణించింది. అయితే గతంలో జరిగిన రాయలసీమ ఉద్యమాలకు ఈ ప్రయత్నం కొనసాగింపా? ఆనాటికీ ఈనాటికీ రాయలసీమ వెనుకబాటుతనంలో మౌలిక మార్పేమీ లేదుగాని, రాయలసీమ రాష్ట్ర భావనను పూర్తిగా కొత్త సైద్ధాంతిక భూమిక నుంచి చూడవలసిన అవసరం మాత్రం కనిపించింది. విద్యావంతుల వేదిక ప్రధాన బాధ్యత అలాంటి సైద్ధాంతిక భూమిక రూపొందించడమే.

గత రాయలసీమ ఉద్యమాలు ప్రధానంగా సాగునీరు, తాగునీరు కేంద్రంగా సాగినవే. జల వనరుల్లో రాయలసీమకు రావలసిన న్యాయమైన వాటా ప్రధాన నినాదంగా ఆ ఉద్యమాలు జరిగాయి. ఆ ప్రజాస్వామిక ఆకాంక్షలో అచేతనంగా కోస్తా వ్యవసాయ నమూనా అనుకరణ ఉంది. ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో రాయలసీమ హక్కులు మిగతా ప్రాంతాల సౌహార్దం, సౌజన్యాలతో మాత్రమే సాధించుకోగలమనే నినాదం ఉంది. అంటే సైద్ధాంతికంగానే ఆ నినాదంలో ఒక పరాధీనత నిహితమై ఉంది. రాయలసీమ ఒక ప్రత్యేక రాష్ట్రంగా మనగలగడానికి అవసరమైన ఆర్థిక వనరులు లేవు, భౌగోళిక సానుకూలత లేదనే ఆత్మశంక ఆ నినాదం వెనుక అదృశ్యంగా ఉండింది.

అందువల్ల రాయలసీమ ప్రత్యేక రాష్ట్ర భావనను పూర్తిగా కొత్త అవగాహన ప్రాతిపదిక మీద నిర్మించవలసి ఉంది. శ్రీబాగ్ ఒడంబడిక నేపథ్యాన్ని, అది అమలైన తీరును లోతుగా పరిశీలిస్తే కోస్తా సంపన్న వర్గాలు రాయలసీమతో శాశ్వతంగా ఒక అసమ సంబంధాన్ని కొనసాగించదలచుకున్నారని స్పష్టమవుతోంది. పెట్టుబడి తన సహజ లక్షణమైన అసమ అభివృద్ధిని మాత్రమే సాధించగలుగుతుంది. తెలుగు జాతి ఏకీకరణ తొలి రూపంగా 1953లో ఏర్పడిన ఆంధ్ర రాష్ట్ర అవతరణలోనే దీనికి పునాది ఉంది. ఆంధ్రప్రదేశ్‌కు ఎవరు ముఖ్యమంత్రయినా కావచ్చుగాని ఉమ్మడి రాష్ట్రానికి అసలైన పాలకులుగా కోస్తా పెట్టుబడిదారులు పదే పదే రాయలసీమ సంరక్షణ కోసం జరిగిన ఒప్పందాలను ఒక పథకం ప్రకారం ఉల్లంఘిస్తూ వచ్చారు. తమ ప్రాంత ప్రయోజనాల కోసం రాయలసీమను ఎండబెడుతూ వచ్చారు. ఒక్క జలవనరుల పంపిణీలోనే కాదు, పారిశ్రామిక రంగంలో కూడా తీరని అన్యాయం చేశారు. దీని వల్ల ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఈ రెండు ప్రాంతాల మధ్య అసమ సంబంధం వ్యవస్థీకృతమైపోయింది. కరువు పీడిత రాయలసీమ ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో రెండవ స్థాయి పౌరురాలిగా, పరాధీనగా, వారి సౌజన్యం మీద బతుకీడ్వవలసిన దీన ప్రాంతంగా మారిపోయింది. అర్థించి, ప్రశ్నించి, ఒత్తిడి చేసి హక్కులు సాధించుకోవలసిన కోసకు తోసివేయబడింది.

గతంలో జరిగిన రాయలసీమ ఉద్యమాలు ఈ అసమానత గురించి, వివక్ష గురించి తీవ్రంగా ప్రశ్నించాయి. అయితే ఈ అసమ సంబంధంలో కొంచెం సమానత్వం కోసం, కొన్ని హక్కుల కోసం పోరాడటమా? మౌలికంగానే ఆ సంబంధాన్ని రద్దు చేసుకోవడమా? అనేదే ఇవ్వాళ రాయలసీమ ముందున్న కర్తవ్యం. 56 ఏళ్ల చరిత్ర అందించిన అనుభవాల దృష్ట్యా వర్తమాన ప్రాంతీయ ఆకాంక్షల సందర్భంలో ఆ అసమ సంబంధాన్ని రద్దు చేసుకోవడమొక్కటే సీమ సర్వతోముఖాభివృద్ధికీ, ఆత్మగౌరవ పరిరక్షణకూ మిగిలిన పరిష్కార మార్గం. అదే ప్రత్యేక రాయలసీమ రాష్ట్ర నినాదం.

అనేక భౌగోళిక, పర్యావరణ ప్రత్యేకతల వల్ల, కోస్తా పెట్టుబడిదారీ వర్గం అమలు చేసిన అభివృద్ధి నమూనా వల్ల, చేసిన విద్రోహాల వల్ల రాయలసీమ జిల్లాల్లో చాలా విభిన్నమైన అంతర్గత ప్రత్యేకతలు చోటు చేసుకున్నాయి. రాయలసీమ ప్రత్యేక రాష్ట్ర నినాదానికి, దానికి ఏర్పరచవలసిన సైద్ధాంతిక పునాదికి ఈ వాస్తవిక దృష్టి అవసరం. నిజానికి సమైక్య రాష్ట్రంలో రాయలసీమకు జరిగిన ఘోరమైన అన్యాయాలను గుర్తించాలంటే ఈ ప్రత్యేకతల మీద తప్పక దృష్టి సారించవలసిందే. ఉదాహరణకు రాయలసీమలో భౌగోళిక కారణాల రీత్యానే గాక సమైక్య పాలకుల అభివృద్ధి వల్ల అనంతపురం జిల్లాది అత్యంత విషాదకర జీవితం. తెలుగుజాతి సమైక్యత దాపున, తెలుగు ప్రజల 'అభివృద్ధి' నీడన ఆకలిచావులు, ఆత్మహత్యలు, వలసలు తప్ప మరేమీ మిగలని ప్రాంతానికి అనంతపురమొక్కటే తిరుగులేని సాక్ష్యం. అలాంటి ప్రాంతాలు రాయలసీమ మిగతా మూడు జిల్లాల్లో కూడా ఉన్నాయి. ఈ అంతర్గత తేడాలను దృష్టిలో ఉంచుకొని నీళ్లు, ఇతర వనరుల పునఃపంపిణీ ప్రణాళికకు సిద్ధం కావాలి. లేకపోతే అంతర్గత తేడాలు రాయలసీమ రాష్ట్ర భావనను వేరు పురుగులా తొలచివేస్తాయి. అయిదున్నర దశాబ్దాల తెలుగు ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన అనేక వంచనల ఫలితమైన ఈ వెనుకబాటుతనానికి, అస్తిత్వ నిర్మూలనకు వ్యతిరేకంగా ముందుకు వచ్చిందే ప్రత్యేక రాయలసీమ రాష్ట్ర నినాదం.

కోస్తా పెట్టుబడిదారులు రాయలసీమ సామాజిక సాంస్కృతిక ప్రత్యేకత్వాన్ని కించపరిచి, సినిమాల్లో సొమ్ము చేసుకుంటున్నారు. ఈ సాంస్కృతిక ఆధిక్యానికి, ఆ ప్రాంత ప్రామాణికతకు వ్యతిరేకంగా రాయలసీమ తనదైన అస్తిత్వాన్ని కాపాడుకోవాలన్నా, కోస్తా ప్రయోజనాలు ఈడేర్చే సకల సమూహాల నుంచి రాయలసీమ విముక్తి మార్గంగా ముందుకు వచ్చిందే ప్రత్యేక రాష్ట్ర నినాదం.

కోస్తా నుంచి విడిబడడం అనే ప్రాతిపదిక నుంచి సీమ ప్రత్యేక రాష్ట్రంగా మనగలగడానికి అవసరమైన నమూనా తయారు చేయవలసి ఉంది. దీన్ని ఎంత శాస్త్రీయంగా రూపొందిస్తే అంతగా సీమ స్వావలంబన, స్వయం పాలన, ఉద్యమం బలోపేతమవుతాయి. సీమ సత్వర అభివృద్ధి సాధించడానికి, సామాజిక మానవ అభివృద్ధి సూచికలను మెరుగు పరుచుకోడానికి అవసరమైన అపార వనరులను వ్యవసాయ మిగులు నుంచి గాక సీమలోని ఖనిజ సంపదను జాతీయం చేయడం ద్వారా మాత్రమే పొందగలం.

అదే విధంగా సీమ వ్యవసాయాన్ని సరికొత్త దృష్టితో పరిశీలించవలసి ఉంది. సీమ వ్యవసాయ – పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకొని స్థానికంగా సాధ్యమయ్యే సుస్థిర అభివృద్ధి నమూనా తయారు చేయవలసి ఉంది. ప్రాచీన కాలంలో గొలుసు చెరువుల వ్యవస్థ ద్వారా వర్షపు నీటిని నిలువు చేసే పద్ధతులు, భూగర్భ జలాలను నిరంతరం పూరించే పద్ధతులు రాయలసీమలో ఉండేవి. వాటి ద్వారా మాత్రమే సీమ వ్యవసాయాన్ని నిలబెట్టగలం. సీమకు కృష్ణా నది నుంచి రావలసిన నికర జలాలతోపాటు కృష్ణా వరద జలాలను ఈ పద్ధతిలో వినియోగంలోకి తేవలసి ఉంది. చిన్న తరహా నీటి పారుదల చెరువు, చెక్ డ్యాంలను సీమలో విస్తృతంగా నిర్మించవలసి ఉంది. మెట్ట ప్రాంతం కావడం వల్ల సీమలో కనీస భూమి ఎక్కువగా ఉంది. ఈ సీలింగ్‌ను తగ్గించడం ద్వారా సీమలో వ్యవసాయయోగ్య మిగులు భూమిని రాబట్టవలసి ఉంది. భూ కేంద్రీకరణ తగ్గించవలసి ఉంది.

వలస పాలన కారణంగా సీమలో విద్యా వసతులు (తెలంగాణతో పోల్చితే) కొంచెం మెరుగ్గా ఉన్నాయి. చదువుకున్న నిరుద్యోగుల సంఖ్య చాలా ఎక్కువగా ఉంది. కానీ సీమలో నగరాలు అభివృద్ధి చెందకపోవడం వల్ల, పారిశ్రామికీకరణ లేకపోవడంవల్ల ఈ నిరుద్యోగులు హైదరాబాద్‌కు వలస పోతున్నారు. సీమ విద్యార్థులు సమైక్య నినాదంపట్ల సానుకూలంగా స్పందించడం వెనుక ఈ వాస్తవం ఒక బలమైన కారణంగా ఉంది. అయితే రాయలసీమలోని అపార ఖనిజ సంపదను పబ్లిక్, ప్రైవేట్ రంగ సంస్థల ద్వారా వెలికి తీసి, ఖనిజ ఆధారిత పరిశ్రమలను పబ్లిక్‌రంగంలో నెలకొల్పితే స్థానికంగా ఉపాధి అవకాశాలు ఏర్పడతాయి. దీనికి అనుబంధంగా రవాణ తదితర సేవారంగాల్లో కూడా ప్రభుత్వ – ప్రైవేట్ పెట్టుబడులు ప్రవహించేందుకు వీలు కలుగుతుంది. ఇది కూడా లక్షలాది విద్యావంతులకు ఉద్యోగ అవకాశం కల్పిస్తుంది. సీమ పారిశ్రామికాభివృద్ధికి గల సాధ్యాసాధ్యాలు – అవకాశాలు – సవాళ్లు అనే అంశంపై లోతయిన అధ్యయనం చేయవలసి ఉంది.

ఉపాధి కల్పన అనేది సహజ వనరులతోపాటు మానవ వనరుల అభివృద్ధిపై కూడా కీలకంగా ఆధారపడి ఉంటుంది. అందువల్ల సీమలో ఎటువంటి విద్యా విధానం, ఎటువంటి శిక్షణా సంస్థలు, పరిశోధనా సంస్థలు అవసరం అనేది చాలా ముఖ్యమైన అంశం. ఇప్పుడు ఉన్న విద్యా సంస్థలను పరిపుష్టం చేసుకుంటూనే భవిష్యత్తు ప్రణాళిక దృష్ట్యా సీమ విద్యారంగాన్ని ఆధునీకరించవలసి ఉంది. ఇందుకోసం ఒక విద్యా – శిక్షణా విధానాన్ని రూపొందించవలసి ఉంది.

రాయలసీమలోని పాలనా వ్యవస్థ గురించి, అందులో తక్షణం రావలసిన సంస్కరణల గురించి చాలా లోతుగా చర్చించవలసి ఉంది. విజయనగర సామ్రాజ్య పతనానంతరం సీమ ప్రాంత సుల్తానుల ఏలుబడిలో, ఆ తర్వాత మైసూరు, నిజాం రాజ్య ఏలుబడిలో ఉండింది. ఈ అన్ని కాలాల్లో కూడా సీమ ప్రాంతం అధికార కేంద్రానికి దూరంగా, సరిహద్దు ప్రాంతంగా ఉంది. అందువల్ల ఈ ప్రాంతం స్థానిక పాలెగాళ్ల పెత్తనంలోకి వెళ్లిపోయింది. దీర్ఘకాలంపాటు ఏర్పడిన పాలనా శూన్యత రాయలసీమలో అనేక అవాంఛనీయ, అప్రజాస్వామిక పెత్తందారీ శక్తులు బలపడడానికి దారితీసింది. బ్రిటిష్ కాలంలో కడప కేంద్రంగా ఒక ఆధునిక పాలనా వ్యవస్థ ఏర్పడే వరకూ ఇదే పరిస్థితి. అయితే స్థానిక పాలెగాళ్లు, వారి వారసులు, గ్రామాల్లోని ముఠాలు, తీవ్ర హింసాయుత ఆధిపత్య సంస్కృతి మాత్రం వేషాలు మార్చుకుంటూ కాలానుగుణంగా జన్యుమార్పిడి పొందుతూ ఇప్పటికీ కొనసాగుతోంది.

మెజారిటీ ప్రజల ప్రజాస్వామిక పౌరహక్కులకు, చట్టబద్ధ పాలనకూ విఘాతంగా మారిన ఈ సాయుధ ముఠాల సంస్కృతి ప్రభుత్వ యంత్రాంగాన్ని, ఆర్థిక కార్యకలాపాలను తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. రాయలసీమలోని ప్రజాస్వామిక చైతన్యం, వ్యక్తి స్వేచ్ఛ, స్వేచ్ఛాయుత ఎంపిక పెరగాడనికీ, వనరుల పునఃపంపిణీకీ, స్వేచ్ఛా వాణిజ్య వ్యవస్థ వృద్ధికీ, నూతన ప్రయోగశీలతకూ, సృజనాత్మకతకూ ఈ సాయుధ ముఠాల సంస్కృతి ఆటంకంగా మారింది. రాయలసీమలో కులవ్యవస్థ చాలా బలీయంగా ఉండి గ్రామీణ వ్యవస్థను ముఠాశక్తుల ఆధీనంలో పట్టి ఉంచుతోంది. స్వేచ్ఛా భావన సీమలో వికసించకపోవడానికి, భూస్వామ్య ఆధిపత్యం, అణచివేత, హింస అనేక రూపాల్లో నేటికీ కొనసాగడానికి కుల సామాజిక సంబంధాలు కారణం. ఆధునిక రాయలసీమ నిర్మాణం

మార్క్స్ రచన 'కాపిటల్' ను పరిచయం చేస్తూ దానిలో మార్క్స్ అనుసరించిన చారిత్రక విశ్లేషణా సంవిధానాన్ని ఎలా అర్థం చేసుకోవాలో వివరిస్తున్నారు బెన్ ఫైన్, ఆల్ఫ్రెడో సాద్ – ఫిల్హో

చరిత్ర - సంవిధానం

(లండన్ విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ ఓరియెంటల్ అండ్ ఆఫ్రికన్ స్టడీస్‌లో అర్థశాస్త్ర ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న బెన్ ఫైన్ 1970ల ప్రారంభంలో అప్పటికే మార్క్సిస్ట్ అర్థశాస్త్రంపైన, ఆదాయం, సంపద పంపిణీ పైన తాను చెపుతున్న పాఠాల ఆధారంగా 'కాపిటల్' పరిచయం పుస్తకం రాశారు. విస్తృతమైన ఆదరణకు నోచుకున్న ఈ పుస్తకం గత నలభై సంవత్సరాలలో అనేక ముద్రణలు పొందింది. ఎప్పటికప్పుడు అభివృద్ధి చెందుతున్న అవగాహనలతో ఈ పుస్తకం ఇప్పటికి మూడు సార్లు తిరగరాసిన కొత్త కూర్పులు కూడా వెలువడ్డాయి. 2003లో వెలువడిన నాలుగో కూర్పుకు బెన్ ఫైన్ సహ అధ్యాపకుడు ఆల్ఫ్రెడో సాద్ – ఫిల్హో సహకరించారు. 'మార్క్స్ కాపిటల్' అనే ఈ చిన్న పుస్తకం ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా చదవవలసినది. ఆ పుస్తకంలో నుంచి మొదటి అధ్యాయం ఇక్కడ ప్రచురిస్తున్నాం. – సం.)

కార్ల్ మార్క్స్ 1818లో జర్మనీలో పుట్టాడు. విశ్వవిద్యాలయంలో తొలి విద్య న్యాయశాస్త్రంలో ప్రారంభించాడు. కాని, త్వరలోనే ఆయన ఆసక్తులు తత్వశాస్త్రం వైపు మళ్లాయి. ఆ సమయానికి తత్వశాస్త్రంలో హెగెల్, ఆయన శిష్యులు ప్రాబల్యంలో ఉన్నారు. వాళ్లు భావవాదులు. అంటే, సైద్ధాంతిక భావనలు ఏవైనా భౌతిక వాస్తవికతతో సంబంధం లేకుండా స్వతంత్రంగా అభివృద్ధి చేయవచ్చునని నమ్మేవారు. హెగెలియన్‌లకు వాస్తవం అంటే భావనల క్రమానుగత అభివృద్ధి ఫలితం మాత్రమే. ఈ భావనలు ఒక పరమభావం దిశగా పయనిస్తుంటాయని వారు నమ్మేవారు. ఈ భావనల వ్యవస్థ సాపేక్షికంగా పరమమైన విషయాన్ని ఇతోధికంగా నిర్దిష్టమైన విషయంతో కలుపుతుందని వాళ్లు భావించేవారు. ప్రభుత్వంలో, సంస్కృతిలో, ఇతర సామాజిక జీవన రూపాలలో జరిగే అభివృద్ధి అంతా మేధోపరమైన అభివృద్ధి ద్వారా వివరించవచ్చునని హెగెలియన్‌లు భావించేవారు. అందువల్ల సమాజాన్ని అర్థం చేసుకోవడానికి కీలకం చైతన్యాన్ని అధ్యయనం చేయడమే అని అనుకునేవారు. అంటే, సంస్థలు, భావాలు ఆధిపత్యం కోసం పరస్పరం సంఘర్షించుకునే ఒక నాటకీయ రంగస్థలం చరిత్ర అని వాళ్లు

జరగాలంటే ఈ సామాజిక బంధనాల నుండి బైటపడాల్సిందే. గత ఇరవై ఐదు సంవత్సరాల్లో ముఠా నాయకులు, వారి గాడ్‌ఫాదర్లు రాజకీయ వ్యవస్థలోకి నేరుగా ప్రవేశించడం వల్ల ఈ హింస రాజకీయ స్వభావం సంతరించుకుంది. సామాజిక అణచివేతను తిరిగి వ్యవస్థీకృతం చేస్తోంది. ఈ నేపథ్యంలో రాయలసీమ ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, సామాజిక పునరుజ్జీవనానికి ప్రజాస్వామ్య పాలనా సంస్కరణలు మౌలిక షరతులు అవుతాయి.

రాయలసీమలో శక్తిమంతమైన సాంస్కృతిక పునరుజ్జీవన వికాసం జరగవలసి ఉంది. తెలుగుజాతిలోనే అత్యద్భుత దేశీయ సంప్రదాయాలకు ఆలవాలమైన రాయలసీమ ఇవాళ 'విలనీ'గా దుష్ప్రచారమవుతోంది. తెలుగు ప్రజల చరిత్రలో రాయలసీమ అందించిన ఆధునిక చేతన, వైవిధ్యం యావత్తూ ఇవాళ కేవలం హింసగా, రక్తపాతంగా, మధ్య యుగాల మొరటుదనంగా వక్రీకరణకు గురవుతున్న తరుణంలో రాయలసీమ తనను తాను సాంస్కృతికంగా పునర్జీవింప చేసుకోవలసి ఉన్నది. దీనికి సీమలోని ఫ్యాక్షనిజం ఒక బలమైన అంతర్గత కారణం. అయితే అది మాత్రమే లేదు. రాయలసీమ తన స్వీయ అస్తిత్వ నిర్మాణంలో ప్రక్షాళన చేసుకోవలసినవీ, రద్దు చేసుకోవలసినవీ ఉన్నాయి. అట్లా సీమ సాంస్కృతిక పునరుజ్జీవనం చరిత్రలో ఇప్పటిదాకా మనకు తెలిసిన వాటికంటే చాలా విభిన్నమైనది.

రాయలసీమ వీటిలో ఏ ఒక్కటి సాధించాలన్నా సమైక్య రాష్ట్రంలో సాధ్యం కాదు. కోస్తా పెట్టుబడిదారులకు, సీమ పెట్టుబడిదారులకు, సీమ భూస్వామ్య ఆధిపత్య రూపాలకు వ్యతిరేకంగా ఉద్యమించకుండా ప్రత్యేక రాష్ట్రం సిద్ధించదు. ఉమ్మడి రాష్ట్రంలో ఉండడమంటే ఆరు దశాబ్దాల నుండి సాగుతున్న కోస్తాంధ్ర పాలకుల కుటిల దుర్మార్గాలను నిరాటంకంగా కొనసాగించడమే అవుతుంది. దానికి స్వస్తి పలకకుండా స్వయం పాలన కోసం ఉద్యమించకుండా సీమకు వీసమెత్తు ప్రయోజనం ఉండదు. ఆత్మగౌరవంతో సొంత కాళ్ల మీద నిలబడి ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడడమే రాయలసీమ ముందున్న చివరి పరిష్కార మార్గం.

- రాయలసీమ విద్యావంతుల వేదిక ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి అవసరమైన సిద్ధాంత భూమికను నిర్మించడం, దానికి ఒక రాజకీయ ప్రచార రూపాన్నివ్వడం తన ప్రధాన కర్తవ్యంగా ఎంచుకుంది.
- రాయలసీమ చరిత్ర, రాజకీయార్థికం, సంస్కృతి, కళా సాహిత్యాల పరిశోధన, అధ్యయనం ముఖ్యమైన పనిగా ఎంచుకుంది. ఇప్పటికే ఈ విషయాల్లో పోగుబడి ఉన్న సమాచారాన్ని, అధ్యయన పద్ధతులను, నిర్ధారణలను పరీక్షించి పునరంచనాలకు, పునర్నిర్మాణాలకు పూనుకుంటుంది.
- ప్రత్యేక రాష్ట్ర నినాదంతో నడిచే ఉద్యమాలన్నిటితో కలిసి నడుస్తుంది.
- ప్రత్యేక రాష్ట్ర నినాదంతో ఏకీభావం లేని రాయలసీమ ప్రేమికులతో, ఆయా రంగాల్లో భిన్న దృక్పథాలతో కృషి చేస్తున్న వారందరితో ఆ విషయాల్లో కలిసి పనిచేస్తుంది. వీ

నమ్మేవారు. ఈ నిరంతర సంఘర్షణలో ప్రతి అభివృద్ధి దశలోనూ దాని పరిణామానికి అవసరమైన బీజాలు ఉంటాయని, అలా అది మరింత ఉన్నత దశకు ఎదుగుతుందని వారు భావించేవారు. ప్రతి దశ కూడా దానికన్న ముందరి దశకన్న అభివృద్ధి అని, కాని అదే సమయంలో అది పాత దశ నుంచి కొన్ని అంశాలను తనలో సంలీనం చేసుకొని పరివర్తన చెందిస్తుందని వాళ్ల ఉద్దేశం. ఈ మార్పు ప్రక్రియలో కొత్త భావాలు పాత భావాలను ఓడించవని, పాతలోని ఘర్షణలను, వైరుధ్యాలను పరిష్కరించవని హెగెల్ నమ్మాడు. ఈ మార్పు ప్రక్రియను హెగెల్ గతితర్కం అన్నాడు.

హెగెల్ 1831లో చనిపోయాడు. అప్పటికీ మార్క్స్ ఇంకా విశ్వవిద్యాలయంలో నవయువకుడిగా ఉన్నాడు. హెగెల్ శిష్యులు రెండు బృందాలుగా – విప్లవకర యువ హెగెలియన్‌లు, అభివృద్ధి నిరోధక వృద్ధ హెగెలియన్‌లు – చీలిపోయి ఇరుపక్షాలు హెగెల్‌కు తామే అసలైన వారసులమని ఘర్షించారు. అప్పటికి ఉనికిలో ఉన్న రష్యన్ నిరంకుశ రాచరికం, మతం, సమాజం పరమ భావన సాధించిన విజయమని, గతితార్కిక అభివృద్ధి క్రమంలో అదే అంతిమమని వృద్ధ హెగెలియన్‌లు వాదించారు. అందుకు భిన్నంగా యువ హెగెలియన్‌లు ఆనాటికి అత్యంత ప్రమాదకరంగా మత వ్యతిరేకంగా మాట్లాడారు. సాధించ వలసిన మేధో అభివృద్ధి ఇంకా ఎంతో ఉన్నదని అన్నారు. ఈ భావనలతో రెండు ఆలోచనా ధోరణుల మధ్య తీవ్రమైన ఘర్షణకు రంగం సిద్ధమైంది. ఇరుపక్షాలు కూడా తాము సాధించబోయే విజయమే జర్మన్ సమాజ అభివృద్ధికి దారితీస్తుందని నమ్మాయి. జర్మన్ సమాజ జీవితంలోని అస్తవ్యస్తతను, దారిద్ర్యాన్ని, శైథిల్యాన్ని పరిశీలించిన మార్క్స్ తొలిరోజుల్లో తనను తాను యువ హెగెలియన్‌లలో భాగంగా భావించుకున్నాడు.

అయితే, యువ హెగెలియన్‌ల పట్ల మార్క్స్ సానుభూతి ఎక్కువ రోజులు నిలువలేదు. అదికూడా ఆయన మీద ఫ్యూయర్‌బా ప్రభావం వల్ల ఉండినదే. ఫ్యూయర్‌బా భౌతికవాది. అంటే, తన బాగు గురించే మొరటుగా ఆలోచించినవాడు అని అర్థం కాదు. నిజానికి అసమ్మతి అభిప్రాయాల వల్ల విద్యారంగంలో ఆయన ఉద్యోగం కూడా పోగొట్టుకో వలసి వచ్చింది. మానవ జీవితాన్ని, మనుగడను ప్రభావితం చేసేది చైతన్యం కాదని, చైతన్యాన్ని నిర్ణయించేది మానవ అవసరాలేనని ఫ్యూయర్‌బా భావించాడు. 'ది ఎసెన్స్ ఆఫ్ క్రిస్టియానిటి' అనే పుస్తకంలో ఫ్యూయర్‌బా మతం మీద సరళమైన, కాని అత్యద్భుతమైన వాదనా పటిమను ప్రదర్శించాడు. మతం అనేది ఒక భావోద్వేగ అవసరాన్ని తీరుస్తున్నది గనకనే మనుషులు భగవంతుడిని కోరుకుంటున్నారని ఆయన అన్నాడు. ఈ అవసరాన్ని తీర్చుకోవడం కొరకే మనుషులు తమలోని ఉత్తమ లక్షణాలన్నిటినీ భగవంతుడనే ఒక మూర్తిని తయారు చేసి అతనికి కల్పించారని, ఆరాధించడం ప్రారంభించారని, అది ఎంత వరకు వెళ్లిందంటే భగవంతుడు మానవ చైతన్యంలో ఒక స్వతంత్ర మనుగడను సంతరించుకున్నాడని ఫ్యూయర్‌బా వాదించాడు. అందువల్ల మనిషి తన మానవత్వాన్ని తాను తిరిగి సంపాదించుకోవాలంటే మాధవ సేవ వదిలి తోటి మనిషి పట్ల ప్రేమను పెంపొందించుకోవాలని ఫ్యూయర్‌బా అన్నాడు.

ఈ వాదనతో మార్క్స్ వెంటనే ఏకీభవించాడు. నిజానికి అంతకు ముందు మార్క్స్ ఫ్యూయర్‌బాను విమర్శించి ఉన్నాడు. ఫ్యూయర్‌బా మనుషులను సామాజిక జీవులుగా చూడలేదనీ, తమకు అందిన 'మానవ ప్రవృత్తి'ని తీర్చుకోవడానికి పోరాడుతున్న వ్యక్తులుగా మాత్రమే చూశాడని మార్క్స్ విమర్శించాడు. అయితే, మార్క్స్ చాలా త్వరగానే ఫ్యూయర్‌బా ప్రతిపాదించిన భౌతికవాదాన్ని అధిగమించి ముందుకు నడిచాడు. ఈ పని ఆయన రెండు మార్గాలలో చేశాడు. మొదటిది, ఫ్యూయర్‌బా ప్రతిపాదించిన భౌతికవాద తత్వశాస్త్రాన్ని ఆయన కేవలం మతానికీ, భావజాలానికీ మాత్రమే కాకుండా, సమాజంలో ఉనికిలో ఉన్న అన్ని ప్రబలమైన భావాలకూ, సమాజం పట్ల మొత్తంగా మనుషులకు గల భావనకూ విస్తరించాడు. రెండవది, ఫ్యూయర్‌బా భావాలను మార్క్స్ చరిత్రకు కూడా విస్తరించాడు. ఫ్యూయర్‌బా విశ్లేషణ సంపూర్ణంగా అచారిత్రికంగానూ, గతితర్క వ్యతిరేకంగానూ ఉండేది. ఏమంటే, మనుషులు మతం ద్వారా ఒక భావోద్వేగ అవసరాన్ని తీర్చుకుంటారు అంటూ, కాని, ఆ అవసరపు మూలం ఏమిటో ఫ్యూయర్‌బా వివరించలేదు. ఆ అవసరాన్ని భగవంతుడు తీర్చినా, తీర్చకపోయినా అది మారుతుందా లేదా ఫ్యూయర్‌బా వివరించలేదు. ఈ సమస్యకు పరిష్కారం భౌతిక పరిస్థితులలో ఉందని మార్క్స్ ఊహించాడు.

మార్క్స్ ఆలోచనలో మానవ చైతన్యం అనేది కీలకమైనది. అయితే, దాన్ని కేవలం చారిత్రక, సామాజిక, భౌతిక పరిస్థితులతో సంబంధంలో మాత్రమే అర్థం చేసుకోగలం. ఈ రకంగా మార్క్స్ గతితర్కానికీ, చరిత్రకూ ఒక సన్నిహిత సంబంధాన్ని నిర్ధారించాడు. ఆ సన్నిహిత సంబంధమే ఆయన సంవిధానానికి పునాది అయింది. చైతన్యం అనేదాన్ని ప్రాథమికంగా భౌతిక పరిస్థితులు నిర్ణయిస్తాయి. అదే సమయంలో ఆ భౌతిక పరిస్థితులు కూడా మానవ చరిత్ర క్రమంలోనే గతితార్కికంగా అభివృద్ధి అవుతూ ఉంటాయి.

ఇది చూస్తే హెగెల్ దృష్టిలో గానీ, విభిన్నమైన ఆయన శిష్యుల దృష్టిలో గానీ, విమర్శకుల దృష్టిలోగానీ, మార్క్స్ దృష్టిలో గానీ ఒక ఉమ్మడి లక్షణం కనబడుతుంది. అదేమంటే, వస్తువులు ఎల్లవేళలా అవి ఎలా ఉన్నాయో అలా కనబడవు. ఉదాహరణకు, ఫ్యూయర్‌బాకు భగవంతుడు మనిషి మనసులో తప్ప ఉనికిలో ఉండడు. అది కూడా ఒక మానవ అవసరాన్ని తీర్చే సందర్భంలో మాత్రమే కనబడతాడు. పెట్టుబడిదారీ విధానం కింద స్వేచ్ఛాయుతమైన శ్రామికుల మార్కెట్ అనేది కనబడుతుంది. దోపిడీని దాస్తుంది. రాజకీయ ప్రజాస్వామ్యం అనేది కనబడి సమానత్వాన్ని సూచిస్తుంది. కాని, అధికారాలు, హోదాలు కొనసాగుతూ ఉంటాయి. ఈ విధంగా వాస్తవానికి (లేదా వస్తువుకు, లేదా సారానికి) అది కనబడే రూపానికి (లేదా స్వరూపానికి) మధ్య అంతరం ఉందనేదే మార్క్స్ గతితార్కిక ఆలోచనలో కేంద్ర స్థానంలో ఉండే విషయం. ఈ ఆలోచనే వర్గం, విలువ వంటి అమూర్త భావనలకు, వేతనాలు, ధరలు, లాభాలు వంటి దైనందిన జీవితంలో ఆచరణాత్మకంగా కనబడే నిర్దిష్ట రూపాలకు మధ్య సంబంధాన్ని విప్పి చెబుతుంది.

ఈ ఆలోచనతో మార్క్స్ తనకు తాను ఒక కర్తవ్యం బిగించుకున్నాడు. అది పెట్టుబడిదారీ విధానం అధ్యయనం ద్వారా సాధించదలిచాడు. శాస్త్రానికి రాజమార్గం ఏమీ లేదు అని ఆయన మాటల్లోనే చెప్పినట్టు ఈ పని చాలా కష్టతరమైనదని ఆయనకు తెలుసు.

ఆ పని ఏమంటే అమూర్త భావనకు నిర్దిష్ట వస్తువుకు మధ్య ఉన్న సంబంధాన్నీ, వైరుధ్యాలనూ కనిపెట్టడం. ఆ పని చేయాలంటే ఒక సముచితమైన సంవిధానాన్ని అలవర్చుకోవాలి. అమూర్త భావనలలో దేనిదగ్గర ప్రారంభించాలని ఎంపిక చేసుకోవడంలో జాగరుకతతో ఉండాలి. వస్తువులు ఉన్న స్థితికి, అవి కనబడుతున్న స్థితికి మధ్య సంబంధాన్ని విప్పి చెప్పడానికి వాటి చారిత్రక, తార్కిక సారాంశాన్ని జాగ్రత్తగా విశదీకరిస్తూ పోవాలి.

ఇక్కడ మరొక ప్రధానమైన విషయం కూడా ఉంది. సరుకుల ఆరాధన అనే చర్చలో మార్క్స్ దాన్ని స్పష్టీకరించాడు కూడా. మతపరమైన భావనల లాగా అన్ని రూపాలు తప్పనిసరిగా భ్రమాజనితమైనవనో, తప్పుడువనో అనుకోవడానికి వీలులేదు. ఎందుకంటే, వేతనాలు, లాభాలు, ధరలు అనేవి పెట్టుబడిదారీ విధానం తన దోపిడీ కొరకు తయారు చేసుకున్న రూపమే అని మనకు ఎంతగా తెలిసినప్పటికీ అవి లేవని మాత్రం అనుకోలేం. ఈ సందర్భంలో ఆ రూపాలు వాస్తవికతలో అవిభాజ్యమైన భాగాలు. పెట్టుబడిదారీ విధానపు మౌలిక అంశాలకు అవి ప్రాతినిధ్యం వహిస్తాయి. వాటిని దాచి పెడతాయి కూడా. వాటిని విప్పి చెప్పడానికి సరిపోయిన గతితార్కిక సూత్రాలు కావాలి. మరి ఈ సంక్లిష్టతను, చిక్కుముడిని విప్పడం ఎలా?

సంవిధానం

రాజకీయార్థ శాస్త్రం, చరిత్ర, మానవ పరిణామ శాస్త్రం, సమకాలీన వ్యవహారాలు, వగైరా విస్తృతమైన రచనలు చేసినప్పటికీ మార్క్స్ తన సంవిధానం గురించి ఒక వివరమైన వ్యాసం రాయలేదు. ఇది ఎందువల్లనంటే, ప్రాథమికంగా ఆయన కృషి అంతా పెట్టుబడిదారీ విధానం మీద, దాని సమర్థకుల మీద విమర్శ. అందులో సంవిధానం అనేది ముఖ్యమైన పాత్రే వహిస్తుంది గాని అది రెండోస్థాయిదే. అది ఇతర వాదనలలో సాధారణంగా కలగలిసి ఉంటుంది. అంతేకాదు, మార్క్స్ సంవిధానాన్ని కొన్ని సార్వత్రిక సూత్రాలుగా క్లుప్తీకరించడం కుదరదు. ఆయన వాడిన భౌతికవాద గతితర్కానికి నిర్దిష్ట అన్వయాలను ప్రతి ఒక్క సమస్యతో వ్యవహరించేటప్పుడు ప్రత్యేకంగా అభివృద్ధి చేయవలసిందే. మార్క్స్ సంవిధానపు అన్వయానికి అందరికీ తెలిసిన ఉదాహరణ 'కాపిటల్' గ్రంథమే. అందులో ఆయన పెట్టుబడిదారీ విధానాన్ని విమర్శనాత్మక పరీక్షకు గురిచేసిన పద్ధతి ఆ సంవిధానమే. పెట్టుబడిలో మార్క్స్ వ్యవహరించిన పద్ధతికి అయిదు ముఖ్యమైన, స్థూలమైన లక్షణాలు ఉన్నాయి. ఈ లక్షణాలను ఆయన ఆ పుస్తకం మొత్తంలోనూ అంతర్గర్భితంగా కొన్నిచోట్ల కలిపారు. కొన్నిచోట్ల సానపెట్టారు.

మొదటిది, సామాజిక దృగ్గోచరాంశాలు చారిత్రక సందర్భంలో మాత్రమే ఉనికిలో ఉంటాయి. చారిత్రక సందర్భంలో మాత్రమే వాటిని అర్థం చేసుకోగలం. చరిత్రతో సంబంధం లేని సాధారణీకరణలు, సార్వకాలికమైన, సార్వజనీనమైన అభిప్రాయాలు సాధారణంగా వాగాడంబరం మాత్రమే. లేదా, అర్థరహితం మాత్రమే. లేదా, రెండూ కూడా. మానవ సమాజాలకు అపారమైన వెసులుబాటు ఉంది. మానవ సమాజాలను చాలా భిన్నమైన పద్ధతులలో సంఘటితం చేయడానికి అవకాశం ఉంది. వివరమైన విశ్లేషణ మాత్రమే ఆ మానవ సమాజాల అంతర్నిర్మాణాల గురించి, వైరుధ్యాల గురించి, మార్పుల గురించి, పరిమితుల గురించి అర్థవంతమైన నిర్ధారణలకు దారితీస్తుంది. ప్రత్యేకంగా సమాజాలను అర్థం చేసుకోవడానికి అవి ఏ ఉత్పత్తి విధానంలో సంఘటితం అయ్యాయో తెలుసుకోవడం అవసరమని మార్క్స్ భావించాడు. ఉదాహరణకు ఆ సమాజం భూస్వామ్య ఉత్పత్తి విధానంలో ఉందా, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో ఉందా అనేదే ఆ సమాజ నిర్మాణం గురించి మన అవగాహనకు వీలు కల్పిస్తుంది. ప్రతి ఉత్పత్తి విధానం ఆ సమాజంలోని వర్గ సంబంధాల ప్రకారమే నిర్మాణం అయి ఉంటుంది. ఆ వర్గ సంబంధాలను అర్థం చేసుకోవడానికి తగిన ప్రత్యేకమైన విశ్లేషణా పరికరాలు కావాలి. వేతన కార్మికుడు అంటే అర్ధబానిస కాదు. ఎందుకంటే, అర్ధబానిసకు వేతనం దొరకదు. అర్ధబానిస 'స్వేచ్ఛాయుత'మైన బానిస కాదు. అలాగే పెట్టుబడిదారు భూస్వామ్య ప్రభువు కాదు. పెట్టుబడిదారుకు కప్పానికి బదులు లాభం రావడం లేదు. సమాజాల మధ్య తేడా అవి ఏ ఉత్పత్తి విధానం కింద సంఘటితం అయ్యాయి అనేదాన్ని బట్టే ఏర్పడుతుంది. అలాగే, వాటిని అర్థం చేసుకోవాడనికి కూడా విభిన్నమైన భావనలు అవసరం.

రెండవది, అందువల్ల ఒక సిద్ధాంతాన్ని దాని చారిత్రక, సామాజిక పరిధుల అవతలికి నెడితే అది నిరుపయోగమైపోతుంది. అంటే, ఏ సమాజాల గురించి వ్యవహరిస్తున్నామో ఆ సమాజాల భావనలనే ఉపయోగించ వలసి ఉంటుంది. ఉదాహరణకు, పెట్టుబడిదారీ విధానంలో కార్మికులు తాము వేతనాల ద్వారా పొందే విలువ కన్న ఎక్కువ విలువను ఉత్పత్తి చేస్తారు గనుక దోపిడీకి గురవుతారని మార్క్స్ అన్నాడు. ఆ తేడానే అదనపు విలువ అంటారు. ఈ నిర్ధారణ గాని, అందుకు సంబంధించి అభివృద్ధి చేసిన అదనపు విలువ అనే భావన గాని, పెట్టుబడిదారీ సమాజాలలో మాత్రమే ఉపయోగపడతాయి. ఇతర సమాజాలలో దోపిడీ గురించి ఈ భావన కొంత వెలుగును ప్రసరింప జేయవచ్చు. కానీ, ఆ సమాజాలలో దోపిడీ పద్ధతులను గురించి సామాజిక, ఆర్థిక పరివర్తన మూలాలను గురించి కొత్తగా అధ్యయనం చేయవలసిందే. పెట్టుబడిదారీ గురించిన విశ్లేషణ ఎంత సరైనదైనా ఇతర సమాజాలు ఎలా నిర్మాణం అయ్యాయనే విషయం అర్థం చేసుకోవడానికి అవసరమైన సూత్రాలను అందజేయదు.

మూడవది, మార్క్స్ విశ్లేషణకు అంతర్గతంగానే ఒక నిర్మాణం ఉంది. అది సిద్ధాంతానికీ, చరిత్రకూ మధ్య ఉన్న సంబంధం మీద ఏర్పడింది. హెగెలియన్ భావ వాదానికి భిన్నంగా మార్క్స్ సంవిధానం భావనలను కనిపెట్టడం మీద ఆధారపడి లేదు. మార్క్స్ దృష్టిలో శుద్ధమైన భావనాత్మకమైన వాదన పరిమితమైనదే. ఎందుకంటే, విశ్లేషకుడి బుర్రలో రూపొందే సంబంధాలు వాస్తవ ప్రపంచంలో ఉన్నాయో లేవో అది వివరించజాలదు. ఇంకా సాధారణంగా చెప్పాలంటే, భావ వాదం ఎక్కడ పొరబడుతుందంటే అది వాస్తవికతను ప్రాథమికంగా భావనల అభివృద్ధి ద్వారా వివరించదలచుకుంటుంది. కాని, వాస్తవికత అనేది ఆలోచించే బుర్రకు బయట చారిత్రకంగా, భౌతికంగా మాత్రమే అస్తిత్వంలో

ఉంటుంది. అందుకే, యువ హెగెలియన్‌ల గురించి మార్క్స్ ఒక పరిహాసం ఆడాడు. భూమ్యాకర్షణ శక్తి అనేది లేదని యువ హెగెలియన్‌లు నమ్మితే దాన్నుంచి తప్పించుకోవచ్చునేమో అన్నాడు. అందుకు భిన్నంగా మార్క్స్ దృష్టిలో వాస్తవికత అనేది సామాజిక వ్యవస్థ ద్వారా రూపొందింది. అందులో ధోరణులు, ప్రతి ధోరణులు ఉన్నాయి. వాటిని గతితార్కికంగా అర్థం చేసుకోవచ్చును. అలాగే వాస్తవికతలో మనం ఊహించడానికి వీలులేని యాదృచ్ఛిక ఘటనలు ఉన్నాయి. వాటిని గతితార్కికంగా కూడా గ్రహించలేం. వాటి మధ్య సంబంధాల ఫలితాలు ఎలా ఉంటాయో మనం ముందస్తుగా నిర్ధారించలేం. అందువల్ల గతాన్ని, వర్తమానాన్ని అర్థం చేసుకోవడంలో భౌతికవాద గతితర్కం మనకు సహాయం పడినప్పటికీ భవిష్యత్తును ఊహించి చెప్పడంలో అది ఉపయోగపడదు. లాభాల రేటు పడిపోయే ధోరణి గురించి ఒక సూత్రం విశ్లేషించిన మార్క్స్ దాని ప్రతి ధోరణుల గురించి కూడా వివరించాడు. అదే ఆయన సంవిధానంలోని విశిష్టత. చారిత్రక విశ్లేషణ అనేది అధ్యయన సంవిధానంలో భాగమనీ, చరిత్ర, తర్కం అవిభాజ్యమనీ మార్క్స్ గుర్తించడం అనుభవవాదాన్ని అంగీకరించడం కాదు. అది కేవలం నిరంతరం మారుతున్న వాస్తవికతను నిర్ధారించడం అలా ఉంచి, కొన్ని భావనల వ్యవస్థకు కుదించలేమని గుర్తించిన ఫలితంగానే మార్క్స్ ఆ విశ్లేషణ చేసాడు.

నాల్గవది, నిర్దిష్టమైన, లేదా ఎక్కువ సంక్లిష్టమైన ప్రత్యేక ఫలితాల వివరణకు అవసరమైన మౌలిక భావనలను, వ్యవస్థలను, సంబంధాలను, విశ్లేషణా స్థాయిలను భౌతికవాద గతితర్కం గుర్తిస్తుంది. కాపిటల్‌లో మార్క్స్ భౌతికవాద గతితర్కాన్ని వాడి పెట్టుబడిదారీ విధానంలోని సారభూతమైన లక్షణాలను, వాటి వైరుధ్యాలను ఎత్తిచూపాడు. ఆ ఉత్పత్తి విధానపు నిర్మాణాన్ని, గతిశీలతను వివరించాడు. చారిత్రక పరివర్తన సాగే శక్తి ఉన్న వనరులను గుర్తించాడు. ఆయన చేసిన అధ్యయనం క్రమ పద్ధతిలో ఇంకా ఇంకా ఎక్కువ సంక్లిష్టమైన, నిర్దిష్టమైన భావనలను వెలికి తెస్తుంది. తద్వారా పెట్టుబడిదారీ విధానపు వాస్తవికతను మన ఆలోచనలో పునర్ నిర్మించడానికి వీలు కలుగుతుంది. ఈ భావనలు పెట్టుబడిదారీ విధానపు చారిత్రక అభివృద్ధిని వివరించడానికి ఉపయోగ పడతాయి. అలాగే, పెట్టుబడిదారీ విధానపు కీలకమైన లోపాలను సూచిస్తాయి. ఈ విశ్లేషణలో మార్క్స్ ఆలోచనలోని వేరు వేరు స్థాయిల అమూర్తీకరణ భావనలు సహజీవనం చేస్తాయి. సైద్ధాంతికంగా అభివృద్ధి సాధించడమంటే, ఎప్పటికప్పుడు కొత్త భావనలను ప్రవేశపెట్టడం. కొనసాగుతున్న భావనలను ఇంకా పై స్థాయిలో మెరుగుపెట్టడం. పునరుత్పత్తి చేయడం. తద్వారా నిర్దిష్టతా, సంక్లిష్టతా అంతకంతకూ పై స్థాయిలో గుర్తించడం. అలాగే, వాస్తవికతకు సంబంధించిన మరింత సంపన్నమైన, మరింత నిర్ణాయత్మకమైన వివరణ ఇవ్వడానికి ఎప్పటికప్పుడు కొత్త, చారిత్రక ఆధారాలను ప్రవేశపెట్టడం.

అయిదవది, మార్క్స్ సంవిధానం చారిత్రక పరివర్తన మీద దృష్టి కేంద్రీకరిస్తుంది. కమ్యూనిస్ట్ ప్రణాళికలోనూ 'కంట్రిబ్యూషన్ టు ది క్రిటిక్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ' ముందుమాటలోనూ, గ్రండ్రిస్సె ఉపోద్ఘాతంలోనూ మార్క్స్ చేసిన సుప్రసిద్ధ వ్యాఖ్య. ఉత్పత్తి వ్యవస్థలకూ, సామాజిక సంబంధాలకూ, చారిత్రక పరివర్తనకూ మధ్య ఉన్న సంబంధం గురించి ప్రకటించింది. మార్క్స్ భావాలను చాలా తరచుగా, యాంత్రికంగా వ్యాఖ్యానించడం జరిగింది. సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధి ఏకముఖంగా జరుగుతుందనీ, అదే ఏ సమస్యలు లేకుండా చారిత్రక పరివర్తనకు మార్గదర్శకత్వం వహిస్తుందనీ అంటే, సామాజిక పరివర్తన అనేది ఉత్పత్తి అభివృద్ధి వల్ల నిర్ణయమవుతుందనీ ఆయన అన్నాడని పొరపాటు వ్యాఖ్య ప్రచారంలో ఉంది. మార్క్స్ మాటలను ఇలా వ్యాఖ్యానించడం అర్థరహితం. సాంకేతిక విధానానికీ, సమాజానికీ, చరిత్రకూ, ఇతర శక్తులకూ మధ్య పరస్పర నిర్ణాయక సంబంధం ఉంది. అయితే, ఈ పరస్పర నిర్ణాయక సంబంధాన్ని ఆనాటి సామాజిక నిర్మాణ పద్ధతి ప్రభావితం చేస్తుంది. ఉదాహరణకు, పెట్టుబడిదారీ విధానంలో సాంకేతిక అభివృద్ధిని మొత్తంగా వ్యాపార కార్యకలాపాలన్నిటికీ మూలంగా ఉండే లాభాకాంక్షే నడుపుతుంది. భూస్వామ్య సమాజంలో విలాస వస్తువుల ఉత్పత్తి, సైనిక సేవలు, కొంతవరకు వ్యవసాయ పరికరాల అభివృద్ధి ప్రధానం అవుతుంది. అక్కడ లాభార్జన దృష్టి లేకపోవడం వల్ల సాంకేతిక అభివృద్ధి పరిధి గానీ, వేగంగానీ పరిమితం అవుతాయి. ఈ రెండు సమాజాలకు భిన్నంగా కమ్యూనిస్టు సమాజాలలో సాంకేతిక అభివృద్ధి పదేపదే చేసే పనిని, శారీరకంగా కష్టతరమైన పనిని, అనారోగ్యకరమైన పనిని, ప్రమాదకరమైన పనిని రద్దు చేస్తుందని, మొత్తంగా శ్రమకాలాన్ని తగ్గిస్తుందని, మౌలిక అవసరాలన్నిటిని తీరుస్తుందని, మానవ అవకాశాలను అభివృద్ధి చేస్తుందని మార్క్స్ వాదించాడు.

మార్క్స్ అర్థశాస్త్రం

ఎంగెల్స్‌తో కలిసి 1845-46లలో జర్మన్ ఐడియాలజీ రాస్తున్నప్పుడు, సొంతంగా 'థీసిస్ ఆన్ ఫ్యూయర్‌బా' రాస్తున్నప్పుడు మార్క్స్ అప్పటికే ఫ్రెంచ్ సోషలిస్టుల భావాలతో ప్రభావితుడయ్యాడు. ఫ్రెంచ్ సోషలిస్టులు 18వ శతాబ్దంలో జరిగిన ఫ్రెంచ్ విప్లవపు ప్రగతిశీల భావాల వారసత్వాన్ని సంతరించుకున్నారు. ఫ్రెంచ్ విప్లవంలో వెలువడిన స్వేచ్ఛా, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే నినాదాలను నిజం చేయడంలో బూర్జువా సమాజం విఫలమైందని వారు గుర్తించారు. వారు చాలా లోతుగా వర్గ రాజకీయాలలో భాగం పంచుకున్నారు. కార్మికులు విప్లవాత్మకమైన చర్యల ద్వారా అధికారాన్ని హస్తగతం చేసుకోవాల్సిన అవసరం ఉందనీ, అది సాధ్యమనీ వారిలో చాలా మంది నమ్మారు.

ఆ రకంగా మార్క్స్ జర్మన్ తత్వశాస్త్రాన్ని, ఫ్రెంచ్ సోషలిజాన్ని సమ్మిళితం చేశాడు. అయితే ఆయన బ్రిటిష్ రాజకీయార్థిక శాస్త్రం మీద విమర్శ చేసి ఉండకపోతే ఈ సమ్మేళనం అసంపూర్ణంగానే ఉండిపోయేది. ఆయన బ్రిటిష్ రాజకీయార్థిక శాస్త్రాన్ని ఆ తర్వాతే చదివాడు. పైన వివరించినట్టుగా తత్వశాస్త్రంలోనూ, చరిత్రలోనూ తన భావనలు రూపొందించుకున్న మార్క్స్‌కి ఇక తన అధ్యయనాన్ని అర్థశాస్త్రం వైపు తిప్పడం చాలా సహజం. తన సమకాలీన పెట్టుబడిదారీ సమాజాన్ని అర్థం చేసుకోవడానికీ, దాని బలాలను, బలహీనతలను గ్రహించడానికీ, అది సోషలిస్టు (కమ్యూనిస్టు) సమాజంగా పరివర్తన చెందడానికీ, ఉన్న అవకాశాలను అధ్యయనం చేయడానికీ మార్క్స్‌కు అర్థశాస్త్రం అవసరం అయింది. అందుకోసమే ఆయన బ్రిటిష్ రాజకీయార్థ శాస్త్ర అధ్యయనంలో మునిగిపోయాడు. ఆడమ్ స్మిత్,

అంతకన్నా ముఖ్యంగా డేవిడ్ రికార్డో రచనల అధ్యయనం నుంచి ఆయన శ్రమ విలువ సిద్ధాంతాన్ని అభివృద్ధి చేశాడు. రికార్డో చెప్పినట్టుగా ఉత్పత్తి శ్రమకాలంలోనే విలువ వనరును వెతకడం అసమగ్రమని మార్క్స్ గుర్తించాడు. రికార్డో అభిప్రాయం వినిమయాన్ని, ధరలను, సరుకులను ఉన్నవి ఉన్నట్టుగా గ్రహిస్తుందని మార్క్స్ గుర్తించాడు. ఎక్కువ శ్రమ కలిగి ఉన్న సరుకులు ఎక్కువ విలువ అయినవి అనే రికార్డో అభిప్రాయం ఇంకా ఒక ప్రశ్నను మిగులుస్తుందని, అసలు సమాజంలో సరుకులు ఎందుకు ఉన్నాయి అని అడగాలని మార్క్స్ భావించాడు. అసలు సరుకులన్నీ వాటి వాటి ఉత్పత్తి శ్రమకాలాన్ని బట్టే వినిమయం అవుతాయి అనే భావన సరైనదేనా అని ప్రశ్నించాడు. ఇక్కడ మార్క్స్ సంవిధానంలోని కీలక అంశం ఇది. ఇతర రచయితలందరి పైనా మార్క్స్ విమర్శ చేసిన విమర్శల్లో ఉమ్మడి అంశం ఇది. ఇతర అర్థశాస్త్రవేత్తలందరూ వారి సారాంశంలో పొరబడడం మాత్రమే కాదు, వారి ఉద్దేశాలలో అసమగ్రంగా ఉన్నారని మార్క్స్ గుర్తించాడు. ఇతర అర్థశాస్త్రవేత్తలందరూ మనుషులకూ, సమాజాలకూ సార్వకాలికమైన లక్షణాలని భావించిన వాటిని మార్క్స్ నిర్మూలించదలిచాడు, వాటి చారిత్రక నేపథ్యంలోనే అర్థం చేసుకోదలిచాడు.

ఉత్పత్తి చేయడానికి, వినియోగించడానికి శ్రమించడం అనేది ఒక సామాజిక అవసరం అని మార్క్స్ అంగీకరించాడు. కాని, ఉత్పత్తి ఏ రకంగా సంఘటితం అవుతుంది అనే దాన్ని వెలికితీయాలని, ఇతర సామాజిక సంబంధాలు ఈ సంఘటిత ఉత్పత్తి మీద ఏ రకంగా ఆధారపడతాయి అనేది వివరించాలని మార్క్స్ ఆశించాడు. ఈ విశదీకరణ, ఈ వివరణ వ్యవస్థాగతంగానూ, చారిత్రకంగానూ జరగాలని ఆయన అన్నాడు. క్లుప్తంగా చెప్పాలంటే, శ్రమించేటప్పుడు అంటే తమ వైయ్యక్తిక, సామాజిక పునరుత్పత్తికి తగిన భౌతిక పరిస్థితులను ఉత్పత్తి చేసేటప్పుడు మనుషులు ఒకరితో ఒకరు నిర్దిష్టమైన సామాజిక సంబంధాలలో ప్రవేశిస్తారని మార్క్స్ వాదించాడు. ఒకరు బానిసగా, మరొకరు యజమానిగా. ఒకరు భూస్వామిగా, మరొకరు అర్ధబానిసగా. ఒకరు పెట్టుబడిదారుగా మరొకరు వేతన శ్రామికుడిగా సామాజిక సంబంధాలలోకి ప్రవేశిస్తారు. అందువల్ల మనుషుల జీవన విధానాలను అప్పటికి కొనసాగుతున్న సామాజిక పరిస్థితులే నిర్ణయిస్తాయి. ఉత్పత్తి ప్రక్రియలో ఏ స్థానంలో ఎవరు నిలబడాలనేది సామాజిక పరిస్థితులే నిర్ణయిస్తాయి. ఇవి వ్యక్తుల వ్యక్తిగత ఎంపికతో సంబంధం లేకుండా ఉండే సంబంధాలు. సమాజపు చారిత్రక అభివృద్ధి క్రమంలో అవి స్థాపించబడి రూపుదిద్దుకుంటూ ఉన్నాయి.

భూస్వామ్యం, పెట్టుబడిదారీ విధానం, వగైరా ఒక ప్రత్యేక ఉత్పత్తి విధానంలో నిర్దిష్టంగా ఉండే సామాజిక ఉత్పత్తి సంబంధాలను సరిగ్గా అధ్యయనం చేయాలంటే వర్గ సంబంధాలుగా అధ్యయనం చేయాలి. అతి సరళమైన సమాజాలలో మాత్రమే ఆ సంబంధాలు భిన్నంగా ఉండవచ్చు. ఈ వర్గ సంబంధాల పునాది మీదనే సమాజం నిర్మాణం అయింది. ఒక పెట్టుబడిదారీ విధానంలో కొనడానికీ, అమ్మడానికీ స్వేచ్ఛ ఉండడం అనేదే మౌలికమైన, చట్టబద్ధమైన లక్షణం. అలాగే, భూస్వామ్య విధానంలో దైవం నిర్ణయించిన లేదా స్వామి నిర్ణయించిన విధులే చట్టబద్ధమైన పునాది. ఈ పునాదికి తోడుగా తమకు తాము వత్తాసు ఇచ్చుకునే రాజకీయ, చట్టపరమైన, మేధోపరమైన, పంపిణీ రూపాలు కూడా నిర్మాణం అవుతాయి. ఇవి ఆ సమాజంలో అతి సాంప్రదాయికమైన భావాలను తప్ప మిగిలిన భావాలన్నిటికీ కళ్లకు గంతలు కడతాయి. నిరుత్సాహపరుస్తాయి. అలా కొత్త భావాలు రాకపోవడానికి అలవాటు కారణం కావచ్చు, ఇతర కారణాలు ఉండవచ్చు. అర్ధ బానిస తన ప్రభువుకూ, రాజుకూ విధేయుడై ఉండాలనుకుంటాడు. ఏమాత్రం ఊగిసలాట కనబడినా అతి తీవ్రమైన శిక్షను అనుభవిస్తాడు. వేతన శ్రామికుడికి తన శ్రమ శక్తిని అమ్ముకోవడానికి స్వేచ్ఛా ఉంది, అమ్ముకోవలసిన నిర్బంధం ఉంది. ఇక్కడ ఎక్కువ వేతనాల కోసం పోరాటం కూడా ఉండవచ్చు. కాని అసలు వేతన వ్యవస్థనే ప్రశ్నించడం ఉండదు. పెట్టుబడిదారీ విధానపు స్వభావం గురించి ఆలోచించడానికి ప్రయత్నిస్తే అధికార వర్గాల ఒత్తిడి పెరుగుతుంది. అంతేకాదు, వ్యక్తిగత స్థాయిలో అసమ్మతిని సహించడం కూడా ఉంటుంది. కాని, పెట్టుబడిదారీ వ్యతిరేక సామూహిక ప్రజా ఉద్యమాలు తప్పనిసరిగా అణచివేత ఎదుర్కొంటాయి.

ఈ నేపథ్యంలో మానవ స్వభావం గురించి సాధారణ ఊహలు చేసినందుకూ, స్వార్థం వంటి లక్షణాలు మానవ ప్రవృత్తిలోని శాశ్వత లక్షణాలు అని చెప్పినందుకూ మార్క్స్ సాంప్రదాయిక రాజకీయార్థిక శాస్త్రవేత్తలను, ఉపయోగితవాద ఆర్థిక శాస్త్రవేత్తలను తీవ్రంగా విమర్శించాడు. వాస్తవంలో ఈ లక్షణాలన్నీ ఆయా ప్రత్యేక సమాజాలు వ్యక్తులలో పెంపొందించిన లక్షణాలే అని మార్క్స్ వివరించాడు. అలాగే, అంతకు ముందరి అర్థశాస్త్రవేత్తలు పెట్టుబడిదారీ సమాజంలోని లక్షణాలను ఉన్నవి ఉన్నట్టుగా అంగీకరించారు. మార్క్స్ వాటిని వివరించడం అవసరమని భావించాడు. ఒక అత్యల్ప సంఖ్యాక వర్గానికి ఉత్పత్తి సాధనాల మీద గుత్తాధిపత్యం ఉండడం, అత్యధిక జనాభా వేతన శ్రామికులుగా ఉద్యోగాల వేటలో ఉండడం, ద్రవ్య రూప వినిమయం ద్వారా మాత్రమే ఉత్పత్తులు పంపిణీ కావడం, ధరలు, లాభాలు, వేతనాలు వంటి ఆర్థిక రూపాలలో మాత్రమే ప్రతిఫలం ఉండడం వంటి లక్షణాలను మార్క్స్ ప్రశ్నించాడు.

మార్క్స్ విలువ సిద్ధాంతం మొత్తంగా సామాజిక శాస్త్రాలకే గొప్ప చేర్పు. ఎందుకంటే, అది మనుషులు తమ మధ్య తాము పెట్టుకునే సంబంధాల గురించి చర్చిస్తుంది. వస్తువుల మధ్య సాంకేతిక సంబంధాల గురించో, ఆర్థిక వ్యవస్థ గురించో కాదు. మార్క్స్‌కు ప్రధానంగా ఒక ధరల సిద్ధాంతాన్ని అభివృద్ధి చేయాలనో, నాణ్యత ప్రమాణాలు సూత్రాలు తయారు చేయాలనో, కొన్ని సంక్షేమ భావనలను కనిపెట్టాలనో ఆసక్తి లేదు. ఆయన ఎన్నడూ తనను తాను ఒక సంకుచితమైన 'అర్థశాస్త్రవేత్త'గా భావించుకోలేదు. చివరికి, రాజకీయార్థశాస్త్రవేత్త కాదల్చలేదు. మార్క్స్ ఒక విమర్శనాత్మక సామాజిక శాస్త్రవేత్త. ఆయన కృషి శాస్త్ర రంగాలలో విభజన రేఖలను దాటుతూ, తిరస్కరిస్తూ అటూ ఇటూ సాగింది. పెట్టుబడిదారీ విధానపు స్థిరత్వానికి, సంక్షోభాలకు మూలాలు ఏమిటి? పెట్టుబడిదారీ విధానాన్ని మార్చాలనే కోరిక ఒక విజయవంతమైన విప్లవాత్మక పరివర్తనా కార్యాచరణగా ఎలా అభివృద్ధి చెందగలదు? ఇవి మార్క్స్ నిశితంగా ఆలోచించిన కీలకమైన ప్రశ్నలు. ఈ ప్రశ్నలు 21వ శతాబ్దంలో కూడా ఇంకా అత్యవసరమైన ప్రశ్నలుగానే ఉన్నాయి. ■

సంప్రదాయ ప్రతిపాదనలకు భిన్నంగా వ్యవసాయం కన్నా ముందే మానవులు స్థిరనివాసం ఏర్పర్చుకున్నట్లు, సామూహిక సహకారం అందించుకున్నట్లు పురాతన కట్టడాల ఆధారంగా తెలుస్తోందని అంటున్నారు **డా. కొడవటిగంటి రోహిణీప్రసాద్**

తొట్టతొలి దేవాలయాలు

ఆధునిక మానవజాతి దాదాపు 2 లక్షల ఏళ్ల క్రితమే మొదలయింది. అంతకు ముందర సుమారు 15 లక్షల సంవత్సరాలుగా హోమోఎరెక్టస్ మొదలైన పూర్వ మానవజాతులు వానరాలకు భిన్నమైన సామూహిక జీవితాలు గడిపాయి. చారిత్రక సాక్ష్యాలు లభించని ఆ యుగంలోనే కొంత తాత్వికచింతన కూడా ఆరంభమయింది. ఇంతకీ మతాలకు నిలయాలైన దేవాలయాలు ఎప్పటి నుంచి ఉన్నాయి? 32 వేల ఏళ్ల క్రితపు గుహా చిత్రాలు అతి ప్రాచీన ఆరాధనా స్థలాలై ఉండ వచ్చునని పరిశోధకుల అభిప్రాయం. అయితే ఇప్పటివరకూ దొరికిన సాక్ష్యాలనుబట్టి తొట్టతొలి దేవాలయం పదకొండున్నర వేల ఏళ్ల నాటిదని తెలుస్తోంది. ఇది కొత్తరాతియుగం మొదలవకముందే తయారైనట్టుగా కనబడుతోంది. అంటే సింధు నాగరికతకు 7 వేల ఏళ్ల కిందట, మానవులు వ్యవసాయ పద్ధతులను పూర్తిగా అవలంబించని దశలోనే దీని నిర్మాణం జరిగి ఉండాలి. ఈ ఆసక్తికరమైన విశేషాలను చూద్దాం.

టర్కీ ఆగ్నేయప్రాంతంలో, సిరియా సరిహద్దుకు సమీపాన జర్మనీకి చెందిన పరిశీలకులు 1994లో కొన్ని శిథిలాలను గుర్తించారు. ఈ ప్రాంతాన్ని మొదటగా అమెరికన్లు 1964లో పరిశీలించి వదిలేశారు. మళ్లీ మరికొందరు వెళ్లి అదొక అపూర్వమైన ప్రాచీనస్థలమని కనిపెట్టారు. గయ్బెక్లీ టేపే, నేవాల చోరీ అనే ప్రదేశాల్లోని అతి ప్రాచీన శిథిలాలు ఇప్పటికి తెలిసినంత వరకూ ప్రపంచంలోని తొట్టతొలి దేవాలయాలుగా నిస్సందేహమైన గుర్తింపును పొందాయి. ఈ సాక్ష్యాలు ఎంత పాతవంటే ఆ కాలానికి కుండల తయారీగాని, లోహపు పనిముట్ల వాడకంగాని మొదలవలేదు.


గయ్బెక్లీ టేపే (టర్కిష్ భాషలో 'నాభి కలిగిన పర్వతం' లేదా 'బొడ్డుకొండ') వద్ద జరిపిన తవ్వకాలలో బైటపడ్డ శిథిలాలు అన్నిటికన్నా ప్రాచీనమైనవి. అక్కడ పదహారడుగులదాకా ఎత్తున్న స్తంభాలు 65 అడుగుల వ్యాసం కలిగిన వలయాకారంలో నిలిచి ఉన్నాయి. కొన్నిటిమీద చెక్కిన బొమ్మల్లో నక్కలూ, సింహాలూ, తేళ్లూ, రాబందులూ కనిపిస్తాయి. ఆ కాలంలో అదొక మనోహరమైన పర్వత ప్రాంతమనీ, బార్లీ, గోధుమలు వన్యజాతులుగా పెరిగేవనీ, లేళ్లూ, ఇతర మృగాలూ తిరుగుతూ ఉండేవనీ, ప్రశాంత వాతావరణం, సమశీతోష్ణం కలిగి, వనరులు పుష్కలంగా దొరికే ప్రదేశమనీ, ఆరాధనా స్థలానికి చాలా అనువైనదనీ ఊహిస్తున్నారు. ఆధునిక పద్ధతిలో భూమి లోపలికి చొచ్చుకు పోగలిగిన రేడార్, జియోమేగ్నెటిక్ శోధకపరికరాల సహాయంతో పరిశీలిస్తే ఇంకా తవ్వి వెలికి తీయ వలసిన ఎన్నో వలయాకార నిర్మాణాలున్నట్టుగా తెలుస్తోంది.



గయ్బెక్లీ టేపే చెక్కడాల్లోని వేటగాడు (ఎడమ), అడవిపంది, బాతులు (కుడి)

స్తంభాల బరువు 7 నుంచి 10 టన్నులదాకా ఉంటుంది కనక ఇది ఆదిమ బృహత్‌శిలా సంస్కృతి వంటిది. పెద్దపెద్ద రాళ్లను పేర్చి స్మారక చిహ్నాలను నిర్మించే ఇటువంటి సంప్రదాయం కొన్ని వేల ఏళ్ల పాటు కొనసాగింది. అక్కడి తవ్వకాలలో ఎంత వెతికినా కొన్ని రాతిపని ముట్లు దొరికాయి గాని, వంటకు ఉపయోగించిన నెగడులూ, ఇళ్లూ, చెత్తకుండీలూ మొదలైనవేవీ కనబడలేదు. సంతానోత్పత్తికి పూజించే అమ్మతల్లి బొమ్మల వంటివి కూడా దొరక లేదు. ఆ ప్రాంతంలో విరివిగా దొరికే సున్నపు రాళ్లను చెక్కడం సులువనీ, లోహపు పనిముట్లు లేకపోయినప్పటికీ అటువంటి నిర్మాణం సాధ్య పడిందనీ పరిశోధకులు గుర్తించారు. ఈ నిర్మాణ మంతా పొరలుగా జరిగింది. పాత స్తూపాల మీద మట్టి కప్పి, పైన కొత్త నిర్మాణం చేపట్టేవారనీ, ఇలా కొన్ని వేల సంవత్సరాల పాటు చేశారనీ తెలుస్తోంది.

అక్కడ దొరికిన ఎముకలను చూస్తే అప్పటి వారు వేటమీద ఎక్కువగా ఆధారపడేవారనీ, లేళ్లూ, జింకలూ, అడవిపందులూ, గొర్రెలూ, బాతులూ, కొంగలూ, రాబందులూ మొదలైన వన్య జాతులను



టర్కీలోని గయ్బెక్లీ టేపే ఆలయప్రాంగణం

పట్టుకుని, చంపి తినేవారనీ తెలుస్తోంది. ఇది జంతువులను మచ్చికచెయ్యడంగాని, పొలం సాగుకాని మొదలవని దశలాగా అనిపిస్తుంది. అయితే వ్యవసాయం మొదలవడానికి అనువైన పరిస్థితులన్నీ అప్పటికే గుర్తింపును పొందాయని పరిశీలకులు ఊహిస్తున్నారు. తొలి ఆలయ నిర్మాణం జరిగిన 500, లేదా వెయ్యేళ్లకు అక్కడికి ఇరవై మైళ్ల దూరాన కనబడ్డ శిథిలాలు పదిన్నర వేల ఏళ్ల క్రితం మొదలైన తొలి వ్యవసాయ జీవితానికి సాక్ష్యాలుగా అనిపిస్తున్నాయి. రేడియో కార్బన్ కాలగణన పద్ధతిలో విశ్లేషించగా, సాగుకు లోనయిన తొలి గోధుమ జాతుల ఆనవాళ్లు కనబడ్డాయి.



గయ్బెక్లీ టేపే చెక్కడాల్లో నక్క బొమ్మ


ఈ వివరాలనుబట్టి చూస్తే తొలి మానవులు వ్యవసాయం మొదలుపెట్టాకనే స్థిరజీవితాలకు అలవాటుపడ్డారనీ, ఆలయాల నిర్మాణం వంటిది ఆ తరవాతగాని మొదలై ఉండదనే ప్రతిపాదన సరికాదనీ అనిపిస్తుంది. అలాకాక, బృహత్‌శిలల నిర్మాణ ప్రయత్నాలే సామూహిక సహకారానికి కారణం అయి ఉంటాయనీ, తద్వారా ఒక జటిలమైన సమాజం ఏర్పడడానికి ప్రాతిపదిక ఏర్పడి ఉంటుందనీ అనుకోవచ్చు. ఇది సంప్రదాయ ప్రతిపాదనలను సవాలు చేసే రుజువు. సామాజిక, సాంస్కృతిక పరిణామాలు ముందొచ్చాయిని వ్యవసాయం ఆ తరవాతగాని మొదలవలేదు.

ఇటువంటి ఆలయ నిర్మాణానికి పూనుకోవడం కేవలం వేటాడుతూ తిరిగే మొరటుజాతికి సాధ్యంకాదు. కొన్ని వందలమంది ప్రజలు ఒకేచోట నివసించి, భోజననివాస వసతులు ఏర్పరుచుకుని, రాతిపనిముట్లతో బొమ్మలన్నీ చెక్కి, భారీ స్తూపాలను నిలబెట్టారంటే అందరూ సమాజ జీవితానికి అలవాటుపడ్డవారే అయి ఉంటారు. స్థిర నివాసాలు ఏర్పడ్డాకనే వ్యవసాయ పద్ధతులు మొదలై ఉంటాయనడానికి దీన్ని తిరుగులేని సాక్ష్యంగా పరిశీలకులు భావిస్తున్నారు.

ప్రపంచంలోనే మొదటిదిగా భావించబడుతున్న సుమేరియన్ కీలలిపి మరొక 6 వేల ఏళ్లకు గాని రూపొందలేదంటే ఈ టర్కీ ప్రాంతపు కట్టడాలు ఎంత ప్రాచీనమో ఊహించుకోవచ్చు. అందుచేత అప్పటి ప్రజల ధోరణీ, ఆలోచనా విధానమూ ఏవీ మనకు అర్థమయే అవకాశం లేదు. ఆలయం సమీపాన ప్రజలు నివసించిన దాఖలాలేవీ కనబడవు. ఆరాధనకు ఆహారంగా పనికొచ్చిన జింకలవంటి వాటినికాక, సింహాల వంటి ఘాతుక మృగాలనూ, భయంకరమైన విష జంతువులనూ ఎందుకు ఎన్నుకున్నారో తెలియదు. వ్యవసాయిక దశలో జరిగినట్టుగా ఫలవంతమైన భూదేవతలనూ, సంతానోత్పత్తినీ పూజించిన లక్షణాలేవీ కనబడలేదు. బహుశా వారు విష ప్రాణులపట్ల తమ భయాలను అధిగమించ ప్రయత్నించారేమో. ఎందుకంటే ఈ ఆలయం వారి నివాసాలకు దూరంగా ఉండేది.

కొందరు పరిశీలకులు రాబందుల ఆరాధనకు ప్రాముఖ్యతనిస్తారు. రాబందులు శవాలను పీక్కుతింటూ ఆకాశంలోకి ఎగురుతాయి కనక మరణాంతర జీవితానికీ, ఆకాశానికీగల సంబంధాన్ని అప్పటివారు ఊహించారేమోనని వారి ఉద్దేశం. బహుశా శవాల తలలను కోసి విడిగా పాతేవారేమో. మనుషుల బొమ్మలు అరుదేకాని, ముడుచుకుని కూర్చున్న స్త్రీ బొమ్మ ఒకటి కనబడిందట. అలాగే తలలేని మొండెంచుట్టూ రాబందులు మూగిన బొమ్మ కూడా ఉందట. మన దేశంలోని పార్శీవారితో సహా ఇప్పటికీ జొరాస్ట్రియన్లు పంచభూతాలకు చెందిన అగ్నినీ, భూమినీ పూజిస్తారు కనక శవాలను ఖననంగాని, దహనంగాని చెయ్యరు. వాటిని పక్షులు పీక్కు తిననిస్తారు. ఈ సంప్రదాయం అతిప్రాచీనమైనదనీ, రాబందులకు అందుకే ప్రాధాన్యత ఉండేదనీ అంటున్నారు.

పటాల్లో ఈ ఆలయాల నిర్మాణవిశేషాలను చూడవచ్చు. తవ్వకా లింకా పూర్తికాలేదు. దిగువ పొరల్లో ఏముందో ఇంకా తవ్వితేగాని బైటపడదని అంటున్నారు.



వివిధ జంతువుల చిత్రీకరణ

ఆదిమానవులు ప్రపంచంలో అనేకచోట్ల తమ జీవితాల ఆనవాళ్లను వదిలివెళ్లారు. అయితే వారికి దిమ్మరుల వైఖరి ఎప్పుడు అంతమయిందో, స్థిరంగా ఒకచోట నివసించే అలవాటు ఎప్పుడు ప్రారంభమయిందో కచ్చితంగా తెలియదు. కొన్ని ప్రదేశాల్లో మాత్రం కొన్ని సాక్ష్యాలు కనిపిస్తాయి. ఉదాహరణకు నేటి లెబనాన్ ప్రాంతంలో క్రీ.పూ. 12,500–9500 మధ్యకాలంలో నతూఫియన్ నాగరికత ఒకటి ఉండేది. అక్కడి ప్రజలు కట్టుకున్న ఒక ఇంటి గోడ శిథిలాలు ఇప్పటికీ ఉన్నాయి.




నతూఫియన్ ఇంటి గోడ శిథిలాలు

అప్పటి వారికి వ్యవసాయం తెలియకపోయినా ధాన్యాల్లోని వన్యజాతులను ఏరుకుతినేవారు. జింకల వంటి జంతువులను వేటాడేవారు. చిన్న రాతిపనిముట్లు చేసుకునేవారు. వారు చేపల వేటకు వాడిన పనిముట్లు కొన్ని దొరికాయి. అప్పటికి కుక్కల పెంపకం మొదలైంది. శవాలను ఖననం చేసి, రాతి పలకలతో కప్పిపెట్టిన దాఖలాలున్నాయి. మృతుల్లో చిన్నపిల్లలు ఎక్కువగా ఉండేవారు. పాతిపెట్టిన ఒక మహిళ అప్పటి పూజారిణి అయి ఉంటుందని ఊహిస్తున్నారు. ఎందుకంటే ఆ శవం పక్కనే 50 తాబేళ్ల పూర్తి అస్థిపంజరాలున్నాయి. అవన్నీ విందులో ఆరగించినవై ఉంటాయని భావిస్తున్నారు. ఆ కాలపు జంతువు విగ్రహం ఒకటి దొరికింది (పటం).

ఈ నాగరికతలో ప్రజలు నేలను తవ్వి కాస్త లోతున ఇళ్లు నిర్మించుకున్నారు. అందుకోసం రాళ్లు, చెక్కలూ, బహుశా ఇంటికప్పుకు తడికలవంటివీ ఉపయోగించుకున్నారు. కొండలకూ, తీర ప్రాంతాలకూ మధ్యన నివసించి, తమ ఆహార సేకరణ వివిధ వనరులపై ఆధార పడేట్టుగా చూసుకున్నారు. రుతువులనుబట్టి గింజలనూ. ఎందు మాంసాన్నీ, చేపలనూ తిన్నారు.

తంతులకు గాను పసుపురంగు పొడిని వాడేవారు. చెత్తను ఇంటి బయటే పెట్టేవారు. రోజువారీ అవసరాల గురించి ఇన్ని ఏర్పాట్లు చేసుకున్న ఈ ప్రజలకు ఎలాటి తాత్వికవైఖరి ఉండేదో తెలియదు. ఆరాధనకు ఉపయోగించిన కొన్ని జంతువుల విగ్రహాలు మటుకు దొరికాయి.

టర్కీలో కనబడిన కొన్ని అతిప్రాచీన శిథిలాలు మనుషులు కొత్తరాతియుగం ప్రారంభంలో నిర్మించిన తొలి దేవాలయాలని జర్మన్ పరిశోధకులు గుర్తించారు. వీటిలో ఒకటి 'గయ్బెక్లీ టేపే' అనే ప్రదేశంలో ఉంది. మరొకటి యూఫ్రటీస్ నది సమీపాన 'నేవాల చోరీ' ప్రాంతంలో ఉంది. ఇది క్రీ.పూ. తొమ్మిదో సహస్రాబ్దం ఉత్తరార్ధకాలం నాటిదని తెలుస్తోంది. గయ్బెక్లీ టేపేలాగే ఇదికూడా మనుషులు వ్యవసాయ వృత్తులను చేపట్టకమునుపే నిర్మించిన ఆరాధనాస్థలమనే సాక్ష్యాలు లభించాయి.




నతూఫియన్ విగ్రహం

ఇక్కడి తవ్వకాలలో అనేక విశేషాలు బైటపడ్డాయి. వీటిలో దీర్ఘచతురస్రాకారపు గదులున్నాయి. ఇటువంటివి 23 కనబడ్డాయి. అందులో కొన్ని నివాసాలుగా ఉపయోగపడి ఉంటాయని భావిస్తున్నారు. పెద్ద బండరాళ్లతో వీటికి పునాదులు నిర్మించి, ఖాళీలలో చిన్నరాళ్లు దోపి చదునుగా తయారుచేశారు.



నేవాల చోరీలోని ప్రాచీనతమ ఆలయంలో దొరికిన మనుషుల బొమ్మలు

మధ్యలో అక్కడక్కడా మురికినీటి కోసమనో, చల్లబరచటానికో సన్నని తూములూ, వాటిమీద కప్పిన రాతిపలకలూ కనబడ్డాయి. తూముల పక్కలను మూసి ఉంచే ఏర్పాటు చెయ్యలేదు. గయ్బెక్లీ టేపేలో కనబడిన 9, 10 అడుగుల ఎత్తున్న స్తంభాలవంటివి ఇక్కడా ఉన్నాయి. అక్కడున్న సున్నపురాతి శిలలమీద ఎన్నో బొమ్మలను చెక్కారు. వీటిలో శిఖలున్న మనుషుల తలలు కనిపిస్తాయి. మనుషులంతేసి విగ్రహాలేకాక, రెండంగుళాల మనుషుల బొమ్మలు వందలకొద్దీ దొరికాయి. వీటిని ఏవో



నేవాల చోరీ మనుషుల బొమ్మలు

తంతుల్లో ఉపయోగించి ఉంటారని భావిస్తున్నారు. వీటిని అయిదారువందల డిగ్రీల (సెల్సియస్) ఉష్ణోగ్రతలో కాల్చి తయారు చేశారని తెలుస్తోంది. ఇవన్నీ జరిగే కాలానికి కుండల తయారీకూడా మొదలవకపోవడం విశేషం.


మానవులు వేటాడి, ఏరుకుతింటూ తిరిగిన దశలో నిర్మించుకున్న ఈ ఆలయ వ్యవస్థలు చాలా అపురూపమైనవిగా పేరుపొందాయి. ఇదంతా లిపులూ, భాషలూ మొదలవడానికి 6 వేల ఏళ్ల క్రితమే జరిగిందనేది అద్భుతమైన విషయం. మతాలకూ, తాత్వికచింతనకూ ఎంత ప్రాచీనమైన చరిత్ర ఉందో వీటినిబట్టి అర్థం చేసుకోవచ్చు. లిఖిత ఆధారాలేవీ లేని ఈ సాక్ష్యాలద్వారా అప్పటివారి భావనల గురించి మనం పరోక్షంగా తప్ప అర్థం చేసుకోలేం. ఈ శిథిలాలను పరిశీలించిన వారు వీటిని అప్పటి ప్రజలు క్రమంగా ఉపయోగించడం మానలేదనీ, తరవాతి తరాల కోసమని బుద్ధిపూర్వకంగా పాతి పెట్టారనీ అంటున్నారు. వీటిలో ఆరాధించ బడ్డట్టుగా కనిపిస్తున్న జంతువులూ, పక్షులూ ప్రశాంతంగా కనిపిస్తాయి. ఎక్కడా హింసాత్మకవైఖరి కనబడదు.

టర్కీలోని హాజిలార్ ప్రాంతంలో క్రీ.పూ. 8000 నాటి నివాస స్థలాలు కనిపించాయి. మట్టితో కట్టిన ఇళ్లలో గోడలూ, నేలా సాఫీగా తయారు చేశారు. గోధుమ, బార్లీవంటివి సాగులోకి వచ్చాయి. మట్టి పాత్రల తయారీ మొదలుకాలేదు. కుక్కలు తప్ప మచ్చికజంతువులేవీ ఉండేవికావు. ఏవో కారణాల వల్ల కొన్నాళ్లకు వీటిని అప్పటివారు వదిలి



చటల్ హుయుక్‌లోని జనవాసాల ఆనవాళ్లు


వెళ్లిపోయారు. మరొక వెయ్యేళ్ల తరవాత అక్కడికే వచ్చిన ప్రజలు మాత్రం మెరుగైన నాగరికత కలిగి జీవించారు. అప్పటికి పాత్రల తయారీ మొదలైంది. సంతానోత్పత్తిని సూచించే అమ్మతల్లి విగ్రహాలు కనబడ్డాయి.



చటల్ హుయుక్‌లోని క్రీ.పూ. 5700నాటి సంతానదేవత విగ్రహం

టర్కీలోని హాజిలార్ సమీపాన ఉండే 'చటల్ హుయుక్'లో క్రీ.పూ. 6250–5400 మధ్యకాలంలో జననివాసాలుండేవి. కొందరు పరిశీలకులు క్రీ.పూ. 7500 నాటికే ఇక్కడ ప్రజలుండేవారని అంటారు. అప్పటివారు మాతృదేవతను ఆరాధించేవారు. మహిళలే కుటుంబానికి పెద్దలుగా వ్యవహరించే వారేమో. ఆనాటి ఒక ధాన్యపుగాదెలో సంతానదేవత విగ్రహం ఒకటి కనబడింది (పటం). దీని శిరస్సును మాత్రం పునర్నిర్మించారు. అలాగే మధ్యధరా సముద్రంలోని మాల్టా దీవుల్లోనూ ప్రాచీన కట్టడాల అవశేషాలు కనిపిస్తాయి. అక్కడ కూడా క్రీ.పూ. 5000 నాటి మాతృదేవత ఆరాధనకు ఆనవాళ్లున్నాయి. చటల్ హుయుక్ ఇళ్లలో గోడలకు అలంకారచిత్రాలూ, చిన్న అరుగులూ, తంతులకు ప్రత్యేకస్థలాలూ ఉండేవి. వీథులు లేనప్పటికీ ఇళ్లమధ్యన ఖాళీ ప్రాంతాలూ, చెత్త పారవేసే ఏర్పాట్లూ ఉండేవి. నేలకు కాస్త లోతున కట్టిన ఇళ్లలోకి ఒక కంతద్వారా ప్రవేశం ఉండేది. అదే కంత పొగ బయటికి పోవడానికి కూడా ఉపయోగపడేది. దిగడానికి నిచ్చెనల ఏర్పాటుండేది. గీసిన బొమ్మల్లో తలలులేని మొండేల చుట్టూ రాబందులు కనిపిస్తాయి. అప్పటివారు శవాల తలలను పాతిపెట్టి, శరీరాలను రాబందులు పీక్కుతిన్నాక, ఎముకలను శుభ్రం చేసి పాతేవారు. పార్సీ వారిలో ఇటువంటి ఆచారం నేటికీ ఉంది. ఒక గదిలో ఏకంగా 67 శవాల అవశేషాలు దొరికాయి. అమ్మతల్లి బొమ్మలు చాలా ఉండేవి. కొన్నిటిలో కాన్పు జరుగుతున్నట్టూ, పక్కనే సింహాలున్నట్టూ చిత్రీకరణ జరిగింది.





క్రీట్‌లో దొరికిన నాగదేవత బొమ్మ, మాల్టాలోని ప్రాచీన స్త్రీమూర్తి

ఈనాడు మనకు కనబడే సాక్ష్యాల్లో ఒకవంక 30 వేల ఏళ్ల క్రితం గుహలలో మనుషులు గీసిన జంతువుల బొమ్మలూ, మరొకవంక ఆ తరవాత క్రీ.పూ. 3000 నాటినుంచీ బేబిలోనియా, ఈజిప్ట్ తదితర నాగరికతల్లో పెద్దఎత్తున మొదలైన మతవ్యవస్థలూ కనిపిస్తాయి. ఆ గుహలు ఆరాధనాస్థలాలై ఉండవచ్చుననేది ఊహ మాత్రమే. అందుకు స్పష్టమైన రుజువులు లేవు. అయితే టర్కీ సమీపాన కనబడిన ప్రాచీన అవశేషాలు మాత్రం ఏ 15 వేల ఏళ్ల క్రితమో మొదలైన ఆలయ వ్యవస్థలకు సాక్ష్యాలుగా కనబడతాయి. అప్పుడు అస్పష్టంగా, ఏదో ఒక రూపంలో ప్రకృతి గురించీ, మరణానంతర జీవితం గురించీ మనుషుల్లో రూపుదిద్దుకున్న భావాలే తరవాతి కాలపు మతవిశ్వాసాలకు ఆధారం అయాయి. ఆ భావాలకు ఉండిన భౌతిక ఆధారాలు ఎటువంటివో, తమ సాటివారి భద్రతకూ, సమాజం మొత్తంగా బావుండడానికీ ఎటువంటి వైఖరి శ్రేయస్కరమని అప్పటి ప్రజలు భావించారో మనం అర్థం చేసుకోగలిగితే మన అవగాహన మెరుగవుతుంది. అందరి సంక్షేమాన్నీ నిజాయితీతో కాంక్షించిన ఈ మతాలు క్రమంగా కొన్నివర్గాల పెత్తనానికీ, ఆ తరవాత వివిధ సముదాయాల మధ్య వైషమ్యాలకూ, రక్తపాతానికీ ఎలా దారితీశాయో మనం అర్థం చేసుకోవాలి.

(రచయిత అణుధార్మిక శాస్త్రవేత్త)

ముంబై దాడి కేసులో కసబ్‌కు ఉరి

ముంబై దాడి కేసులో అజ్మల్ అమీర్ కసబ్ దోషి అని ప్రత్యేక కోర్టు మే 5న తీర్పు చెప్పింది. 2008 నవంబర్ 26న కసబ్‌తో పాటు మరో తొమ్మిది మంది ముంబాలో సృష్టించిన మారణహోమంలో 166 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆ సందర్భంగా పోలీసు కాల్పుల్లో 9 మంది ఉగ్రవాదులు మరణించగా కసబ్ ఒక్కడే ప్రాణాలతో పట్టుబడ్డాడు. హత్య, హత్యకు కుట్ర, రాజ్యంపై యుద్ధానికి దిగడం, హత్యలకు ప్రేరేపించడం, ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడటం వంటి అయిదు నేరాలకు పాల్పడ్డందుకు చట్టవిరుద్ధ కార్యకలాపాల చట్టం కింద కసబ్‌కు మరణశిక్ష విధిస్తున్నట్లు ప్రత్యేక కోర్టు జడ్జి ఎం.ఎల్. తహిల్యాని తీర్పును ప్రకటించారు.

నార్కో పరీక్షలు రాజ్యాంగ విరుద్ధం

నిందితులకు ఇష్టం లేకుండా బలవంతంగా నార్కో అనాలిసిస్ లాంటి పరీక్షలు రాజ్యాంగ విరుద్ధం, అక్రమం, అన్యాయం అంటూ దాఖలైన పిటిషన్‌లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కె.జి. బాలకృష్ణన్‌తో పాటు జస్టిస్ ఆర్.వి. రవీంద్రన్, జస్టిస్ జె.ఎం. పంచాల్‌లతో కూడిన ధర్మాసనం మే 5న తీర్పు ఇచ్చింది. 'నిందితులు స్వచ్ఛందంగా ముందుకు వస్తే మినహా వారిపై ఎలాంటి పరీక్షలు నిర్వహించరాదు. బలవంతంగా నార్కో అనాలిసిస్, బ్రేన్ మాపింగ్, పాలిగ్రాఫ్ పరీక్షలు చేయడం వ్యక్తి స్వేచ్ఛను హరించడమే. పౌరులకు రాజ్యాంగంలోని 21వ అధికరణ కల్పించిన హక్కులకు భంగం కలిగించడమే. దర్యాప్తు దశలో నిందితుడు మౌనంగా ఉండే హక్కును కల్పిస్తున్న ఆర్టికల్ 20(3)ను కూడా ఉల్లంఘించడమే' అని స్పష్టం చేసింది. స్వచ్ఛందంగా ముందుకు వచ్చే వారిపై ఈ పరీక్షలు చేసుకోవచ్చని, ఈ ఫలితాలను దర్యాప్తులో ఉపయోగించుకోవచ్చని తెలిపింది. అయితే, విచారణలో మాత్రం దీనిని సాక్ష్యంగా మాత్రం పరిగణించలేమని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది.

భారత ప్రధాన న్యాయమూర్తి

సుప్రీంకోర్టు 38వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సరోష్ హోమి కపాడియా మే 12న ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన 29 సెప్టెంబర్ 2012 వరకు ప్రధాన న్యాయమూర్తిగా కొనసాగుతారు. కపాడియా 18 డిసెంబర్ 2003 నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పనిచేస్తున్నారు.

జార్ఖండ్‌లో రాజకీయ సంక్షోభం

కేంద్రంలోని యుపిఏ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రతిపక్షాల కోత తీర్మానంలో ప్రభుత్వానికి అనుకూలంగా శిబూ సోరెన్ ఓటు వేయడంతో జార్ఖండ్‌లో రాజకీయ సంక్షోభం తలెత్తింది. రాజకీయ సంక్షోభాన్ని తెరదించేందుకు బిజెపి, జెఎంఎంలు అధికారం పంచుకునేందుకు నిర్ణయించు కున్నాయి. రెండు పార్టీలు చెరో 28 నెలలు అధికారాన్ని పంచుకునేలా అంగీకారం కుదిరింది. మొదటి అవకాశం బిజెపి కి ఇవ్వాలనేది నిర్ణయం. 82 సీట్లున్న జార్ఖండ్ అసెంబ్లీలో బిజెపి, జెఎంఎంలకు చెరో 18 మంది ఎం.ఎల్.ఎ.లు ఉన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి శిబూ సోరెన్ ముఖ్యమంత్రిగా పూర్తికాలం నేనే కొనసాగుతాను అనడంతో వివాదం మొదటికొచ్చింది.

రైతుల ఆత్మహత్యలు

గడిచిన మూడేళ్లలో దేశవ్యాప్తంగా 3,450 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. రాజ్యసభలో ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ, కేంద్ర మంత్రి శరద్ పవార్ ఈ వివరాలను అందించారు. అత్యధికంగా మహారాష్ట్రలో 1,720 మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారు. కాగా, 1,142 ఆత్మహత్యలతో ఆంధ్రప్రదేశ్ ఆ తరువాతి స్థానంలో, 434 మరణాలతో కర్ణాటక మూడో స్థానంలో ఉన్నాయి.

టైట్లర్‌కు విముక్తి

ఇందిరాగాంధీ హత్యానంతరం జరిగిన అల్లర్ల కేసు నుండి కాంగ్రెస్ నేత జగదీశ్ టైట్లర్ బయటపడ్డారు. ఆయన ఈ కేసులో నేరస్తుడు అనదగ్గ ఆధారం లేదని క్లీన్ చిట్ ఇస్తూ, గత సంవత్సరం సిబిఐ దాఖలు చేసిన కేసు ముగింపు నివేదికను ఢిల్లీ కోర్టు ఏప్రిల్ 27న ఆమోదించింది. ఈ తీర్పుకు నిరసనగా కోర్టు వెలుపల ఎంతో మంది సిక్కులు తీర్పును వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. ఈ కేసును పై కోర్టులో అప్పీలు చేస్తామని, అసలైన సాక్షులను సిబిఐ కావాలనే ప్రవేశ పెట్టలేదని పిటిషనర్ తరపు న్యాయవాది రెబెక్కా జోషి తెలిపారు. 1984లో ఉత్తర ఢిల్లీలో జరిగిన అల్లర్లలో ముగ్గురు సిక్కులను హత్య చేసిన సంఘటనలో టైట్లర్ ప్రమేయం ఉందంటూ ఈ కేసు నమోదయింది.

షెకావత్ కన్నుమూత

మాజీ ఉప రాష్ట్రపతి, రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి, బిజెపి సీనియర్ నాయకుడు భైరాన్‌సింగ్ షెకావత్ ఈ నెల 15న గుండెపోటుతో మరణించారు. రాజస్థాన్‌లోని సికార్ జిల్లాలో ఓ కుగ్రామంలో 1923 అక్టోబర్ 23న షెకావత్ జన్మించారు. 1948లో పోలీసు ఉద్యోగానికి రాజీనామా చేసి రాజకీయాల్లోకి వచ్చారు. 1977,1990, 1993 సంవత్సరాల్లో కాంగ్రెసేతర ప్రభుత్వాలను ఏర్పాటుచేశారు. 2002లో ఉప రాష్ట్రపతిగా చేశారు.

బస్సు పేల్చివేత

దంతెవాడ నుంచి సుకుమా గ్రామానికి వెళ్తున్న ప్రైవేట్ బస్సును మే 17న మావోయిస్టులు పేల్చివేశారు. అందులో 35-40 ప్రయాణికులు, బస్సుపై 20 మంది ఎస్.పి.ఒ.లు ఉన్నారు. బస్సును పేల్చి వేయడంతో 31 మంది మరణించారు. చనిపోయిన వారిలో 15 మంది ప్రయాణికులు, 11 మంది డిస్ట్రిక్ట్ ఫోర్స్ పోలీసులు, నలుగురు ఎస్.పి.ఒ.లు, ఒక ఎస్.ఎస్.పి. జవాన్‌లు ఉన్నారు. మరో పదిమందికి తీవ్ర గాయాలయ్యాయి.

వ్యక్తుల కదలికలపై కన్ను

పౌరుల వ్యక్తిగత వివరాలన్నీ కంప్యూటర్‌లో నిక్షిప్తం చేసే నేషనల్ ఇంటెలిజెన్స్ గ్రిడ్ (నాట్‌గ్రిడ్) ప్రాజెక్ట్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. వ్యక్తుల కదలికలు, కార్యకలాపాలు, ఆర్జనలు, అలవాట్లు సమగ్ర సమాచారాన్ని సేకరిస్తారు. పోలీస్ రికార్డులు, వ్యక్తుల ఫోన్‌లు, డ్రైవింగ్ లైసెన్సులు, ఇంటర్నెట్, క్రెడిట్ కార్డులు, పాస్‌పోర్టులు, ఆదాయ పన్ను రికార్డులు ఇలా 21 రకాల సమాచారాన్ని అనుసంధానిస్తారు. ఇంటెలిజెన్స్ బ్యూరో, సిబిఐ, రా వంటి 11 నిఘా సంస్థలకు ఈ సమాచారం అందుబాటులో ఉంటుంది.

వక్ఫ్ ఆస్తుల రక్షణ

దేశవ్యాప్తంగా వక్ఫ్‌బోర్డుల ఆస్తులు ఆక్రమణకు గురవుతున్న నేపథ్యంలో వాటి పరిరక్షణకు కేంద్రం పూనుకుంది. ఇందుకు ఉద్దేశించిన వక్ఫ్ చట్టం సవరణ బిల్లు - 2010ని మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి ఖుర్షీద్ ఏప్రిల్ 27న సభలో ప్రవేశపెట్టారు. దేశంలో ఉన్న వక్ఫ్ బోర్డులు సజావుగా పనిచేసేలా, వక్ఫ్ ఆస్తులు కబ్జాకు గురికాకుండా చూసే బిల్లును లోక్‌సభ మే 7న ఆమోదించింది.

హబుల్‌కు ఇరవై ఏళ్లు

అంతరిక్ష దృశ్యాలను కెమెరాలో బంధిస్తూ, ఎంతో విలువైన సమాచారాన్ని అందజేస్తున్న 'హబుల్ స్పేస్ టెలిస్కోప్' ఏప్రిల్ 24తో ఇరవై ఏళ్లు పూర్తి చేసుకుంది. అంతరిక్షంలో ఇన్నేళ్లపాటు ఉన్న టెలిస్కోప్ ఇదే. హబుల్‌ను అమెరికన్ శాస్త్రవేత్తలు 24 ఏప్రిల్ 1990న డిస్కవరీ వ్యోమనౌక ద్వారా దిగువ భూకక్ష్యలో ప్రవేశపెట్టారు. ఇది ఇప్పటి వరకు 30 వేల అంతరిక్ష లక్ష్యాలపై దృష్టి పెట్టింది. 50 లక్షల ఫొటోలు తీసింది. హబుల్ పంపిన ఫొటోలను, ఖగోళ సమాచారాన్ని ప్రపంచ వ్యాప్తంగా విద్యా, వైజ్ఞానిక రంగాల్లో వినియోగించుకుంటున్నారు.

చమురు లీకేజి

అమెరికాలోని గల్ఫ్ ఆఫ్ మెక్సికో వద్ద ఏప్రిల్ 22న ప్రమాదవశాత్తూ సముద్రంలో మునిగిపోయిన ఆయిల్ రిగ్ నుంచి నిరంతరాయంగా చమురు లీక్ అవుతుండడంతో చమురు తెట్టు ముప్పు కారణంతో మిసిసిపీ, అలబామా రాష్ట్రాల్లోని తీరప్రాంతాల్లో అమెరికా ఎమర్జెన్సీ ప్రకటించింది. లూసియానా తీరం వెంబడి భారీగా చమురు తెట్టు పేరుకుపోతుండడంతో ఏప్రిల్ 30న ఎమర్జెన్సీ ప్రకటించింది. రోజుకు ఐదువేల బ్యారెళ్ల (రెండు లక్షల గ్యాలన్లు) చమురు సముద్రంలో కలుస్తుండడంతో పర్యావరణానికి తీవ్ర నష్టం పొంచి ఉంది.

నేపాల్‌లో మావోయిస్టుల బంద్

నేపాల్‌లో మావోయిస్టు పార్టీ మే 3 నుండి 5 వరకు మూడు రోజుల బంద్ నిర్వహించారు. ప్రధాని రాజీనామా, ప్రభుత్వంలో తమకు భాగస్వామ్యం తదితర డిమాండ్లతో ఆందోళనలు నిర్వహించారు. వేలాది మంది ఎర్ర చొక్కాలు ధరించి మావోయిస్టులు మానవ వలయంగా మారి రాజధాని కఠ్మాండును దిగ్బంధించారు. ఈ బంద్ కారణంగా సాధారణ జనజీవనం స్తంభించి పోయింది. ప్రభుత్వంతో జరిపిన చర్చలు విఫలం అయ్యాయి. మే 3న జరిగిన చర్చలు ఎలాంటి ఫలితం తేలకుండానే ముగిశాయి.

గ్రీస్‌లో నిరసన గళం

గ్రీస్‌లో ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఆందోళనకారులు మే 5న సమ్మె జరిపారు. ఉద్యోగ, కార్మిక సంఘాల నాయకులు, కమ్యూనిస్టు కార్యకర్తలు పార్లమెంట్‌లోకి చొచ్చుకెళ్లడానికి ప్రయత్నించారు. పోలీసులు వారిని అడ్డుకోవడంతో ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో కార్యకర్తలు తీవ్రంగా గాయపడ్డారు. యూరోపియన్ యూనియన్, ఐఎంఎఫ్‌ల నుంచి పదహారు వేల కోట్ల డాలర్ల రుణం తెచ్చుకోవడానికి భారీ ఎత్తున బడ్జెట్ కోతలను, పన్నుల పెంపును ప్రతిపాదిస్తూ ప్రభుత్వం తీసుకున్న వైఖరికి నిరసనగా ఈ ఆందోళనలు చెలరేగాయి.

జి-15 గ్రూప్ కొత్త అధ్యక్షుడు

గ్రూప్ ఆఫ్ 15 కంట్రీస్ (జి-15) కి కొత్త అధ్యక్షుడుగా శ్రీలంక అధ్యక్షుడు మహింద రాజపక్సే మే 17న పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆయన రెండేళ్లపాటు ఈ పదవీలో కొనసాగుతారు. జి-15 సదస్సు మే 17 నుండి టెహరాన్‌లో ప్రారంభమయింది. ఈ సదస్సులో అభివృద్ధి చెందుతున్న దేశాలలో పరస్పర వాణిజ్య, సాంకేతిక, పెట్టుబడి రంగాలపై దృష్టి కేంద్రీకరిస్తారు. జి-15లో అల్జీరియా, అర్జెంటీనా, బ్రెజిల్, చిలీ, ఈజిప్ట్, భారతదేశం, ఇండోనేషియా, ది ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్, జమైకా, కెన్యా, మలేషియా, మెక్సికో, నైజీరియా, సెనెగల్, శ్రీలంక, వెనెజూలా, జింబాబ్వే దేశాలు సభ్యులుగా ఉన్నారు.

బ్రిటన్‌లో సంకీర్ణ ప్రభుత్వం

బ్రిటన్‌లో రెండో ప్రపంచ యుద్ధం తరువాత తొలి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడింది. మే 6న పోలింగ్ జరిగింది. 649 నియోజకవర్గాల్లో 4150 మంది పోటీ పడ్డారు. ప్రధాన ప్రతిపక్షం కన్జర్వేటివ్ పార్టీ 306 స్థానాలు గెలుచుకొని మొదటిస్థానంలో, లేబర్ పార్టీ 258 స్థానాలతో రెండో స్థానంలో, లిబరల్ డెమోక్రాట్ పార్టీ 57 స్థానాలు గెలుచుకొని మూడో స్థానంలో నిలిచాయి. దీంతో కన్జర్వేటివ్ పార్టీ, లిబరల్ డెమోక్రాట్ పార్టీలు కలిసి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. పదమూడేళ్ల లేబర్‌పార్టీ పాలనకు తెరపడింది. కన్జర్వేటివ్ పార్టీ అధ్యక్షుడు డేవిడ్ కామెరాన్ నూతన ప్రధానమంత్రి అయ్యారు. ఉప ప్రధానిగా లిబరల్ డెమోక్రాట్ పార్టీ అధ్యక్షుడు నిక్ క్లెగ్ ఎన్నికయ్యారు.

'విక్టరీ డే' ఉత్సవాలు

చరిత్రలో తొలిసారిగా రెండవ ప్రపంచ యుద్ధంలోని పశ్చిమ దేశాల కూటమి సేనలు రష్యన్ సేనలతో కలిసి చారిత్రాత్మక రెడ్ స్క్వేర్‌లో 'విక్టరీ డే' ఉత్సవాలు జరుపుకున్నాయి. నాజీ జర్మనీపై విజయానికి సంకేతంగా ప్రతి ఏడాది మిత్రదేశాలు ఈ ఉత్సవాలు నిర్వహిస్తాయి. ఈసారి రష్యాతోపాటు పూర్వపు సోవియట్ రిపబ్లిక్స్‌కు చెందిన సైనిక దళాలతో కలిసి బ్రిటన్, ఫ్రాన్స్, పోలెండ్, అమెరికా సైనిక దళాలు రెడ్‌స్క్వేర్‌లో పరేడ్ నిర్వహించాయి. ఈ సందర్భంగా రష్యా అధ్యక్షుడు మెద్వెదెవ్ మాట్లాడుతూ సంఘీభావంతో మెలగాలని, రెండవ ప్రపంచ యుద్ధం మనకు పాఠాలు నేర్పిందన్నారు. శాంతికి విఘాతం ఇంకా పొంచి ఉందని, ఆధునిక పద్ధతుల్లో వచ్చే ముప్పును సమష్టిగానే ఎదుర్కోగలమన్నారు.

ఇరాక్‌లో మళ్లీ బాంబు పేలుళ్లు

ఇరాక్ రాజధాని బాగ్దాద్, దాని సమీపంలోని ప్రాంతాల్లో మే 10న వరుస బాంబు పేలుళ్లతో తీవ్ర ప్రాణ నష్టం జరిగింది. ఈ దాడులలో వంద మందికి పైగా మరణించారు. 350 మందికి పైగా గాయపడ్డారు. హిల్లా పట్టణంలో ప్రభుత్వ జౌళీ ఫ్యాక్టరీ వద్ద కార్మికులు ఫ్యాక్టరీ నుంచి ఇళ్లకు వెళ్తున్న సమయంలో పార్కింగ్ స్థలంలో రెండు శక్తిమంతమైన కారు బాంబులు పేలాయి. గాయపడిన వారిని ఆస్పత్రులకు తరలిస్తుండగా వారి మధ్యలో ఉన్న మానవ బాంబు తనను తాను పేల్చేసుకున్నాడు. ఈ దాడిలో 60 మంది దాకా పౌరులు మరణించారు. సువేరా పట్టణంలో మసీదు వద్ద, బాగ్దాద్ శివారుల్లోని ఆర్మీ చెక్‌పోస్ట్‌ల దగ్గర జరిగిన దాడులలో నలభై మంది దాకా మరణించారు.

పోరాటకారులపై సాయుధ దాడి

గత రెండు నెలలుగా థాయ్‌లాండ్‌లో జరుగుతున్న ఆందోళనల పై ప్రభుత్వం సైనిక చర్యతో విరుచుకుపడింది. ప్రధాని అభిసిత్ వెజ్జజీవా రాజీనామా చేసి వెంటనే పార్లమెంట్‌కు ఎన్నికలు నిర్వహించాలనే డిమాండ్‌తో విపక్షాలు చేస్తున్న ఆందోళనలను తమ అదుపులోకి తెచ్చుకున్నామని ప్రభుత్వం మే 19న ప్రకటించింది. కొద్దివారాలుగా బ్యాంకాక్‌లోని సువాన్ లుంబిని పార్క్ వద్ద ఆందోళన చేస్తున్న రెడ్‌షర్ట్స్ శిబిరంపైకి సాయుధ బలగాలు యుద్ధ ట్యాంకులతో దాడిచేసి ప్రతిపక్ష నేతలను, కార్యకర్తలను, కార్మికులను, రైతులను నిర్బంధంలోకి తీసుకున్నాయి. ఈ దాడిలో ఒక విదేశీ పాత్రికేయుడితో సహా ఐదుగురు మరణించారు. సైనిక చర్య నేపథ్యంలో రెడ్‌షర్ట్స్ కార్యకర్తలు థాయిలాండ్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌నీ తగులబెట్టారు. ఆగ్నేయాసియాలోనే అతి పెద్దదైన సెంట్రల్ వరల్డ్ షాపింగ్ మాల్‌ను ధ్వంసం చేశారు.

అసహజ మరణాల సూచి

సంకలనం : **రాంకి, వై. రామచంద్రం**

మరణం ఎప్పుడయినా విషాద సూచకమే. మృతుల బంధువులకూ, మిత్రులకూ విచారకరమే కాని అందులోనూ మరణించిన మనిషి నిండు జీవితం గడిపి వయోభారంతోనే మరణిస్తే దాన్ని సహజ మరణంగా అంగీకరించి ఊరట పడవచ్చు. సగటు ఆయు ప్రమాణంలో సగం కూడా అనుభవించక ముందే మరణిస్తున్నారు. ఈ అసహజ మరణాలకు లెక్కలేనన్ని ఆర్థిక, సామాజిక, రాజకీయ కారణాలున్నాయి. మన పక్కనే మనతోనే ఉండే మనుషులు అర్ధాంతరంగా అసహజంగా అకాలంగా అదృశ్యమైపోతున్నారు. ఇటువంటి అసహజ మరణాలు ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇవి సామాజిక సంక్షోభానికి, సమాజం దిగజారుడుకు ఒక చిహ్నం. మన రాష్ట్రంలో సాలీనా ఈ రకంగా చనిపోతున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంటుందని అంచనా. నిజానికి అసహజ మరణాలన్నీ అసహజ మరణాలుగా నమోదు కావడం లేదు గనుక ఈ సంఖ్య వాస్తవంలో ఒక భాగం మాత్రమే కావచ్చు. పత్రికలలో అచ్చయిన ఇటువంటి ఘటనలన్నిటినీ ఒక్కచోట నమోదు చేయాలని భావిస్తున్నాం. ఈ శీర్షిక ప్రతి నెల ఉంటుంది. అయితే రాష్ట్రంలో ప్రతి గ్రామంలో జరుగుతున్న సంఘటనలన్నీ ఇక్కడ రిపోర్ట్ కాకపోవచ్చు. కొన్నయినా మనల్ని ఆలోచింపజేస్తే, మనం మనచుట్టూ ఉన్న మనుషులకోసం ఇంకాస్త బాధ్యతగాను, జాగ్రత్తగాను వ్యవహరిస్తూ మొత్తంగా పరిష్కారాలవైపు వెళ్లడానికి ఏమయినా తోడ్పడితే ఈ శీర్షిక విజయవంతమైనట్లే.

(21 ఏప్రిల్ 2010 నుండి 20 మే 2010 వరకు అసహజ మరణాల పాలైన వారి సంఖ్య – 1938) *వడదెబ్బ, పిడుగుపాటు వల్ల చనిపోయిన వారు

జిల్లా	ఆకలి	ఆత్మహత్యలు				చికిత్స అందక, అనారోగ్యం			గుర్తు తెలియని		హత్యలు		ప్రమాదాలు				పోలీసు కాల్పుల్లో		పోలీసులు, సైన్యం	మిస్సింగ్/ లాకప్ మరణాలు	ప్రకృతి వైపరీత్యాలు
		వ్యవసాయ రంగం	చేనేత రంగం	ఇతరాలు									పనిచేసే స్థలంలో	కరెంట్	రహదారి	ఇతరాలు	ఉద్యమ కారులు	ఇతరులు			
				స్త్రీ	పు.	స్త్రీ	పు.	పి.	స్త్రీ	పు.	స్త్రీ	పు.									
(1)	**(2)**	**(3)**	**(4)**	**(5)**	**(6)**	**(7)**	**(8)**	**(9)**	**(10)**	**(11)**	**(12)**	**(13)**	**(14)**	**(15)**	**(16)**	**(17)**	**(18)**	**(19)**	**(20)**	**(21)**	**(22)**
ఆదిలాబాద్	1	6	–	13	20	9	3	1	3	5	1	7	4	5	16	26	–	–	–	5	33
హైదరాబాద్	–	–	–	12	14	–	–	–	2	9	1	9	–	–	47	29	–	–	–	10	–
కరీంనగర్	2	5	3	28	44	25	21	1	5	14	3	7	4	10	31	28	–	–	–	3	89
ఖమ్మం	–	3	–	6	8	3	8	1	–	4	3	4	1	3	24	13	3	2	–	1	71
మెదక్	–	6	–	14	11	4	7	–	1	4	–	3	1	3	35	13	–	–	–	–	16
నిజామాబాద్	1	–	–	5	17	10	7	1	–	–	5	5	2	–	24	10	–	–	–	–	8
రంగారెడ్డి	–	8	–	8	6	3	3	3	1	2	–	–	3	6	42	8	–	–	–	–	12
వరంగల్	–	3	–	9	7	–	7	3	2	1	1	3	–	4	9	3	–	–	–	–	35
అనంతపురం	వివరాలు అందలేదు																				
చిత్తూరు	–	–	–	11	6	–	3	2	–	–	6	4	–	–	33	–	–	–	–	–	3
కడప	వివరాలు అందలేదు																				
కర్నూలు	–	4	–	16	18	2	5	1	6	5	4	2	3	4	35	27	–	–	–	3	24
తూర్పు గోదావరి	–	–	–	16	17	1	3	1	3	4	4	5	11	3	68	32	–	–	–	–	8
గుంటూరు	–	–	–	9	6	3	–	1	–	2	6	9	4	3	34	22	–	–	–	–	14
కృష్ణా	–	2	–	7	9	3	4	3	2	2	2	5	1	3	18	6	–	–	–	–	3
నెల్లూరు	వివరాలు అందలేదు																				
పశ్చిమ గోదావరి	–	–	–	3	2	–	–	–	–	–	6	3	–	–	14	–	–	–	–	–	–
శ్రీకాకుళం	–	–	–	6	7	6	5	8	5	7	6	5	4	3	17	4	–	–	–	–	7
విశాఖపట్నం	–	–	–	3	9	1	–	–	–	5	2	2	4	–	20	7	–	–	–	3	1
విజయనగరం	వివరాలు అందలేదు																				
మొత్తం	**4**	**37**	**3**	**166**	**201**	**70**	**76**	**26**	**30**	**64**	**50**	**73**	**42**	**47**	**467**	**228**	**3**	**2**	**–**	**25**	**324***

అందిస్తున్నవారు : ఆదిలాబాద్ – సి.ఎచ్. శ్రీమన్నారాయణ మూర్తి; హైదరాబాద్ – డి. విజయభాస్కర్; కరీంనగర్ – ఎల్. సంతోష్; ఖమ్మం – సి.ఎచ్. గిరిజ; మెదక్ – ఎన్. భగవాన్‌రెడ్డి; నిజామాబాద్ – ఎం. నర్సయ్య; రంగారెడ్డి – శంకరయ్య, వరంగల్ – ఎ.కుమార్; అనంతపురం – సుమలత; చిత్తూరు – పలమనేరు బాలాజి; కడప – బి. దస్తగిరి; కర్నూలు – జి.వి. సుధాకర్ రెడ్డి; తూర్పు గోదావరి – మహమ్మద్ ఇబ్రహీమ్ సాహెబ్; గుంటూరు – బి. అంజమ్మ ; కృష్ణా – బి. రమేష్‌బాబు; నెల్లూరు – కె. సుబ్బనాచారి; పశ్చిమ గోదావరి – టి. హేమలత; శ్రీకాకుళం – జి. సుధీర్; విశాఖపట్నం – కె.వి. అరుణ; విజయనగరం – డి. సుధాకర్

ఆనంద్ ఏజెన్సీస్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా వీక్షణం లభ్యమయ్యే బుక్ స్టాల్స్

కోయిలకుంట్ల	సిఎచ్. రామసుబ్బారెడ్డి, ఆర్.టి.సి. కాంప్లెక్స్
కర్నూలు	షిర్డీసాయి బుక్ స్టాల్ న్యూస్ ఏజంట్
ధోన్	శ్రీనివాస శెట్టి, ఆర్.టి.సి. కాంప్లెక్స్
ధోన్	మకం బుక్ స్టాల్, ఆర్.టి.సి. కాంప్లెక్స్
నంద్యాల్	ఎ. లక్ష్మీనారాయణ న్యూస్ ఏజంట్
నందికొట్కూర్	రామాంజనేయులు, ఆర్.టి.సి. కాంప్లెక్స్
అదోని	ఆనంద్ కుమార్, ఆర్.టి.సి. కాంప్లెక్స్
ఆత్మకూరు	రవి బుక్ స్టాల్
అనంతపూర్	బి. శివారెడ్డి న్యూస్ ఏజంట్
ధర్మవరం	అమర్ న్యూస్ ఏజెన్సీస్
తాడిపత్రి	బాలతిమ్మయ్య న్యూస్ ఏజంట్
కదిరి	లోకేష్ బాబు, ఆర్.టి.సి. కాంప్లెక్స్
హిందూపూర్	రామకృష్ణ బుక్ స్టాల్, ఆర్.టి.సి. కాంప్లెక్స్
అనంతపూర్	పి.సి.ఎస్. గుప్త న్యూస్ ఏజంట్
గుంతకల్	గణేష్ న్యూస్ ఏజెన్సీస్
కళ్యాణదుర్గం	ప్రసాద్ బుక్ స్టాల్
కడప	క్రిసెంట్ న్యూస్ ఏజెన్సీ
ప్రొద్దుటూరు	ఎస్.వి.ఆర్. శేట్టి న్యూస్ ఏజంట్
రాయచోటి	ఎస్. కరీముల్లా పాషా న్యూస్ ఏజంట్
జమ్మలమడుగు	ఎస్. మదార్ పాషా న్యూస్ ఏజంట్
రాజంపేట	పి. పెంచలయ్య న్యూస్ ఏజంట్
మైదుకూరు	ఎ.వి. శివరాం న్యూస్ ఏజంట్
కొత్తగూడెం	సిఎచ్. నాగరాజు న్యూస్ ఏజంట్
భద్రాచలం	శివకృష్ణారావు, ఆర్.టి.సి. కాంప్లెక్స్
ఇల్లెందు	శ్రీనివాస్, ఆర్.టి.సి. కాంప్లెక్స్
ఖమ్మం	సత్యనారాయణ న్యూస్ ఏజంట్
మహబూబాబాద్	సురేంద్రనాథ్ న్యూస్ ఏజంట్
నల్గొండ	సాక్షి బుక్ స్టాల్
హుజూర్‌నగర్	సాక్షి బుక్ స్టాల్, ఆర్.టి.సి. కాంప్లెక్స్
కోదాడ	శ్రీనివాస్ న్యూస్ ఏజంట్
కోదాడ	కోటేశ్వరరావు, ఆర్.టి.సి. కాంప్లెక్స్
మిర్యాలగూడ	పాండు బుక్ స్టాల్, ఆర్.టి.సి. కాంప్లెక్స్
సూర్యాపేట	సత్యనారాయణ, ఆర్.టి.సి. కాంప్లెక్స్
సూర్యాపేట	కాకతీయ బుక్ సెంటర్, ఆర్.టి.సి. కాంప్లెక్స్
పరకాల	సాంబయ్య, ఆర్.టి.సి. కాంప్లెక్స్
హనుమకొండ	వేణు న్యూస్ ఏజంట్
హనుమకొండ	రవీంద్ర అప్లికేషన్స్ న్యూస్ ఏజంట్
నర్సంపేట	పల్లవి బుక్ స్టాల్
వరంగల్	శ్యాంరాజ్ న్యూస్ ఏజంట్
ఖాజీపేట	నబీ బుక్ స్టాల్
గోదావరిఖని	బి. కృష్ణయ్య న్యూస్ ఏజంట్
పెద్దపల్లి	సత్యనారాయణ, ఆర్.టి.సి. కాంప్లెక్స్
జగిత్యాల	సంపత్ న్యూస్ ఏజంట్
సిరిసిల్ల	జి. అనీల్ కుమార్, ఆర్.టి.సి. కాంప్లెక్స్
వేములవాడ	కె. లచ్చయ్య న్యూస్ ఏజంట్
కరీంనగర్	మోయిజ్ బుక్ స్టాల్
కరీంనగర్	ఎ.ఆర్. ట్రేడర్స్
రామగుండం	జబ్బార్ బుక్ స్టాల్, రైల్వే స్టేషన్
జమ్మికుంట	డి. సదానందం, రైల్వే స్టేషన్ ఎదురుగా
హుజూరాబాద్	శరత్, ఆర్.టి.సి. కాంప్లెక్స్
నాగర్‌కర్నూల్	కె. గోపాలకృష్ణ న్యూస్ ఏజంట్
కొత్తకోట	భాస్కరరెడ్డి, ఆర్.టి.సి. కాంప్లెక్స్
గద్వాల్	బస్వరాజు న్యూస్ ఏజంట్
వనపర్తి	జి. శివప్రసాద్ న్యూస్ ఏజంట్
మహబూబ్‌నగర్	ఆదిత్య బుక్ సెంటర్
మంచిర్యాల్	కృష్ణా బుక్‌స్టాల్
మంచిర్యాల్	మహేశ్వరరావు న్యూస్ ఏజంట్
నిర్మల్	రమేష్ బుక్ స్టాల్, ఆర్.టి.సి. కాంప్లెక్స్
ఆదిలాబాద్	నాగేష్‌రెడ్డి, ఆర్.టి.సి. కాంప్లెక్స్
భైంసా	శ్రీనివాస్, ఆర్.టి.సి. కాంప్లెక్స్
నిజామాబాద్	గాయత్రి బుక్ డిపో (ఎం. కిషోర్)
నిజామాబాద్	లక్ష్మణ్, ఆర్.టి.సి. కాంప్లెక్స్
బాన్స్‌వాడ	వినోద్ కుమార్, ఆర్.టి.సి. కాంప్లెక్స్
మెదక్	రాధాకృష్ణ, ఆర్.టి.సి. కాంప్లెక్స్
సంగారెడ్డి	సాయి రాం బుక్‌స్టాల్, ఆర్.టి.సి. కాంప్లెక్స్
సంగారెడ్డి	పి.ఎస్. కుమార్ బుక్ సెంటర్
సిద్ధిపేట్	టి. శ్రీనివాస్ న్యూస్ ఏజంట్
సిద్ధిపేట్	రాజ్ బుక్స్ స్టేషనరీ
సిద్ధిపేట్	వెంకటసాయి బుక్ స్టాల్
పరిగి	కృష్ణయ్య న్యూస్ ఏజంట్
షాద్‌నగర్	ఇండియన్ బుక్ స్టాల్
చేవెళ్ల	ఇందు బుక్ స్టాల్
నల్లకుంట	ఆర్. నర్సయ్య న్యూస్ ఏజంట్
సనత్‌నగర్	ఎ. నరేంద్ర రావు న్యూస్ ఏజంట్
ఓల్డ్ సిటి	పాండురంగారావు న్యూస్ ఏజంట్
జెబిఎస్	టి. సురేష్ న్యూస్ ఏజంట్
ఆబిడ్స్	టి. అరవింద్ సింగ్ న్యూస్ ఏజంట్
మెహదీపట్నం	సంతోష్‌కుమార్ న్యూస్ ఏజంట్
మల్కాజ్‌గిరి	ఎ. రవీందర్ న్యూస్ ఏజంట్
వారాసిగూడ	బి. నర్సింహా న్యూస్ ఏజంట్
అశోక్‌నగర్	హనుమంతరావు న్యూస్ ఏజంట్
అశోక్‌నగర్	దుర్గా బుక్ స్టాల్
అశోక్‌నగర్	వికాస్ బుక్ స్టాల్
అశోక్‌నగర్	రెడ్డి బుక్ స్టాల్
రాంకోఠి	బుక్ సెలెక్షన్ సెంటర్
సికింద్రాబాద్	రాధేశ్యాం న్యూస్ ఏజంట్
పంజాగుట్ట	లడ్డు భాయి న్యూస్ ఏజంట్
బల్కంపేట్	మోహన్‌బాబు న్యూస్ ఏజంట్
కృష్ణానగర్	రాజు న్యూస్ ఏజంట్
కూకట్‌పల్లి	చందు న్యూస్ ఏజంట్
బాలాజీనగర్	ధనలక్ష్మి బుక్ స్టాల్ (రామచందర్)
హైదరాబాద్	దుర్గా డిస్ట్రిబ్యూటర్స్
బళ్లారి	శ్రీనివాస్ న్యూస్ ఏజంట్

VEEKSHANAM Telugu Monthly Journal of Political Economy and Society - 107 - June 2010
• RNI Regn.No.APTEL/2003/11482• Published on 29/05/2010 • Postal Regn. No. LII/RNP/HD/1100/2008-10



R.O.No. 18/Sou/Advt.I/20010-11 Dt. 06-04-2010

Edited, printed, published and owned by N. Venugopal Rao, Printed at Charitha Impressions, 1-9-1126/B, Azamabad, Hyderabad - 500 020
and Published at 3-6-394, Mythri Residency, Street No. 3, Himayatnagar, Hyderabad 500 029. Editor : N. Venugopal Rao